




# మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 94: మంగళవారం 18 నవంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్


# 46మంది సజీవదహనం

## సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం



సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మక్కా యాత్రకు వెళ్లిన భారతీయులు ప్రయాణిస్తున్న బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో 42 మంది సజీవ దహనమయ్యారు. సోమవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో బదర్-మదీనా మధ్య ముఫరహత్ ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. వారంతా మక్కా యాత్ర ముగించుకుని మదీనాకు వెళ్తుండగా, ఘోరం జరిగింది. మృతుల్లో 20 మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నారు. హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదం నుంచి అబ్దుల్ షోయబ్ అనే ఒక్క వ్యక్తి మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు.

- మంటలు చెలరేగడంతో 46 మంది మృత్యువాత
- బతికి బయటపడ్డ ఒకే ఒక్కడు
- మృతులంతా హైదరాబాద్ పాతబస్తీ వాసులు
- మక్కాకు వెళ్తుండగా ప్రమాదం

వివరాలు 2వ పేజీలో..



## తీవ్రంగా కలచివేసింది

సౌదీ ప్రమాద ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

డిప్యూటీ సీఎం పవన్ సంతాపం

02

## ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి



బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

సాధ్యమైనంత సహాయం అందిస్తామని స్పష్టం

వివరాలు 2వ పేజీలో..



## ఆపరేషన్ సింధూర్ పాఠాలు నేర్పింది

ఇది కేవలం ట్రైలర్ మాత్రమే

పాక్ మళ్లీ తెగిస్తే ఇక అంతే సంగతులు

చాణక్య రక్షణ సదస్సులో జనరల్ ద్వివేది

04

# అన్నదాత సుఖీభవ



కడప జిల్లా కమలాపురంలో ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

## రేపు జమ కానున్న నిధులు



- అధికారులతో మంత్రి అచ్చన్నాయుడు సమీక్ష
- రాష్ట్ర, జిల్లా అధికారులకు దిశా నిర్దేశం
- 46,62,904 మంది రైతులకు చేకూరనున్న ప్రయోజనం

“రైతు సంక్షేమ పథకం కింద రాష్ట్రంలోని 46 లక్షల 62 వేల 904 మంది రైతులకు సంబంధించిన నిధులు రేపు (నవంబర్ 19, 2025) వారి ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయి. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లాలోని కమలాపురంలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. నిధుల విడుదలకు సంబంధించిన ఏర్పాట్లపై మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, రాష్ట్ర మరియు జిల్లా స్థాయి అధికారులకు తగిన దిశా నిర్దేశం చేశారు. సకాలంలో రైతులకు ప్రయోజనం చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.”

**అమరావతి, నవంబర్ 17 (మనసులో మాట):**

ఈనెల 19న రెండోవిడత అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. అదేరోజు కేంద్రం పిఎం కిసాన్ పథకం కింద రెండు వేలు విడుదల చేయనుంది. దీంతో రాష్ట్రం కూడా ఐదువేలు తమవంతుగా విడుదల చేయనుంది. ఈ నెల 19న 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న విషయం తెలిసిందే. అదే రోజు పీఎం కిసాన్ పథకం కింద నిధులను కేంద్రం విడుదల చేయనుంది.ఈ నెల 19న వైయస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధుల తో కలిసి రైతుల ఖాతాల్లో నిధులను జమచేయ నున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి అచ్చన్నాయుడు తెలిపారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం రెండో విడత అమలుపై వ్యవసాయ శాఖ అధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సమీక్ష నిర్వహించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ జేడీలకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అలాగే.. అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యూటేషన్ చేసి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవడంతో పాటు

మిగతా 2 లో



04

## బంగ్లా మాజీ ప్రధానికి ఉరిశిక్ష

అల్లర్లలో కాల్పులకు షేక్ హసీనా ఆదేశించారన్న అభియోగం

ఢాకా ట్రిబ్యునల్ కోర్టు తీర్పు

## ఢిల్లీ పేలుడు ఘటనలో కీలక పరిణామం


ఉమర్‌కు సహకరించిన అమీర్ రషీద్

ఎన్ఐఎ కస్టడీకి అప్పగించిన పాటియాల కోర్టు

04

## నేడు టీటీడీ ఆర్జిత సేవా టికెట్లు విడుదల

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటేనే లభ్యం



.. వివరాలు 4లో

## సినీ కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్న పైరసీకారులు



- ఐబొమ్మ రవి అరెస్టుతో అప్రమత్తం కావాలి
- కమిషనర్ ను కలిసి అభినందించిన చిరంజీవి

20



## ఐబొమ్మ రవితో సినీ పరిశ్రమకు తీరని నష్టం

- 3 కోట్లు అకౌంట్‌లో ఫ్రీజ్ చేశామన్న సజ్జన్నార్
- కమిషనర్‌ను కృతజ్ఞతలు తెలిపిన సినీ పెద్దలు

20

## సినీ పరిశ్రమకు ఊరట

- పైరసీపై ఉక్కుపాదం అభినందనీయం
- హైదరాబాద్ పోలీసులకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశంసలు

03

'ఐబొమ్మ', 'బప్పమ్' వెబ్‌సైట్ల నిర్వాహకుడి అరెస్టుపై అభినందనలు





తిరుమల పరకామణి కేసులో

## ఎవరినీ వదిలిపెట్టం

సతీష్ ను హత్యచేసి ఆత్మహత్యగా ప్రచారం

పరకామణి కేసులో అనేక అనుమానాలు

మంత్రి పార్థసారథి

వివరాలు 2వ పేజీలో..



## రేపు పుట్టపర్తికి ప్రధాని మోడీ

4

ఏర్పాట్లు వేగవంతం చేసిన ఏపీ ప్రభుత్వం

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# అన్నదాత సుఖీభవ



## మొదటి పేజీ తరువాయి

ఎన్‌పీసీఏలో ఇన్ యాక్టివ్‌గా ఉన్న ఖాతాలను యాక్టివేట్ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని సులభతరం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడత 46,62,904 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ విడతలో రాష్ట్రం వాటా రూ.5 వేలు, కేంద్రం వాటా రూ.2 వేలు మొత్తం రూ .7 వేలు అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లోకి జమకానున్నాయి. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద రూ.3077.77 కోట్లు రైతుల ఖాతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేయనున్నాయి.

# సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాలు

## ప్రత్యేక అవసరాల పిల్లలకు పంపిణీ

## సమగ్ర శిక్ష ఏపీసీ ఎం.రజనీకుమారి

**విజయవాడ,నవంబర్ 17(మనసులో మాట):**

ఎన్‌టీఆర్ జిల్లాలో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు అయిదు ప్రాంతాల్లో ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.రజనీకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లలోపు ఉండి, సదరం సర్టిఫికెట్ ఉన్న, పాఠశాలలో నమోదైన విద్యార్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం తమ మండల భవిత కేంద్రాల్లోని ఐఈఆర్‌పీలను సంప్రదించవచ్చన్నారు. విజయవాడ అర్బన్‌కు సంబంధించి ఈ నెల 18న ఎంకే బేగ్ హైస్కూల్లో శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 19న మైలవరం లక్కిరెడ్డి హనిమిరెడ్డి హైస్కూల్లో, ఈ నెల 20న తిరువూరు నియోజకవర్గంలోని కంభంపాడు జెడ్‌పీహెచ్‌ఎస్‌లో శిబిరాలు ఉంటాయన్నారు. ఇదేవిధంగా ఈ నెల 21న నందిగామ జెడ్‌పీహెచ్‌ఎస్, నవంబర్ 22న జగ్గయ్యపేట నియోజకవర్గంలోని చిల్లకల్లు జెడ్‌పీహెచ్‌లో శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని వారు శిబిరాలను సద్వినియోగం చేసుకొని అలిమ్కో ద్వారా ఉచితంగా ఉపకరణాలు పొందేందుకు తగిన ధ్రువీకరణపత్రాలతో పేర్లు నమోదు చేయించుకోవాలని రజనీకుమారి తెలిపారు.

# రెవెన్యూ సేవలపై ప్రత్యేకంగా దృష్టిసారించండి

## పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యుటేషన్లపై అవగాహన

## పీజీఆర్ఎస్ అర్జీలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలి

## జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియ

**విజయవాడ,నవంబర్ 17(మనసులో మాట):**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని.. ముఖ్యంగా రెవెన్యూ శాఖ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఎన్టీఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన అనంతరం జేసీ ఇలక్కియ మాట్లాడుతూ.... పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యుటేషన్ సేవలు పారదర్శకంగా అందించాలని, అవగాహన కల్పించాలని చెప్పారు. ఎ÷-లోచార్టు ప్రకారం దరఖాస్తుల పక్రియ గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్ల నుంచి ప్రారంభమయ్యేలా డివిజన్, మండల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా, పూర్తి పారదర్శకంగా ఈ పక్రియను నిర్వహించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, అదే సమయంలో అర్జీదారుడికి సంతృప్తికర పరిష్కారం లభించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. ÷రిళిమవారం కలెక్టరేట్లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 160 అర్జీలు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు 50 అర్జీలు వచ్చాయి. పోలీస్ శాఖకు 23, విభిన్న ప్రతిభావంతుల శాఖకు 13, పంచాయతీరాజ్‌కు 12, పురపాలక శాఖకు 11 అర్జీలు రాగా విద్య, డీఆర్‌డీఏ విభాగాలకు తొమ్మిది చొప్పున అర్జీలు వచ్చాయి. ఆరోగ్య శాఖకు 6, సర్వేకు 4, విద్యుత్ శాఖకు 4, కళాశాల విద్యకు 3, గృహ నిర్మాణం 2, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్‌కు 2 అర్జీలు రాగా వివిధ శాఖలకు సంబంధించి 12 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎం. లక్ష్మీనరసింహం, జడ్పీ సీఈవో కే. కన్నమ నాయుడు, గ్రామ వార్డు సచివాలయాల సమన్వయ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే భార్యకు డిజిటల్ అరెస్ట్ వేధింపులు

## ఏడుగురిని అరెస్ట్ చేసిన కడప పోలీసులు

**కడప,నవంబర్ 17(మనసులో మాట):**

డిజిటల్ అరెస్టు పేరుతో పలువురిని సైబర్ క్రిమినల్స్ ఇటీవల మోసం చేస్తున్నారు. సైబర్ నేరస్తుల బారిన పడి బాధితులు పెద్దమొత్తంలో నష్టపోతున్నారు. తాజాగా తెలుగుదేశం పార్టీ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భార్యను సైతం డిజిటల్ అరెస్ట్ చేశారు. ఈ మేరకు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు పుట్టా సుధాకర్ యాదవ్ . ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు ఏడుగురిని అరెస్ట్ చేశారు కడప జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు. డిజిటల్ అరెస్ట్‌కు పాల్పడిన నిందితుల్లో ఢిల్లీకు చెందిన ఐడీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. తమ నుంచి సైబర్ నేరస్తులు రూ. 1.7 కోట్లు మోసం చేశారని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.

# హత్యలు చేసి డోర్ డెలివరీ చేసిన వైసీపీ

## మంత్రి సత్యకుమార్ విమర్శలు

**విజయవాడ,నవంబర్ 17(మనసులో మాట):**

జగన్ హయాంలో హత్యలు చేసి డోర్ డెలివరీ చేశారని సంచలన ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. సోమవారం విజయవాడలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న రోజుల్లో స్వర్ణాంధ్రప్రదేశ్‌ని వికసిత్ భారత్‌గా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈనేపథ్యంలోనే రూ.87 కోట్లని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. 740 ఏకలవ్య మోడల్ స్కూల్స్ తీసుకువచ్చి గిరిజన విద్యార్థుల విద్యని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సోళ్ల బుజ్జిరెడ్డికి ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పదవీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అవగాహన కలిగిన అనుభవం ఉన్న వాళ్లని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎంపిక చేశారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# 46 మంది సజీవదహనం

## సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం

- డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న టూరిస్ట్ బస్సు
- బతికి బయటపడ్డ ఒకే ఒక్కడు
- మృతులంతా హైదరాబాద్ వాసులు
- మక్కాకు వెళ్తుండగా ప్రమాదం




**హైదరాబాద్, నవంబర్ 17:** సౌదీ అరేబియాలో ఘోర విషాద ఘటన చోటుచేసుకుంది. మదీనాకు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరా బాదీలు మృతిచెందారు. యాత్రికులతో వెళ్తోన్న బస్సు.. డీ జిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుం ది. సౌదీ అరేబియాలో సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు సమీపంగా భారీ రోడ్డు ప్రమాదం సంభవించింది. మక్కా నుంచి మదీ నా వెళుతున్న యాత్రికుల బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్ట డంతో మంటలు చెలరేగి పెద్ద దుర్ఘటన చోటుచేసుకుంది. ఈమంటల్లో హైదరాబాద్‌కు చెందిన 45 మంది యాత్రి కులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపిన వివరాల ప్రకారం 54 మంది యాత్రికుల బృందం నవంబర్ 9 న



హైదరాబాద్ నుంచి జెడ్డాకు బయలు దేరింది. నవంబర్ 23 వరకు టూర్‌ను ప్లాన్ చేశారు. వారిలో నలుగురు ముందుగానే కారులో మదీనాకు వెళ్లగా, మరో నలుగురు మక్కాలోనే నిలిచిపోయారు. మిగిలిన 46 మంది బస్సులో ప్రయాణం కొనసాగించారు. మదీనా నుండి సుమారు 25 కిలోమీ టర్ల దూరంలో బస్సు చమురు ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా అగ్నిప్రమాదం చెలరేగిందని తెలిపారు. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనగానే మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి. ప్రమాద సమయంలో యాత్రికులంతా నిద్ర లో ఉండటంతో మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలు స్తోంది. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతు న్నాయి. ఈ ప్రమాదంలో అబ్దుల్ షోయబ్ అనే యాత్రి కుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు. అతను ప్రస్తు తం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరణించిన వారిలో మల్లేపల్లి, బజార్‌ఘాట్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల వారూ ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 1.30 గంటల సమయంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. యాత్రికులంతా నిద్రలో ఉండడం వల్ల మరణాలు అధికంగా నమోద య్యాయని అధి కారులు భావిస్తున్నారు. ప్రమాద స్థలంలో రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాలోని జెడ్డా భారత దౌత్య కార్యాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. 24 ఏళ్ల మొహమ్మ ద్ అబ్దుల్ షోయబ్ డ్రైవర్ పక్కన కూర్చోవడంతో ప్రమా దం నుంచి తప్పించుకున్నారు. షోయబ్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి. గాయాల పాలైన షోయబ్‌ను హాస్పిటల్‌లో చేర్చారు. అయితే అతడి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం బయటకు రాలేదు . ప్రమాదంలో షోయబ్ కుటుంబ సభ్యులందరూ చనిపోయినట్టు తెలుస్తోంది.

# ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి



**న్యూ ఢిల్లీ, నవంబర్17:** సౌదీలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ప్రధాని మోడీ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మదీనాలో జరిగిన ప్రమాదంలో భారతీయులు మరణించడం తనకు చాలా బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రియ-ంమైన వారిని కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని మోడీ ప్రార్థించారు. రియాద్ లోని భారత రాయబార కార్యాలయం, జెడ్డాలోని కాన్సులేట్ సాధ్యమైనంత సహాయం అందిస్తున్నాయని తెలిపారు. భారత అధికారులు సౌదీ అరేబియా అధికారులతో సన్నిహితంగా ఉన్నారని పేర్కొన్నారు.

# తీవ్రంగా కలచివేసింది

## సౌదీ ప్రమాద ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

## డిప్యూటీ సీఎం పవన్ సంతాపం



**అమరావతి, నవంబర్ 17:** సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఉమ్రా యాత్రకు వెళ్లిన వారు మరణించడం బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సౌదీ అరేబియాలో జరిగిన ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు యాత్రికులు మ-రణించడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. మృతులకు నివాళు లర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సౌదీ అరేబియాలో విషాద ఘటన చోటుచేసుకుంది. మదీనాకు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతిచెందారు. యాత్రికులతో వెళ్తోన్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది.

# పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

## శాస్త్రోక్తంగా ధ్వజారోహణంతో ప్రారంభం



**తిరుచానూరు, నవంబర్ 17(మనసులో మాట):**

తిరుపతి జిల్లా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, నిత్య అర్చన చేశారు. అనంతరం నాలుగుమాడ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం జరిపి, ధ్వజ స్తంభ తిరుమంజనం నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గజపటాన్ని ఆరోహణం చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ..ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. ప్రతి భక్తుడికి వాహన సేవ దర్శనం కల్పిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులందరికీ మూలమూర్తి దర్శనం చేయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్రహ్మోత్సవాల్లో గజ వాహన సేవ, పంచమి తీర్థంకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, అందుకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వి.వీరబ్రహ్మం, సీవీఎస్వో కే.వి. మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, కంకణ భట్టార్ పి.శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఈవో శ్రీ శుక్రవారపు తోటలో ఉద్యాన విభాగం ఏర్పాటు చేసిన పుష్పప్రదర్శన, శిల్ప కళాశాల ఏర్పాటు చేసిన శిల్పకళా ప్రదర్శన, ఆయుర్వేద ప్రదర్శనను ప్రారంభించారు.





# విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం లేదు!

## ప్రగతి వైపుప్రస్థానం కొనసాగుతుందని చెబుతున్న ప్రభుత్వం

**అమరావతి, నవంబర్ 17(మనసులో మాట)::**

విశాఖ ఉక్కు పరిశ్రమపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ సంస్థను ప్రైవేటైజేషన్ చేయడం లేదని.. ప్రగతి వైపు ప్రస్థానం సాగిస్తుందని స్పష్టం చేసింది. ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 17 నెలల్లో ఉక్కు పరిశ్రమకు రూ.15 వేల కోట్ల సాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించినట్లు తెలిపింది. ఇక ఓవరాల్ కెపాసిటీ యుటిలైజేషన్‌ను 17 నెలల్లో 48 నుంచి 79 శాతానికి పెంచినట్లు సోదాహరణగా వివరించింది. దేశంలో మరే పబ్లిక్ సెక్టార్ కంపెనీకీ ఇవ్వని స్థాయిలో ప్రభుత్వాలు ఈ ఆర్థిక సాయం అందించినట్లు ప్రకటించింది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఇటీవల ఒక సర్క్యూలర్ జారీ చేసింది. ఇది కార్మికుల్లో ఆందోళనకు కారణమైనట్లు తెలుస్తోంది. ఉత్పత్తికి అనుగుణంగానే జీతాలు చెల్లిస్తామని ఆ సర్క్యూలర్‌లో యాజమాన్యం పేర్కొన్నట్లు కార్మిక సంఘాలు చెబుతున్నాయి. దీని వల్ల నష్టపోతామని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. దాంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు(సోమవారం) ఉక్కు కార్యాలయం ముట్టడికి కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. స్టీల్ పాంట్‌ను ప్రైవేటీకరణ చేసేది లేదని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. తాజాగా విశాఖ ఉక్కు యాజమాన్యం తీసుకొచ్చిన ఆదేశాలతో ప్రస్తుతం ఈ వివాదం రేగింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో తమందరికీ యాజమాన్యం పూర్తి జీతాలు అందజేసిందని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. నవంబర్ నుంచి మాత్రం అందుకు భిన్నంగా జీతాలు చెల్లింపు ఉంటుందని యాజమాన్యం చెబుతోందని కార్మిక సంఘాలు అంటున్నాయి. ఉత్పత్తికి అనుగుణంగానే జీతాల చెల్లింపులు ఉంటాయని సంస్థ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేయడంపై వారంతా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా 100 శాతం ఉత్పత్తి జరిగితేనే 100 శాతం జీతాలు ఇస్తామని యాజమాన్యం ఉత్తర్వుల్లో పేర్కొందని చెబుతున్నారు. దాని వల్ల తాము నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు కార్మికులు. ముడి పదార్థాలు సరిగ్గా అందుబాటులో లేవని.. తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. దీని వల్ల లక్షిత ఉత్పత్తి సాధించడం సాధ్యం కావడం లేదని చెబుతున్నారు. ముడి సరకు అందుబాటులో ఉండి.. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉంటే.. ఉత్పత్తి సాధ్యమవుతుందని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. అలాంటి వేళ.. ప్రభుత్వం విశాఖ ఉక్కుపై కీలక ప్రకటన చేసినట్లు తెలుస్తోంది.

# సినీ పరిశ్రమకు ఊరట

- పైరసీపై ఉక్కుపాదం అభినందనీయం
- హైదరాబాద్ పోలీసులకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశంసలు
- 'ఐబొమ్మ', 'బప్పమ్' వెబ్‌సైట్ల నిర్వాహకుడి అరెస్టుపై అభినందనలు

**అమరావతి, నవంబర్ 17 (మనసులో మాట):**

సృజనాత్మకత, డబ్బుతో నిర్మించే సినిమాలను విడుదలైన రోజునే ఇంటర్నెట్‌లో పోస్ట్ చేస్తున్న ముఠాల వల్ల చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సోమవారం ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ ఆయన ఈ విషయం తెలిపారు. సినిమా విడుదలనే ఒక మహా యజ్ఞంగా భావిస్తున్న తరుణంలో, పైరసీ ముఠాలను నియంత్రించడం దర్శక నిర్మాతలకు కష్టమవుతోందని ఆయన అన్నారు.

### సైబర్ క్రైమ్ పోలీసులకు ప్రత్యేక అభినందనలు

పైరసీలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న 'ఐబొమ్మ', 'బప్పమ్' వెబ్‌సైట్ల నిర్వాహకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, అతని చేతనే వాటిని మూయించడం స్వాగతించదగ్గ పరిణామం. పోలీసులకు సవాల్ విసిరే స్థాయికి ఎదిగిన పైరసీ ముఠాలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల బృందం చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైంది. ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్న పోలీసులకు, సిటీ కమిషనర్ వి.సి.సజ్జనార్‌కి పవన్ కల్యాణ్ అభినందనలు తెలియజేశారు.

### బెట్టింగ్, పాంజీ స్కీమ్స్ పై సజ్జనార్ కృషిని కొనియాడిన పవన్

బెట్టింగ్ మాఫియా, పాంజీ స్కీమ్స్ వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించి, వాటివల్ల ప్రజలు ఆర్థికంగా ఎలా నష్టపోతున్నారో చైతన్యపరుస్తున్నారని ఆయన సజ్జనార్‌ను కొనియాడారు. పాంజీ స్కీమ్స్ వల్ల ప్రజలు మోసపోతున్న తీరును సజ్జనార్ ఒక సందర్భంలో తనకు వివరించారని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. అలాగే, బెట్టింగ్ యాప్స్‌ను నియంత్రించేందుకు సజ్జనార్ చేపట్టిన చర్యలు అన్ని రాష్ట్రాల్లోనూ కదలిక తీసుకొచ్చాయని తెలిపారు. సజ్జనార్ నేతృత్వంలో తీసుకునే



చర్యలు తెలుగు సినిమాకే కాక, యావత్ భారతీయ చిత్ర పరిశ్రమకు మేలు చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సైబర్ నేరాలను అరికట్టేందుకు కఠిన చర్యలు

- సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులపై అప్రమత్తం
- డిజిటల్ అరెస్ట్‌లను నివారించేందుకు చైతన్యం
- ప్రజల్లోకి విస్తృతంగా సైబర్ సురక్ష స్లోగన్
- విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు

**విజయవాడ,నవంబర్ 17 (మనసులో మాట):**

సైబర్ నేరాలను అరికట్టేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. నేరగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్నారని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు తెలిపారు. డిజిటల్ అరెస్ట్ నేరాలను నివారించేందుకు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. సైబర్ సురక్ష అనే స్లోగన్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి.. సైబర్ నేరగాళ్ల ఆట కట్టిస్తామని ఆయన సోమవారం విజయవాడలో ప్రకటించారు. పోలీసుల పరంగా తీసుకునే చర్యల వల్ల నేరగాళ్లు తప్పించుకో కూడదని పేర్కొన్నారు. జీరో టోలరెన్స్ టూ క్రైం, సైబర్ క్రైం అని సీఎం చంద్రబాబు చెబుతుంటారని.. ఎటువంటి పరిస్థితుల్లో డిజిటల్ అరెస్టులు జరగకూడదని పేర్కొన్నారు. నెల రోజుల పాటుసైబర్ సురక్షా అనే కార్యక్రమం తీసుకుని.. దానిని ప్రారంభిస్తున్నామని తెలిపారు. 226 బ్యాంకులలో అవగాహన తీసుకు వచ్చేందుకు 226 టీంలు, బ్యాంకు ఉద్యోగులతో కలిసి.. ఖాతాదారుల్లో మార్పు తీసుకు వస్తామన్నారు. ఉన్నతస్థాయిలో దీనిపై సమావేశం ఏర్పాటు చేసి ప్రణాళికలు కూడా సిద్ధం చేశామని తెలిపారు. ఒక చిన్న అప్లికేషన్ కూడా రూపొందించామని.. దీనిని చదివితే ప్రతి ఒక్కరికీ అర్థమవుతుందని చెప్పారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు,



ప్రజల్లో అవగాహన తీసుకొచ్చే విధంగా సైబర్ సురక్షా పేరుతో నెల రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సైబర్ నేరాలు వివిధ రూపాలలో జరుగుతున్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వారి కదలికలపై దృష్టి పెట్టి దొంగలను పట్టుకుంటున్నామని పేర్కొన్నారు. చైన్ స్నాచర్స్, బైక్ దొంగలు, గంజాయికి బానిసలుగా మారి చోరీ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ తరహా చోరీలను అరికడుతున్నామని తెలిపారు. తాము తీసుకున్న చర్యల వల్ల నలభై శాతం నేరాలు తగ్గాయని వివరించారు. ఎప్పుడూ లేని విధంగా 80 శాతం రికవరీతో విజయవాడ పోలీసులు ముందున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను గత ఏడాది కంటే ఈ ఏడాది 92 మందికి తగ్గించగలిగామన్నారు. వీటిపై సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ చురుగ్గా పని చేసేలా చేస్తున్నామని వివరించారు. దాతల సహకారంతో ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. పది వేల సీసీ కెమెరాలు.. డాష్ బోర్డులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సైబర్ క్రైమ్ నేడు పెను సవాల్‌గా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్లితేనే.. ఈ తరహా నేరాలను నిరోధించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సైబర్ సిటిజన్ అమల్లోకి తీసుకు వచ్చామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలు ఉంటాయని విజయవాడ నగర సీపీ రాజశేఖర్ బాబు ఆశా భావం వ్యక్తం చేశారు. ÷-యాంకర్స్‌తో పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరగాళ్లు కరెంట్ అకౌంట్లు ఏర్పాటు చేసి.. ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. సేవింగ్స్ నుంచి కరెంట్ అకౌంట్‌గా మార్చే ప్రతి ఖాతాను తప్పకుండా పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు. ఈ సైబర్ నేరాలపై అవగాహన కోసం ఫామ్ ప్లేట్లు సైతం ముద్రించి.. వారితో చదివించడం ద్వారా అవగాహనకు తీసుకువస్తున్నామన్నారు. అక్కడక్కడా కొంతమంది బ్యాంక్ సిబ్బంది నిర్లక్ష్యంతో నేరాలు జరుగు తున్నాయని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టులు చాలా వరకు నిరోధించగలిగామని ఎన్టీఆర్ జిల్లా పోలీసులుగా తాము గర్వంగా చెబుతున్నామన్నారు. సైబర్ ఫ్రాస్టర్స్‌ను కచ్చితంగా కట్టడి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నగర సీపీ రాజశేఖర్ బాబు స్పష్టం చేశారు. ఇన్వెస్టిమెంట్ మోసాలు కూడా బాగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులు ఆసక్తికరంగా చేసే ప్రకటనలు నమ్మి రూ. లక్షల్లో నగదు పోగొట్టుకున్నారని వివరించారు. ఈ ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ నివారణ కోసం పెద్ద యుద్ధమే చేయాల్సి ఉ ంటుందన్నారు. వీటిని నివారించేందుకు ఎలా ముందుకు సాగాలనే దానిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ప్రాపర్టీ క్రైం నిరోధించడంలో పై చేయి సాధించినా.. వైట్ కాలర్ క్రైం, సైబర్ క్రైంలను నిరోధించాల్సి ఉందని పేర్కొన్నారు. అందులో పోలీస్ సిబ్బందికి అన్ని విధాలా శిక్షణ ఇస్తున్నామన్నారు. సైబర్ క్రిమినల్స్‌కు తప్పకుండా ముక్కుతాడు వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాల్ సెంటర్ అరాచకాలపై దృష్టి పెడతామని నగర సీపీ రాజశేఖర్ బాబు స్పష్టం చేశారు.

## తిరుమల పరకామణి కేసులో
# ఎవరినీ వదిలిపెట్టం

### సతీష్ ను హత్యచేసి ఆత్మహత్యగా ప్రచారం
### పరకామణి రాజీ కేసులో అనేక అనుమానాలు
### మంత్రి పార్థసారథి వెల్లడి

**అమరావతి,నవంబర్ 17 (మనసులో మాట):**


తిరుమల పరకామణి కేసులో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని మంత్రి పార్థసారథి అన్నారు. ఇందులో అసలు దోషులు వైకాపా నేతలే అన్నది స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఫిర్యాదుదారుడు సతీష్‌ను హత్య చేసి ఆత్మహత్యగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. అయితే తిరుమల చుట్టూ రాజకీయ కుట్రలతో భక్తులు మనస్తాపం చెందారని మంత్రి పార్థసారథి అన్నారు. వైకాపా తీరుపై మంత్రి పార్థసారథి మండిపడ్డారు. మంగళవారం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. 2023లో రూ.100 కోట్ల విలువైన పరకామణి చోరీ జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దర్యాప్తు లేకుండా ఛార్జ్‌షీట్ వేశారని, గతంలో ముద్దాయి రవిని వైకాపా పెద్దలు బయటకు తీసుకొచ్చారని చెప్పారు. స్వామివారి ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దోపిడీలకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.సతీశ్ హత్య కేసులో సీబీఐ విచారణ కోరడం.. వైకాపా ద్వంద్వ వైఖరికి నిదర్శనం. వివేకా కేసులో సీబీఐ అధికారులను బెదిరించి విచారణను అడ్డుకున్నారు. హత్యలు చేయడం సీబీఐ విచారణ కోరడం వైకాపాకు అలవాటే. సతీశ్ కుటుంబం హత్య అని చెబుతుంటే.. ఆత్మహత్య అని వైకాపా ప్రచారం చేస్తోందని పార్థసారథి మండిపడ్డారు. పరకామణి కేసు వెనుక ఎవరు ఉన్నారో తేల్చాలి అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. ఇక, సాక్ష్యం చెప్పడానికి వస్తున్న మాజీ ఏవీఎస్‌ఓ సతీష్‌కుమార్ హత్యకు గురయ్యాడు.. గతంలో వివేకానందరెడ్డి హత్య కేసులో అసత్యాలు ప్రచారం చేసినట్లే.. సతీష్ హత్య కేసులోనూ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సతీష్‌కుమార్‌ది ఆత్మహత్య అని వైసీపీ నేతలు ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. ఆయన హత్య కేసులో వైసీపీ నేతలకు ఎందుకంత ఉత్సాహం.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది వెంకన్న భక్తులు తిరుమల చుట్టూ జరుగుతున్న రాజకీయ కుట్రలను చూసి తీవ్ర మనస్తాపం చెందుతున్నారు.. 29-04-2023న సుమారు 100 కోట్ల విలువైన విదేశీ కరెన్సీ పరకామణి నుంచి దొంగతనం జరిగింది



అని మంత్రి పార్థసారథి చెప్పుకొచ్చారు. వందల కోట్ల స్వామివారి సొమ్ము చోరీకి గురైతే గత ప్రభుత్వం కేవలం చిన్న చిన్న సెక్షన్లతో కేసు నమోదు చేసి దర్యాప్తును నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కీలక నిందితుడు రవికుమార్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి ఇంటరాగేషన్ చేయకుండా, రాచ మర్యాదలతో నోటీసు ఇచ్చి, కాఫీ-టిఫిన్ పెట్టి సాగనంపారు.. కేసు నమోదైన ఒక నెలలోనే ఎలాంటి దర్యాప్తు లేకుండా పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారని ఆరోపించారు. అయితే, 1-6-2023న ఫిర్యాదు చేసిన సతీష్ కుమార్, నిందితుడు రవికుమార్ కలిసి కోర్టులో రాజీ అని జాయింట్ మెమో ఇచ్చారు.. ఈ కేసు రాజీ పడటానికి ఫిర్యాదు చేసిన సతీష్ కుమార్‌కు ఏమాత్రం అర్హత లేదని మంత్రి పార్థసారథి వెల్లడించారు. ఇక, వైసీపీ పెద్దల సొత్తా.. లేక కోట్లాది మంది భక్తులు ఆరాధించే స్వామివారి సొత్తా రాజీ చేసుకోవడానికి అని పార్థసారథి అడిగారు. ఒక్క రోజు కూడా జైలుకు పోకుండా ముద్దాయి రవికుమార్‌ను సగర్వంగా బయటికి తీసుకొచ్చారు వైసీపీ పెద్దలు.. రూ. 100 కోట్ల విదేశీ కరెన్సీ దోపిడీ నిందితుడితో రాజీ చేసి, స్వామివారి పేరిట కేవలం రూ.14 కోట్ల ఆస్తులు రాయించుకోవడం పెద్ద స్కామ్ అన్నారు. టీటీడీ బోర్డు అజెండాలో భక్తుడు రవికుమార్ దానం చేశాడని రాసి రికార్డు చేశారు.. దొంగతనం చేసిన వ్యక్తి భక్తుడా అని ప్రశ్నించారు. అలాగే, టీటీడీ విజిలెన్స్ స్వయంగా తమ రిపోర్టులో 'పోలీసుల ఒత్తిడి వల్లే లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నామని రాసుకున్నారు.. ఆ ఒత్తిడి తెచ్చిందెవరని అనుమానం వ్యక్తం చేశారు.

## దేశంలో ఉగ్రచర్యలకు పాల్పడే
# వారిని వదలం

### పాతాళంలో దాక్కున్నా పట్టుకుని శిక్షిస్తాం
### హోంమంత్రి అమిత్ షా హెచ్చరిక



**న్యూఢిల్లీ :** ఢిల్లీ కారు పేలుడు నిందితులకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఢిల్లీ పేలుళ్ల నిందితులను ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. పాతాళంలో ఉన్నా వేటాడి పట్టుకొచ్చి మరీ కఠిన శిక్షలు పడేలా చేస్తామని హెచ్చరించారు. సోమవారం హరియాణా లోని ఫరిదాబాద్‌లో జరిగిన నార్తరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. ఢిల్లీ పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉగ్రచర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టమని వార్నింగ్ ఇచ్చారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని మూలాల నుంచి నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. 2025, నవంబర్ 11న భారీ పేలుడుతో దేశ రాజధాని ఢిల్లీ ఒక్కసారిగా ఉలిక్కిపడిన విషయం తెలిసిందే. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఓ కారులో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 15 మంది మృతి చెందగా.. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. యావత్ దేశాన్ని కుదిపేసిన ఈ ఘటనను ఉగ్రదాడిగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏకి అప్పగించింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎన్ఐఏ విచారణ వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పలువురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు.. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. ఈ క్రమంలోనే ఢిల్లీ కారు పేలుడుకు సంబంధించి సోమవారం మరో వ్యక్తిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. జమ్మూకాశ్మీర్‌కు చెందిన జాసిర్ బిలాల్ వాని అలియాస్ డానిష్?ను అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ కారు బ్లాస్ట్ కేసులో ప్రధాన నిందితుడు, ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీతో డానిష్‌కు సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బాంబ్ పేలుడు కోసం ఉమర్ నబీకి డానిష్ సాంకేతిక సహాయం అందించాడని.. డ్రోన్ల ద్వారా ఉగ్రవాద దాడులకు సహకరించాడని అధికారులు వెల్లడించారు.

## తెలుగు మహిళ కారుపై
# దుండగుల దాడి

**అనంతపురం,నవంబర్ 17 (మనసులో మాట):**

ఆంధ్రప్రదేశ్ తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని కారుపై దుండగులు దాడి చేశారు. ఈ మేరకు ఆమె నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రసాద్ కు పిర్యాదు చేశారు. కాగా సంగా తేజస్విని కారుపై సెప్టెంబరు 9న ఇదివరకే ఒకసారి దుండగులు దాడి చేశారు. అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా తిరిగి రెండోసారి ఆమె కారుపై ఆదివారం రాత్రి సమయంలో దుండగులు దాడి చేసినట్లు చెబుతున్నారు. ఐతే ఇటీవల ఆమె మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అవినీతిపై పలు వ్యాఖ్యలు చేశారు. దీంతో ఈ దాడుల వెనుక వైసీపీ నాయకుల హస్తం ఉందని తేజస్విని వర్గీయులు భావిస్తున్నారు. అయితే పలుమార్లు దాడులకు దిగుతున్న వారిని గుర్తించి పోలీసులు శిక్షించాలని తేజస్విని కోరుతున్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక దొడ్డిదారున ఇలా ఆర్థికంగా దెబ్బతీయాలని చూడడం జరిగింది కాదని ఆమె అన్నారు. పోలీసులు ఫిర్యాదులు స్వీకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## హిందూపురం వైఎస్ఆర్సీపీ
# కార్యాలయంపై దాడి

### దాడిశెట్టి రాజా అధ్యక్షతన కాకినాడలో నిరసనలు

**కాకినాడ,నవంబర్ 17 (మనసులో మాట):**

హిందూపురం వైఎస్ఆర్సీపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ కాకినాడ సిటీ మాజీ శాసన సభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, కాకినాడ జిల్లా వైయస్ఆర్ సిపి అధ్యక్షులు దాడిశెట్టి రాజా అధ్యక్షతన కాకినాడ బాలజి చెరువు వై.యస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా మాట్లాడుతూ హిందూపురంలో వైఎస్ఆర్సిపి కార్యాలయంపై జరిగిన దాడిని ఖండించారు. ఇలాంటి దాడుల సంస్కృతి రాష్ట్రంలో మంచిది కాదని ప్రభుత్వం వెంటనే దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వంగా గీతా, మాజీ ఎంపీ తోట నరసింహం, వై.యస్.ఆర్ సిపి ప్రత్తిపాడు ఇంచార్జ్ ముద్రగడ గిరి, వై.యస్.ఆర్ సిపి పెద్దాపురం ఇంచార్జ్ దవులూరి దొరబాబు, వై.యస్.ఆర్ సిపి రాష్ట్ర మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ జమ్మలమడుగు నాగమణి, కాకినాడ సిటీ మహిళా అధ్యక్షురాలు పసుపులేటి వెంకట లక్ష్మి, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, కాకినాడ జిల్ల, సిటీ అనుబంధ పదవుల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎయిడెడ్ టీచర్లకు మెడికల్
# రీయింబర్స్‌మెంట్

### ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ డిమాండ్

**అమరావతి,నవంబర్ 17 (మనసులో మాట):**

ఎయిడెడ్ టీచర్లకు మెడికల్ రియంబర్స్‌మెంట్ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి చిట్టిబాబు, ఎల్కే చిన్నప్ప ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి ఒక పత్రిక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రస్తుతం 765 ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే 2500 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి 1998 నుంచి ప్రభుత్వ మునిసిపల్ జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల మాదిరి మెడికల్ రీయంబర్స్మెంట్ సౌకర్యం లేదని తెలిపారు. అప్పటి నుంచి ఉపాధ్యాయులు తమ స్వంత ఖర్చులతోనే వైద్యం చేయించుకున్నారు. కరోనా సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు 169 మంది మరణించారని తెలిపారు. వారి ఆరోగ్యం కొరకు కుటుంబ సభ్యులు ఐదు లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చు చేశారు. కానీ ఫలితం దక్కలేదు వారి కుటుంబ సభ్యులకు ఇంతవరకు కారుణ్య నియామకాల కింద ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. కనుక కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రస్తుతం ఉన్న ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మెడికల్ రీయంబర్స్మెంట్ సౌకర్యం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## డ్రగ్స్ నిరోధంపై అవగాహనకు
# 'సంకల్పం'

### అమరావతి విట్ వర్సిటీలో నేడు కార్యక్రమం

**గుంటూరు,నవంబర్ 17 (మనసులో మాట):**

డ్రగ్స్ నిరోధంపై అవగాహనకు 'సంకల్పం' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. అమరావతి విట్ వర్సిటీలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. డ్రగ్స్ విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేసిన సందర్భంగా ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఠా నుంచి 17 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠా బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి ఇక్కడ సరఫరా చేస్తున్నారని, బెంగళూరులో డ్రగ్స్ తయారీదారులను గుర్తించాల్సి ఉందని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ ముఠాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

## ఓఎల్ఎక్స్‌లో గిద్దలూరు
# తాసిల్దార్ ఆఫీస్ అమ్మకం

### ఆకతాయి పోస్ట్‌పై పోలీసుల దర్యాప్తు


**ఒంగోలు,నవంబర్ 17(మనసులో మాట):**

సెకండ్ హ్యాండ్ వస్తువులను అమ్మడానికి, కొనడానికి ఉపయోగించే 'ఓఎల్ఎక్స్'ను ఓ దుండగుడు దుర్వినయోగం చేశాడు. ఏకంగా తాసిల్దార్ కార్యాలయాన్నే అమ్మకానికి పెట్టాడు. చిన్న చిన్న వస్తువుల దగ్గరినుంచి భారీ స్థలాల వరకు అన్ని రకాల వాటిని ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి వస్తూ ఉంటాయి. ప్రకాశం జిల్లాలో షాక్‌తో పాటు మనల్ని షేక్ చేసే సంఘటన ఒకటి వెలుగు చూసింది. ఓ ఆకతాయి రెచ్చిపోయి గిద్దలూరు తహశీల్దార్ కార్యాలయాన్ని ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి పెట్టాడు. అది కూడా కేవలం 20 వేల రూపాయలకే ఎమ్మార్వో ఆఫీస్ అమ్ముతానంటూ పోస్టు పెట్టాడు. సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన పోస్టు వైరల్‌గా మారింది. గిద్దలూరు ఎమ్మార్వో దృష్టికి కూడా విషయం వెళ్లింది. ఆయన వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఎమ్మార్వో ఆఫీస్‌ను ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి పెట్టడంపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# నంద్యాలో ఉద్యోగాల మోసం

**నంద్యాల,నవంబర్ 17(మనసులో మాట):**

నంద్యాల జిల్లాలో భారీ మోసం వెలుగు చూసింది. దీనిపై ఫిర్యాదులు రావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్యోగాల పేరిట రాయలసీమలో జరిగిన భారీ మోసం వెలుగులోకి వచ్చింది. వెల్త్ అండ్ హెల్త్ సంస్థ నిర్వాహకులు ఈ దురాగతానికి పాల్పడ్డారు. ఉద్యోగం కావాలంటే రూ.3 లక్షలు డిపాజిట్ చేయాలని నిబంధన పెట్టి, నెలకు రూ.40వేలు వేతనం ఇస్తామని నిరుద్యోగులకు గాలం వేశారు. కడప, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో దాదాపు 1200 మంది నుంచి డిపాజిట్లు వసూలు చేశారు. కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో బాధితులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే అసలు వ్యవహారం బయటపడింది. కేసు నమోదు చేసిన ఆళ్లగడ్డ పోలీసులు.. వెల్త్ అండ్ హెల్త్ సంస్థ నిర్వాహకులు రాజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, వీరారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలను అరెస్టు చేశారు.




సంపాదకీయం

# విజయాన్ని అనుకూలంగా భావించొద్దు

తెలంగాణలో కేవలం కెసిఆర్, కెటిఆర్ అహంకారం వల్లనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసారు. అదికూడా బండి సంజయ్‌ను బిజెపి అధ్యక్షుడిగా తొలగించడంతో బిజెపి వైపు ఉన్న సానుకూల పవనాలు రేవంత్ వైపు చూపించారు. ఇది రెండేళ్ల క్రితం నాటి ఎన్నికల ముందు పరిస్థితి. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదు. ఎందుకంటే బండిని తొలగిచగానే బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యయాని క్షేత్రస్థాయిలో కూడా ప్రజలు చర్చించుకుని ముక్కున వేలేసుకున్నారు. అందుకే అటు బిజెపిని, ఇటు బిఆర్ఎస్‌ను దెబ్బకొట్టి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రెండు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మొన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా ప్రజలు రేవంత్‌ను నమ్మి గెలిపించారు. ఇది కూడా కేవలం రేవంత్ వ్యూహం వల్లనే అని చెప్పక తప్పదు. అయితే అన్నింటికిమించి ఆరు గ్యారెంటీ లను ప్రస్తావిస్తూ..అన్ని హామీలను నెరవేర్చామని కాంగ్రెస్ పదేపదే ప్రకటిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న అనేక సమస్యలను అసలు పరిష్కారం దిశగా చూడడం లేదు. ధరణి పోయి భూమాత వచ్చినా సమస్యలు అలాగే ఉన్నాయి. అనేక భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని వార్తలు ప్రచురితం అవుతున్నా పట్టించు కోవడం లేదు. దేవాదాయ శాఖ భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి గురించి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకే తెలియదు. అసలు దేవాదాయ శాఖలో ఏం జరుగుతుందో ఆమె తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదు. అటవీ భూములు పరిస్థితి అలాగే ఉంది. రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు దెబ్బతిన్నాయి. హైదరాబాద్‌లో రోడ్ల అధ్వానంనం గురించి మంత్రి కోమటిరెడ్డికి కూడా పట్టింపు లేదు. అంతెందుకు వరంగల్ హైవేలో రోడ్డను బాగు చేద్దామన్న సోయి లేదు. లంచం ఇవ్వనిదే ఉద్యోగులు ఏ పనీ చేయడం లేదు. ఉద్యోగులను గట్టిగా అదిలించ లేకపోతున్నారు. ఒకరిద్దరు ఎసిబికి చిక్కుతున్నా అది ప్రభావం చూపడం లేదు. గ్రామాల్లో తెల్లరేషన్ కార్డు విధానం తీవ్రంగా దుర్వినియోగం అవుతోంది. రేషన్ బియ్యం కొత్త వ్యాపార దందాకు తెరతీసింది. దీనిపై పౌరసరఫరాలశాఖ మంత్రికే తెలియడం లేదు. ఏం జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఇవి మచ్చుకు తీసుకుని చర్చిస్తున్న అంశాలు మాత్రమే. ఫీజు రియంబర్స్‌మెంట్ దోపిడీ, ఆరోగ్యశ్రీ దోపిడీలు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ కూడా సిఎంగా రేవంత్ రెడ్డిపైనే ప్రభావం చూపుతాయి. మంచి జరిగితే ఎలాగైతే పేరు వస్తుందో చెడు జరిగినా సిఎంగా రేవంత్‌పైనే ప్రభావం చూపుతాయి. ఎంతసేపు ఉప ఎన్నికల్లో గెలిచమనో, బిసి రిజర్వేషన్లను అమలు చేశామనో లేక అమలు చేయబోతున్నామనో చెబితే సమస్యలను పరిష్కరించి నట్లు కాదు. చిన్న సమస్యను కూడా సీరియస్‌గా తీసుకని పరిష్కరించాలి. ఇల్లు అలకగానే పండగ కాదన్నట్లు ఒక ఉప ఎన్నికను సర్వశక్తులూ ఒడ్డి గెలిచనంత మాత్రాన అంతా అనుకూలంగా ఉందని భావిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతానికి రేవంత్‌రెడ్డి పైచేయి సాధించారు. అందులో అనుమానం లేదు. అలాగని ప్రజాభిమానాన్ని చూరగొనడానికి ఆయన ఇంకా ప్రయత్నించాలి. ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలి. పార్టీలో క్రమశిక్షణ నెలకొల్పడంతో పాటు, మంత్రులను పనిచేసేలా అదిలించాలి. రెండేళ్ల వార్షికోత్సవం జరుపుకోవడానికి ముందు ఈ రెండేళ్ల పాలనలో మంచి చెడులను సమీక్షించుకోవాలి. మధ్య తరగతి, ఆపై వర్గాల ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉంది. హైదరాబాద్ నగర్ సమస్యలపై దృష్టి పెట్టడం ద్వారా ప్రజల మనసు గెలుచుకోవాలి. ఉప ఎన్నిక అంటే పార్టీ యంత్రాంగం అంతా మోహరిస్తుంది. సాధారణ ఎన్నికల్లో అలా చేయడం సాధ్యం కాదు. వనరులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత వస్తోంది. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉన్నందున ఈ పరిస్థితిని అధిగ మించడానికి అవకాశం ఉంది. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ గెలవడంతో ఇక అంతా మంచి చేశామని, ప్రజలు తమవెంటే ఉన్నారని, కెసిఆర్ పని అయిపోయిందని అంటే ప్రజలు సహించరు. ముఖ్యమంత్రిగా రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాల ప్రజల మనోగతం తెలుసు కోవాలి. ప్రజల్లో ఏయే అంశాలపై అసంతృప్తి ఉందో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఇప్పడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తన స్థానం పటిష్ఠం అయినందున ప్రజలకు సంబంధించిన సామాన్య సమస్యలపై దృష్టి సారించాలి. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి పరపతి పడిపోతోందని ప్రచారం చేసిన వారికి జూబ్లీఅహిల్ విజయంతో సమాధానం చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్న ప్రచారం గత కొంత కాలంగా జోరుగా జరుగుతోంది. ఈ పరిస్థితులలో ఈ విజయం కాంగ్రెస్ పార్టీకి లాభించడం ఎలా ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠ పెరగడానికి మాత్రం దోహదం చేసిందనే చెప్పాలి. ఇదే సమయంలో ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో రేవంత్ పట్టు సాధించాలి. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం పైనే ఆ పార్టీ నాయకులు, శ్రేణులకు నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ రెండేళ్లుగా తనను ఎవరు ఎన్ని విధాలుగా విమర్శించినా, హేళన చేసినా రేవంత్‌రెడ్డి ఓపికతో వెళుతున్నారు. అవకాశం కోసం ఎదురుచూస్తూ వచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రూపంలో ఆయనకు ఆ అవకాశం వచ్చింది. ఆత్మవిశ్వాసంతో,పదునైన వ్యూహ రచనతో విజయాన్ని అందుకున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో రాష్ట్ర రాజకీయాలలో గానీ, ప్రజల జీవితాలలో గానీ మార్పులు రావు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోయి ఉంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోక పోయినా, వ్యతిరేకత మాత్రం విపరీతంగా పెరిగేది. రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ఇప్పుడు వచ్చిన ప్రమాదం లేదు. అయితే ఆయన ఎంతగా క్షేత్రస్థాయిలోకి వెళ్లగలిగితే అంతగా ప్రజల్లో స్థానం సాధిస్తారు. లేకుంటే ఈ మూడేళ్లలోనే గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదు.

డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక



# ఆపరేషన్ సింధూర్ పాఠాలు నేర్పింది

## ఇది కేవలం ట్రైలర్ మాత్రమే
## పాక్ మళ్లీ తెగిస్తే ఇక అంతే సంగతులు
## చాణక్య రక్షణ సదస్సులో జనరల్ ద్వివేది



న్యూఢిల్లీ, నవంబర్ 17: పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై జరిపిన మిలటరీ చర్య 'ఆపరేషన్ సిందూర్' నుంచి తాము పాఠాలు నేర్చుకున్నామని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. గతేడాది చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఒక ట్రైలర్ మాత్రమేనని, పొరుగుదేశం మళ్లీ దారి తప్పితే గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సోమవారంనాడిక్కడ జరిగిన 'చాణక్య రక్షణ సదస్సు'లో ఆయన మాట్లాడుతూ, 88 గంటలపాటు సాగించిన 'ఆపరేషన్ సిందూర్' ఒక ట్రైలర్ మాత్రమేనని అన్నారు. 'భవిష్యత్తులో ఎలాంటి సవాళ్లు ఎదురైనా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. పాక్ తిరిగి దారి తప్పితే ఎలా బాధ్యతగా వ్యవహరించాలో గుణపాఠం నేర్పిస్తాం' అని జనరల్ ద్వివేది అన్నారు. ఎప్పుడు ఆపరేషన్ చేపట్టినా దాని నుంచి కొన్ని విషయాలు నేర్చుకోవడం జరుగుతుందని, త్రివిధ దళాల మధ్య సమన్వయం, సరఫరాలు సక్రమంగా అందేలా చూసుకోవడం, ప్రతి దశలోనూ ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వంటివి చాలా కీలకమైనవిగా 'ఆపరేషన్ సిందూర్' నుంచి గ్రహించినట్టు చెప్పారు. అతి తక్కువ సమయం లోనే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ప్రతి దశలోనూ సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం అనివార్యమని చెప్పారు. బలగాల మధ్య సమన్వయం చాలా అవసరమని, అందులోనూ యుద్ధాలు ఇవాళ బహుళ మాధ్యమాల్లో జరుగుతున్నాయని అన్నారు. భూమి, ఆకాశం, సైబర్ రంగం, సమాచార యుద్ధం... వెరసి సమగ్ర యుద్ధం అవుతోందన్నారు. ఆర్మీ మాత్రమే యుద్ధం సాగించలేదని, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా యుద్ధం సాగించాల్సి ఉంటుందని చెప్పారు. ఇవాళ యుద్ధం అంటూ వస్తే ఎన్ని గంటలు జరుగుతుందో చెప్పలేమని, ఆపరేషన్ సిందూర్ 88 గంటలపాటు సాగించామని, వచ్చేసారి నాలుగు నెలలైనా కావచ్చు, నాలుగేళ్లూ పట్టవచ్చని అన్నారు. ఇలాంటప్పుడు యుద్ధానికి సరిపడినన్ని ఆయుధాలు మన వద్ద ఉన్నాయా? అనేది చూసుకోవాలని, లేనిపక్షంలో అందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రఘటన అనంతరం భారత్ తీసుకువచ్చిన 'న్యూ నార్మల్' విధానంపై మాట్లాడుతూ, ఒకే సమయంలో చర్చలు, ఉగ్రవాదం కొనసాగలేవని చాలా స్పష్టంగా ఈ విధానంలో చెప్పడం జరిగిందన్నారు. ఒక దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుంటే, అది ఇండియాకు ఆందోళన కలిగించే విషయమని, ప్రగతిని ఇండియా కోరుకుంటోందని, అందుకు అవరోధం కలిగించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. శాంతియుత పక్రియకు భారత్ సహకరిస్తుందని, అప్పటివరకూ ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని స్పాన్సర్ చేస్తున్న వారికి ఒకే రీతిన గుణపాఠం చెబుతుందని అన్నారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపై మాట్లాడుతూ, 370వ అధికరణ రద్దు తర్వాత ఉగ్రవాద ఘటనలు తగ్గాయని చెప్పారు.

# నేడు టీటీడీ ఆర్జిత సేవా టికెట్లు విడుదల

## ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటేనే లభ్యం



**తిరుమల, నవంబర్ 17:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవ టికెట్లను తిరుమల తిరుపతి దేవస్థానం మంగళవారం విడుదల చేయనుంది. ఈ నెల 18న ఉదయం 10 గంటలకు ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల ఫిబ్రవరి కోటా టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనుంది. ఆసక్తి కలిగిన భక్తులు వీటిని బుక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఆర్జిత సేవా టికెట్లను ఎలక్ట్రానిక్ లక్కీడిప్ ద్వారా జారీ చేస్తారు. లక్కీడిప్ రిజిస్ట్రేన్‌కు ఈనెల 20 ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందిన భక్తులు నవంబర్ 20 నుంచి 22 మధ్యాహ్నం 12 గంటలలోపు నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఇక కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవం టికెట్లను ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా విడుదల మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుంది. అదేవిధంగా అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం టికెట్ల కోటాను 11 గంటలకు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్లను నవంబర్ 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను నవంబర్ 25న ఉదయం 10 గంటలకు టీటీడీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. తిరుమల, తిరుపతిల్లో అద్దె గదుల బుకింగ్ కోటా మధ్యాహ్నం 3 గంటలకు జారీ అవుతుంది. భక్తుల వెబ్‌సైట్‌లోనే ఆర్జిత సేవలు, సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ వెల్లడించింది.

# రేపు పుట్టపర్తికి ప్రధాని మోడీ



**అమరావతి, నవంబర్ 17:** పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతి వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 19న పుట్టపర్తిలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. భక్తులకు ఏర్పాట్లు, రవాణా సౌకర్యాల కోసం ముగ్గురు ఐఏఎస్ అధికారులను నియమించింది. గోపాలకృష్ణ, గోవిందరావు, కల్యాణ్ చక్రవర్తికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. అంతేకాకుండా సమీప జిల్లాలకు చెందిన జేసీ, 9 మంది డిప్యూటీ కలెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.



# ఢిల్లీ పేలుడు ఘటనలో కీలక పరిణామం

## ఉమర్‌కు సహకరించిన అమీర్ రషీద్
## ఎన్ఐఎ కస్టడీకి అప్పగించిన పాటియాల కోర్టు

**న్యూఢిల్లీ, నవంబర్ 17:** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన భారీ పేలుడు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పేలుడుకు పాల్పడిన ఉమర్‌కు సహకరించిన నిందితుడు అమీర్ రషీద్ అలీని కట్టుదిట్టమైన భద్రత మధ్య పాటియాలా హౌస్ కోర్టు కాంప్లెక్స్‌లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు ముందు సోమవారం నాడు హాజరుపరిచారు. ఈ మేరకు 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి కోర్టు ఆదేశించింది. ఆ వెంటనే రషీద్‌ను ఎన్ఐఏ కార్యాలయానికి అధికారులు తరలించారు. అమీర్ రషీద్ అలీని కోర్టుకు హాజరుపరిచే సమయంలో మీడియాను అనుమతించలేదు. కోర్టు కాంప్లెక్స్ చుట్టూ ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది మోహరించారు. అల్లర్ల వ్యతిరేక టీమ్‌నూ సిద్ధం చేశారు. నవంబర్ 10న జరిగిన ఢిల్లీ పేలుడు ఘటనలో 10 మంది మృతిచెందగా, 13మంది గాయపడ్డారు. ఐఈడీ అమర్చి పేల్చిన ఐ20 కారు అమిర్ పేరుతో రిజిస్టర్ కావడంతో ఎన్ఐఏ అతన్ని అదుపులోకి తీసుకుంది. సూసైడ్ బాంబర్ ఉమర్ నబీతో కలిసి ఈ దాడికి అమిర్ రషీద్ కుట్రపన్నినట్టు ఎన్ఐఏ వెల్లడించింది. అమిర్ జమ్మూకశ్మీర్‌లోని పంపోర్‌కు చెందిన వ్యక్తి కాగా, ఉమర్ ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. తదుపరి విచారణలో భాగంగా ఉమర్ ఉపయోగించిన మరో కారునూ ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. ఇంతవరకూ గాయపడిన బాధితులతో సహా 73మంది సాక్ష్యులను ఎన్ఐఏ విచారించింది. మరోవైపు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ కేసులో ప్రమేయం, మోసం, ఫోర్జరీకి పాల్పడిన ఆరోపణలపై అల్-ఫలాహ్ యూనివర్శిటీ చైర్మన్‌కు ఢిల్లీ పోలీసులు రెండు సమన్లు జారీ చేశారు. యూజీసీ, ఎన్ఏఏసీ లేవనెత్తిన ఆందోళనలపై రెండు ఎఫ్ఐఆర్‌లనూ నమోదు చేశారు. యూనివర్శిటీ గుర్తింపు క్లెయిమ్స్‌పై జరిపిన సమీక్షలో పెద్దఎత్తున అవకతవకలు

# బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష

## అల్లర్లలో కాల్పులకు ఆదేశించారన్న అభియోగం
## ఢాకా ట్రైబ్యునల్ కోర్టు సంచలన తీర్పు



**ఢాకా,నవంబర్ 17:** ఢాకా అల్లర్లకు కారణమంటూ బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోరటు ఉరిశిక్ష విధించింది. దశాబ్దాల పాటు ఆ దేశ రాజకీయ చరిత్రను తానై నడిపించిన ఆమెను 'ఉక్కు మహిళ'గా వ్యవహరిస్తుంటారు. కానీ, తన హయాంలో ఏర్పడ్డ ట్రైబ్యునలే.. ఇప్పుడు ఆమెకు మరణశిక్ష విధించింది. ఇటీవలి అల్లర్ల తరవాత ఆమె భారత్‌లో ఆశ్రయం పొంది ప్రవాస జీవితం గడుపుతున్నారు. ఆమె ప్రభుత్వం అసమ్మతిని అణచివేసిందని, మీడియాపై ఆంక్షలు విధించిందని, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసిందని, భద్రతా శక్తుల అధికారాలను పెంచిందనే ఆరోపణలు వచ్చాయి. 2024లో స్వాతంత్ర్య పోరాట వీరుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థి నిరసనలు చివరికి దేశవ్యాప్త తిరుగుబాటుగా మారాయి. ఈ నిరసనలే హసీనా పాలనను అంతం చేశాయి. ఆమె ప్రభుత్వం చేపట్టిన భద్రతా చర్యల వల్ల హింస పెరిగింది. ఇది జులై తిరుగుబాటుగా మారింది. ఈ అల్లర్లలో 1,400 మంది వరకు మరణించారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదించింది. ఆందోళనల కారణంగా హసీనా అధికారం నుంచి వైదొలగి భారత్‌లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. అనంతరం బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడ్డ మధ్యంతర ప్రభుత్వం 'అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్'ను పునరుద్ధరించింది. యుద్ధ నేరాలకు పాల్పడిన వారిని విచారించేందుకు ఆమే ఒకప్పుడు దీన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు అదే ట్రైబ్యునల్ 2024 నాటి అల్లర్ల విషయంలో హసీనాపై మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాల ఆరోపణలు మోపింది. నెలల తరబడి విచారణ జరిపి సోమవారం మరణశిక్ష విధించింది. తన ఎదుగుదలకు తోడ్పడిన దేశమే ఇప్పుడు తన పతనాన్ని శాసించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు హసీనా. భారత ఆశ్రయంలో ఉంటూ సరిహద్దు ఆవల ఉన్న బంగ్లాదేశ్ భవిష్యత్తుపై మథనపడుతున్నారు. తనకు విధించిన మరణ శిక్షను ఖండించారు. తీర్పు మోసపూరితమన్నారు. అక్కడి ప్రభుత్వమే కుట్రపూరితంగా తనకు శిక్ష పడేలా చేసిందని ఆవేదన చెందారు. తనను తాను నిరూపించుకోవడానికి కోర్టు అవకాశం ఇవ్వలేదని వాపోయారు. నాటి తూర్పు పాకిస్థాన్‌లోని తుంగిపారాలో 1975 ఆగస్టులో జరిగిన సైనిక తిరుగుబాటు హసీనా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ ఘర్షణల్లో ఆమె తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులు ఇంకా కుటుంబ సభ్యులు హత్యకు గురయ్యారు. ఆ సమయంలో విదేశాల్లో ఉండటం వల్ల హసీనా, ఆమె చిన్న చెల్లెలు రెహానా మాత్రమే బతికి బయటపడ్డారు. నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ ఆమెకు ఆశ్రయం ఇచ్చారు. ఆరు సంవత్సరాల తర్వాత 1981 మేలో బంగ్లాదేశ్‌కు హసీనా తిరిగొచ్చారు. దేశానికి రాకముందే ఆమెను అవామీ లీగ్ పార్టీ తమ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. దేశానికి తిరిగి వచ్చే సరికే హసీనా ప్రధాన ప్రత్యర్థి ఖలీదా జియా ఆమె కోసం వేచి చూస్తున్నారు. హసీనా మొదటిసారి 1996లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. 2001లో అధికారం కోల్పోయారు. 2008లో భారీ విజయం సాధించి సుదీర్ఘ పాలన మొదలుపెట్టారు. 2014, 2018 ఎన్నికల్లోనూ అవామీ లీగ్ పార్టీయే గెలిచింది. దీంతో ప్రపంచంలోనే ఎక్కువ కాలం పాలించిన మహిళా నేతల్లో ఒకరిగా చరిత్ర సృష్టించారు. ఆమె పాలనలో బంగ్లాదేశ్ చాలా వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించింది. పద్మా వంతెన వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి. పేదరిక నిర్మూలనలో దేశం పురోగమించింది. బంగ్లాదేశ్ ప్రపంచ వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా మారింది. ఈ ప్రశంసలతో పాటే విమర్శలు కూడా ఎదుర్కొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం

మంగళవారం 18 నవంబర్ 2025



### అల్లూరి స్ఫూర్తిని ప్రతిబింబించిన
### పదో తరగతి విద్యార్థి మొస్స సూర్యతేజ కు
# ప్రముఖుల ప్రశంసల వర్షం



**గూడెం/సీలేరు నవంబర్ 17:(మనసులో మాట)..** విశాఖపట్నం, మారికవలసలో ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం మారికవలస సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు) లో ఇటీవల నిర్వహించిన ప్రతిష్ఠాత్మక సాంస్కృతిక కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థి మొస్స సూర్యతేజ అల్లూరి సీతారామరాజు వేషధారణలో చేసిన అద్భుత ప్రదర్శన రాష్ట్రవ్యాప్తంగా స్ఫూర్తిదాయక చర్చనీయాంశంగా మారింది.

అల్లూరి సీతారామరాజు ధైర్యం – పోరాట పటిమ – ఆదివాసీ సంస్కృతి – గిరిజనుల హక్కుల కోసం చేసిన త్యాగస్ఫూర్తి అన్నింటినీ నిష్కళంకంగా ప్రతిబింబిస్తూ సూర్యతేజ చేసిన అల్లూరి పాత్రాభినయం కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధులను చేసింది. సూర్యతేజ నటనలో ప్రతిఫలించిన అల్లూరి వీరవిక్రమం, భావోద్వేగ పటిమ, దేశభక్తి జ్వాల, సంస్కృతి మీద నేర్చుకున్న లోతైన గౌరవం. ఆంధ్రప్రదేశ్ శిశు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ మంత్రివర్యులు గుమ్మడి సంధ్యారాణి, పౌర విమానయాన కేంద్ర మంత్రివర్యులు కింజరపు రామ్మోహన్ నాయుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, విశాఖపట్నం జిల్లా జిల్లా పరిషత్ (జెడ్పీ) చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తో పాటు అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సూర్యతేజ వేషధారణ, నటన, అల్లూరి రూపంలో అతని తీరు చూసి అందరూ ప్రశంసలు కురిపించారు.



## 'మనసులో మాట' పత్రికలో వచ్చిన వార్తకు స్పందన

**(ఎంపీడీఓ కు చెప్పినా వీధి బల్బులు వేయని వైనం)**

**కొయ్యూరు నవంబర్ 17 (మనసులో మాట):** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రావణాపల్లి పంచాయితీ లోని తోటలూరు గ్రామంలో వీధి బల్బులు కొన్ని చోట్ల వేసి కొన్ని చోట్ల వదిలేసారని 'మనసులో మాట' పత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. వెనువెంటనే ఈరోజు తోటలూరు గ్రామంలో వీధి బల్బులు వేయించారు.

### బుకింగ్ చేసిన డెలివరీ ఇవ్వని గ్యాస్
## కానీ.. క్యాష్ బిల్ జారీ




**నాతవరం, నవంబర్ 17 (మనసులో మాట)..** నాతవరం మండలం వెదురుపల్లి గ్రామం చెందిన శలపాక రమణమ్మ నర్సీపట్నం చెందిన సాయి హెచ్ పి గ్యాస్ కంపెనీ లో గ్యాస్ కనెక్షన్ తీసుకోవడం జరిగింది ఇలా మా ఊరు నుండి చాలామంది సాయి ఏజెన్సీలో గ్యాస్ కనెక్షన్ తీసుకోవడం జరిగింది కానీ చాలా కష్టం అవుతుంది మేము గ్యాస్ బుక్ గ్యాస్ అయిపోతే గ్యాస్ విడిపించుకోవడానికి చేసిన గ్యాస్ డెలివరీ చేయట్లేదు మేము ఆ కంపెనీ వారికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవట్లేదు మేము ఎప్పుడు గ్యాస్ బుక్ చేసిన బుకింగ్ అవుతుంది గ్యాస్ బిల్లు కూడ వస్తుంది ముంతా తుఫాన్ దగ్గర నుండి మేము గ్యాస్ బుక్ చేస్తున్నాము బుకింగ్ అవుతుంది కానీ మాకు డెలివరీ ఇవ్వలేదు డెలివరీ ఇవ్వకుండా గ్యాస్ బిల్లు జారీ అవుతుంది మా సెల్ కు గ్యాస్ బిల్ వస్తుంది కానీ గ్యాస్ ఇవ్వట్లేదు దీనిపైన సరైన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు

### గొలుగొండపేట పాఠశాలలో
## లైబ్రరీ ప్రారంభం



**నాతవరం (మనసులో మాట)నవంబర్ 17,** నాతవరం మండలం గొలుగొండపేట ఎంపీపీ స్కూల్లో కమ్యూనిటీ పోలీసింగ్లో భాగంగా ఎస్ఐ వై. తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైత్రీ లైబ్రరీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ రాజేశ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో యువతకు గ్రంధాలయం ఏర్పాటు చేయడం మంచి పరిణామన్నారు. మండలంలో యువతకు మంచి మార్గంలో నడిపిస్తున్న ఎస్ఐను అభినందించారు. ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, నర్సీపట్నం జనసేన ఇంచార్జ్ సూర్య, మిరపల దొరబాబు, పారుపల్లి చిన్నబాబు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### వడ్డాది- తాటిపర్తి రోడ్డుకు
# మోక్షం తీరేది ఎప్పుడో

- ▸▸ అడుగడుగున గోతులు
- ▸▸ పట్టించుకోని కూటమి సర్కారు
- ▸▸ గత వైఎస్ఆర్సిపి హాయములోనే నిధులు మంజూరు
- ▸▸ ముందుకు సాగని పనులు పై ప్రజలు ఆగ్రహం





**వి మాడుగుల (మనసులో మాట) నవంబరు 17 ..** గుంతల లేని రోడ్లు వేస్తామని కూటమి నేతలు హామీలు నీటి మీద రాతల మిగిలిపోయాయి. ఇందుకు అద్వానంగా అనకాపల్లి. చోడవరం. నర్సీపట్నం. రోడ్లు నిదర్శనం. మాడుగుల నియోజకవర్గంలో ప్రధాన రహదారి వడ్డాది నుంచి తాటిపర్తి ఆర్ అండ్ బి రహదారి ఆడుగడుగునా గోతుల మయంగా మారింది. విశాఖ తో పాటు ఆర్డిఓ కార్యాలయం. నర్సీపట్నం. జిల్లా కేంద్రం అనకాపల్లి వెళ్లాలంటే మాడుగుల బుచ్చి పేట రావికతం. రోలుగుంట. చీడికాడ. అల్లూరి జిల్లాల ప్రజలకు ఈ రోడ్డే ప్రధాన ఆధారం. గతంలో కాంట్రాక్టులు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవడం.. భారీ కోరి లారీలు ఈ రోడ్డుపై ప్రయాణించడంతో పెద్దపెద్ద గోతులు పడ్డాయి.

**వైయస్సార్సీపి హాయంలో నిధులు మంజూరు**

ఈ రోడ్డు అభివృద్ధికి గత వైఎస్ఆర్సిపి హాయంలో మాజీ డిప్యూటీ సీఎం నాయుడు సుమారు రూ 22 కోట్లు మంజూరు చేయడంతో పాటు టెండర్ కూడా అప్పట్లోనే ఖరారు అయింది. పనులు ప్రారంభించి కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంతో ఆగిపోయాయి. దీంతో బూడి ముత్యాల నాయుడు ప్రయాణికుల ఇబ్బందులు తెలుసుకొని సొంత నిధులతో అప్పట్లోనే ఎన్నికలకు ముందే వడ్డాది నుండి తాటిపర్తి వరకు తాత్కాలికంగా గోతులు పూల్చారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడదిన్నర గడిచిపోతున్న సరే ఈ రోడ్డు విషయములో పట్టించుకునే దాఖలు లేవు. అసలే వడ్డాది వద్ద పెద్దేరు తాచేరు నదులపై వంతనాలు శిధిలమై పోయి విశాఖ అనకాపల్లి వెళ్లే ప్రయాణకులకు ఈ రోడ్డుపై ప్రయాణాలు అగమ్య గోచరంగా మారింది. స్థానిక యువకులు ప్రజలు కూడా ఈ రోడ్డు బాగు చేయాలని నిరసన తెలియజేశారు. అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. తాజాగా వైఎస్సార్సీపి మండల నాయకులు కూడా ఈ గోతుల వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు.

**శిలా పలకానికే పరిమితం**

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత గుంతలు లేని రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు.ఏ కానీ ఆ హామీలు నెరవేరలేదు. మాడుగుల మండలంలో వడ్డాది. తాటిపర్తి రోడ్డుకు హడావడిగా రోడ్డు పూర్తి చేయడానికి నిధులు మంజూరయ్యాయని రూ .23 .59 కోట్లు మంజూరు అయ్యాయని ఘాటి రోడ్డు జంక్షన్ లో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ శిలాఫలకాన్ని 2024లో డిసెంబర్ లో ప్రారంభించారు. కానీ కొంత పనులు జరిగాక మధ్యలోనే నిలిచిపోయాయి. శిలాఫలకం ప్రారంభించి ఏడాది గడుస్తున్న సరే రోడ్డు పూర్తవ్వలేదని. ప్రయాణికులు. వాహన చోదకులు ఆవేదన చెందుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు పూర్తి చేయాలని పలు గ్రామాలు ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బి జె ఈ శ్రీనివాసును సంప్రదించగా రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోవడం వాస్తవమేనని. పనులు త్వరలోనే ప్రారంభిస్తామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు అన్నారు.




**తక్షణము పనులు ప్రారంభించాలి..**

గత వైయస్సార్సీపి హాయంలో ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయి . కానీ కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వల్ల పనులు నిలిచిపోయి కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డుకు నిధులు మంజూరు చేశామని చెబుతూ శిలాఫలకం ఆవిష్కరించారు. ఏడాదిక వస్తున్న సరే రోడ్డు మాత్రం పూర్తి కాలేదు. రెండు జిల్లాలకు ప్రధాన మార్గమైన ఈ రోడ్డు పూర్తి చేయలేకపోవడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేయాలి.



**గొల్లవిల్లి సంజీవరావు**
**ఎంకోడూరు సర్పంచ్**

**నిత్యం నరకయాతనే..**

జిల్లా కేంద్రానికి వెళ్లడం అంటే నరకయాతన పడుతున్నాం. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్న సరే రోడ్డు పూర్తి చేయక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదు.

జిల్లా కలెక్టరు. కూటమి ఎమ్మెల్యేలు. మంత్రులు ఈ రోడ్డుపై నిత్యం తిరుగుతున్న సరే పట్టించుకోకపోవడం దారుణం.



**చింత శ్రీనివాసరావు**
**వ్యాపారస్థులు**
**ఎం కోడూరు**

# ఈ ఏడాది లక్ష్యం 4 వేల మెట్రి టన్నులు

### ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కొండపల్లి



**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 17:** ప్రతి రైతు తన పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం లో మంత్రి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూగత ఏడాది .... 3 లక్షల 34 వేలు టన్నులు ... కొనుగోలు చేసామని, ఈ ఏడాది 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు లక్ష్యంగా నిర?యించడం జరిగిందని తెలిపారు. కనీస మద్దతు ధర క్వింటాకు -కామన్ వెరైటీ రూ.2369/- గ్రేడ్ ఏ రూ. -2389/ లు గా ఉంటుందని, ఇది గత ఏడాది కంటే 69 రుపాయలు ఎక్కువని తెలిపారు. ధాన్యం సేకరణ కు జిల్లాలో 382 కొనుగోలు కేంద్రాలను , 261 క్లస్టర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి రైతుసేవా కేంద్రం లో సేకరణకు అవసరమగు సామగ్రిని సిద్ధం చేయడం జరిగిందన్నారు. అలాగే గోనె సంచులు, వాహనాలను సిద్ధం చేయడం జరిగిందని, ఈ వాహనాలన్నీ జి.పి.ఎస్ పద్ధతి లో పని చేస్తాయని అన్నారు. 159 మిల్లులను గుర్తించడం జరిగిందని, వాటి సామర్ధ్యాన్ని బట్టి ధాన్యం సిద్ధం చేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది ఆర్.ఎస్.కే లలో ఉండే తేమ యంత్రాలనే మిల్లుల వద్ద కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. చెల్లింపులు 48 గంటల్లోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. జిల్లా స్థాయి లో 89789 75284 కాంట్రోల్ రూం ఏర్పాటు చేయడమైనదని, మండల స్థాయి లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసామని తెలిపారు. అలాగే సేకరణ పై 1967 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఏ ఒక్క రైతు కు నష్టం జరగకుండా సేకరణ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి పడాల అరుణ,జనసేన ఇంచార్జ్ సురేష్, ఏ. ఎం.సి చైర్మన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి పౌర పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి. శాంతి , జిల్లా పౌర సరఫరాల అధికారి మురళీ, డి.సి.ఓ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామా రావు, మార్క్‌ఫెడ్ డి.ఎం వెంకటేశ్వర రావు , తహసిల్దార్లు, ఎం.పి.డి.ఓ లు, డి.టి లు , వి.ఆర్.ఓ లు, వి.ఆర్.ఏ లు, పాక్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రజకుల కల సాకారం

### ఎన్టీపీసీ సిఎస్ఆర్ నిధులతో ధోబీఖానా ఏర్పాటు సిరిపురపు

**పరవాడ (మనసులో మాట) నవంబర్ 17,** మండల కేంద్రం పరవాడలో గల రజకుల ఎన్నో ఏళ్ల నాటి కళ సాకారం కానుంది. స్థానిక సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు రజకులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే దిశగా అడుగులు వేశారు. సర్పంచ్ సిరిపురపు అభ్యర్థన మేరకు ఎన్టి పి సి సి ఎస్ ఆర్ నిధులు 8 లక్షల రూపాయలుతో రజకుల కోసం ధోబీఖానా ఏర్పాటుకు మంజూరు చేశారు. పరవాడ పెద్ద చెరువు కళింగ దిగువున రజకుల ధోబిఖానా నిర్మాణ పనులకు శ్రీకారం . ఈ నిధులతో ఆ ప్రాంతంలో రూఫ్ టాప్ షెడ్డు, వాటర్ ట్యాంక్, బట్టలు ఉతుక్కునేందుకు వీలుగా చిన్న ట్యాంకులతో కూడిన 8 బల్లలు, డ్రైన్ నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు పాల్గొని ధోబీఖానా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తమ కల నెరవేరుతున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ రజకులు సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన అభ్యర్థన మేరకు ధోబిఖానా నిర్మాణానికి సి ఎస్ ఆర్ నిధులు మంజూరు చేసిన ఎన్.టి.పి.సి యాజమాన్యానికి సర్పంచ్ సిరిపురపు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, పెద్ద చెరువు ఆయుకట్టుదారుల సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ పరవాడ మండల అధికార ప్రతినిధి బండారు రాజు, జనసేన నాయకులు బొద్దపు అయ్యబాబు, వార్డు మెంబర్ సిరిపురపు రాజేష్, చొప్ప సతీష్, జానీ రాంబాబు, గోపాల్ రెడ్డి, సచివాలయం సిబ్బంది మరియు రజక సంఘం అధ్యక్షులు వాడపర్తి విశ్వేశ్వరరావు, కోశాధికారి గూనూరు రవి, రజక సంఘం సభ్యులు నాగరాజు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాజువాకలో ఐక్యతా మార్చ్

### ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, కేఎన్ఆర్



**గాజువాక (మనసులోమాట)నవంబర్ 17..** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు గాజువాకలో యూనిటీ మార్చ్ కేంద్ర యువజన మరియు క్రీడల మంత్రిత్వశాఖ , మరియు మై భారత్ సంస్థ ఆద్వర్యంలో ఘణంగా జరిగింది. ముఖ్య అతిథిగా గాజువాక శాసనసభ్యులు మరియు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు గౌరవ అతిథిగా బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు.కార్యక్రమం జిల్లా ఇంచార్జ్ ధానేష్ అధ్యక్షతన జరిగింది. పల్లా జెండా ఊపి యూనిటీ మార్చ్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్క మనిషి మాజీ కేంద్ర హెూంమంత్రి,మాజీ ఉప ప్రధాని, భారత రత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. అఖండ భారతావని కోసం ఆయన హైదరాబాద్ వంటి 565 సంస్థానాలను భారత దేశంలో విలీనం చేసారని అన్నారు. కేఎన్ఆర్ మాట్లాడుతూ ప్రదాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఐక్యతకు చిహ్నంగా ఆయన విగ్రహాన్ని నర్మదా నది వద్ద నిర్మించారని అన్నారు. 182 మీటర్ల ఎత్తులో నిర్మించారని అన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత పొడవైన విగ్రహం అని అన్నారు. కార్యక్రమంలో గాజువాక టిడిపి ఇంచార్జ్ మరియు ఏపిఐఐసి డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ ,నాయకులు పొలిమేర శ్రీనివాస్ ,సిరసపల్లి నూకరాజు ,దాడి రమేష్ ,కృష్ణంరాజు ,బాటా శ్రీను,బొండా యల్లాజీరావు,సోంబాబు,గూటూరు శంకరరావు,ఒమ్మి రంగనాయకులు, అశోక్,తాతారావు,విజయ్ కుమార్,ప్రసాద్,రోహిణి, భువనేశ్వరి, రమాదేవి,సోమశేఖర్, రమణ,బొత్స జగదీష్, మనోహర్, కృష్ణారెడ్డి,నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వ అధికారులు,ఎన్సిసి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కురచా వారి కల్లాల వద్ద వన భోజనాలు



**చీడికాడ నవంబర్ 17, (మనుషుల మాట)** మండలంలో అప్పలరాజు పురం గ్రామంలో కురచా శ్రీనివాసరావు మాస్టారు కురచా స్వామి కల్లాల వద్ద కార్తీక మాసం వన భోజనాలు కార్యక్రమం సోమవారం జరిగింది ఈ సందర్భంగా గ్రామ ప్రజలు రావి చెట్టుకు పూజలు చేశారు ప్రతి ఏడాది కురచా శ్రీనివాసరావు మాస్టారు కురచా స్వామి కల్లాలు వద్ద కార్తీక మాసంలో వనభోజనాల కార్యక్రమం జరుగుతుందని ఆర్గనైజర్ కురచా స్వామి తెలిపారు ఈ వన భోజనాల కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని ప్రసాదం స్వీకరించారు ఈ కార్యక్రమంలో చీడికాడ పిఎసిఎస్ అధ్యక్షులు గవిరెడ్డి జగన్నాథం టిడిపి నాయకులు గవిరెడ్డి శ్రీనివాసరావు కురచా సురేష్ నారాయణమూర్తి దేముడు నాయుడు కాళ్ళ అప్పలనాయుడు గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.



# రవాణా విధానాలపై చర్యలు తీసుకోవాలి

## ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు డిమాండ్

విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 17:: వ్యాప్తంగా ఉన్నప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్,కాలేజీలు వాహన ఫిట్‌నెస్ నిబంధనలు పాటించకుండా, అధిక సంఖ్యలో విద్యార్థులను రవాణా చేస్తున్నాయి. ఈ బస్సుల్లో చాలా వరకుఫిట్‌నెస్ సర్టిఫికేట్లు లేకుండా నడుస్తున్నాయని, విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తున్న రవాణా విధానాలపై తక్షణ నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు.పాతవి, మరమ్మతులు చేయని ప్రమాదకర వాహనాలు,అవసరమైన సేఫ్టీ స్టాండర్డ్స్ లేని బస్సులు, ఓవర్ లోడిరగ్ (అధిక సంఖ్యలో విద్యార్థులు) జరుగుతున్నాయని ఆయన కలెక్టర్‌కు తెలిపారు. తగిన లైసెన్స్/అనుభవం లేని డ్రైవర్లు వాహనాలు నడుపుతున్నారనిఇ తెలియజేశారు. ఇలాంటి నిర్లక్ష్యం కారణంగా ఇటీవల రాష్ట్రంలో జరిగిన పలు ప్రమాదాలు విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.కాబట్టి,ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్, జిల్లా సమితి తరపునస్కూల్,కాలేజీ బస్సులను వెంటనే తనిఖీ చేసి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అన్ని విద్యాసంస్థలు రవాణాపై మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు..స్కూల్‌కాలేజీ నిర్వహణలపై నిర్లక్ష్యం కనబరిస్తే కఠినమైన చర్యలు తీసుకోవాలి.,ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, రూట్ పర్మిట్, డ్రైవర్ లైసెన్స్‌లపై ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించాలి.విద్యార్థుల రక్షణ కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక రోడ్డు భద్రత కమిటీని తక్షణం ఏర్పాటు చేయాలి.జిల్లాలో విద్యార్థుల భద్రతకు సంబంధించిన ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా స్వీకరించి, ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెలగాడ రాజేష్ పాల్గొన్నారు.

# సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దర్శనానికి భక్తులు తాకిడి



**అనకాపల్లి, నవంబర్ 17 (మనసు లో మాట):** అనకాపల్లి సుంకరమెట్ట శ్రీ రమా సమేత శ్రీ సత్యనారాణస్వామి, శ్రీ ఉషా ఛాయా పద్మినీ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి వార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసోత్సవం నాల్గవ సోమవారం పర్వదినాన ఉదయం నుంచే స్వామి వార్లను దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు రావడంతో ఆలయం కిక్కిరిసింది. పలువురు ప్రముఖులు స్వామి వార్ల ను దర్శించుకొని పూజలు జరిపారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, అనకాపల్లి జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్లమెంట్ టిడిపి మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ బొద్ధపు ప్రసాద్, పోలవరపు త్రినాథ్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శ్రీనివాసరావు తదితరులు స్వామి వార్లను దర్శించికొని ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా వారికి దేవస్థాన చైర్మన్ బొడ్డేడ మురళి స్వాగతం పలికి స్వామివార్ల దర్శనం చేయించి శాలువా లుతో వారిని సత్కరించారు. అనంతరం బొడ్డేడ శ్రీనివాసరావు, దేవి దంపతులు వితరణ చేసిన ప్రసాదాన్ని మళ్ళ సురేంద్ర, బొడ్డేడ శ్రీనివాసరావు ల చేతుల మీదుగా భక్తులకు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మెన్ బొడ్డేడ మురళి, ధర్మకర్తల మండలి సభ్యులు సూరిశెట్టి బల్లమ్మ, దొడ్డి భరత్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్, హెూండా అయ్యప్ప శెట్టి మణికంఠ, అటెండర్ అనపర్తి శంకర్రావు, ప్రధాన అర్చకులు విద్యాసాగర్ పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు



**డుంబ్రిగుడ, నవంబర్ 17, (మనసులో మాట):** గ్రంథాలయ వారోత్సలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో సోమవా రం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు కమలాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతి రోజూ గ్రంథాలయాలను ఉపయోగించుకో వాలాన్నారు.ఇంటర్ తరువాత ఉన్నత చదువుల కోసం గ్రంథాలయాల్లో ప్రిపేర్ అవ్వడానికి పుస్తకాలు అందు బాటులో ఉన్నాయన్నారు. వీటిని ఉపయోగించుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు దివాకర్,గ్రంథాలయ అధికారిణి ఎస్ సునీత, సు.సుబ్బరావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# వినతులను త్వరితగతిన పరిష్కరించాలి

## - జిల్లా కలక్టరు ఎస్ రాంసుందర్ రెడ్డి -



**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 17:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కు వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కారించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలక్టరు ఎం .రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలక్టరు ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు విశేష స్పందన లభించింది. జిల్లా కలక్టరు, జిల్లా రెవెన్యు అధికారి, స్పెషల్ డిప్యూటి కలక్టర్లు ప్రజల నుండి ధరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను సాదవధానంగా విన్నారు. ఫిర్యాదుల నుండి 230 వినతులు స్వీకరించి, వినతులపై తగు పరిష్కారం, చర్యలు చేపట్టుటకు సంబంధింత అధికారులను కలక్టరు ఆదేశాలు జారీచేసారు. రెవెన్యు శాఖకు సంబంధించి 92 వినతులు, డిఆర్డిఎ సంబంధించి 27 వినతులు, గ్రామ సచివాలయం శాఖకు సంబందించి 28 వినతులు, మున్సిపల్ శాఖ-15, విద్యా శాఖ %-%12, పంచాయితీ శాఖ-10, విద్యుత్ శాఖ-5, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ-3, హౌసింగు-2, ఇతర శాఖ నుండి 36 వినతులు స్వీకరించారు. ఈ సందతరేగా ఆయన మాటాలడుతు అధికారులు అర్జీదారును కలిసి, మాట్లాడిన తర్వాతనే ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అర్జీదారునితో మాట్లాడిన తేదీ, సమయం కూడా వారి రిపోర్ట్ లో నమోదు చేయాలన్నారు. పిజిఆర్ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100 పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ నెంబర్ కు అందిన కాల్స్ కు కూడా సంబంధిత అధికారి సమాధానం సరైన రీతిలో అందజేయవలసి ఉంటుందన్నారు. ఆర్జిదారుల సమస్యల పరిష్కారంపై సంబంధింత అధికారులను తగు చర్యలు, సత్వర పరిష్కారానిని చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేసారు.నవంబర్ 30 లోపల గృహాల సర్వే: గృహాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను సర్వే చేసి అర్హత ఉన్న వారి వివరాలను యాప్ లో ఎం.పి.డి.ఓ నమోదు చేయాలని సంబంధిత అధికారులను కలక్టరు ఆదేశించారు. . నవంబర్ 30 వరకు ప్రభుత్వం సర్వే కోసం సమయం ఇచ్చిందని, లబ్ధిదారుల సర్వే పూర్తి చేసి అప్లోడ్ చేయాలని తెలిపారు.ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదికారి ఎస్.శ్రీనివాసమూర్తి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు డి.వెంకటేశ్వర రావు, మురళి, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి. శాంతి, కళావతి , సర్వే శాఖ ఎ.డి. ఆర్.విజయకుమార్, కలక్టరేటు పరిపాలనాధికారి దేవి ప్రసాద్, సి.పి.ఒ. బాలజి, జిల్లా విద్యాశాఖాధికారి మణిక్యంయుడు, మార్కఫెడ్ మేనేజరు వెంకటేశ్వరరావు, విజయనగరం మున్సపిల్ కమీషనరు నల్లనయ్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జీవనరాణి, ఐ.సిడి.ఎస్. పి.డి. విమలరాణి, డిఆర్ డి ఎ పిడి శ్రీనివాస్ పాణి, జిల్లా పర్యాటక అధికారి కుమార స్వామి, మైక్రోఇరిగేషన్ పి.డి. లక్ష్మీనారాయణ, డి.ఇ.ఒ. మణిక్యంనాయుడు, జిల్లా మార్కెఫెడ్ మేనేజరు వెంకటేశ్వరరావు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చౌడేశ్వరి స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల



**పెందుర్తి (మనసులో మాట) నవంబర్ 17:** పెందుర్తి మండలం పినగాడి గ్రామంలోని శ్రీశ్రీ ఉమా రామలింగేశ్వర చౌడేశ్వర స్వామిని పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో స్వామి దర్శన భాగ్యం కల్పించి ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేరు మీద ప్రత్యేక పూజలు చేయించారు కార్తీక సోమవారం సందర్భంగా శివునికి అభిషేకం చేశారు ఈ సందర్భంగారమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఈ కార్తీకమాస పర్వదినాన బైలా పూడి హరగోపాల్ దంపతులు మరియ బైలపూడి ఉమామహేశ్వరరావు ఆహ్వానం మేరకు ఈరోజు పినగాడి గ్రామంలో స్వామివారిని దర్శించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తూ ఈ నెల రోజులు శివాలయాల్లో శివనామస్మరణతో మార్మోగి భక్తులు భక్తిశ్రద్ధలతో ఆ శివుని పూజించారని తెలియజేశారు. మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బైలపూడి హరగోపాల్ దంపతులు, ఉమామహేశ్వరరావు దంపతులు, పంచకర్ల వెంకటేశ్వర్లు, తవ్వానిపాలెం సర్పంచ్ బోకర్ స్వామి నాయుడు, ఐయితి సింహాచలం, గొర్లె అప్పారావు, పినగాడి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరి విద్యార్థులపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యమా?

# జిల్లా యంత్రాంగం మొద్దు నిద్ర వీడాలి !

## అధికారులపై మండిపడ్డ వైసీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు పాడేరు శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు








**కొయ్యూరు నవంబర్ 17 (మనసులో మాట):** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లోని రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ వల్ల 22 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారని, విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న విద్యార్థినిలను హుటాహుటిన వెళ్ళి పరామర్శించి,పిల్లల ఆరోగ్య పరిస్థితిని గురించి డాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు.తదుపరి బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి,పాఠశాలలో ఉన్న పలు సమస్యలు గుర్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నిర్వీర్యం చేసి అంధకారంలోకి నెడుతూ పరిపాలన చెయ్యడం దుర్మార్గమైన చర్య అని, గత నెలలో కురుపాం నియోజకవర్గం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సుమారుగా 120 మంది విద్యారులు అస్వస్థతకు గురై ఐదు గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని,ఇంతలోనే మొన్నటికి మొన్న గూడెం కొత్త వీధి మండలం జర్రెల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ వల్ల సుమారుగా 50 మంది విద్యర్థులు ఆసుపత్రి పాలై వారి ఆరోగ్యం మెరుగుపడకుండానే నిన్న ఉదయం కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలలో 22 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం చాలా దారుణమని అన్నారు. ఇలాంటి వరుస సంఘటనలు జరగడం వల్ల విద్యార్థుల తల్లి తండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలంటేనే తీవ్ర భయాందోళనతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని శాసన సభ్యులు అన్నారు. ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పనుండి రాష్ట్ర ప్రజలకు గుడికి వెళ్లినా, బడికి వెళ్లినా తమ మాన ప్రాణాలకు భద్రత కల్పించలేని దుస్థితిలో ఈ కూటమి ప్రభుత్వం పరిపాలన చేస్తుందని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.అలాగే రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే కు ఎదురుగా పూర్తిగా బాత్రూం డోర్ లు పాడైపోయి కనిపించడంతో ఆడ పిల్లలు ఇటువంటి బాత్రూంలు వాడుతున్నారా అని ఆవేదన వ్యక్తం చేస్తూ, సరైన బాత్రూమ్ డోర్లు వేయించలేని దుస్థితిలో ఈ కూటమి ప్రభుత్వం ఉందా అని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులతో పాటు స్థానిక ఎంపీపీ బడుగు రమేష్,వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ,మండల పార్టీ అధ్యక్షులు బిడిజన అప్పారావు, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ అచ్యుత్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సమర్ల సూరిబాబు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు ముసలినాయుడు, అంతాడ సర్పంచ్ చంద్రరావు,ఎం మాకవరం సూపర్ సర్పంచ్ కోడా రాజుబాబు,పార్టీ నాయకులు రామ్మూర్తి,కాకరి బాలరాజు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు

# అతను గజ్జకట్టి ఆడితే.....



**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 17 :** అతను గజ్జ కట్టి ఆడితే అది వేదికయినా....కేవలం రంగస్థలం నేల అయినా ఆ ప్రదేశమంతా అదిరిపోతుంటుంది. కాలిగజ్జల సవ్వడికి..చేతికట్టిన మువ్వల శబ్దానికి గుండెపై కట్టుకున్న కంజరీ నాదానికి గుండెలయలతో గంతులేస్తున్నట్టు ఉంటుంది. అది పురాతన జానపద తప్పెటగుళ్ళ నృత్యం. అయినా శశిరేఖ పరిణయం....గొల్లవారి బామలు, సుందరాకాండ, సీతాదేవి వియోగం, ఇలా పురాణ ఇతిహాసాల కథాగానమయినా సరే అందరినీ ఆకట్టుకుని ఇట్టే తన నృత్యగానంలోకి తీసుకుపోతాడు. అతనిపేరే విజయనగరం జిల్లా గరికిపేట గ్రామానికి చెందిన కందివలస సోములు. సుమారు 60 ఏళ్ళు ఉంటాయి, అయినా తన గానంలోకానీ, నృత్యంలో కానీ వయసుకు మించిన ఉత్సాహం కనిపిస్తుంది. రాంబద్రపురం మండలంలోని గుణుపూరు పైడితల్లి దగ్గర నృత్యం నేర్చుకున్నాడు. గురువు కాల చేశాకా ఎందరికో ఆ నృత్యం నేర్పాడు. సుమారు 600 ప్రదర్శనలు రాష్ట్ర వ్యాపితంగా వివిధ జిల్లాలలో ఇచ్చాడు. మూడుసార్లు అవార్డులు వచ్చాయి. సన్మానాలు జరిగాయి. కానీ, అంతకు మించి ఈ కళాకారుడిని ఎవరూ ఆదుకోలేదు. వృద్ధాప్యం మీదపడుతున్నా కనీసం కళాకారుల పింఛను కూడా మంజూరుచేయలేదు. కళాకారుడిగా గుర్తింపుకార్డు మాత్రం మూర్చబిళ్ళలా మెడకు తగిల్చారు. ఒక బృందంతో ప్రదర్శన ఇవ్వాలంటే ఎంతో శ్రమ..ఓర్పు..కష్టం కూడుకున్న పని. 25మందిని ఒకేసారి ఒకేవేదికమీద లయబద్ధంగా నృత్యం చేయిస్తూ తానుకూడా ఆడుతూ ఉత్సాహపర్చాలి. అప్పుడే ఆ ప్రదర్శన రక్తి కడుతుంది. ఇలాంటి కళాకారులు..కళాసంపద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడుకుని మన జాతి ఔన్నత్యాన్ని కాపాడాలనే ఆయన తపన. ప్రభుత్వ పదకాల, అభివృద్ధి కార్యక్రమాల్లో..జాతరలలో..పండుగలలో ప్రభుత్వ నిర్వహించే కార్యక్రమాల్లో ప్రదర్శనలు పెడితే కాస్త అయినా కళాకారుడికి తిండి దొరుకుతుందని తన ఆవేదన. అలాగే ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు కార్డుతో పాటు ఫింఛను ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాడు.



# చురుగ్గా వంతెన నిర్మాణ పనులు

కోటవురట్ల(మనసులో మాట) నవంబర్ 17: కోటవురట్ల మండలం పందూరు గ్రామం వద్ద వరాహ నదిపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో నిర్మించిన వంతెన నీలం తుపానులో కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. హెూంమంత్రి వంగలపూడి అనిత వంతెన పునర్నిర్మాణానికి రూ.5.75 కోట్లు మంజూరు చేయడంతో ఐదు నెలల కిందట పనులు ప్రారంభించారు. ఏడు స్లాబులు నిర్మించాల్సి ఉండగా ప్రస్తుతం రెండు స్లాబ్లుల నిర్మాణం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఓవైపు రిటైనింగ్ వాల్ పూర్తయిందని అన్నారు. మరోవైపు పనులు జరుగుతున్నాయన్నారు. వర్షాలు కారణంగా పనుల్లో జాప్యం జరిగిందన్నారు. వచ్చే ఏడాది అక్టోబర్ కు వంతెన నిర్మాణం పూర్తికావాల్సి ఉందన్నారు. అయితే 2026 జూన్ నాటికి వంతెన నిర్మాణాన్ని పూర్తిచేసి అప్పగిస్తామని కాంట్రాక్టర్ రాజు తెలిపారు.

# గిరిజన గ్రామాలలో కార్తీక దీపారాధన



**వి మాడుగుల నవంబర్ 17 (మనసులో మాట)..** మాడుగుల మండలంలోని శంకరం బొడ్డరేవు తదితర గిరిజన గ్రామాలలో ఎం కోడూర్ శ్రీ సంపత్ వినాయక భజన బృందం, సమరత సేవ ఫౌండేషన్ నిర్వాహకులు గొల్లవిల్లి సత్యారావు, సన్యాసి శెట్టి ఆధ్వర్యంలో కార్తీక దీపారాధన ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.. ఈ సందర్భంగా అక్కడ దేవాలయాలలోని స్వామీజీల ఉపన్యాస ములు, భజనలు నిర్వహించడంతోపాటు వేల దీపాలతో శివలింగ, ఓంకార ఆకారాలలో దీపారాధన చేస్తున్నారు. ఈ కార్యక్రమాలలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## మిశ్రమ పదార్థాలలో పురోగతులుపై

# ఐదురోజులు వర్క్‌షాప్



విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 17::విజయనగరంలోని ఎం.వీ.జీ.ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప సివిల్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా మిశ్రమ పదార్థాలలో ఇటీవలి పురోగతులు: మోడలింగ్ను సమగ్రపరచడం మరియు ప్రయోగాత్మక విధానాలపై 5 రోజుల ఆన్లైన్ ఎఫ్.డీ.పీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి . మిశ్రమ పదార్థాలలో తాజా పురోగతుల గురించి అత్యాధునిక జ్ఞానాన్ని అందించడం, మెరుగైన ఇంజనీరింగ్ అప్లికేషన్ల కోసం మోడలింగ్ మరియు ప్రయోగాత్మక విధానాలను ఏకీక ృతం చేయడ లక్ష్యంగా పెట్టుకుంది.సోమవారం జరిగిన ఈ 5 రోజుల ఆన్లైన్ ఎఫ్.డీ.పీ కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎన్.ఐ.టీ రూర్కెలాలోని మెటలర్జికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. రాజేష్ కుమార్ ప్రస్టీ ముఖ్యతిథిగా హాజరయ్యారు.నిర్మాణం మరియు తయారీ ప్రక్రియలను మెరుగుపరచడంలో మిశ్రమ పదార్థాల ప్రాముఖ్యతను ఎం.వీ.జీ.ఆర్ ప్రిన్సిపాల్ డా. వై.ఎం.సి. శేఖర్ వివరించి, మిశ్రమ పదార్థాల రంగంలో వినూత్న పరిణామాలను స్వీకరించి పనిచేసే ఆలోచన ద ృక్పథం ఉండాలని ఈ ఎఫ్.డీ.పీ లో పాల్గొన్న వాళ్లందరికీ సూచించారు.ముఖ్య అతిథి ప్రొఫెసర్ డా. రాజేష్ కుమార్ ప్రస్టీ ప్రసంగిస్తూ, ఫైబర్-రీసోర్డ్ పాలిమర్లు, నానోకంపోజిట్లు మరియు మిశ్రమ పదార్థాలను అభివ ృద్ధి చేయడానికి అవసరమైన ఫాబ్రికేషన్ టెక్నిక్లు వంటి అంశాలపై దృష్టి సారించాలని మరియు మిశ్రమ పదార్థాలలో అభివృద్ధి చెందుతున్న ధోరణులపై విలువైన ఆలోచన పనితీరు ఉండాలని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా 250 మందికి పైగా అధ్యాపకులు, పరిశోధనా పండితులు మరియు పరిశ్రమ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.డా. రమ్యశ్రీ ముళ్ళపూడి, ఐ.ఐ.టీ హైదరాబాద్‌బీ డా. డి.రవి ప్రసాద్, ఎన్.ఐ.టీ వరంగల్‌బీ డా.చందలూరి వినయ్ కుమార్, ఎన్.ఐ.టీ తిరుచిరాపల్లిబీ డా. బి. రవి కుమార్, డి.జి.ఎం - చెట్టినాడ్ సిమెంట్‌బీ డా. దినేష్ కుమార్ రాథోడ్, ఎం.ఎన్.ఐ.టీ జైపూర్‌బీ డా. నితిన్ శర్మ, కె.ఐ.ఐ.టీ భువనేశ్వర్‌బీ డా. కిషోర్ కుమార్ మహతో, వి.ఐ.టీ వెల్లూరుబీ డా. కె రాజేశ్వరరావు, మాజీ ప్రొఫెసర్-ఎం.వి.జి.ఆర్ మరియు రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-నీటి పారుదల శాఖబీ డా. శుభం, వి.టి.ఓ.ఎల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ 5 రోజుల ఆన్లైన్ ఎఫ్.డి.పి కార్యక్రమంలో ఫైబర్- కాంపోజిట్ల కోసం క్యారెక్టరైజేషన్ పద్ధతులు, నానోకంపోజిట్ల కోసం ఫ్యాబ్రికేషన్ టెక్నిక్లు మరియు కాంపోజిట్ మెటీరియల్స్ యొక్క బాలిస్టిక్ పనితీరు వంటి వివిధ అంశాలపై నిపుణుల ఉపన్యాసాలు ఇవ్వనున్నారు.ఈ కార్యక్రమంలో మెకానికల్ సివిల్ ఇంజనీరింగ్ హెచ్.ఓ.డీ డా. ప్రవీణ్ కల్లా, సివిల్ ఇంజనీరింగ్ హెచ్.ఓ.డీ డా. మురళీ సాగర్ వర్మ సాగి, మెకానికల్ సివిల్ ఫ్యాకల్టీ ఎఫ్.డి.పి కోఆర్డినేటర్లు, డి సంతోష్ కుమార్, డా. జి.ప్రమోద్ కుమార్, బీ.వీ జోగారావు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యోగ పోటీలు నిర్వహణ



**పాయకరావుపేట నవంబర్ 17 మనసులో మాట..** పాయకరావుపేట శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. అలాగే డ్రాయింగ్ కాంపిటేషన్,రహదారి చిహ్నాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు చీడికాడ అప్పలరాజుపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు

# విద్యుత్తు సరఫరా నిలిపివేత

### - డి ఇ ఏవిఎన్ అప్పారావు



**చీడికాడ, నవంబర్ 17, (మనసులో మాట)..** మండలంలో అప్పలరాజపురం చీడికాడ విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు మెయింటెనెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు డిఇ ఏవిఎన్ అప్పారావు తెలిపారు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ చీడి కాడ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్నటు వంటి తరువోలు అర్జునగిరి చుక్కపల్లి చెట్టుపల్లి పెదగోగాడ జైత వరం బి సింగవరం బయలు పూడి దిబ్బపాలెం అప్పలరాజు పురం సబ్ స్టేషన్ పరిధిలో అప్పలరాజు పురం ఖండివరం ఎల్బీ పట్నం విబి పేట కోణం సిరిజాం మంచాల గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

### 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామపంచాయతీల ఖాతాలో

# వెంటనే వెయ్యాలి

### ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, గసబ సర్పంచ్ పాంగి సునీత



**డుంబ్రిగుడ, నవంబర్ 17, (మనసులో మాట):** కేంద్ర ప్రభుత్వం రెండు విడతలుగా విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ 959 కోట్లను స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలకు కేటాయించాలని ఆంధ్ర ప్రదేశ్ సర్పంచ్ ల సంక్షేమ సేవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు , గసబ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత డిమాండ్ చేశారు.సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజుల క్రితం అన్ టైడ్ కింద రూ410 కోట్లను, అలాగే టైట్ గ్రాంట్ కింద రూ 548 కోట్లు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం విడుదల చేయడం చేసిందన్నారు,ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీల ఖాతాల్లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు, ఈపాటికే స్థానిక సంస్థలలో ముఖ్యంగా గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలు నిధులు లేక నిధులు రాక చాలా ఇబ్బందులు పడిన పరిస్థితి అందరికీ తెలిసిందేనన్నారు.కనీసం కరోనా టైంలో బ్లీచింగ్ చల్లించటానికి కూడా నిధులు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో వచ్చిన తర్వాత గతం కన్నా కొంత మెరుగ్గా ఉన్న, గతంలో వచ్చిన నిధులను అనేక నెలలు విడుదల చేయకుండా జాప్యం చేసిందన్నారు. సర్పంచ్ లు అందరు పార్టీలకతీతంగా ఆందోళన చేయడంతో నిధులు విడుదల చేశారన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి , రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ,పంచాయతీరాజ్ శాఖ మంత్రి వర్యులు చొరవ చూపి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను వెంటనే గ్రామ పంచాయతీల ఖాతాలో ,స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసే విధంగా కృషి చెయ్యాలని కోరారు.కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలులో ముఖ్యంగా సర్పంచ్ ల గౌరవ వేతనం,గ్రామ పంచాయతీలకు బడ్జెట్ లో నిధులు పెంపుదల చేస్తామన్న హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

### కార్తీకమాసం నాల్గవ సోమవారం వేడుకలలో పాల్గొన్న గండి రవికుమార్



**సబ్బవరం, నవంబర్ 17, ( మనసులో మాట ) :** సబ్బవరం మండలం మొగలిపురం గ్రామంలో ఈశ్వర ఘాట్ శివాలయం నందు పెందుర్తి నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గండి రవికుమార్ తులసి భవాని దంపతులు పాల్గొని ఆ పరమశివునికి ప్రత్యేక పూజలు చేసి ఆ పరమశివుని ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలు పై ఎల్లప్పుడు వుండాలని ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో వుండాలిని ఆ పరమశివుని కోరుకున్నారు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించి అనంతరం భక్తులు కోసం ఏర్పాటు చేసిన కార్తీకమాస వనభోజన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారభించారు అలాగే సాయంత్రం మొగలిపురం గ్రామం ఈశ్వర ఘాట్ శివాలయంనందు దీపారాధన కార్యక్రమాన్ని గండి రవికుమార్, తులసి భవాని చేతులమీదుగా ప్రారభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిరపరపు వాసు , సబ్బవరం మండలం వైయస్ఆర్ కాంగ్రేస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు యడ్ల నాయుడు, అప్పికొండ సత్యనారాయణ, గండి ముత్యాలనాయుడు, కరక రాము, గురి శ్రీనివాస్, గురుస్వామి జాగరపు గోపి, బైలపూడి బంగారయ్య, బత్తిన వెంకట్, పైల రామునాయుడు, గండి నాయుడు, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# మీ డబ్బు - మీ హక్కు

### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ చే గోడపత్రిక అవిష్కరణ



**అనకాపల్లి (మనసులో మాట) నవంబర్ 17..** మీ డబ్బు - మీ హక్కు" అనే నినాదంతో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలలపాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ మెడిద జాహ్నవి తో కలిసి "మీ డబ్బు - మీ హక్కు" గోడ పత్రికను అవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పౌరులు తమ పేర్లపై ఉన్న క్లెయిమ్ చేయని లేదా మరచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం కల్పించబడుతోంద న్నారు. ప్రజలు బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా పాలసీలు మరియు ఇతర ఆర్థిక సాధనాలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా తమ కుటుంబ భవిష్యత్తును సురక్షితం చేసుకుంటున్నారని, అయితే కొన్ని సందర్భాల్లో ఈ ఆస్తులు పరిపక్వతకు వచ్చిన తర్వాత లబ్ధిదారులకు చేరకపోవడానికి ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు, లేదా నామినీ వివరాల లోపం వంటి కారణాలు ఉన్నాయని చెప్పారు. ఆర్థిక సంస్థలు సాధ్యమైనంత వరకు లబ్ధిదారులు లేదా వారి చట్టపరమైన వారసులను సంప్రదించి ప్రయోజనాలు అందించడానికి కృషి చేస్తున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో అది సాధ్యం కావడం లేదని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో నిధులు బ్యాంకులు, బీమా సంస్థలు మరియు ఇతర ఆర్థిక సంస్థల్లో క్లెయిమ్ చేయని రూపంలో నిల్వగా మిగిలిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం సమన్వయంతో ఐదు ప్రధాన ఆర్థిక సంస్థలు ు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్ బి ఐ ), సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సే బి), ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐ ఆర్ డి ఎ ఐ ), పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ (పి ఎఫ్ ఆర్ డి ఎ ), మరియు ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (ఐ ఎఫ్ పి ఎఫ్ ఎ ) కలిసి మూడు నెలల ప్రచారాన్ని ప్రారంభించాయని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రచారం ద్వారా పౌరులు తమ పేర్లపై ఉన్న క్లెయిమ్ చేయని నిధులను గుర్తించి, సరైన పత్రాలతో సులభంగా క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పించబడుతుందని తెలిపారు. తమ ఆర్థిక హక్కులను వినియోగించుకోండి. క్లెయిమ్ చేయని నిధులను ఇప్పుడే క్లెయిమ్ చేసుకొని, మరచిపోయిన ఆర్థిక ఆస్తులను కొత్త అవకాశాలుగా మార్చుకోవాలని బ్యాంక్ వినియోగదారు లకు కలెక్టర్ సూచించారు.

జిల్లాలో గత 10 సంత్సరాలు గా బ్యాంక్ ఖాతాలలో ఎ విధమైన ఆర్థికలావాదేవీలు జరుపకుండా ఉన్నటువంటి ఖాతాలు మరియు ఖాతాలలో నిల్వ ఉన్న నగదు వివరాలు

జిల్లాలో వ్యక్తిగత బాంక్ ఖాతాలు 31,6075, నగదు నిల్వ రూపాయలు 44.82 కోట్లు, జిల్లాలో వార్తక వ్యాపార సంస్థల ఖాతాలు 11,565, నగదు నిల్వ రూ 9.32 కోట్లు, జిల్లాలో వివిధ ప్రభుత్వ సంస్థల 4,611, నిల్వ నగదు రూ 3.06 కోట్లు. కాగా జిల్లాలో మొత్తం బ్యాంక్ ఖాతాలు మొత్తం 33,22,251.

బ్యాంక్ ఖాతాలలో నగదు నిల్వలు మొత్తం రూ 57. 29 కోట్ల రూపాయలు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె సత్యనారాయణ, డి అర్వో వై. సత్యన్నారాయణరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు శచి దేవి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయల సమన్వయ అధికారి మంజులవాణి, తదితరులు పాల్గొన్నారు.

# ఎలమంచి నియోజక వర్గం తెదేపా సభ్యులు సమావేశం



**అచ్యుతాపురం నవంబర్ 17 మనసులో మాట.** అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ వనభోజన కార్యక్రమం మండల కేంద్రమైనటువంటి అచ్చుతాపురం శిల్ప లేఅవుట్లో సోమవారం వనభోజనం కార్యక్రమం జరిగింది తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్టీ రామారావు చిత్రపటానికి మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎలమంచిలి టిడిపి ఇన్చార్జిలు ప్రగడ నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు అనంతరం నియోజకవర్గంలో మండల కస్టర్లు యూనిట్ సభ్యులు బూత్ గ్రామ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది . మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీమతి లాలం భవాని భాస్కర్ , నియోజవర్గ పరిశీలికులు శ్రీ బోండా జగన్నాథం , రాష్ట్ర కార్యదర్శి శ్రీ రాజాన రమేష్ కుమార్ , రాష్ట్ర కార్యదర్శి మరియు యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ ధూళి రంగనాయకులు , రాష్ట్ర కార్యదర్శి మరియు డిసిఎంఎస్ చైర్మన్ శ్రీ కోటిని బాలాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఉన్న అన్ని కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం నేడు పండుకు వాతావరణంలో జరపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీల తులసీరామ్, లాలం శ్రీ భరత్, పెంటకోట విజయ్, గొర్లి శివన్నారాయణ మూర్తి, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, పడుకుని బాధ్యతలు కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ దొక్క నాగభూషణం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, శ్రీకాళహస్తి డైరెక్టర్ బిలా స్రవంతి, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయరామరాజు, సీనియర్ నాయకులు మెరుగు బాపు నాయుడు, పొన్నమల్ల కొండబాబు, కడియం అనురాధ, ఆడారి జానకి, రాజాన నారాయణమ్మ, కాంద్రకోట చిరంజీవి, రాజాన సూరి నాగేశ్వర రావు, ఎంపీటీసీ నీరుకొండ నరసింగరావు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, భూత్ ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు

### సమర్పించిన అర్జీల సమాచారం కోసం - 1100 కాల్ చేసి తెలుసుకోవాలి - జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



**అనకాపల్లి (మనసు లో మాట) నవంబర్ 17:** తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో పిజిఆర్ఎస్ కు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా అర్జీలను పరిష్కరించాలని అన్ని శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, డిఆర్వో వై. సత్యన్నారాయణ రావు లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ ప్రజల నుండి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి సత్వరమె చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించారు. అనంతరం పరిస్కారం కాని అర్జీల పై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని ఆమె తెలిపారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. సిపిఓ జి.రామారావు, డ్వామా, డిఆర్డిఎ, మెప్మా, గృహనిర్మాణం పథక సంచాలకు లు పూర్ణిమదేవి, శచిదేవి, కె.సరోజినీ, శ్రీనివాస్, డిఈఓ జి.అప్పారావు నాయుడు, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమవతి, జిల్లా ఎక్సయిజ్, రవాణా శాఖ అధికారులు వి సుదీర్, జి మనోహర్, జిల్లా సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లా జీకే వీధిలో జనసేన జోరు

### దారకొండ పంచాయతీలో 228మంది జనసైనికుల చేరిక



**గూడెం/సీలేరు (మనుసులో మాట) నవంబర్ 17:..** అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలంలో జనసేన పార్టీ తన బలాన్ని మరింత పెంచుకుంది. మండలంలోని దారకొండ పంచాయతీలో సోమవారం ఘనంగా నిర్వహించిన పార్టీ సమావేశంలో 228 మంది యువకులు, ప్రజలు జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, నాట్యమండలి చైర్మన్ డాక్టర్ గంగులయ్య చేతుల మీదుగా వీరందరూ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సమావేశానికి సీలేరు, దుప్పలవాడ, దారకొండ, గుమ్మరేగుల పంచాయతీల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక సమస్యలు, జనసేన సిద్ధాంతాలపై నాయకులు ప్రసంగించారు. పార్టీ ఇన్చార్జి డా. గంగులయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి, పవన్ కళ్యాణ్ గారి ఆశయాల సాధనకు జనసైనికులు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా పార్టీలో చేరిన 228 మంది జనసైనికులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు వీర వెంకట్ తో పాటు ఆయా పంచాయతీల స్థానిక నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు. ఈ నాలుగు పంచాయతీల పరిధిలో జనసేన పార్టీ బలోపేతానికి ఈ చేరికలు మరింత ఊపునిచ్చాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

# లింగాల తిరుగుడు సోమలింగేశ్వర స్వామి నీ దర్శించుకున్న గండి బాబ్జి



**సబ్బవరం, నవంబర్ 17, ( మనసులో మాట) :** సబ్బవరం మండలం, లో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకైక స్వయంభు సోమలింగేశ్వర ఆలయం పెందుర్తి నియోజకవర్గం పరిధిలో" లింగాల తిరుగుడు " ఒకటేనని ఈ ఆలయ అభివృద్ధికి, అప్పికొండ ఆలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు మళ్లించాలని మాజీ ఎమ్మెల్యే, విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర సీడ్స్ అండ్ గ్రౌండ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి డిమాండ్ చేశారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం సబ్బవరం మండలం లింగాల తిరుగుడు లో శ్రీ సోమలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకుని బిజెపి నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో, ఇక్కడి ఆలయ ట్రస్ట్ చైర్మన్, దొడ్డి రామ సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్న మనాయుడు, ఎంపిటిసి సభ్యులు రాపేటి రాము లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గండి బాబ్జి మీడియాతో మాట్లాడుతూ, పూర్వపు పరవాడ, ప్రస్తుత పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకైక సేవే క్షేత్రం లింగాల తిరగడని గుర్తు చేశారు. 1956 లో స్వయంభులింగేశ్వరుడిగా పేరుందిన ఇ క్కడి సోమలింగేశ్వర స్వామి ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోకి వెళ్ళటంతో ఈ పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు. కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లింగాల తిరుగుడు రామలింగేశ్వర ఆలయం, అప్పికొండ శైవ క్షేత్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం దత్తత తీసుకొని నిదుర మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఆఖరి కార్తీక సోమవారం కావడంతో భక్తులు సబ్బవరం మండలంలో పలు సేవే క్షేత్రాలకు అత్యధిక సంఖ్యలో పోటెత్తారు. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలను ఆలయ కమిటీల నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ గొర్లి రామునాయుడు విశాఖ జిల్లా బిజెపి మహిళా విభాగం అధ్యక్షురాలు నాదెండ్ల జ్యోతి , సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి ముత్యాల నాయుడు, సబ్బవరం పిఎసిఎస్ చైర్పర్సన్ గండి దేముడు, రాపేటి రాము,ఆడారి నాగరాజు, దొడ్డి రామ నాయుడు,శీలపారాశెట్టి సత్యనారాయణ, ఆడారి వెంకట రమణ, దొడ్డి వీరాప్పరావు, అర్చకులు, డి శేఖర్, పూతి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.



### అనకాపల్లి లో ఘనంగా జీవీఎంసి మేయర్

# పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

**అనకాపల్లి, నవంబర్ 17 (మనసు లో మాట):** అనకాపల్లి పట్టణం లోని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ కార్యాలయంలో సోమవారం జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను పురష్కరించుకొని టీడీపీ శ్రేణుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి స్వీట్ లు పంచారు. అలాగే అనకాపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనకాపల్లి లోని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి లో గర్భిణీ స్త్రీలకు, రోగులకు పండ్లు,రొట్టెలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, మండల పార్టీ అధ్యక్షులు కర్రీ బాబీ, వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఛైర్మెన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ వార్డుల టీడీపీ ఇంఛార్జీలు బి.ఎస్.ఎం.కె జోగినాయుడు, పోలారపు త్రినాధ్, బొద్దపు ప్రసాద్, బత్తుల రమేష్, 82 వ వార్డు అధ్యక్షులు దాడి జగన్, సురే సతీష్ కుమార్, పిట్ల రాజు, అధికసంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి ఇరుముడి

### పాల్గొన్న కౌన్సిలర్ చింతకాయల పద్మావతి



**నర్సీపట్నం, (మనసులో మాట) నవంబర్ 17:** నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పినారిపాలెం రామాలయం వద్ద సోమవారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గురు స్వామి డబ్బీర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమంలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురు స్వామి డబ్బీర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో సుమారు 110 మంది అయ్యప్ప స్వాములు సంప్రదాయబద్ధంగా ఇరుముడులు ధరించారు. కార్యక్రమానికి విచ్చేసిన చింతకాయల పద్మావతి పీఠంలో కొలువైన అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శబరిమల యాత్రకు సిద్ధమైన స్వాములకు ఆమె స్వయంగా పండ్లు, ప్రసాదాలను అందజేశారు. స్వాముల యాత్ర క్షేమంగా, నిర్విఘ్నంగా సాగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళి, భక్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా చినరాజుపేట

# చౌడేశ్వర సాంబ శివ శూలాల మహోత్సవం

### రాష్ట్ర కార్యానిర్వహక కార్యదర్శి దాడి రత్నాకర్ చే అన్నసమారాధన ప్రారంభం



**అనకాపల్లి, నవంబర్ 17 (మనసు లో మాట):** అనకాపల్లి చినరాజుపేట శ్రీ చౌడేశ్వర సాంబశివ శూలాల మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ప్రారంభించారు. ముందుగా స్వామి వారిని రత్నాకర్ దర్శించుకున్నారు. అంతకుముందు రత్నాకర్ కు ఆలయ కమిటీ వారు స్వాగతం పలికి సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ కార్తీక మాసం శివారాధనకు ఎంతో విశిష్టమైనదన్నారు. ప్రతి ఏటా కార్తీక మాసం లో అతి పవిత్రంగా ఉపవాస దీక్షలతో శూలాలను ధరించి శివారాధన చేసి సాంబశివుని అనుగ్రహం భక్తులు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో బాల గురూజీ, రెడ్డి ప్రసాద్, వేమన సంతోష్, యాండపల్లి మోహన్ బ్రహ్మజీ, ఆడారి రవికుమార్, కోడూరి త్రినాధ్, కిరణ్ కుమార్, మావురి అయ్యప్ప, ఆడారి రవికుమార్, కోటిపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గౌరీ పరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శించుకున్న భక్తులు



**సబ్బవరం , నవంబర్ 17, ( మనసులో మాట ) :** సబ్బవరం మండలంలో పెదయాత పాలెం గ్రామంలో. నాలుగో సోమవారం శ్రీ గౌరీ పరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శించుకున్న భక్తులు వేకువజాము నుంచి ఆ మహాదేవునికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు , ధూపదీప నైవేద్యాలతో విశాఖ డైరీ డైరెక్టర్ శరగడం శంకరరావు మరియు గ్రామస్తులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు . మధ్యాహ్నం అన్న సామరాధన సాయంత్రం నందీశ్వరునికి అభిషేకాలు మరియు ద్వీపాలంకరణ అతివైభామగా నిర్వహించారు, మరియు సబ్బవరం మండలంలో సబ్బవరం శివాలయంలో మరియు పెదనాయుడుపాలెం శివారు గణపతిపురం గ్రామంలో తవ్వానిపాలెం గ్రామంలో స్వామివారికి ఉదయం నుంచి అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం అన్న సామరాధన ఏర్పాటు చేశారు.

# గత జన్మభూమి, గ్రామదర్శినిల కళాకారుల బకాయి సొమ్ము చెల్లించాలి..

### కళాకారుల ఆవేదన..

**డుంబ్రిగుడ, నవంబర్ 17, (మనసులో మాట):** గత 2018 సంవత్సరంలో కళాకారులు ప్రదర్శించిన జన్మభూమి, గ్రామదర్శిని బకాయి సొమ్ము తక్షణమే చెల్లించాలని కళాకారు లుఅప్పలరాజు,ఈశ్వరరావు శ్రీను, అచ్చిబాబు, మల్లేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో2018 సంవత్సరం చంద్రబాబు నాయుడు హాయంలోనే జన్మభూమి, గ్రామదర్శిని కార్యక్రమాలు కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించారని చెప్పారు. అప్పట్లో కళాజాత ద్వారా కార్యక్రమాలు నిర్వహించేందుకు కళాకారులకు అడ్వాన్స్ సొమ్ము ఇవ్వకపోయినప్పటికీ కూడా కళాకారులు కళాజాత ద్వారా కార్యక్రమాలు నిర్వహించేందుకు బయట వడ్డీలకు అప్పులు చేసి కళాజాత కార్యక్రమాలు నిర్వహించామని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 7 సంవత్సరాలు గడిచినప్పటికీ కూడా ఇప్పటివరకు బకాయి సొమ్ము చెల్లించకపోవడం సరికాదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాకారులు కళా పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. గతంలో నిర్వహించిన గ్రామదర్శిని, జన్మభూమి వంటి కార్యక్రమాలకు ప్రదర్శించమని కళాకారులు చెప్పారు. ఇప్పటివరకు బకాయి సొమ్ము అందించకపోవడంతో అనేకమంది కళాకారులు అప్పులు పాలై మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కళాకారులకు బకాయి సొమ్ము చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు



## రాజమండ్రికి రూ.100 కోట్లు

# పెట్టుబడులు



- ▶▶ నగర చరిత్రలో ఇదొక మైలు రాయి
- ▶▶ నగరంలో జార్విన్ ఏవియేషన్ అకాడెమీ
- ▶▶ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్
- ▶▶ 400 నుంచి 500 మందికి ఉద్యోగ అవకాశాలు
- ▶▶ వైజాగ్ సదస్సులో భాగంగా ఈ పెట్టుబడులు
- ▶▶ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడి
- ▶▶ ఏవియేషన్ పైలట్లను తీర్చిదిద్దుతాం
- ▶▶ వచ్చే ఏప్రిల్... మే నాటికి 40 మందితో మొదటి బ్యాచ్ ప్రారంభం
- ▶▶ త్వరలో ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు
- ▶▶ అకాడెమీ అధినేత ఫణీంద్ర ఆరుమిల్లి వెల్లడి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** వైజాగ్ లో జరిగిన సీఐఐ పెట్టుబడుల సదస్సులో భాగంగా రాజమహేంద్రవరం నగరానికి రూ.100 కోట్ల పెట్టుబడులు వచ్చాయని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) వెల్లడించారు. రాజమండ్రి నగర చరిత్రలో ఇదొక మైలురాయి అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. జార్విన్ ఏవియేషన్ అకాడెమీని ణీంద్ర ఆరుమిల్లి ఏర్పాటు చేయడానికి ఎంఓయు చేసుకున్నారని ఆయన తెలిపారు. హొటల్ లా హాస్పిన్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రతి ఎమ్మెల్యే బాధ్యత తీసుకుని ఈ పెట్టుబడులు రావడానికి ప్రయత్నాలు చేశామని, దీనికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మహన్ నాయుడు ఎంతగానో సహకరించారని ధన్యవాదాలు తెలిపారు. మార్పు దిశగా ఇది కీలక మలుపని అన్నారు. ఏవియేషన్ రంగంలో స్కిల్ డెవలప్మెంట్ కీలకమని ఆయన చెప్పారు. ఎకో సిస్టానికి ఇది నాంది పలుకుతుందని అన్నారు. రాజమండ్రి నగర యువత కోసం రూ. 100 కోట్ల పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చిన ఫణీంద్ర ఆరుమిల్లికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పై నమ్మకంతో విదేశీ, స్వదేశీ ప్రతినిధులు, పెట్టుబడిదారులు వైజాగ్ సదస్సుకు తరలివచ్చారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వ్యాఖ్యానించారు. అకాడెమీ అధినేత ఫణీంద్ర ఆరుమిల్లి మాట్లాడుతూ తమది రాజమండ్రి సమీపంలోని రాజోలు అని అందుకే రాజమండ్రితో తనకు అనుబంధం ఉందన్నారు. అందుకే ఈ ప్రాంతంలో ఏవియేషన్ అకాడెమీ ఏర్పాటు చేయాలని భావించామని చెప్పారు. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సహకరించారని, ప్రభుత్వం, మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి కే రామ్మోహన్ నాయుడు సహకరించినట్లు చెప్పారు. పైలట్ కావాలన్న తన కోరిక తీరలేదని అందుకే ఈ అకాడమీ ద్వారా ఏవియేషన్ పైలట్లను తయారు చేస్తామని చెప్పారు. గత 17 సంవత్సరాలుగా హైదరాబాద్ కేంద్రంగా జార్విన్ సొల్యూషన్స్ నిర్వహిస్తున్నామని, 800 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. అమెరికా, ఆస్ట్రేలియా, యూకేలో సంస్థ వ్యాపారం ద్వారా విదేశాల్లోను రూ.50 కోట్ల టర్నోవరు ఉందని ఆయన చెప్పారు. రాజమండ్రి సమీపంలోని విమానాశ్రయంలో తమకు స్థలం కేటాయిస్తున్నారని, జనవరిలో కార్యకలాపాలు మొదలు పెట్టి ఏప్రిల్ - మే నాటికి 40 మందితో మొదటి బ్యాచ్ ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. 14 నెలల శిక్షణతో పైలట్లను తీర్చిదిద్దుతామని అన్నారు. దేశంలో సంవత్సరానికి 25 వేల మంది పైలట్ల అవసరం ఉందని ఆయన చెప్పారు. భవిష్యత్తులో ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి కోర్సులు కూడా తెస్తామని చెప్పారు. లాజిస్టిక్ ప్రాజెక్టు కూడా ప్రారంభించే యోచన ఉందని ఫణీంద్ర ఆరుమిల్లి తెలిపారు. విలేకరుల సమావేశంలో రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా పాల్గొన్నారు.




హిందూపురంలో వైసీపీ కార్యాలయం పై దాడిని ఖండిస్తూ

## కాకినాడలో నిరసన



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 17..** హిందూపురం వైఎస్ఆర్సీపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ కాకినాడ సిటీ మాజీ శాసన సభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి కాకినాడ జిల్లా వైయస్ఆర్ సిపి అధ్యక్షులు దాడిశెట్టి రాజా అధ్యక్షతన కాకినాడ బాలచెరువు వై.యస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న విద్య సాగర్ మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ మాజీ ఎంపీ తోట నరసింహం వై.యస్.ఆర్ సిపి ప్రత్తిపాడు ఇంచార్జ్ ముద్రగడ గిరి,వై.యస్.ఆర్ సిపి పెద్దాపురం ఇంచార్జ్ దవులూరి దొరబాబు వై.యస్.ఆర్ సిపి రాష్ట్ర మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ జమ్మలమడుగు నాగమణి వై.యస్.ఆర్ సిపి రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి కుమార్ కాకినాడ సిటీ మహిళా అధ్యక్షురాలు పసుపులేటి వెంకట లక్ష్మి శేఖర్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ మరియు కాకినాడ జిల్లా, సిటీ అనుబంధ పదవుల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



టెన్త్ పరీక్షల ఏర్పాట్లను పరిశీలించిన

## ఏసీ అమలకుమారి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను విద్యా ర్థులు ప్రశాంతంగా రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ఫర్ ఎగ్జామినేషన్ ఎం అమల కుమారి సూచించారు. సోమవారం స్థానిక కంటిపూడి రామారావు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, తరగతి గదుల్లో బెంచీలు ఏర్పాటు పరిశీలించారు. అన్ని రూమ్స్ లోనూ లైట్ లు, ఫ్యాన్ ల సౌకర్యాన్ని పరిశీలిం చారు. తదుపరి నన్నయ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, బీఈఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, ఆనందనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, టౌన్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల లను కూడా సందర్శించి కొన్ని సూచనలు చేశారు. అర్బన్ లో గల పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను అర్బన్ రేంజ్ డీఐ బీ దిలీప్ కుమార్ ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైవీ రామారావు, ఉపాధ్యాయులు, సీఆర్ఎం టీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ద్వారా

## 223 అర్జీలు

జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి



**అమలాపురం (మనసులోమాట) నవంబరు 17..** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ ద్వారా 223 అర్జీలు వచ్చినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు తమ సమస్యలను సులభంగా, సమయం వృథా కాకుండా, క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉన్న సంబంధిత అధికారులకు నేరుగా చేరవేసి పరిష్కారం చూపించేందుకు పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్ సిస్టమ్ కీలక వేదికగా పనిచేస్తుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖాధికారుల సమగ్ర పరిశీలనకు పంపి, వేగవంతంగా పరిష్కారం చూపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. సమస్యల పరిష్కారంలో ప్రతి అధికారి వ్యక్తిగత బాధ్యత, జవాబుదారీతనం వహించడం ఎంతో ముఖ్యమని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. పౌరులు తమ సమస్యలను 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఏ సమయంలోనైనా తెలియజేయవచ్చని ఆమె పేర్కొన్నారు. అర్జీ దార్లు పెట్టుకున్న వాటిలో రెవెన్యూ, పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి, హోమ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పాఠశాల విద్య, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాలు, ఆరోగ్యం, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని జేసి తెలిపారు. ప్రతి అర్జీపై సమయానుకూల చర్య తీసుకుని, ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలను వేగంగా, పారదర్శకంగా అందించడం పీజీఆర్ఎస్ ప్రధాన లక్ష్యమని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి శాఖాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఆర్ఓ కె. మాధవి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పాదగయ క్షేత్రం..

## భక్తజన సంద్రం







పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 17: కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో పిఠాపురం పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ ఉమాకు కోటేశ్వర స్వామి ఆలయం భక్త జనంతో కిటకిటలాడింది. త్రాగయా క్షేత్రాలలో ఒకటైన పాదగయ్య క్షేత్రం శివనామస్మరణతో మారు మ్రోగింది. కార్తీక మాసంలో శివారాధన చేస్తే పాపాలు తొలగిపోతాయి పుణ్యలోకం ప్రాప్తిస్తుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసించడంతో వేలాది మందులు భక్తులు ఉదయం నుంచి ఆలయానికి తరలివచ్చారు. పవిత్ర స్నానాలు దీపారాధనలు పాదగయ కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అరటి దుప్పలలో దీపాలు వెలిగించి వాటిని పుష్కరిణిలో వదిలారు. దీపాల వెలుగుతో ఆలయ ప్రాంగణం మరింత ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కార్తీక మాసం చివరి సోమవారం విశిష్టతను పురస్కరించుకుని ఆలయ ంలో స్వయంభు లింగానికి అభిషేక పండితులచే అభిషేకాలు నిర్వహించారు ప్రత్యేక పూజలు అనంతరం భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచు కుని దేవాలయ సహాయ కమిషనర్ కాట్నం జగ న్మోహన్ శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పేదవాడు లబ్ధి పొందేలా అవగాహన కల్పించండి: కలెక్టర్



**ఏలూరు, నవంబర్ 17 (మనసులో మాట)..** ప్రధానమంత్రి ఆవాస్ గ్రామీణ యోజన పథకం కింద అర్హులైన ప్రతీ పేదవాడు లబ్ధిపొందేలా అవగాహన కలిగింపాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ గ్రామీణ్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ గ్రామీణ యోజన ప్లస్ లబ్ధిదారుల వివరాలు నమోదుపై తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, పురపాలక సంఘాల కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ అధికార్లతో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నిరుపేదల స్వంత ఇంటికల నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ గ్రామీణ్ యోజన, యోజన ప్లస్ పథకంలో జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్కరూ ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేలా అందరిలో అవగాహన కలిగించాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పట్టణ , గ్రామీణ పథకం కింద ఇంతవరకు 29 వేల 187 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 7781 మంది వివరాలు సర్వే చేసి పిఎంఏవై యాప్ లో నమోదు చేసారని, మిగిలిన వాటిలో అర్హులైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు కూడా ఈ నెలాఖరులోగా రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖల సిబ్బంది ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలన్నారు. సర్వే, ఆన్లైన్ లో వెనుకబడి ఉన్న అధికారులు త్వరితగతిన లబ్ధిదారుల సర్వే, ఆన్లైన్ నమోదు వేగవంతం చేసి, ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా పట్టణ ప్రాంతాలలో పిఎంఏవై పథకం మంజూరు చేసిన 1606 ఇళ్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో తహసీల్దార్ లు వాస్తవిక పరిస్థితులను పరిశీలించి వివరాలను సంబంధిత ఆర్డీఓలు ద్వారా మంగళవారం నాటికి అందించాలన్నారు. అర్హులైన లబ్దిదారులకు స్వాధీన ధ్రువీకరణ అందించడంలో అవినీతికి పాల్పడే అధికారులు, సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటానని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు.

నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ, గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్, జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి

## చట్టబద్ధంగా దత్తత చేసుకోవడం ఒక వరం

గోడ పత్రిక ఆవిష్కరించిన కాకినాడ కలెక్టర్ షణ్ముఖన్ సగిలి



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 17..** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల ను అనుసరించి 2025 సంవత్సరంలోని నవంబర్ నెలలో భాగంగా దత్తతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి. దీనిలో భాగంగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు కలెక్టర్ సగిలి షన్మోహన్ కాకినాడ జిల్లా గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగినది. ప్రతి ఒక్కరూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ను అనుసరిస్తూ చట్టబద్ధంగా దత్తత తీసుకోవడం ఒక వరంఅని అన్నారు.అలాగే రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు దృష్టిలో పెట్టుకొని దళారీలను నమ్మి అలాగే ఇబ్బందులకు గురి కావద్దని చట్ట పరంగా దత్తత తీసుకోవడం శ్రేయస్కరమని తెలియజేసినారు. ఒకవేళ ఎవరైనా చట్ట విరుద్ధంగా దత్తత తీసుకుంటే చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. దత్తతలో ఉండే వివిధ రకాలైనటువంటి వెసులుబాట్లు అనగా రిలేటివ్ అడాప్షన్ (రక్తసంబంధీకుల దత్తత) స్టెప్ పేరెంటెడ్ ఆప్షన్ తదితర అంశాల మీద అందరికీ అవగాహన కల్పించాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బందికి సూచించారు. నవంబర్ మాసం అంతా గ్రామస్థాయి మండల స్థాయి డివిజనల్ స్థాయిలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ద్వారా దత్తత ప్రచార కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగపరచుకోవాలని తెలియజేశారు.ఈ సంవత్సరం నవంబర్ 2025 మాసం అంతా కూడా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను దత్తతకు ఇచ్చుట గురించి అవగాహన కార్యక్రమాలు జరిపించడం జరుగుతుందని ప్రాజెక్ట్ డైరెక్టర్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ కాకినాడ జిల్లా వారు చెరుకూరి లక్ష్మి తెలియజేసినారు. ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవాలనుకుంటే జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖను సంప్రదించ వలసినదిగా తెలియజేయుచున్నారు. ఈ కార్యక్రమం నందు జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్ . వెంకట్రావు, సంరక్షణ అధికారులు కె. శ్రీనివాస్ జె. విజయ మరియు శిశు గృహ ఇంచార్జ్ మేనేజర్ రేవతి ఇతర జిల్లా అధికారులు పాల్గొనడం జరిగింది. సంప్రదించవలసిన అధికారులు నెంబర్ల కి 85550 60818, 6303599264, 93925 00795 జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ కాకినాడ వారి ఫోన్ నెంబర్లు కి ఫోన్ చేయండి.

నిర్ణీత గడువులో

## అర్జీల పరిష్కారం తప్పనిసరి

- పీజీఆర్ఎస్ జిల్లా స్థాయిలో మొత్తం 156 అర్జీలు స్వీకరణ
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** పీజీఆర్ఎస్‌లో నిర్ణయించిన సమయంలో పరిష్కారం చూపాల్సిన అర్జీల్లో ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉండటం ప్రజల సంతృప్తిపై ప్రతికూల ప్రభావం చూపుతోందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్‌తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ అన్ని శాఖలు తమ పనితీరులో స్పష్టత, వేగం, బాధ్యత వహించాలని సూచించారు. అర్జీల పరిష్కార మార్గంలో ప్రజల సంతృప్తి స్థాయిపై రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేయడం జరుగుతోందని వెల్లడించారు. అందులో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు పరిష్కారం అయ్యే వాటి విషయంలో వ్యక్తిగత బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రజలకి మెరుగైన పౌర సేవలు అందించే క్రమంలో మెరుగైన పనితీరు చూపాలన్నారు. మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అసలైన మత్స్యకారులకు లైసెన్సులు జారీ చేయడంలో రెవెన్యూ శాఖ, మత్స్యశాఖ సమన్వయం అత్యంత కీలకమని కలెక్టర్ అన్నారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం లైసెన్స్ అనుమతి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆమె సూచించారు. అదే విధంగా ఉద్యోగుల సేవా నైపుణ్యాభివృద్ధి కోసం iGOT-Karmayogi యాప్‌లో ఉన్న అవసరమైన శిక్షణ కోర్సులను నిర్ణీత గడువులో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి కిసాన్– అన్నదాత సుఖీభవ పథకం రెండవ విడత కింద రైతులకు పెట్టుబడి సాయం నిధులు బుధవారం విడుదల కానున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయిలో అన్ని ఏర్పాట్లు పూర్తిగా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ప్రభుత్వం అందించే ప్రయోజనాలు ఎటువంటి అంతరాయం లేకుండా చేరేలా వ్యవస్థ పటిష్టంగా ఉండాలని ఆమె అన్నారు. కాగా సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 156 అర్జీలు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ శాఖకు 66, పంచాయతీరాజ్ -గ్రామీణాభివృద్ధికి 23, హోమ్ శాఖకు 22, మున్సిపల్ శాఖకు 6 ఫిర్యాదులు చేరాయి. విద్యుత్తు, జలవనరులు, వ్యవసాయం, ఆరోగ్యం, పశుసంవర్ధక, మత్స్య, పరిశ్రమలు తదితర శాఖలకు చెందిన మరో 49 అర్జీలు స్వీకరించారు. పెండింగ్ అర్జీలపై దృష్టి సారించి శాఖల వారీగా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో భాగంగా ధవళేశ్వరం, కోరుకొండ, కడియం మండలాలకు చెందిన పలు అర్జీలను కలెక్టర్ పరిశీలించారు. స్కూల్ రికార్డు సరిచేయడం, చెరువు ఆక్రమణ నివేదిక, దీపం పథకం సొమ్ము జమ సమస్య, బోధి మార్గం ఆక్రమణ వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారి తక్షణంగా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, డీఆర్వో టీ సీతారామ మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



ప్రకృతి పద్దతుల ద్వారా పండించే

## ఆహారం పదార్థాలు ఆరోగ్యానికి మేలు

### జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ వి సత్యనారాయణ

**కాకినాడ (మనసులో మాట), నవంబరు 17:** రసాయన ఎరువులు ఉపయోగించకుండా ప్రకృతి పద్దతుల ద్వారా పండించే ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.వి.సత్యనారయణ అన్నారు.సోమవారం కాకినాడ కలెక్టరు కార్యాలయంలో రైతు సాధికార సంస్థ డి.పి.ఎం.జెలియాజర్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్దతుల ద్వారా పండించిన ఉత్పత్తుల ప్రచార కార్యక్రమం జరిగింది.దీనిలో భాగంగా జిల్లా ఉన్నతాధికారులకు గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా పలు ఉత్పత్తులను అందచేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్దతులు పాటించి పండించిన పంటలకు మార్కెట్లో మంచి డిమాండు ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఎం.వి.ఆర్ ఫణీంద్ర, ఉమెన్ ఎంపవర్మెంట్ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్మోహిని కేశవ స్వామి ఆలయ అభివృద్ధికి

## రూ లక్ష విరాళం




**ఆత్రేయపురం (మనసులో మాట) నవంబర్ 17..** జిల్లా ప్రసిద్ధిగాంచిన జగన్మోహిని కేశవ స్వామి ఆలయ అభివృద్ధికి, విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజనల్ డెవలప్మెంట్ అథారిటీ, కమిషనర్ ఎన్ తేజ భరత్ ఆలయ అభివృద్ధికి రూ, లక్ష విరాళం ఆలయ ఈవో భాగవతుల వెంకట రమణమూర్తి కి అందజేశారు. దాతలకు ఆలయ ప్రత్యేక దర్శనం చేయించి, విశిష్టత తెలిపి, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయవో మాట్లాడుతూ గర్భాలయ ప్రవేశం ఉన్న ఆలయమని, స్వామి వారి మాస కళ్యాణలు జరుగునని కళ్యాణాలు చేయించుకునే భక్తులు ఆన్లైన్ ద్వార చేయించుకోవచ్చు అని తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి టీం మణికర్ణిక ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 17..** జగ్గంపేటకు చెందిన దుర్గారావు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు.ఈ విషయం తెలిసిన టీం మణికర్ణిక అతనికి ఒక నెలకు సరిపడ కిరాణా, ఆర్థికంగా సహాయం చేయడం జరిగింది. మణికర్ణిక యువజన సంఘం ఆధ్వర్యంలో గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దుర్గారావు అనే వ్యక్తి దీర్ఘకాలికంగా శ్వాసకోస వ్యాధితో బాధపడుతూ ఆహారం తినలేక ద్రవపదార్థాలు మాత్రమే తీసుకోగలుగుతున్నాడు అటువంటి వ్యక్తికి మణికర్ణిక యువజన సంఘం అతనికి ఏవి ఉపయోగమో అవి మాత్రం ఒక నెలకు సరిపడ సరుకులు అందించడం జరిగింది.ఈ సందర్భంగా మణికర్ణిక యువజన సంఘం అధ్యక్షురాలు గున్నాబత్తుల పూజా అనుష మాట్లాడుతూ ఇటువంటి వారిని గుర్తించి అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.క్యాండిల్ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్ జుత్తుక నాగేశ్వరరావు ఈ విషయం తెలియజేయడం ద్వారా ఆ వ్యక్తి దగ్గరికి వెళ్లి వారు ఉండే ఇంటిని పరిసరాలను అడిగి తెలుసుకుని వారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి వారు ఎవరైనా ఉండి మా దృష్టికి తీసుకువస్తే తప్పనిసరిగా సహాయం అందించడానికి మా సంఘం ముందుంటుందని జగ్గంపేట నియోజక వర్గంలోని యువతని సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనే విధంగా వారిని టీం మణికర్ణిక కలుపుకుంటూ వెళ్తున్నారు అని అధ్యక్షురాలు పూజా అనుష అన్నారు అలాగేఉపాధ్యక్షుడు మొగ్గలంక శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాగే ఎంతోమందికి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని అలాగే తల్లిదండ్రులు లేని పిల్లలను చదివించడం కూడా జరుగుతుందని అలాగే క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారికి కూడా ప్రతి నెల సహాయం చేయడం మా సంఘం ద్వారా జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు మణికంఠ వీరబాబు ప్రసాద్ శివకుమార్ పాల్గొన్నారు.

లిక్కర్ సిండికేట్ వ్యవహారంలో అడ్డంగా దొరికేసి..

# శ్రీరంగ నీతులా?!

▸▸ పనికి మాలిన చీటర్ ను తెర మీదకు తెచ్చి నీచ నికృష్ట రాజకీయాలా..

▸▸ టీడీపీ నగర అధ్యక్షుడివి అన్నీ బుకాయింపు మాటలే

▸▸ నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్న వ్యక్తిని అరెస్టు చేయడానికి పోలీసులు ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు?

▸▸ టీడీపీ నేతల వ్యాఖ్యలు, వ్యవహార తీరుపై వైసీపీ సిటీ నాయకులు ఫైర్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** లిక్కర్ సిండికేట్ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన తరువాత విషయాన్ని పక్క దోవ పట్టించడానికి ఐపీ పెట్టిన చీటర్, పనికిమాలిన వ్యక్తిని తెర మీదకు తీసుకుని వచ్చి ఈవీఎం ఎమ్మెల్యే మాట్లాడిస్తున్నారని సిటీ వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. సోమవారం రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వైసీపీ నేతలు..సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబుపైన, అలాగే మాజీ ఎంపీ భరత్ పై పలు అభియోగాలు చేసిన చందా సత్రం మాజీ ఛైర్మన్ పీ రామశర్మ పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో రామశర్మ పై పలు కేసులు ఉన్నా అరెస్టు చేయకుండా ఎందుకు మిన్నకుంటున్నారని పోలీసులను ఉద్దేశించి ప్రశ్నించారు. లిక్కర్ సిండికేట్ ఆడియోలు ఒకటి కాదు మూడు వచ్చాయని.. అవి అభూత కల్పన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అంటూ టీడీపీ నేతలు అతి తెలివి తేటలతో మాట్లాడటం కేవలం తప్పించుకునేందుకు బుకాయింపు మాత్రమే అన్నారు. సాక్షాత్తూ స్థానిక ఈవీఎం ఎమ్మెల్యే కనుసన్నలలో ఈ మొత్తం తతంగం నడుస్తోందని ఆరోపించారు. ఇదీ మన రాజమండ్రి నగర దౌర్భాగ్య పరిస్థితి అన్నారు. మూడు ఆడియో రికార్డింగ్లు లీకయ్యి మొత్తం నగరాన్నే కాదు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయినా వాటి మీద ఎటువంటి చర్యలు లేవన్నారు. అదే ఈవీఎం ఎమ్మెల్యే బాబాయ్ ఆదిరెడ్డి శ్రీనివాస్ ఒక ఆడియో వస్తే తక్షణమే అతని మీద కేసు పెట్టారన్నారు. అతనితో మీ సత్సంబంధాలు దెబ్బతిన్నాయి కనుక తక్షణ చర్యలు తీసుకున్నారని అన్నారు. దీనిపైన మీడియా కూడా ప్రశ్నించాల్సి ఉందన్నారు. మీ పార్టీ నాయకుడు బర్ల బాబూరావు తెల్లారితే మీ పైన ఇష్టం వచ్చినట్లు ఎండగడుతుంటే అతనిపై పార్టీ పరంగా ఎం దుకుచర్యలు తీసుకోలేకపోతున్నారని, కేసు ఎందుకు పెట్టలేదని.. ఇంత నిర్లిప్తంగా ఉన్నారు అంటే బర్ల ఆరోపణలలో పచ్చి నిజాలు ఉన్నాయి కాబట్టేనని టీడీపీ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మీ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రశ్నిస్తా అనే ఉప ముఖ్యమంత్రి, ఇంకా పైన ఉన్న మీ కూటమి బీజేపీ ప్రధాన మంత్రి మోదీ.. ఇదంతా చూస్తూ ఏమి చేస్తున్నట్టు, ఈ లిక్కర్ మాఫియాపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు తనకు మద్యం వ్యాపారం లేదని, ఉల్లిపాయల వ్యాపారం అని కబుర్లు చెబుతున్నాడు.. స్టేడియం రోడ్డు వద్ద బార్ ఎవరిది అధ్యక్షా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. నువ్వూ, కీలపర్తి శ్రీను, ఇంకో వ్యక్తిది కదా..ఈ విషయం నగరంలో అందరికీ తెలుసు అన్నారు. అజ్ఞాత వ్యక్తి రామశర్మ ప్రెస్ క్లబ్ లో పాత్రికేయుల సమావేశం నిర్వహించాడు.. అతనిపై కేసులు ఉన్నాయి, నాన్ బెయిలబుల్ వారెంట్ ఉందని పోలీసులకు తెలియదా..జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా అరెస్టు చేయకుండా ఎందుకు చోద్యం చేస్తున్నట్టు వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. స్థానిక 21 వార్డు ఇంచార్జి.. తోటి కులస్తుడు దుర్వాసుల సత్యనారాయణ దగ్గర రూ.11 లక్షలు తీసుకుని రామశర్మ మోసం చేశాడని, కన్న కూతురికి పెళ్లి కట్నం కింద స్థలం కొని ఇద్దామనుకున్న దుర్వాసులను మోసం చేసి సొమ్ము కాజేసిన రామశర్మపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను వైసీపీ నేతలు కోరారు. అరెస్టు వారెంట్ ఉన్నా కూడా దర్జాగా నగరంలో తిరుగుతున్న రామశర్మని తక్షణమే అరెస్టు చేసి ఉద్యోగ ధర్మం నిర్వహించాలని ఈ సందర్భంగా పోలీసు శాఖను వారు కోరారు. ఈ సమావేశంలో సిటీ వైసీపీ అధికార ప్రతినిధి రొక్కం త్రినాథ్, ట్రేడ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు సప్ప ఆదినారాయణ, 21వ వార్డు ఇంచార్జి దుర్వాసుల సత్యనారాయణ, కాటం రజనీకాంత్, సోడదాసి సుందర్సింగ్, చవ్వాకుల సుబ్రహ్మణ్యం, మునీశ్వర రావు, షబ్బీర్, కంబాలపేట బాబీ, పొదిలపు నాగు, రేగుళ్ళ శ్రీధర్, సాంబ, కొండేటి సుధ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఇంచార్జ్ కమిషనర్ కె.టి. సుధాకర్




**(మనసులో మాట), నవంబరు 17:** కాకినాడ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ కె.టి. సుధాకర్ సోమవారం ఉదయం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇంచార్జ్ కమిషనర్ కే టీ సుధాకర్ భానుగుడి సెంటర్ టూ టౌన్ చిన్న మార్కెట్ మూడు లైట్ జంక్షన్ జిల్లా పరిషత్ సెంటర్ బాలాజీ చెరువు సెంటర్ ప్రాంతాలను సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాకినాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం మన అందరి బాధ్యత అని డ్రైనేజీల్లో చెత్త వేయకుండా తడి చెత్త-పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి మాత్రమే అందించాలి," అని సూచించారు. శానిటేషన్ నిర్వహణలో సమర్థత పెంచేందుకు ఇన్స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. వివేకానంద పార్కు వద్ద గల అన్న క్యాంటీన్ ను కూడా ఆయన సందర్శించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్ సానిటరీ ఇన్స్పెక్టర్లు సత్తిబాబు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తక్షణ స్పందనకు ఆదేశాలు

### ఇన్చార్జి కమిషనర్ కె.టి. సుధాకర్




**కాకినాడ (మనసులో మాట )నవంబర్ 17..** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవా లని సంబంధిత అధికారులకు కాకినాడ నగర పాలక సంస్థ ఇన్ చార్జీ కమీషనర్ కె.టి. సుధాకర్ ఆదేశించారు.ప్రతి సోమవారం శారదమ్మగుడి సమీపంలోని కార్పొరేషన్ కార్యాలయ సమావేశం హాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఈ సోమవారం కూడా యధావిధిగా కొనసాగింది. ఈ సందర్భంగా ఇన్ చార్జీ కమీషనర్ కే.టి సుధాకర్ స్వయంగా అర్జీదారుల నుండి పలు ఫిర్యాదులను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ వంటి విభాగాలకు సంబంధించిన సమస్యల పై 11 మంది అర్జీలను కమిషనర్ కు అందజేశారు .ఆయా విభాగాధికారులకు అర్జీలను ఇంచార్జ్ కమిషనర్ పంపించి వాటిని తక్షణమే పరిష్కరించాలంటూ ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఇన్ చార్జీ కమీషనర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు నిర్వహించిన డయల్ యువర్ కమీషనర్ కార్యక్రమంలో మొత్తం 5 మంది ప్రజలు ఫోన్ ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ కె. శ్రీనివాస్ ఎస్.ఇ. పి. వెంకట్రావు హెల్త్ ఆఫీసర్ డా. పృథ్వీచరణ్ డిసిపి కృష్ణారావు మేనేజర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు ఉపయోగించకుండా ప్రకృతి పద్దతుల ద్వారా

## పండించే ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయి

### జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి.సత్యనారయణ



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 17..** కాకినాడ కలెక్టరేట్ లో రైతు సాధికార సంస్థ డి.పి.ఎం జెలియాజర్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్దతుల ద్వారా పండించిన ఉత్పత్తుల ప్రచార కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా జిల్లా ఉన్నతాధికారులకు గృహ నిర్మాణ సంస్థ పి.డి సత్యనారాయణ చేతుల మీదుగా పలు ఉత్పత్తు లను అందచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్దతులు పాటించి పండించిన పంటలకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎం.వి.ఆర్ ఫణీంద్ర ఉమెన్ ఎంపవర్మెంట్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక



**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 17:** ఏపీ ఎన్ జీ జీ ఓ ముమ్మిడివరం నూతన శాఖ కమిటీ అధ్యక్షుడు గా సి హెచ్. ఎన్. దొర, కార్యదర్శి గా బి. రాజేష్ ఎన్నికయ్యారు. ఏపీ ఎన్ జీ జీ ఓ అమలాపురం అధ్యక్షుడి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలలో ఎన్నికల ఆఫీసర్ సి.హెచ్. రాజశేఖర్ పర్యవేక్షణ ఏకగ్రీవంగా ఈ ఎన్నిక జరిగింది. 11 మంది సభ్యులతో కూడిన నూతన కమిటీ ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో సహాయ ఎలక్షన్ ఆఫీసర్ గా జి. వెంకటేశ్వరరావు, ఎం. వెంకటేశ్వర్లు, సి హెచ్. చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో ఘనంగా

## యూనిటీ మార్చ్..

- యువతలో ఐక్యత భావం దేశ సమైక్యత పెంపొందించాలని లక్ష్యం
- ట్రైన్ కలెక్టర్ మనీషా

**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 17..** యువతలో ఐక్యత భావం దేశ సమైక్యతను పెంపొందించాలనే లక్ష్యంతో ఐక్యత మార్చ్ (యూనిటీ మార్చ్) ను నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా ట్రైనీ కలెక్టర్ మానీషా పేర్కొన్నారు.

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి సాంబమూర్తి నగర్ ఆదిత్య ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ వరకు నిర్మించిన 5 కి.మి పాదయాత్రను ట్రైనీ కలెక్టర్ మానీషా ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభంమైన ఈ పాదయాత్ర భానుగుడు జంక్షన్ కోకిల రెస్టారెంట్ మదర్ థెరిస్సా స్టార్టింగ్ సెంటర్ మీదుగా ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు చేరుకుంది.

ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మానీషా మాట్లాడుతూ సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా మేరా యువ భారత్ (మై భారత్) పోర్టల్ నేతృత్వంలో యూనిటీ మార్చ్ను దేశవ్యాప్తంగా భారత ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. దేశానికి సర్ధార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చెందిన సేవలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ఐక్యత భావం, దేశ సమైక్యతను పెంపొందించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

అనంతరం ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ గ్రామీణం శాసనసభ్యులు పంతం నానాజీ ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్. శేషారెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ.. ఉక్కు మనిషిగా ప్రసిద్ధి పొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అమూల్యమైన సేవలు అందించారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని దేశాన్ని ఐక్యమత్యం చేయడం ద్వారా అఖండ భారత్ ను నిర్మించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.జె.నరసింహ నాయక్ జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మై భారత్ సిబ్బంది ప్రకాష్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్యామకుమార్ బీజేపీ ప్రతినిధులు పి. రవి కిరణ్ సాయి కుమార్ యాదవ్ పాపారావు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు జేఎన్టీయూకె విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.జిల్లా యువజన అధికారి తిర్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

పీపీ రాచపల్లి ప్రసాద్ కు

## ఎస్సీ, ఎస్టీ నాయకుల అభినందన



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** ప్రతిష్ఠాత్మకమైన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన ప్రముఖ న్యాయవాది రాచపల్లి ప్రసాద్ ను జిల్లా ఎస్సీ, ఎస్టీ నేత జంగం సుబ్బారావు ఆధ్వర్యంలో ఆయన చాంబర్ కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాది రాచపల్లి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనపై పెట్టిన ఈ బాధ్యతను శక్తి వంచన లేకుండా సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జిల్లా నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, దారా ఏసురత్నం, న్యాయవాదులు పీఎల్ఎన్ ప్రసాద్, రాధాకృష్ణ రాజు, పాస్టర్ పాలపర్తి మార్టిన్ లూథర్, నక్కా వెంకటరత్నం, అర్థాల కుమార్ బాబు, మోత నాగలక్ష్మి, తురకల నిర్మల, కప్పల వెలుగు కుమారి, కోసూరి చండీ ప్రియ, బొర్రా చిన్ని, ఏలేటి రాజారావు, రావి విజయ్ కుమార్, బీర విజయ్, దాసరి భూషణరావు, కాళాబత్తుల మునీశ్వరరావు, బేతాళ రామారావు, కొమ్ము బాబ్జీ, ఇంజనీర్ సోమాబత్తుల కృష్ణారావు, కప్పల రాజేష్, కటకం బాబ్జి, వాసా వర్జిల్, తలారి విజయ్ తేజ, చందు, బేతాళ వెంకటేశ్వరరావు, జే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని రాచపల్లిని ఘనంగా సత్కరించారు.

## 58 వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**కాకినాడ (మనసులో మాట )నవంబర్ 17..** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవం భాగముగా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు గ్రంథాలయ అధికారి బంధిల రత్నమని పర్యవేక్షణలో నిర్వహించారు.వ్యాసరచన పోటీలులో అంశము జూనియర్ విభాగంలో పుస్తక పఠనం ఆవశ్యకత పైనిర్వహించడం జరిగింది. సీనియర్ విభాగము లో అంశము స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పై వ్యాసరచన పోటీ లు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో జడ్పీ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు వై.యం.హెచ్ స్కూల్ విద్యార్థులు బచ్చు ఫౌండేషన్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు జడ్పీకల్స్ హైస్కూల్ సిబ్బంది ఆగ్నేయ బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారిని మాట్లాడుతూ మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహింపబడునని విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయులకు తెలిపారు



## భక్తులతో పోటెత్తిన ఆలయాలు

**ఆత్రేయపురం (మనసులో మాట) నవంబర్ 17..** కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మండలంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. వేకో జామున గోదావరి స్నానం ఆచరించి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. ఉపవాసం చేసిన భక్తులు సాయంత్రం సమయంలో ఆలయాల్లోని దీపారాధన చేసి స్వామివారి దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర, ర్యాలీ ఉమా కమండలేశ్వర స్వామి వసంతవాడ పార్వతీ పరమేశ్వర ఆత్రేయపురం రాజరాజేశ్వరి దేవి ఆలయం తెల్లవారుజాము నుండి భక్తులు స్వామివారిని దర్శించేందుకు బార్లు తీరారు. వాడపల్లి ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు ర్యాలీ ఆలయ ఈవో భాగవతుల వెంకట రమణమూర్తి భక్తులకు ఆలయాల్లో ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేశారు. సిబ్బందికి తగు చూసినట్లు ఇచ్చారు.

## ఈ నెల 19న సైక్లింగ్ క్రీడ ఎంపికలు

**కాకినాడ (మనసులో మాట ) నవంబరు 17:** సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఆఫ్ ఇండియా కోరిక మేరకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార ఆధ్వర్యంలో ఈ నెల 19, 20తేదిలలో సైక్లింగ్ క్రీడ పోటీలు/ఎంపికలు నిర్వహించడం జరుగుతుంది జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వి. సతీష్ కుమార్ తెలిపారు. జడ్.పి.ఉన్నత పాఠశాల, గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మండలం విలేజ్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా లో ఏ.పి.ఇంటర్ డిస్ట్రిక్ట్ ఎంపికలు జరుగుతాయని, జిల్లాలో పై తెలిపిన సైక్లింగ్ క్రీడ పోటీలు/ఎంపికల్లో పాల్గొనుటకు ఆశక్తి గల సైక్లింగ్ క్రీడాకారులు వారి సైక్లింగ్ ఎక్విప్మెంట్ తో సహా పై తెలిపిన చిరునామాలో ఈ నెల 19 ఉదయం 8.00 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. ఈ పోటీలలో ఎంపిక కాబడిన సైక్లింగ్ క్రీడాకారులు వచ్చే నెల.2 నుండి 6వరకు సంబల్ పూర్, ఒడిస్సా రాష్ట్రము నందు నిర్వహించు 30వ జాతీయ సైక్లింగ్ చాంపియన్షిప్ కు పంపబడతారన్నారు.మరిన్ని వివరములకు.వి. కనకారావు, సైక్లింగ్ కోచ్, డి.ఎస్.ఎ. గుంటూరు -6301177119, కె.సంగీత బాబు, ఫెన్సింగ్ కోచ్, డి.ఎస్.ఎ. గుంటూరు -8790623461 సంప్రదించాలన్నారు.

## అనువైన వరి రకాలు సాగు చేయాలి

**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 17:**రబీ సీజన్ లో అనువైన వరి వంగడాలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా. ఎమ్. నంద కిషోర్ ఓ ప్రకటన లో తెలిపారు. జిల్లాలో 1.67 లక్షలు ఎకరాలల్లో రబీ సాగు జరుగుతుందని రైతులు స్వల్ప కాలికి వరి వంగడాలను సాగు చేయాలన్నారు. ఎం టీ యూ 1121,1426,1293,1282 వంటి సన్న రకాలను సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడి తో పాటు పైరు తెగుళ్లు, చీడ పీడలను తట్టుకుంటాయి అన్నారు. డిసెంబర్ 15 లోగా రబీ నారుమళ్లు పూర్తి చేయాలనీ, ఎదజల్లే పద్ధతిని పాటించే వారు డిసెంబర్ 30 నాటి కి పూర్తి చేయాలన్నారు. సార్వాలో పండించిన రకాలను దాళ్వా లో విత్తనాలుగా వేయాల్సి వస్తే నిద్రావస్థను తొలగించాలన్నారు.


## వీరేశ్వర స్వామిని దర్శించుకున్న భారత మాజీ క్రికెట్ ప్లేయర్



**ఐ. పోలవరం( మనసులో మాట) నవంబర్ 17..** నిత్య కళ్యాణం పచ్చ తోరణం తో విరాజిల్లే మహిమనుతుడైన మురమళ్ళ శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారిని భారత క్రికెట్ ప్లేయర్, ఏషియన్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి సాగిరాజు వెంకటపతి రాజు కార్తీక మాసం నాలుగో సోమవారం మురమళ్ళ శ్రీ స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ను కలిసి ఇటీవల జరిగిన మెంతా తుఫాన్ లో విశేష సేవలు అందించడంతోపాటు బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలో విజయం సాధించిన బుచ్చిబాబును వెంకటపతి రాజు అభినందించారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నుండి సీ.ఎం చంద్రబాబు చేతుల మీదుగా మేధా తుఫాన్ ఫైటర్ అవార్డును అందుకోవడంపై విప్, ఎమ్మెల్యే బుచ్చి బాబుకు వెంకటపతి రాజు ప్రత్యేక అభినందనలు తెలిపారు. 1999 నుండి 2009 వరకు ఇండియాకు భారత క్రికెట్ ప్లేయర్ గా పనిచేసే పలు అద్భుతమైన పథకాలు సాధించానని ఆయన చెప్పారు. 93 నుండి 96 వరకు వరల్డ్ కప్ ఇండియాకు తెచ్చారని గర్వంగా చెప్పుకున్నారు. తనది పశ్చిమగోదావరి జిల్లా ఆలమూరు స్వగ్రామం అని తన బయోడేటా తెలిపారు.

### ఎమ్మెల్యే నెహ్రూ ఆధ్వర్యంలో ఇర్రిపాక శివ కేశవుల క్షేత్రంలో

# మహా పంచామృతాభిషేకం



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 17...** కార్తీకమాసం ఆఖరి సోమవారం జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలోని ఏలేరు నది తీరాన వెంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి, వేంచేసి ఉన్న శివకేశవుల దేవస్థానం నందు పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని ఆఖరి కార్తీక సోమవారం ఉదయం 6 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు శివ కేశవులు ఇరువురికి ఏకకాలంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎమ్మెల్యే,టీటీడీ పాలక మండలి సభ్యుడు, ఆలయ ధర్మకర్త జ్యోతుల నెహ్రూ మణి దంపతులు చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం వేలాదిగా విచ్చేసిన భక్తులు తమ స్వహస్తాలతో ఈ అభిషేకం ఒక వెయ్యి 108 బిందెల ఏలేరు నదీ జలాలతో జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కార్తీక సోమవారం శివ కేశవులకు పంచామృత అభిషేకం 1108 బిందెలతో ఏలేరు జలాల అభిషేకం నిర్వహిస్తున్నామని ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న కోటిలింగేశ్వరుడు, ప్రసన్న వెంకటేశ్వర స్వామి కలిసిన ఈ క్షేత్రం శివ కేశవుల క్షేత్రంగా విరాజిల్లుతుందని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా పంచామృతాభిషేకం నిర్వహించామని జగ్గంపేట నియోజకవర్గం ప్రజలందరూ సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించామని అదేవిధంగా ఆ శివకేశవ ఆశీస్సులతో నియోజవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని కోరుకున్నామని ఆ భగవంతుని ఆశీస్సులతో నియోజకవర్గం ఆ దిశగా అడుగులు వేస్తుందని అదేవిధంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న ద్వాదశ జ్యోతిర్లిం గాలను కూడా అభిషే కించు కున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు, ఎస్ వి ఎస్ అప్పలరాజు దంపతులు, జీను మణిబాబు దంపతులు, వీరం రెడ్డి కాశి బాబు, కొత్త కొండబాబు, తోట రవి, తోట గాంధీ, పైడిపాల సూరిబాబు, భూపాలపట్నం ప్రసాద్, పాలచర్ల నాగేంద్ర చౌదరి, బస్వా చినబాబు, జ్యోతుల నాగబాబు, జ్యోతుల సత్యమూర్తి, సుంకవిల్లి రాజు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

### తణుకు శాఖా గ్రంథాలయంలో

# మనోరంజకంగా కవి సమ్మేళనం



**తణుకు (మనసులో మాట)నవంబర్ 17..** కవిత్వం మనసుని రజింపజేస్తుందనీ, కవులు కవిత్వ రచనతో బాటు హాస్య చతురత కలిగి ఉంటారని ప్రముఖ ఆడిటర్ జొన్నలగడ్డ సూర్య సుబ్రహ్మణ్యం అన్నారు.గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా, సోమవారం స్థానిక పురుషుల శాఖా గ్రంథాలయంలో జరిగిన కవి సమ్మేళనం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు.సభకు మానవత సంస్థ నాయకులు, పారిశ్రామిక వేత్త గమిని రాంబాబు అధ్యక్షత వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వావిలాల సరళాదేవి, ప్రధాన కార్యదర్శి కౌరు వెంకటేశ్వర్లు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు బెజవాడ రామ సూర్యారావు, దూలం చిట్టి పాప, ప్రముఖ సినీ గేయ రచయిత రసరాజు, గ్రంథాలయ అధికారి గుత్తికొండ కృష్ణారావు ప్రభృతులు వేదికను అలంకరించారు. ముందుగా వావిలాల సరళాదేవి కవులకు కండువాలు బహూకరించి స్వాగతం పలికారు.అనంతరం కవి సమ్మేళనంలో కవులు రసరాజు, వావిలాల సరళాదేవి, కవిశ్రీ మోహన ప్రసాద్, కె. జె.ఎస్.రామా రెడ్డి (సితారె), పప్పొప్పు విజయలక్ష్మి, వి.ఎస్.వి. ప్రసాద్, జవ్వాది లక్ష్మి, ఎస్.హైమవతీ సత్య ప్రభృతులు తమ కవితా గానంతో సభికులను అలరించారు. ప్రముఖ సినీ గేయ రచయిత రసరాజు "అసెంబ్లీ రౌడి" సినిమా కోసం రచించగా, ప్రముఖ గాయకులు జేసుదాస్ గానం చేసిన "అందమైన వెన్నెలలోన అచ్చ తెలుగు పడుచువలె" గీతంను ప్రముఖ గాయకులు ఆకుమర్తి రాజు తమ మధురమైన గాత్రంతో పాడి సభికులను అలరించారు. కార్యక్రమంలో చివరిగా గమిని రాంబాబు, జొన్నలగడ్డ సూర్య సుబ్రహ్మణ్యం, రసరాజు లను దుశ్శాలువాలు, పూల మొక్కలతో నూ, కవులు మోహన ప్రసాద్, సితారె, గాయకుడు ఆకుమర్తి రాజు, పప్పొప్పు విజయలక్ష్మి, వి.ఎస్.వి. ప్రసాద్, జవ్వాది లక్ష్మి, ఎస్. హైమవతీ సత్య, రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకులు, టీవీ మరియు సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కోట రామ ప్రసాద్ ప్రభృతు లను పూల మొక్కలతో వావిలాల సరళాదేవి సత్కరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ గుత్తికొండ కృష్ణారావు, గుత్తికొండ ప్రవంతి, లైబ్రరీ రికార్డ్ అసిస్టెంట్ రాగాల పృథ్వీ నారాయణ, రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకులు, టీవీ, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కోట రామ ప్రసాద్, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, తణుకు మానవత కో ఛైర్మన్ బి.రామ కాశి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యురాలు యం.ఉమా జ్యోతి, ఎస్.వి.సతీష్ బాబు, జి.సాయి నాగేష్, జి.యం.గోవిందరావు ప్రభృతులు, చదువరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వైసీపీ సర్పంచ్ కాలే రాజబాబుకి టీడీపీ ఎమ్మెల్యే చే

# సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 35000 పంపిణీ

**మొఖం చేల్లక చెక్కు- అందుకోలేక రాని సర్పంచ్ - బంధువు చేత చెక్కు తీసుకున్న వైనం**



**ఐ. పోలవరం (మనసులో మాట) నవంబర్ 16..** కులం చూడం మతం చూడం ప్రాంతం చూడం అని డాంబికలు పలికే వై.సి.పి పార్టీని చూపించే నాయకులు నేడు ఐ .పోలవరం మండలంలో సీ.ఎం చంద్రబాబు సహాయ నిధి నుండి వచ్చే రిలీఫ్ ఫండ్ చెక్కును రూ.35000 అందుకున్న వైనంమిది. పైగా ఆ వై.సి.పి సర్పంచికి మొఖం చేల్లక ఆయన అందరిలో కొచ్చి ఎమ్మెల్యే చేతుల మీదుగా తీసుకోవడానికి మొకమాటము అడ్డొచ్చి వచ్చిందో ఏమో... లేక మొహం చెల్లలేదో తెలియదు కానీ అతని దగ్గర బంధువు చేత సీ.ఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందుకున్నారు. మురమళ్ళ గ్రామ సర్పంచ్ కాలే రాజబాబు తనకు అనారోగ్యం వచ్చిందని సీ.ఎం రిలీఫ్ ఫండ్ కి పెట్టుకుంటే సీ.ఎం రిలీఫ్ ఫండ్ 35 వేల రూపాయలు చెక్కును మంజూర అయింది. ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) సోమవారం మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో ఈ చెక్కును అందుకోవడానికి ఒకటి రెండుసార్లు రాజబాబు బావ వెంకటేష్కు వచ్చి ఎమ్మెల్యే బుచ్చిబాబు చేతుల మీదుగా అందుకున్నారు. తనకు అనారోగ్యం వచ్చిందని బ్రెయిన్ సంబంధించిన లోపంతో బాధపడుతున్నానీ, తన దగ్గర అంతగావైద్య ఖర్చులు లేవని, అంతగా వైద్య ఖర్చులు నిమిత్తం ఇబ్బంది పడకుండా ఉండేందుకు సీ.ఎం చంద్రబాబుకుసహాయం నిధి నిమిత్తం నిధులు మంజూరు చేయాలని రాజబాబు వేడుకున్నారు. కష్టాల్లో ఉన్న వ్యక్తులకు తోడుగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సిఫార్సుతో రాజబాబుకు 35 వేల రూపాయలు ఆర్థిక సాయం మంజూరు చేశారు. రాజబాబు గతంలో జరిగిన ఎన్నికల్లో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు తీవ్ర వ్యతిరేకంగా పని చేయడంతో పాటు ఆయన ఓటమికి రాజబాబు మూడుసార్లు నిద్రాహారాలు మానీ ఎన్నికల్లోను విశేష కృషి చేశారు. అయినప్పటికీ బుచ్చిబాబు మానవతా దృక్పథంతో రాజబాబు అనారోగ్యం పాలవడంతో సీ.ఎం రిలీఫ్ ఫండ్ నుండి 35 వేల రూపాయలు మంజూరు చేయించారు. ఎమ్మెల్యే బుచ్చిబాబు మతం, కులం చూడలేదు, ప్రాంతం చూడలేదు, వైసిపి పార్టీ అని అసలేచూడలేదు రాజబాబు ప్రతిపక్ష వైసిపి పార్టీకి చెందిన వాడు అయినప్పటికీ రాజబాబుకు సీ.ఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయడంలో ఎటువంటి తారతమ్యతులు లేకుండా అందర్నీ సమానంగా చూస్తూ ప్రతిపక్ష పార్టీకి చెందిన వారికి సైతం సాయం చేయడంలో అందవేసిన చేయిగా ఎమ్మెల్యే బుచ్చిబాబు నిలిచారు. అయితే రాజబాబు వైసిపి పార్టీకి చెందిన వ్యక్తి కదా ఇక్కడ తెలుగుదేశం పార్టీ వాళ్ళు వద్ద సీ.ఎం సహాయ నిధి పొందడాని తెలుగు తమ్ముళ్లు గుసగుసలాడుకున్నారు. కొందరైతే బహిరంగంగానే కారాలు, మిరియాలు నూరుతున్నారు. స్థానిక నాయకులు కొందరు దగ్గరుండి ఎమ్మెల్యే బుచ్చిబాబు చేత ఈ ఆర్థిక సాయం ఇప్పించడం ఆశ్చర్యకరం. సాటివారికి సాయం చేయడంలో ఆపన్న అందించడంలో ఎమ్మెల్యే బుచ్చిబాబుకు మంచి మనసు ఉండడం పలువురు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

### 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా

# విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 17..** కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 4 వ రోజు 17 వ తేదిన పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ప్రముఖ చిత్రకారులు ఉపాధ్యాయులు ఎం .చిన్నబాబు పర్యవేక్షణలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ పోటీలు జూనియర్స్ విభాగం 6, 7 తరగతుల విద్యార్థులకు ఆదర్శ గ్రామం అనే అంశం పై సీనియర్స్ విభాగం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పర్యావరణం పరిరక్షణ అనే అంశం పై పోటీలు నిర్వహించుట జరిగినది. ఈ పోటీలలో స్థానిక పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు 130 మంది పాల్గొనడం జరిగినది.

ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఇన్ చార్జ్ కే కిషోర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం శ్రావ్య గ్రంథాలయ సిబ్బంది ఏ వి ఎస్ నాగేంద్ర కుమార్ ఎన్ .వి .ఎస్ ఫణీంద్ర కుమార్ టీ వీర్రాజు జి దుర్గా ప్రసాద్ వి అరుణ కార్యాలయ సిబ్బంది ఎస్ రాజు టీ సాయి వెంకట్రావు మరియు అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులకు పాల్గొన్నారు.



పి.జి.ఆర్.ఎస్ వచ్చిన ఫిర్యాదులను శాఖల అధిపతులు

# స్వయంగా పరిశీలించి సత్వరమే చర్యలు

**డి ఆర్ ఓ వెంకట్రావు ఆదేశాలు - పీజీఆర్ఎస్ కు 382 అర్జీలు..**

**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 17..** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎన్.శ్రీధర్, ఎస్ఎస్ఏ ఏపీవో పి.వేణుగోపాల రావు, కేఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణి, సీపీవో పీ. త్రినాథ్ తదితర అధికారుల కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను, దరఖాస్తులను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని డీఆర్వో వెంకటరావు అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు కార్డు లలోని పేర్లు మార్పులు చేర్పులు పింఛన్లు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇళ్ల స్థలాలు భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు రీ సర్వే ఆక్రమణలు తొలగింపు డ్రైన్ కాలువల్లో పూడిక తొలగింపు పారిశుద్ధ్యం ఆటో డ్రైవర్ల సేవలో వంటి అంశాలపై మొత్తం 382 అర్జీలు అందాయి.

ఈ సందర్భంగా డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కరం నిమిత్తం ప్రజల నుంచి అందుతున్న అర్జీలను సంబంధిత శాఖ అధికారులు స్వయంగా పరిశీలించి సకాలంలో పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల స్థితిని తెలుసుకోవాడానికి 1100 నెంబరుకి నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి హాజరు కాలేని అర్జిదారులు, తమ యొక్క అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని డీఆర్వో వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## శృంగరాయునిపాలెం కార్తీక వనసమారాధన పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్



**కిర్లంపూడి (మనసులోమాట) నవంబరు 17..** జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం శృంగరాయునిపాలెం గ్రామంలో గ్రామస్తులు ఉసిరి చెట్టు కింద ఏర్పాటుచేసిన కార్తీకమాస వన సమారాధన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ముందుగా ఉసిరి చెట్టు దగ్గర కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం జరిగిన వనభోజనాల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో పట్టు చంటిబాబు సర్పంచ్, గరగా గోవింద్ ఎంపీటీసీ, బజ్జపు నాగేశ్వరరావు మాజీ ఎంపీటీసీ, అరిణే రాజేష్ ఐటి కోఆర్డినేటర్, అలుమలు నాగు, మాదారపు దుర్గయ్య, కర్ణం వీర్రాజు, వేపాటి వీరబాబు, పుర్రె గంగబాబు,బొడ్డేటి బాబీ తదితరులు పాల్గొన్నారు.

## నేరెళ్లమ్మ ఆలయం వద్ద భారీ అన్నదానం



**తాళ్లరేవు (మనసులో మాట), నవంబరు 17:** పవిత్ర కార్తీకమాసం సందర్భంగా యానాం బైపాస్ రహదారిలోని గణపతి నగర్ వద్ద వేంచేసియున్న నేరెళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నక్కల చినపైడియ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు హాజరై అన్నసమారాధను ప్రారంభించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కాపు కల్యాణ మండలంలో వర్తకుల ఆట... పాట..

**ఉత్సాహంగా సామూహిక కార్తీక వనసమారాధన**



**తాళ్లరేవు (మనసులో మాట), నవంబరు 17:** సుంకరపాలెం బైపాస్ జంక్షన్ శ్రీ లక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం వ్యాపారులు సోమవారం ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపారు. వర్తక సంఘం అధ్యక్షుడు పుగాకు వాసు ఆధ్వర్యంలో పవిత్ర కార్తీకమాసం సందర్భంగా స్థానిక పెద్దిరెడ్డి వినాయకరావు కాపు కల్యాణ మండంలో వర్తక సోదరులు సామూహిక కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఉసిరిచెట్టు వద్ద కార్తీక దామోదరునికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం హౌసీ, మూజికల్ చైర్స్, కబడ్డీ తదితర ఆటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం సామూహిక వనభోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, తోట రాజు, అడబాల శివ, ఉండి మాణిక్యం, వనచర్ల రామకృష్ణ, నరహరిశెట్టి విఘ్నేశ్వరరావు, ఖండవిల్లి నాని, కాదా రాము. రామకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీకి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్

## నీరుకొండ సత్యనారాయణ రాజీనామా

**ఏలేశ్వరం (మనసులో మాట) నవంబర్ 17..** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ నీరుకొండ సత్యనారాయణ సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు.తన వ్యక్తిగత కారణాలు వల్ల పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. 30 సంవత్సరాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నానని నీరుకొండ సత్యనారాయణ అన్నారు. ఇప్పటి వరకూ నాకు అన్ని విధాలుగా సహకరించిన ఏలేశ్వరం మండల ప్రజానికానికి ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలకు, ధన్యవాదాలు తెలుతున్నానన్నారు. నా కార్యకర్తలు అభిమానులు అభీష్టం మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఈ సందర్భంగా మీడియాతో తెలిపారు.

## ప్రజా ఫిర్యాదుల వేదికలో 58 ఫిర్యాదుల స్వీకరణ



**కాకినాడ (మనసులో మాట), నవంబర్ 17:** కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో జిల్లా మాధవ్, మొత్తం 58 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భూ తగాదాలు - 13, కుటుంబ కలహాలు - 18 ఇతర విభాగాలకు చెందినవి - 27 అర్జీలు అందినట్లు అయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ జి. బిందు మాధవ్, సంబంధిత అధికారులను ఆదేశిస్తూప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 7 రోజుల లోగా విచారణ పూర్తిచేసి తగిన పరిష్కారం చూపాలని, చేపట్టిన చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలన్నారు.

## సృజనాత్మక శక్తిని వెలికి తీసే చిత్ర లేఖనం పోటీలు




**కపిలేశ్వరపురం (మనసులో మాట) నవంబర్ 17..** విద్యార్థుల్లో అంతర్లేనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తి ని చిత్రాలేఖంనం పోటీలు దోహద పడతాయనీ స్థానిక సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కపిలేశ్వరపురం శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పలు ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కపిలేశ్వరపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటలు, జూనియర్స్ సీనియర్స్ విభాగాలలో నిర్వహించడం జరిగింది. జూనియర్స్ విభాగానికి అమ్మ ప్రేమ, సీనియర్స్ విభాగానికి ప్లాస్టిక్ నిషేధం అంశాలు గా ఇవ్వడం జరిగింది. గ్రంథాలయ వారోత్సవముల సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు విజేతలకు ఈ నెల.20 తేదీ గురువారం నాడు బహుమతి ప్రధానం చేయడం జరుగునని గ్రంధాలయ అధికారి దానేటి శివకుమారి అన్నారు. గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, డ్రాయింగ్ ఉపాధ్యాయులు అబ్బులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు చిట్టురీ సత్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు, అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# భీమవరం బుల్లోడికి తెలంగాణలో సత్కారం..

### - విస్సాకోడేరు మెడికల్ రిప్రజెంటేటివ్ గరికిపాటికి ప్రతిభా పురస్కారం





**భీమవరం (మనసులో మాట), నవంబరు 17:** రంగం ఏదైనా దాని అంతు చూసే వరకూ కృషి చేస్తే ఫలితం, గుర్తింపు తప్పక లభిస్తుందని సాధనతో నిరూపించారు భీమవరం విస్సాకోడేరుకు చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్ గరికిపాటి నాగేంద్ర కుమార్. ఈయన కృషిని గుర్తించి తెలంగాణాలో ఘనంగా సత్కరించి, పురస్కారం అందజేశారు. ఉప్పల్ డిపో రోడ్ లోని ఎం కన్వెన్షన్ హాల్ లో బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సత్కార కార్యక్రమంలో పలువురు ప్రముఖులు హాజరయ్యారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 50 మంది బాలికలు నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్య అతిథిగా 'తత్వం' చారిటబుల్ ట్రస్టు అధినేత శ్రీనివాస బంగారయ్య శర్మ, అతిథులుగా ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ కే సుహాసినీ ఆనంద్, విశ్రాంత డీసీపీ సారంగపాణి, ప్రముఖ సంగీత దర్శకుడు స్వర వీణాఫణి, ఆర్థోపెడిక్ డాక్టర్ శూలపాణి పాల్గొన్నారు. నృత్య ప్రదర్శనతో అలరించిన బాలికలకు శ్రీనివాస బంగారయ్య జ్ఞాపికలతో సత్కరించారు. మధ్యాహ్నం రెండు గంటలకు కార్తీక వన సమారాధన తర్వాత తిరుపతిలో పనిచేస్తున్న బ్రాహ్మణ పోటు కార్మికులను సన్మానించారు. వీరు అందరూ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరిని పర్మినెంట్ చేయడానికి కృషి చేయమని సుహాసినికి మెమోరాండం ఇచ్చారు. ఆ తర్వాత ఏపీ, తెలంగాణ నుంచి వచ్చిన పదిమంది మెడికల్ రిప్రజెంటేటివ్స్ ను ప్రతిభా పురస్కారం తో సన్మానించారు. ఎండికల్ రిప్రజెంటేటివ్స్ శ్రమను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. భీమవరం విస్సాకోడేరు నుండి గరికిపాటి నాగేంద్ర కుమార్ ఈ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు.

# భక్తులతో కిటకిటలాడిన శ్రీ వీరేశ్వర స్వామి ఆలయం

### నాల్గవ సోమవారం అధికంగా భక్తుల రద్దీ - భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు





**ఐ .పోలవరం,( మనసులో మాట) నవంబర్ 17..** పరమ పవిత్రం కార్తీక మాసం ఆఖరి సోమవారం నిత్య కల్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మహిమానితుడైన మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారిన ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుండి అధిక సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుండి వృద్ధ గౌతమి నది లో స్నానాలు ఆచరించి పంచామృతాభిషేకం లో పాల్గొన్నారు. వేలాదిమంది భక్తులు శ్రీ స్వామి, అమ్మవారి ని దర్శించుకొంన్నట్లు అంచనా. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లు, మంచి నీరు, మెడికల్ క్యాంప్, ఉచిత ప్రసాద వితరణ చేశారు. క్షేత్ర పాలకులు లక్ష్మీ నరసింహస్వామి వారిని, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేస్వర స్వామి వారిని, శ్రీ వీరేశ్వర గోకులం దర్శించుకొన్నారు. 108 ప్రదక్షిణ లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అన్న ప్రసాద వితరణ దాత భక్తులు నరసింహం నందమూరి బాలకృష్ణ అభిమానులు అయిన నలమాటి అవినాష్ చౌదరి, జితేష్ చౌదరి అర్థక సహాయం తో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. మూడు వేల కు పైగా భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించి కార్తీక దామోదరుణ్ణి ఆరాధించారు. ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, టిడిపి నాయకులు దాట్ల నరసింహ బాబు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ, సూపర్ డిన్టెంట్ కటారి శ్రీనివాసరాజు ఏర్పాట్లును పర్యవేక్షించారు. ఎటు చూసినా భక్తులు శివ శివ శివ హర హర మహాదేవ శంభో శంకర అంటూ వం ం ం వ ం ళ్ళ శివాలయం వైపే భక్తులు శివనామ స్మరణతో దారులు తీశారు. శివతత్వంతో మురమళ్ళ దివ్య క్షేత్రం శోభిల్లింది. సాయంత్రం ఆకాశ దీపాలు తో దేదీప్యమనంగా విరాజిల్లింది.

# గొల్లపాలెం వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ వన సమారాధన

### సుమారు 6000 మందికి అన్నసమారాధన - సేవామూర్తుల పుణ్యకార్యం



**కాజులూరు, (మనసులో మాట) నవంబరు 17..** సామాజిక సేవ, సాంప్రదాయ పరిరక్షణ, సామూహిక శ్రేయస్సు అనేవి మన సంస్కృతిలో ఎప్పటినుంచో ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించాయనీ ఈ భావజాలానికి ప్రతీకగా గొల్లపాలెం వర్తక సంఘం ప్రతీ ఏడాది నిర్వహించే వన సమారాధన అద్భుతంగా నిలుస్తోంది. ఈ సంవత్సరం కూడా అదే జోష్‌తో, మరింత విశాలమైన స్థాయిలో సంఘం వన సమారాధనను నిర్వహించి సమాజానికి సేవా సందేశాన్ని మరింత బలంగా చాటింది.

ఈ మహోత్సవంలో సుమారు 6000 మందికి పైగా భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేయడం సంఘం సేవాస్ఫూర్తికి నిదర్శనం. సోమవారం గొల్లపాలెం బాల త్రిపుర సుందరి గోకర్ణేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోఉదయం నుంచే కార్యక్రమ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. సాంప్రదాయ వేదఘోషల మధ్య ప్రారంభమైన వన సమారాధనలో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ భక్తి భావంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.అన్నసమారాధనలో విభిన్న రకాల వంటకాలు, మంచి నిర్వహణ, పరిశుభ్రత, సమర్థవంతమైన సేవా బృందం అందరి ప్రశంసలు అందుకుంది. భక్తులు ఎవరూ ఇబ్బంది పడకుండా, వరుసలు సాఫీగా కొనసాగేందుకు వర్తక సంఘ సభ్యులు, యువ సేవాదారులు నిరంతరంగా శ్రమించారు. ప్రతి వ్యక్తికి గౌరవంగా, ప్రేమతో భోజనం అందించడం కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది.

ఈ సందర్భంగా వర్తక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ "మానవ సేవే మాధవ సేవ. ప్రజల ఆశీస్సులు, గ్రామ పెద్దల సహకారం, సేవాభావంతో ముందుకు వచ్చే యువత%ా% ఇవే మా కార్యక్రమాల బలం అని వన సమారాధనను ప్రతి సంవత్సరం మరింత విస్తృతంగా నిర్వహించేందుకు మా సంకల్పం" అని తెలిపారు.అదేవిధంగా గ్రామ పెద్దలు, ప్రముఖులు, భక్తులు సంఘం చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని హృదయపూర్వకంగా అభినందించారు. సమాజంలో ఏకతాభావానికి, పరస్పర సహకారానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.సేవ భావనకు ప్రతీకగా నిలిచిన ఈ వన సమారాధన గొల్లపాలెం గ్రామానికి మాత్రమే కాకుండా పరిసర ప్రాంతాలకు కూడా ఓ ఆదర్శంగా నిలిచింది. అంకితభావంతో, స్వచ్ఛంద సేవతో, శ్రద్ధతో ఇంత భారీ స్థాయిలో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వర్తక సంఘ సభ్యులకు గ్రామ ప్రజలు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.భారీ ఎత్తున భక్తులు విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చినప్పటికీ వర్తక సంఘాల సభ్యులు తిరస్కరించారు.

# భక్తులతో కిట కిటలాడిన ముమ్మిడివరం లోని ఆలయాలు





**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 17:** కార్తీక మాసంలో ఆఖరి సోమవారం కావడంతో తెల్లవారజాము నుంచి ఆలయాలు, నదీ తీరాలు కిటకిటలాడుతున్నాయి. కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా ముమ్మిడివరం నియోజకవర్గం లో కార్తీక పౌర్ణమి నాడే కాకుండా, ఈ ఆఖరి రోజు కూడా శివాలయాలు, విష్ణు దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

ఉదయం నుంచే భక్తులు నదీ స్నానాలు ఆచరించి, వ్రతాలు, పూజలు నిర్వహించారు. ముఖ్యంగా దీపారాధన కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుతున్నారు. పవిత్రమైన నదులు, చెరువులు, కోనేరుల్లో దీపాలను వదిలి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. సాయంకాలం ఆలయాల్లో నిర్వహించే ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నారు.ఈ మాసం శివుడికి, విష్ణువుకు ఇద్దరికీ ప్రీతిపాత్రమైనది కావడంతో నెల రోజుల పాటు శివ నామస్మరణ, విష్ణు సహస్రనామ పారాయణలు చేస్తూ భక్తులు నియమ నిష్ఠలతో గడిపారు. ఈ పవిత్ర మాసంలో నెలకొన్న అధ్యాత్మిక వాతావరణం నేటితో ముగియనుండడంతో మళ్లీ ఏడాది పాటు ఈ వైభవం కోసం భక్తులు వేచి చూడనున్నారు. ముమ్మిడివరం లో పార్వతి ఉమా మహేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు పోటెత్తారు భక్తులు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో.. ఈ ఆలయానికి అధిక సంఖ్యలో తరలి వచ్చారు భక్త జనం. తెల్లవారుజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి మండపం వద్ద కార్తీక దీపాలను వెలిగించారు.

**భక్తులతో కిక్కిరిసిన మురముళ్ల వీరేశ్వర స్వామి ఆలయం**

ఐ. పోలవరం మండలం మురముళ్ల వీరేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తారు భక్తులు. ఆలయం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. వేకువ జాము నుంచే క్యూ లైన్‌లో బారులు తీరారు. భక్తుల శివనామస్మరణతో ఆలయం మార్మోగిపోయింది. నది లో పుణ్య స్నానాలు ఆచరించి.. భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు ఆలయ అధికారులు.

భక్తులతో కిటకిట లాడిన కుండలేశ్వరం శ్రీ కుండలేశ్వర స్వామి ఆలయం..

కాట్రేనికోన మండలం కుండలేశ్వరం లో శ్రీ కుండలేశ్వర స్వామి వారి దేవస్థానానికి కార్తీక భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు.. స్నాన ఘాట్ వద్ద పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. క్యూ లైన్లు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద మహిళా భక్తులు పెద్ద ఎత్తున దీపారాధనలు చేశారు. ఆలయ ప్రాంగణం హర హర మహాదేవ శంభో శంకర అనే నినాదంతో మారుమోగాయి.

ఇలా ముమ్మిడివరం నియోజకవర్గం లో అన్ని దేవాలయాల్లో సోమవారం భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



## అన్నాక్యాంటీన్ వద్ద ఉచిత అన్నదానం

**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 17..** జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆశీస్సులతో దాతల సహకారంతో ప్రతి సోమవారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న ఉచిత అన్నా క్యాంటీన్ కు ఈ సోమవారం ఆర్థిక సహాయం అందించిన దాత కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన సమ్మిట వీర వెంకట సత్యనారాయణ(వీరబాబు). వారి ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఉచిత అన్నా క్యాంటీన్ కు ముఖ్యఅతిథిగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు హాజరై అన్న క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు.ఈ సందర్భంగా ఎస్వీఎస్ మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకే టిడిపి ఆవిర్భవించిందని 44 సంవత్సరాలుగా ప్రజలకు అన్ని విధాల అండగా ఉందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో నాలుగున్నర సంవత్సరాలుగా ఉచిత అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని జగ్గంపేటలో ప్రభుత్వ అన్న క్యాంటీన్ భవనం పూర్తయిందని తొందరలోనే అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, సోమవరం గ్రామ టిడిపి అధ్యక్షుడు మంచి కంటి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు, దాపర్తి సీతారామయ్య, యల్లమిల్లి సీఎం, దేగల సత్తిబాబు, నండ్ల చిరంజీవి, బద్దిసురేష్, సాంబత్తుల చంద్రశేఖర్, ఎండి రాజా, మారిశెట్టి గంగ, ఎస్ వి ప్రసాద్ పాల్గొన్నారు.ం

## ఎమ్మెల్యే గొల్లపల్లిని కలిసిన నూతన పిడబ్ల్యుడి ఈఈ సుధారాణి



**యానాం (మనసులో మాట), నవంబరు 17:** యానాం ప్రజా పనుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుధారాణి సోమవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ను మర్యాదపూర్వకంగా కలిసి దుస్సలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం యానంలో జరుగుతున్న పలు అంశాలపై ఎమ్మెల్యే అశోక్ తో చర్చించారు. పెండింగులో ఉన్న పనులు త్వరితగతిన పనులు చేపట్టాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో జ్యోతి రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

## మండల పరిషత్ బిల్డింగ్ కార్యాలయం పై పిచ్చి మొక్కలు

### పట్టించుకోని అధికారులు



**అయినవిల్లి (మనసులో మాట) నవంబరు 17:** అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుటి భాగం చూడడానికి అందరికీ బాగానే ఉన్నా వెనుక భాగంలో పిచ్చిమొక్కలు మొలసి బిల్డింగ్ శిథిలావస్థకు చేరే ప్రమాదం పొంచి ఉంది .అయితే స్థానిక ఎంపిడిఓ గాని ఎంపీపీ గాని పట్టించుకోకపోవడంపై ఎంపిటిసిలు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్డింగ్ లో అగ్రికల్చరల్, ఎంఈఓ ,ఉపాధి హామీ తో పాటు ఎంపీడీవో కార్యాలయాలు ఉన్నాయి. అంతేకాకుండా సమావేశాలు నిర్వహించుకోడానికి హాలు కూడా ఉంది. ఇంత ప్రాముఖ్యం గల భవనం అభివృద్ధి కోసం అధికారులు ఎందుకు పట్టించుకోవట్లేదు అని సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. త్వరలో జరిగే మండల సర్వసభ్య సమావేశంలో దీనిపై ప్రత్యేక చర్చ పెట్టి అధికారులను నిర్లక్ష్యం పై నిలదీయడానికి ఎంపీటీసీలు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకొని పిచ్చి మొక్కలు తొలగించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్థానిక ప్రజాప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.

సామర్లకోటలో వైఎస్ఆర్సిపి

## కోటి సంతకాల సేకరణ



**పెద్దాపురం, (మనసులో మాట)నవంబర్ 17..** ప్రభుత్వం మెడికల్ కళాశాలను ఓటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయటానికి నిరసిస్తూ సామర్లకోటలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు సోమవారం కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దాపురం ఇన్చార్జ్ దొరబాబు, సామర్లకోట టౌన్ అధ్యక్షులు బాగా సురేష్ కుమార్ ఆధ్వర్యంలో మఠం సెంటర్ వద్ద కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా దౌలూరి దొరబాబు మాట్లాడుతూ గత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం వైద్య విద్యను అందించేందుకు గతంలో ఎన్నలు లేని విధంగా రాష్ట్రంలో 12 కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం వాటిని చేయటం దారుణం అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోటీ సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేక శ్రీనివాసరావు, షేపెని సురేష్, చిట్టి మాని శ్రీనివాసరావు, ఇరుసుమల్ల సాయి సత్యనారాయణ, మన్యం చందర్రావు,పాలిక కుసుమ చంటిబాబు, మహిళా నేతలు షేపెని రూప, రెడ్డి లోవ కుమారి, వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా లక్షాభిల్వార్చన

**అనపర్తి ( మనసులో మాట) నవంబరు 17:** బిక్కవోలు మండలంలోని పందలపాక గ్రామంలో శ్రీ గౌరిశంకర ఆలయం వద్ద, అర్చకులు గరిమెళ్ల గాంధీ ఆధ్వర్యంలో 12 మంది రుత్వికులుతో గ్రామానికి చెందిన సుమారు 150 మంది దంపతులు లక్షాభిల్వార్చన నిర్వహించారు. కార్తీక మాసం నాలుగవ సోమవారం కావడంతో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, దీపాలంకరణ, హెూమాలు, తదితర పూజలు చేశారు. అనంతరం అన్నసమారధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని ఆలయ కమీటీ సభ్యులు బండారు గణేష్, బొడ్డు ఆనంద్,రెడ్డి గజ్జలు, వెన్నల శివ, బోడ్డుముత్యాలరావు, గేదల గణేష్, రుత్తల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలకు క్రమబద్ధీకరణకు అవకాశం



**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 17:** పట్టణంలో అక్రమంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు నూతనంగా జీవో నెంబర్ 225 జారీ చేసిందని భవన యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రణాళిక బద్ధంగా లేని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవన యజమానులు క్రమబద్ధీకరించుకునేందుకు ఇది మంచి అవకాశం అన్నారు. మరెన్నో వివరాల కోసం సంబంధిత సచివాలయాలలో సంప్రదించాలన్నారు. అక్రమంగా నిర్మించిన భవన యజమానులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ కోరారు. క్రమబద్ధీకరించుకొని పక్షంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

## కువైట్‌లో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న సత్యవతిని స్వదేశానికి చేర్చిన మైగ్రేషన్ అధికారులు



**అమలాపురం( మనసులో మాట) నవంబరు 17 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం చెయ్యేరు గ్రామ నివాసి ఆర్. సత్యవతిని సురక్షితంగా స్వదేశానికి చేర్చడంలో కోనసీమ జిల్లా పరిపాలన కీలక పాత్ర పోషించింది. జిల్లా కలెక్టర్ డా. మహేష్ కుమార్ ఏర్పాటు చేసిన కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ తక్షణ చర్యలు తీసుకుని బాధితురాలికి సహాయం అందించింది. మైగ్రేషన్ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం 2025 జూలైలో ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లిన సత్యవతి అక్కడ తీవ్ర ఆరోగ్య సమస్యలు, పని చేసే ఇంటి వద్ద మానసిక ఒత్తిడులు ఎదుర్కొని అనారోగ్యానికి గురయ్యారన్నారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను సంప్రదించగా, కలెక్టర్ డా. మహేష్ కుమార్ వ్యక్తిగతంగా ఈ అంశాన్ని పర్యవేక్షించి, కువైట్‌లోని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అత్యవసర సహాయం అందేలా చర్యలు తీసుకున్నారని వారు తెలిపారు. జిల్లా పరిపాలన సమన్వయంతో సత్యవతిని సురక్షితంగా స్వగృహానికి చేర్చడంలో అధికారులు విజయంసాధించారన్నారు. ఈ సందర్భంగా సత్యవతి కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్, కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విదేశాలకు ఉపాధి కోసం వెళ్లదలచినవారు తప్పనిసరిగా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను సంప్రదించి సురక్షిత మార్గాల్లోనే వెళ్లాలని, నకిలీ ఏజెంట్ల ద్వారా ప్రయాణాలు చేయవద్దని నోడల్ అధికారి కె. మాధవి సూచించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త గోళ్ళ రమేష్, కె. సత్తిబాబు, సఫియా, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 111 ఫిర్యాదులు



**పల్నాడు, నవంబర్ 17,(మనసులో మాట):** కుటుంబ, ఆర్థిక,ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 111 ఫిర్యాదులు అందాయని పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు.దాచేపల్లి పట్టణమునకు చెందిన ఒక స్త్రీ టైలరింగ్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నట్లు, తన పెద్ద కుమార్తె ఆరోగ్యం బాగోలేక హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం అదే ఊరికి చెందిన ఇరువురి మహిళలు వద్ద 25,000/- రూపాయలు, 2,50,000/- రూపాయలు రెండు రూపాయల వడ్డీకి తీసుకున్నట్లు, డబ్బులు తీసుకున్న తర్వాత వారిరువురూ రెండు రూపాయలు వడ్డీ కాదని ఒకరు పది రూపాయిలు వడ్డీ అని, మరొకరు 15 రూపాయలు వడ్డీ అని చెప్పగా ఫిర్యాది గత్యంతరం లేక ఒప్పుకున్నట్లు, వారిరువురికి వారు చెప్పిన వడ్డీ ప్రకారం వడ్డీ చెల్లిస్తున్నట్లు, ఫిర్యాది ఆర్థిక పరిస్థితి బాగోలేక ఒక నెల వడ్డీ కట్టలేక పోతే ఇంటి మీదకు వచ్చి తిట్టి డబ్బులు కట్టండి అని దాడి చేసినట్లు,దాడి తరువాత పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకోగా ఫిర్యాదిని, ఇద్దరు మహిళలను మందలించి పంపినట్లు, టైలరింగ్ కు సంబంధించిన లైనింగ్ లు,ఫాల్స్ తీసుకోవడానికి బజారుకు వెళుతున్నప్పుడల్లా వారిరువురు నోటికి వచ్చినట్లు తిడుతున్నందుకు గాను తనకు న్యాయం చేయవలసిందిగా ఫిర్యాది ఎస్పీని కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. రొంపిచర్ల గ్రామం నందు గల శ్రీ వెంకటేశ్వర డైరీ హద్దు లలో ప్రస్తుతం సంగం డైరీ వారు పనిచేస్తున్నట్లు, డైరీని పూర్తిగా ఓపెన్ చేసిన తర్వాత పైపుల ద్వారా వేస్ట్ వాటర్ ను వాగులోకి వదలడానికి పైపులు వేసినట్లు, వేస్ట్ వాటర్ వాగులోకి విడుదల చేసినట్లయితే ప్రజలకు వారి పశువులకు హాని జరుగుతుందని, పశువులు ఆ నీరు త్రాగే ప్రమాదం ఉండటంతో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు రావచ్చునని, అదనంగా భవిష్యత్తులో ఈ పైపుల ద్వారా రసాయనాలు కూడా వదిలే అవకాశం ఉండటం తో వాగులోకి వేస్ట్ వాటర్ విడుదల చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని రొంపిచర్ల గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. పిడుగురాళ్ల పట్టణానికి చెందినటువంటి ఫిర్యాది హెూటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు, ఇటీవల ఫిర్యాది తన యొక్క హెూటల్ ను అభివృద్ధి చేసుకునే క్రమంలో హెూటల్ నిర్మాణం,హెూటల్ యొక్క డిజైనింగ్ ఇంటర్నల్ వర్క్ కొరకు ఫిర్యాదుకు తెలిసిన తన స్నేహితుడి ద్వారా హైదరాబాద్ నగరం నందు ఇంటీరియల్ వర్క్స్ చేసే వారిని సంప్రదించగా తను, అతని కంపెనీ ఇంజనీర్ ఇద్దరు కలిసి ఫిర్యాది హెూటల్ ను చూసి కావలసినవి అన్నీ నోట్ చేసుకొని ఫిర్యాదు యొక్క హెూటల్ పని పూర్తి చేయుటకు 31,50,000/- రూపాయలు ఫిర్యాదుతో కాంట్రాక్టు కుదుర్చుకొని ఈ పూర్తి వ్యవహారం అంతయు అగ్రిమెంట్ ప్రకారం రెండు నెలలు గడువు లోపు పని అంతా పూర్తి చేస్తామని ఒప్పందం కుదుర్చుకొని అడ్వాన్సు గా 22,50,000/- రూపాయలు వారికి ఇచ్చినట్లు, ఫిర్యాది కాంట్రాక్టు కుదుర్చుకున్న ఒక వారం చిన్న చిన్న పనులు మొదలుపెట్టి వారు హైదరాబాద్ వెళ్ళినట్లు, పని ఆలస్యం అవుతుందని ఫిర్యాది ఎన్నోసార్లు వారిరువురికి ఫోన్ చేయగా ఫిర్యాదు ఫోన్ తీయడం లేదని, అగ్రిమెంట్ టైం పూర్తయిందని ఫిర్యాదు వారికి తెలియపరిచిననూ ఎటువంటి సమాధానాలు ఇవ్వకుండా ఫిర్యాది వద్ద డబ్బులు తీసుకొని ఉద్దేశపూర్వకంగా మోసం చేసినందుకు గాను చట్టపరమైన న్యాయం కొరకుఎస్పీని కలిసి అర్జీ ఇవ్వడం జరిగింది.సత్తెనపల్లి మండలం అబ్బురు గ్రామానికి చెందిన ఫిర్యాది వద్ద నుండి చిత్తూరు నందు నివాసం ఉంటున్న వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని మూడు దఫాలుగా 6,60,000/- రూపాయలు తీసుకుని ఉద్యోగం ఇప్పించకుండా కాలయాపన చేస్తే ఫిర్యాదుని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు, ఫిర్యాది ఉద్యోగం ఎందుకు ఇప్పించరని అడిగితే మీ డబ్బులు నీకు ఇస్తాను అని నమ్మబలికించి యాక్సిస్ బ్యాంకుకు సంబంధించిన రెండు చెక్కులు ఇచ్చి విత్ డ్రా చేసుకోమని చెప్పినట్లు సదరు ఆ చెక్కులను బ్యాంకు నందు సంప్రదించగా ఆ ఖాతాలో డబ్బులు లేనట్లు తెలిపినట్లు, కావున ఉద్దేశపూర్వకంగా ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసినందుకు అతని పై గాను చట్టపరంగా చర్యలు తీసుకుని న్యాయం చేయవలసిందిగా ఫిర్యాది ఎస్పీని కలిసి అర్జీ ఇవ్వడం జరిగింది. చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన ఫిర్యాది డ్వాక్రా గ్రూప్ యానిమేటర్ గా పనిచేస్తున్నట్లు, ఆమెకు చిలకలూరిపేట లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నందు అకౌంట్ ఉన్నట్లు,
ఫిర్యాది ఖాతా నుండి 99,500/- రూపాయలు వేరే ఖాతా కు బదిలీ అయినట్లు బ్యాంక్ వారు తెలిపినట్లు, కావున తన ప్రమేయం లేకుండా వేరే ఖాతాకు బదిలీ అయిన విషయం గురించి విచారణ చేసి న్యాయం చేయవలసిందిగా ఎస్పీని కలిసి అర్జీ ఇవ్వడం జరిగింది.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడ్మిన్ అదనపు ఎస్పీ జేవి.సంతోష్ హాజరు అయినారు..అదేవిధంగా పిజిఆర్ఎస్ కు వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహాయ సహకారాలు అందించారు.

### గొల్లప్రోలు నగరపంచాయితీ కమిషనర్‌గా

# పి. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ



**గొల్లప్రోలు (మనసులో మాట) నవంబరు 17:** గొల్లప్రోలు పట్టణ నగరపంచాయితీ కమిషనర్‌గా పి. శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నరసరావుపేట నగరపాలక మేనేజర్‌గా విధులు నిర్వహించి, పదోన్నతి పొందిన ఆయన తాజాగా గొల్లప్రోలుకు బదిలీ అయ్యారు. నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నగరపంచాయితీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందిస్తూ ఆయనను అభినందించారు. పదోన్నతి అనంతరం కీలక బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రజలకు పారదర్శకంగా, వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టంచేశారు. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, మురుగు నీటి నిర్వహణ, రహదారి మరమ్మతులు మరియు ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. కొత్త కమిషనర్ బాధ్యతలు స్వీకరించడంతో పట్టణ ప్రజల్లో సానుకూల భావన నెలకొంది. పట్టణ అభివృద్ధి ముమ్మరంగా జరిగి సేవల నాణ్యత మెరుగుపడుతుందన్న విశ్వాసాన్ని పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

# బీమా చట్ట సవరణలకు నిరసన

### -ఈ నెల 29న పాలకొల్లులో మహాసభ గోడ పత్రికను ఆవిష్కరించిన ఎల్ఐసీ ఉద్యోగులు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** ఈ నెల 29న పాలకొల్లులో నిర్వహించబోయే రాజమండ్రి డివిజన్ ఎల్ఐసీ ఉద్యోగుల 28 వ మహాసభ గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక వీఎల్ పురం ఎల్ఐసీ కార్యాలయంలో గోడ పత్రికను ఆవిష్కరించిన అనంతరం రాజమండ్రి యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం కోదండ రామ్ మాట్లాడుతూ ఈ మహాసభకు ఎల్ఐసీ క్లాస్ 3, 4 ఉద్యోగులు 350 మంది భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. పాలకొల్లులో నిర్వహించే మహాసభలో ఇన్సూరెన్స్ రంగానికి సంబందించిన ముఖ్యమైన అంశాలు చర్చకు వస్తాయని చెప్పారు. ఈ మహాసభ ను జోనల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ (హైదరాబాద్) ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశం లో జోనల్ అధ్యక్షుడు పీ సతీష్, సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. ఎల్ఐసీలో చాలా కాలంగా ఖాళీ గా ఉన్న క్లాస్ 3, 4 ఉద్యోగాలు భర్తీ, నూతన పెన్షన్ పథకం రద్దు చేసి, ఎల్ఐసీలో ఉద్యోగులు అందరికీ 1995 పెన్షన్ పథకం అమలు, ఆల్ ఇండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కు గుర్తింపు మొదలగు అంశాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.
అదే విధంగా బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు శాతం 100 కి పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామని, బీమా చట్ట సవరణలు వ్యతిరేకిస్తున్నామన్నారు. బీమా రంగంలో ప్రభుత్వ వాటా తగ్గింపు వ్యతిరేకిస్తున్నామని, ఉద్యోగాల ఔట్ సోర్సింగ్ ను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తున్నామని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరుతూ ఈ సమావేశం లో తీర్మానాలు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఇన్స్యూరెన్స్ కార్పోరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ అద్యక్షులు మాథ్యూస్, ప్రధాన కార్యదర్శి ఎం కోదండరామ్, మహిళా కన్వీనర్ శిరీష, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి సమ్మతం గనెయ్యా, ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, అధ్యక్షుడు బీ శ్రీనివాసరావు, రూరల్ బ్రాంచ్ నాయకులు పట్నాయక్, ఇమ్రాన్, డివిజన్ నాయకులు సత్యదేవ, జీ శ్రీనివాసరావు, వీ ఈశ్వర రావు, పీఎస్ఎన్ రాజు, రమేష్ బాబు, డీ శ్రీనివాస్, వీ ప్రసాద్, మహిళా ఉద్యోగులు విజయదుర్గా, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై సూచనలు ఇవ్వండి

### గోదావరి డెల్టా ఛైర్మన్ సునీల్ కుమార్



**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 17..** తూర్పుగోదావరి డెల్టా ఛైర్మెన్ మురాలశెట్టి సునీల్ కుమార్ ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం కోసం రైతులను, నీటి సంఘం అధ్యక్షులను, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులను సలహాలు ఇవ్వాలని కోరారు.
నవంబర్ 21వ తేదీన కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం జరుగుతుందని ఇందులో చర్చించేందుకు సమస్యలు ఏమైనా ఉంటే తెలపాలన్నారు. ఆయన ఒక ప్రకటనలో సమస్యలు సలహాలను తెలపాలని కోరారు. రైతులు తమ సమస్యలను సలహాలను తెలియజేయడానికి ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి 5 గంటల వరకు తన కార్యాలయంలో అందుబాటులో ఉంటానని చెప్పారు. రైతులు భాగస్వామ్యంతో మెరుగైన నిర్ణయాలు తీసుకోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రైతుకు సంబంధించిన కీలక సమస్యలు చర్చికి వస్తాయన్నారు. ముఖ్యంగా నీటి వనరులు సరైన వినియోగం, పంపిణీ,కాలవ నిర్వహణ, వంటి అంశాలు పై చర్చలు జరుగుతాయని నియోజకవర్గంలో రైతులంతా తమ సమస్యలను తెలియపరచాలని పిలుపునిచ్చారు.



### నాళం రోశయ్య ఆధ్వర్యంలో

# కార్తీక వన సమారాధన

### 2000 మంది హాజరయ్యి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరణ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17 :** వైశ్య ప్రముఖులు నాళం రోశయ్య, ద్వారకాతిరుమల మాజీ డైరెక్టర్ నాళం సుజాత దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం పాలచర్ల బీవీసీ కళాశాల ప్రాంగణంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. వన సమారాధనకు సుమారు రెండు వేలమంది హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి నాళం ఇంటి పేరు గలవారు ఆత్మీయంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతూ గత 14 ఏళ్ళగా ఆత్మీయ వన సమారాధన నిర్వహిస్తున్నామని, సహకరిస్తున్న పాలచర్ల రామాలయ కమిటీ, వైశ్య ప్రముఖులకు ధన్యవాదాలు తెలియజేశారు. రోశయ్య దంపతులను వైశ్య ప్రముఖులు సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ తవ్వా రాజా, అతిథులుగా అడపా అనిల్, కోడి కోట తదితరులు పాల్గొన్నారు. ఆహ్లాదకరమైన వాతవరణంలో జరిగిన ఈ వన మారాధనలో 2000 మంది హాజరయ్యారు.

# పల్నాడులోని రైల్వే సమస్యలను పరిష్కరించండి

### సౌత్ సెంట్రల్ రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కోరిన టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు కృష్ణ దేవరాయలు



**పల్నాడు, నవంబర్ 17 (మనసులో మాట):** పల్నాడు జిల్లా పరిధిలోని పలు రైల్వే సమస్యలను పరిష్కారించాలని సౌత్ సెంట్రల్ రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ను టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు కోరారు.సోమవారం సికింద్రాబాద్ లో జిఎం ను కలసి ఎంపీ లావు వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రధానంగా పెదకూరపాడులోని ఎల్ సి నెం.27, సత్తెనపల్లిలోని ఎల్ సి నెం.40, పిడుగురాళ్ల మండలం, తుమ్మలచెరువు వద్ద ఎల్ సి నెం. 81 వద్ద మంజూరైన రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబి) నిర్మాణానికి టెండర్లు త్వరగా పిలిచి, ప్రాజెక్ట్ లను పట్టాలెక్కించాలని కోరారు. బెల్లంకొండలోని ఎల్ సి నెం.53 వద్ద ఆర్ఓబి ని మంజూరు చేయాలని కోరారు.గిరిజవోలు మరియు మేరికపూడి గ్రామాల మధ్య ఉన్న ఎల్ సి నెం.గేట్ 294 ను ప్రస్తుత స్థానం నుండి 150 మీటర్లు ప్రక్కకు తరలించాలని అభ్యర్థించారు. మాచర్ల రైల్వే స్టేషన్ వెనుక భాగంలో ఫుట్‌పాత్ నిర్మాణం చేయాలని, కాలువ నిర్మాణం, ఆర్అండ్ బి రోడ్ నుండి మాచర్ల రైల్వే స్టేషన్ వరకు దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు నిర్వహించాలని కోరారు.గురజాల, రెంటచింతల రైల్వే స్టేషన్లలో ప్రాథమిక సౌకర్యాలు, మాచెర్ల-విజయవాడ మెము రైల్ (నెం.67228)కు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ వద్ద రైలు నెం.12795/12796 (ఉద్యోగస్తులు వెళ్ళే రైలు) రైలు నం.17221/17222 ఎల్ టి టి ఎక్స్‌ప్రెస్, భవనగర్ ఎక్స్‌ప్రెస్ (రైల్ నెం.12755/12756) లకు స్టాపేజ్ ఇవ్వాలని,పెదకూరపాడు రైల్వే స్టేషన్ లో పల్నాడు ఎక్స్ ప్రెస్ (ట్రైన్ నెం. 12747/12748) కు, డెల్టా ఎక్స్‌ప్రెస్ (రైలు నెం.17645/17646)కు స్టాపేజ్ ఇవ్వాలని,పల్నాడు ప్రాంతంలో ఆలస్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే రైల్వే ప్రయాణీకులకు భద్రత సౌకర్యాలు పటిష్టం చేయాలని కోరారు.పెరేచర్ల రైల్వే స్టేషన్‌లో రైలు.నెం 17254 ఔరంగాబాద్ - గుంటూరు రైల్ ను ఆపాలని అభ్యర్థించారు.గుంటూరు - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (నెం.12705/76) పేరును అనవేమ ఎక్స్‌ప్రెస్ రైలుగా మార్చడం విషయంపై అభ్యర్థించారు.పల్నాడు జిల్లా ప్రజలను ప్రభావితం చేస్తున్న కీలకమైన ఈ రైల్వే సంబంధిత సమస్యలపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారానికి సహకరించాలన్న ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు కోరిక మేరకు రైల్వే జిఎం సానుకూలంగా స్పందించారు.

# భక్తజనంతో కిక్కిరిసిన శైవక్షేత్రాలు

### వేకువజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు - దర్శనాలు

**కాజులూరు (మనసులో మాట) నవంబరు 17..** శివభక్తి వెల్లివిరిసే మాసాల్లో, శైవక్షేత్రాలు భక్తుల రాకతో పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. నాలుగవ సోమవారం కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో ప్రముఖ దైవ క్షేత్రాలు అయిన కోలంక పెనుమల్ల తో పాటు కాజులూరు గొల్లపాలెం జగన్నాధగిరి శీల మంజేరు ఉప్పుమిల్లి పల్లి పాలెం గ్రామాల్లో భక్తజనం పోటెత్తారు.. పంచాక్షరి నాదంతో మారుమ్రోగే దేవాలయ ప్రాంగణాలు, నందీ నాదమేనన్నట్లుగా గంభీరంగా వినిపించే ఘంటానాదాలు, ధూపదీప సుగంధాలుఇవి అన్నీ కలసి క్షేత్రాల ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరిపూర్ణం చేస్తాయి.
వేకువ వెలుగులు తొంగి చూసే లోపే శైవక్షేత్రాలు భక్తజనంతో కిక్కిరిసిపోయి, దేవాలయ ద్వారాల దగ్గర నుంచే నాగబంధంలా తిరిగే పెద్ద పెద్ద క్యూలు కల్పించాయి.. సాదాసీదా భక్తుడి నుండి గ్రామ పెద్దల వరకు, కుటుంబాలుగా, ముదుసలి దంపతులుగా, యౌవనంతో నిండిన యువతగాప్రతీ ఒక్కరూ శివదర్శనం కోసం శ్రద్ధతో నిలబడడం ఆధ్యాత్మికతకు నిదర్శనంగా మారింది.అర్ధరాత్రి నుంచి సాగిన ఆలయ సన్నాహాలు వేకువజామున ప్రత్యేక మహాన్యాస పూర్వక అభిషేకాలతో ప్రారంభమయ్యాయి.పురోహితులు శ్రుతిసమానంగా మ్రోగే మంత్రఘోషలతో శివలింగానికి పాలు, పెరుగు, తేనె, గంగాజలం, బిల్వదళాలు సమర్పిస్తూ అభిషేకాలను నిర్వహిస్తుంటే, భక్తులు “ఓం నమఃశివాయ” నినాదాలతో ఆ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక శక్తితో నిండిపోయాయి. అభిషేకాల అనంతరం ప్రారంభమయ్యే దర్పణార్చన, అష్టోత్తర పూజలు, అలంకార దర్శనం భక్తుల హృదయాలను ఆకట్టుకునేలా ఉండటంతో భక్తులు మంత్రముగ్ధులయ్యారు. నందీ మూలమూర్తి నుండి గర్భగుడి వరకు పూలతో, దీపాలతో అలంకరించిన క్షేత్రం భక్తుల మనసుల్లో భక్తిరసాన్ని మరింత పెంచుతున్నాయి. వేకువజాము నుంచే ప్రారంభమైన దర్శనాలు మధ్యాహ్నానికీ, సాయంత్రానికీ అంతరాయం లేకుండా కొనసాగు తూనే ఉన్నాయి. భక్తుల సౌకర్యం కోసం ఆలయ నిర్వాహకులు నీళ్లు, ప్రసాదం, క్యూలైన్ మార్గదర్శకాలు సమకూరుస్తూ సేవాభావంతో పనిచేయడం ప్రశంసనీయమైన అంశం.

### పేకాట శిబిరం పై దాడి

# నలుగురు అరెస్టు

**ఆత్రేయపురం (మనసులో మాట )నవంబర్ 17..** ఆత్రేయపురం మండలం వసంతవాడ గ్రామంలో పేకాట ఆడుతున్న శిబిరంపై సోమవారం ఆత్రేయపురం పోలీసులు దాడి చేసి,నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ 22 వందలు నగదును స్వాధీనంచేసుకొని . కేసు నమోదు చేసినట్లు ఆత్రేయపురం ఎస్సై రాము తెలిపారు.

# వీళ్ళు అపరిచితులా! అసలు ఉన్నారా! లేరా!

## స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో అయోమయం - కార్డు దారులను గుర్తించేందుకు కష్టపడుతున్న డీలర్లు, అధికారులు



**ముమ్మిడివరం(మనసులో మాట) నవంబరు 17:** జిల్లాలో స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు అందించే విషయంలో రేషన్‌షాపు డీలర్లు చేతులెత్తేస్తున్నారు. గతంలో ఉన్న అడ్రస్‌ల ప్రకారం పౌరసరఫరాలశాఖ అధికా రులు ఆ కార్డులను లబ్ధిదారులకు ఇచ్చే బాధ్యతను డీలర్లకు అప్పగించారు. నెలక్రితం వారు పంపిణీ ప్రారంభించారు. కార్డుదారులు అందుబాటులో లేకపోవడంతో ఒక్కో డీలర్ వద్ద భారీగా పెండింగ్‌లో ఉన్నాయి.డా. బీ. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 5,36,573 రైస్‌కార్డులు రాగా ఇప్పటివరకు 4,93,819 పంపిణీ చేశారు. ఇంకా 38,111 డీలర్ల వద్దనే ఉన్నాయి. గతంలో ఇచ్చిన తెల్లరేషన్ కార్డులో ఉన్న అడ్రసు ప్రకారం ఈ రైస్ కార్డులు ఆయా రేషన్ షాపుల డీలర్లకు అప్పగించగా ఇప్పుడు ఆ కార్డుదారులు ఎక్కడ ఉన్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. అలాంటి వారిని గుర్తించడం కష్టతరంగా మారింది.

**నెలాఖరులోపు పంపిణీ ఎలా?**

గ్రామీణ ప్రాంతాల్లో అతి తక్కువగా రైస్‌కార్డులు మిగలగా ఆ కార్డు దారులు ఎక్కడ ఉన్నారన్న దానిపై కొంత సమాచారాన్ని డీలర్లు సేకరించారు. పట్టణప్రాంతాల్లో మాత్రం పాత అడ్రస్సుల్లో కార్డుదారులు లేరు. పాత కార్డుల ద్వారా కూడా బియ్యం తీసుకునే సౌలభ్యం ఉండటంతో కొంతమంది ఈ నెలలో రేషన్ సరుకులు తీసుకున్నట్లు గుర్తిం చారు. ఇప్పుడు ఆ కార్డుదారులు ఏప్రాంతంలో తీసుకున్నారు? జిల్లా లోనా, లేక ఇతర ప్రాంతాల్లో తీసుకున్నారా? అనేవిషయాన్ని గుర్తించే పనిలో పౌరసరఫరాల శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభు త్వం ఈ నెలాఖరులోపు పూర్తిస్థాయిలో కార్డుదారులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేయాలని ఆదేశించడంతో ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న వారికి ఏవిధంగా పంపిణీ చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

**వీళ్ళు అపరిచితులా :**

అక్టోబర్ నెలలో ఈ జిల్లాలో 4,85,288 మంది కే వై సి చేయించుకుని రేషన్ తీసుకున్నారు. అక్టోబర్ లో రేషన్ తీసుకొని వారు 51,285 మంది ఉన్నారు. వీళ్ళలో కొంతమంది కే వై సీ చేయించుకోలేదు, రేషన్ తీసుకోలేదు. ప్రభుత్వ పథకాలకు ఆరోగ్య శ్రీ, ఫీజు రీయంబర్స్ మెంట్, ఇతర ప్రయోజనాలు కొరకు తెలుపు రేషన్ కార్డు అవసరమని అనర్హులు కూడా వీటిని పొందారు. ఇందులో ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవారు, ఉద్యోగులు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, మృతులు కూడా ఉన్నారు.ఏది ఏమైనా నవంబర్ 30 లోపు ఈ కే వై సీ చేయించుకోలేని వాళ్ళని అనర్హులు గా గుర్తించి రేషన్ కార్డు తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు

# గిరిజనులకు దక్కిన మహోన్నత గౌరవం

## - వీసీ ప్రసన్నశ్రీ కి ఘన స్వాగతం.. ప్రశంసలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** "నాకు దక్కే ప్రతి గౌరవం గిరిజనులకే చెందుతుందని, ప్రతిష్టాత్మకమైన అవార్డును గిరిజనులకు అంకితం చేస్తున్నానని" ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ తెలిపారు. రామోజీ ఎక్సెలెన్స్ అవార్డులో భాగంగా కళా, సంస్కృతి విభాగంలో అవార్డు స్వీకరించిన ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ కి విశ్వ విద్యాలయ అధికారులు రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో విశ్వ విద్యాలయానికి విచ్చేసిన ఆమెకు చాళుక్య ద్వారం వద్ద అధ్యాపకులు పుష్ప గుచ్ఛాలను అందజేసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే విశ్వ విద్యాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, అధికారులు, ఆధ్యాపకులు, ఆధ్యాత్మికత సిబ్బంది శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రశంసించారు. అనంతరం ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన అభినందన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ రామోజీ ఎక్సలెన్స్ అవార్డును భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ వీ రమణ, భారత ప్రభుత్వ పౌర విమానయాన మంత్రి కే రామ మోహన్ నాయుడు, గనుల మంత్రి జీ కిషన్ రెడ్డి సమక్షంలో అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గిరిజనుల అక్షరాస్యత కోసం చేస్తున్న కృషిని గుర్తించి అవార్డు ప్రదానం చేయడం హర్షణీయం అన్నారు. ఈ అవార్డు అందుకోవడంతో ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయానికి చక్కని గుర్తింపు వచ్చిందన్నారు. ఇటువంటి అవార్డులను స్ఫూర్తిగా తీసుకుని మరింత ఎక్కువగా విశ్వ విద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. అధ్యాపకులు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన మార్గ నిర్దేశం చేసి వారి ఉన్నతి కోసం కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయ అధికారులు, అధ్యాపకులు, ఆధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధులకు న్యాయ చట్టాలపై అవగాహన



**ఏలూరు, నవంబరు 17(మనసులో మాట)..** జాతీయ న్యాయసేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి యస్.శ్రీదేవి, సోమవారం ఏలూరు మండలం వెంకటాపురం ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి యస్.శ్రీదేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వయోవృద్ధులు హక్కులు, చట్టాలు పైన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈరోజు ప్రేమాలయంలోని వయోవృద్ధులకు ఈ అవగాహన సదస్సును నిర్వహించామని తెలిపారు. వృద్ధులు పట్ల జాలి, దయ చూపటం కాదని, ప్రేమా ఆప్యాయతలను పంచి సమాజంలో గౌరవంగా జీవించేలా చూడాలని అన్నారు. మనం కూడా కొన్నేళ్ళు తర్వాత వృద్ధులము అవుతామని గుర్తుపెట్టుకోవా లన్నారు. వయోవృద్ధులు వారి పిల్లలు నుండి సంరక్షణ మరియు పోషణ లోపం అయిన వారి నుంచి భరణి ఇప్పించడం, పిల్లలకి ఇచ్చిన ఆస్తులు గిఫ్ట్ డీడ్ ను రద్దు పరచడం తిరిగి తల్లిదండ్రులకు చెందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అవసరమైతే ఆ బాధ్యతలను న్యాయ సేవాధికార సంస్థలు తీసుకుంటాయని, అటువంటి సమస్యలు ఉన్నవారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. అవసరమైన వారికి ఉచిత న్యాయవాదిని నియమించి వారి యొక్క కేసులను ముందుకు తీసుకువెళ్ళి, వారిని అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతు ందని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు, ప్రేమాలయం గౌరవాధ్యక్షులు టి.వి.ఆర్.గురూజీ, ప్రెసిడెంటు టి.సుబ్బారావు, సెక్రటరీ రాంబాబు, వైస్ ప్రెసిడెంటు యం.యన్.వి. మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. తదనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు స్థానిక ప్రత్తెబాద నందు ఉన్న పట్టణ నిరాశ్రయుల వృద్ధుల ఆశ్రమం నందు వయో వృద్ధుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించి, చట్టాలపై అవగాహన కలిగించారు. సంక్షేమ పథకాలు పొందటంలో కాని మరి ఏ ఇతర సమస్య ఎదురైనను జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సంప్రదించ వచ్చుని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ పి.వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజరు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# పిడిఎస్‌యు రాష్ట్ర 24వ మహాసభలను జయప్రదం చేయండి

## పి.డి.ఎస్.యు రాష్ట సహాయ కార్యదర్శి బి. సిద్ధూ



**రామచంద్రపురం(మనసులో మాట) నవంబరు 17..** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) రాష్ట్ర 24వ మహాసభలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నవంబర్ 28, 29 తేదీల్లో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని పి.డి.ఎస్.యు జిల్లా నేతలు పిలుపునిచ్చారు. రామచంద్రపురం సోమవారం పట్టణంలోని వికాస్ జూనియర్ కళాశాల ఆవరణలో పి.డి.ఎస్.యు రాష్ట్ర మహాసభ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ మాట్లాడుతూ పి.డి.ఎస్.యు గత 51 సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల కోసం, సమాన సమాజ స్థాపన కోసం నిరంతర పోరాటం చేస్తోంది. విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక స్పృహ పెంపొందించడం, సామాజిక వివక్షలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం చేసిందన్నారు. జాతీయంగా మరియు అంతర్జాతీయంగా జరుగుతున్న రాజకీయ సామాజిక పరిణామాల్లో సామ్రాజ్యవాద విషసంస్కృతికి వ్యతిరేకంగా పి.డి.ఎస్.యు నిరంతరం రాజీలేని పోరాటాలు జరిపిందని బి. సిద్ధూ గుర్తుచేసారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తల్లికి వందనం సమస్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ లోపాలు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, హాస్టల్ మెస్ మరియు కాస్మోటిక్ చార్జీల పెంపు వంటి అంశాలపై పి.డి.ఎస్.యు తీవ్రంగా పోరాడుతోంద న్నారు. ఈ నేపథ్యంలో పి.డి.ఎస్.యు రాష్ట్ర 24వ మహాసభలను రాజమండ్రి లో జరుపుతున్నామని, రాష్ట్ర నలుమూలల నుండి విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక రాష్ట్ర కార్యదర్శి వి. భీమ శంకరం, ఐ.ఎఫ్.టీ.యూ నాయకులు చింతా రాజారెడ్డి, పీ.వై.ఎల్ నాయకులు వి. నాగ రాజు, పి.డి.ఎస్.యు నాయకులు ఆర్.మురళీకృష్ణ, ఆర్.చైతన్య ,పి గణేష్, ఎం. మణికంఠ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సప్పా ఎక్స్ లెన్స్ పురస్కార ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** రాజమహేంద్రవరానికి నాట్య రంగంలో అంతర్జాతీయ ఖ్యాతినందించిన విఖ్యాత నాట్య పండితుడు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ప్రతి సంవత్సరం ఇచ్చే పురస్కార విజేతలను ప్రకటిస్తూ ఆహ్వాన పత్రాన్ని స్థానిక నటరాజ కళా పీఠంలో సంస్థ గౌరవాధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ ఏడాది సేవా రంగం నుంచి వంశీ రామరాజు (యుఎస్ఎ), పడాల సుబ్బారెడ్డి, సాహిత్య రంగం నుంచి ప్రముఖ కవి శిఖామణి, సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్ మల్లికార్జున్, సంగీత రంగం నుంచి మాస్ట్రో గజల్ శ్రీనివాస్, పత్రికా రంగం నుంచి పొత్తూరి సుబ్బారావు (హైదరాబాద్), కుదుపూడి పార్థసారధి, వైద్యరంగం నుంచి సాయి ఆసుపత్రి అధినేత డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఎం రామకోటేశ్వరరావు, ఆధ్యాత్మిక రంగం నుంచి శ్రీ శివకామేశ్వరి పీఠాధిపతి ఈమణి దక్షిణామూర్తి, రాపాక శ్రీనివాస్, నాట్యరంగం నుంచి డాక్టర్ హేమసుందర్ (ఏలూరు), డాక్టర్ వేణుగోపాల్ (మిర్యాలగూడ), సామాజిక సేవా రంగం నుంచి నిమ్మలపూడి గోవింద్, నందూరి సుబ్బారావు ను ఎంపిక చేసినట్లు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 23 న తాడితోట సెంటర్ లోని సంహిత కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాలు అందచేస్తారని తెలిపారు. పురస్కార ప్రదానోత్సవంలో అతిథులుగా రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, శాసనసభ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తదితర ప్రముఖులు పాల్గొంటారని జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు.



# ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

**ఆత్రేయపురం (మనసులో మాట) నవంబర్ 17..** ఆత్రేయపురం గ్రంథాలయం లో 58వ, జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నాలుగవ రోజు, ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం లో సీనియర్స్ జూనియర్స్ విభాగంలో వక్తృత్వ పోటీలు నిర్వహించరు. సీనియర్స్ విభాగంలో ప్రకృతి విపత్తులు జాగ్రత్తలు అనే అంశంపై జూనియర్స్ విభాగంలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై పోటీలు. న్యాయం నిర్ణయతలగా ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు ఎం సురేష్, గ్రంథాలయ అధికారి టి. నమశ్శివాయ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పెదపూడి ప్రాచీన శివాలయంలో

# ఘనంగా శివరాత్రి మహోత్సవాలు



**పెదపూడి, (మనసులో మాట) నవంబర్ 17..** కాకినాడ జిల్లా పెదపూడిలో దశాబ్దాల చారిత్రిక ప్రాపంచిత కలిగిన ప్రాచీన శివాలయంలో ఆఖరి కార్తీక సోమవారం విశేష పూజలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామికి అర్చకులు కోమాళ్ళపల్లి వెంకట్రావు శర్మ, రాజా శర్మ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వపత్ర పూజలు, సహస్ర కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్దాపురం మహారాజు రాజా శ్రీవత్సవాయి బుచ్చి సీతమ్మ జగపతి బహదూర్ పేరు మీదుగా తొలి అభిషేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు వెంకటరావు శర్మ తెలిపారు. ఈవో వడ్డాది సత్యనారాయణ, భక్త మండల కమిటీ చైర్మన్ చింతపల్లి కామేశ్వరరావు, శివాలయం యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఆకాశ కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

# స్వామి అమ్మవార్లకు ఉంజల్ సేవ





**అనపర్తి(మనసులో మాట) అనవంబరు 17 :** స్థానిక శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు కార్తీక చివరి సోమవారం పురస్కరించుకొని దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. శివనామ స్మరణతో స్వామివారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించుకున్నారు. సాయంత్రం గ్రామానికి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి ( దత్తుడు శీను) శ్రీమతి పార్వతి దంపతులచే ఉయ్యాల సేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను (ప్రతిమలను) అందంగా అలంకరించి ఉయ్యాల్లో కూర్చోబెడతారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఉయ్యాల సేవా కార్యక్రమాన్ని భక్తుల సమక్షంలో వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. పూజ అనంతరం యావన్మంది భక్తులు భక్తిశ్రద్ధలతో ఉయ్యాల ఊపుతారు. భక్తులు ఈ ఉంజల్ సేవ వీక్షించడం వల్ల సంతోషం, శ్రేయస్సు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి కూటమి నాయకులు తదితరులు పాల్గొని తీర్థ ప్రసాదాల స్వీకరించారు.



# రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్న చంద్రబాబు

## -18 వ డివిజన్ రచ్చ బండ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ హెూమ్ మంత్రి తానేటి వనిత

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** రాజమహేంద్రవరం రూరల్ నియోజవర్గం స్థానిక ఆల్కాట్ గార్డెన్స్ లో సోమవారం 18 వ డివిజన్ వైసీపీ ఇంచార్జ్ అంగాడ సత్యప్రియ ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ హెూం మంత్రి తానేటి వనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ఈ రోజున రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు పోలీసు వ్యవస్థను తమ చేతుల్లో పెట్టుకుని రాష్టాన్ని అస్తవ్యస్తంగా మార్చి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పైన, నాయకుల పైన ఏదో ఒక విధంగా తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అధికారం ఏ ఒక్కరికి శాశ్వతం కాదని, ఇంకో మూడున్నర సంవత్సరాల తర్వాత తిరిగి జగనన్న ముఖ్యమంత్రి అవుతారని ఆరోజు అధికారం తమ చేతుల్లో ఉంటుందని, మేము మీలానే కక్ష సాధింపు చేయాలి అని అనుకుంటే పరిస్థితులు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మా ప్రభుత్వ హయాంలో ప్రజల రక్షణ పట్ల అంకిత భావంతో పరిపాలన చేశామని చెప్పారు. ఈ రోజు అది కూటమి ప్రభుత్వం చేయలేక పోతోంది అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ రాష్ట్రం అన్ని విధాలా దివాలా తీసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రానికి కొత్తగా జరిగిన మేలు ఏమీ లేదని, గతంలో జగన్మోహన్ రెడ్డి తెచ్చిన పెట్టుబడులను ఈ రోజు లోకేష్ తెచ్చినట్టుగా చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. తన కుమారుడికి ఖ్యాతి కోసం గత ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులను కూడా తమ కుమారుడు తెచ్చినట్టుగా చెప్పుకుంటున్నారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నేత కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఏ ప్రభుత్వం చేయనట్టుగా జగన్మోహన్ రెడ్డి సంవత్సరానికి 24 వేల రూపాయలు చొప్పున ప్రతి నేత కార్మికుడి కుటుంబానికి అందేలా ఒక పథకాన్ని ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. కరోనా కష్ట కాలంలో కూడా ఒక్క సంవత్సరంలో రెండు సార్లు ఈ పథకాన్ని నేతన్నలకు అందజేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు.

# ఘనంగా ముగిసిన మహా రుద్రయాగ మహోత్సవాలు ...

- కన్నుల పండుగగా మహా కుంభాభిషేకం ..
- భక్తి శ్రద్ధలతో మహా పూర్ణాహుతి
- శివనామస్మరణలతో మారుమ్రోగిన ఉప్పంగల



**తాళ్ళరేవు (మనసులో మాట), నవంబరు 17:** మండల పరిధిలోని ఉప్పంగల గ్రామంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో 11 రోజులపాటు జరిగిన మహా రుద్రయాగ మహోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా కొత్తలంక వాస్తవ్యులు తిరుమల తిరుపతి దేవస్థాన ప్రతివర్ష పండితులు బ్రహ్మశ్రీ బాదంపూడి ప్రసాద్ శర్మ బ్రహ్మత్వంలో శైవాగమ శాస్త్ర ప్రకారం విశేష పూజలను నిర్వహించారు. చివరి రోజు జరిగిన పూజలలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సతీమణి ఉదయలక్ష్మి తదితరులు ఈ పూజలలో పాల్గొన్నారు. వేద పండితులు మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, స్వామి వారి శాంతి కళ్యాణం తదితర పూజలను శాస్త్ర యుక్తంగా నిర్వహించారు. సాయంత్రం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. శివనామస్మరణలతో స్వామివారి ఆలయం, ఉప్పంగల గ్రామం మారు మ్రోగింది. పరిసర ప్రాంతాలకు చెందిన అనేకమంది ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాఖ శంకరుడు, విశ్రాంత ఉపాధ్యాయులు పూళ్ల రామలింగేశ్వర శర్మ (బి.ఆర్.ఎల్ స్వామి), కొండూరి సత్యంబాబు మాస్టారు, కొండూరి విసుబాబు, నాయకులు దవులూరి శ్రీరామ్మూర్తి, నల్లా శ్రీను, పైడికొండల లోవరాజు, శాఖ రామకృష్ణ, పైడికొండల రమేష్, ఆలయ కమిటీ ప్రతినిధులు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో ప్రభుత్వ హైస్కూల్ ఏర్పాటు చేయాలి

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు - ఎంఈఓ కి వినతి



**ఎటపాక( మనసులో మాట), నవంబర్ 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఎటపాక మండల ఎంఈఓ లక్ష్మీనారాయణ, రాజులు కు ఎటపాక మండల గ్రామ పెద్దలు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర విజన తర్వాత ఏపీలో కలిసిన ఎటపాకను మండల కేంద్రంగా ఏర్పాటు చేసిన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో సిఎస్ఐ వారు ఎటపాక గ్రామంలో నిర్వహించిన పాఠశాలను మధ్యంతరంగా బాధ్యతలు నుండి తప్పుకోవడం వలన సీఎస్ఐ పాఠశాలను ప్రభుత్వానికి అప్పగించక పోవడం వలన మండల కేంద్రంలో సరైన పాఠశాల లేక ఈ ప్రాంత విద్యార్థులు చదువులకు దూరంగా ఉంటున్నారని, ఎటపాక మండలానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఆనుకుని ఉన్న భద్రాచలం మండలమైన తెలంగాణ కు వెళ్లి చదువుకోవాలంటే తెలంగాణ ప్రాంతానికి చెందినది కనుక స్థానికత సమస్య వల్ల ఇక్కడి విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని ప్రకటనలో తెలిపారు. అలాగే రాష్ట్ర విభజన జరిగి 10 సంవత్సరాలు దాటిన నేటికీ ఈ ప్రాంత విద్య పట్ల ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తు పట్ల ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదని ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ప్రభుత్వాం, ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును చదువులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఎటపాక మండల కేంద్రంలో హైస్కూల్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత పిల్లలకు విద్యను అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. స్పందించిన మండల ఎడ్యుకేషనల్ అధికారులు, తక్షణమే ఈ ప్రాంతంలో హై స్కూల్ ఏర్పాటు చేసే దానికోసం ప్రభుత్వంతో మాట్లాడి తక్షణం ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో, గ్రామ పెద్దలు, పాటి చలపతిరావు, దేగల మాధవరావు, గజ్జల శ్రీను, మోతుర్కారి రాంప్రసాద్, గుమ్మడి నరసింహారావు, బత్తుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## వచ్చే నెలలో మంగళగిరిలో ప్రధానోపాధ్యాయ సంఘం ప్లాటినం వేడుకలు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ నెలలో రాష్ట్ర స్థాయిలో ప్రధాన వేడుకను మంగళగిరిలో నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీ రమణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మంగిన రామారావు తెలియజేశారు. ఆదివారం విజయవాడలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రవి అధ్యక్షతన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ని ఆహ్వానించాలని నిర్ణయించినట్లు వారు తెలియజేశారు. అదే విధంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను చర్చించడం జరిగిందని వారు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్లస్టర్ విధానంలో, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుని హోదాను గ్రేడ్ వన్ ప్రధానోపాధ్యాయునిగా మార్చాలని, అదే విధంగా 73 జీవోను వెంటనే అమలుపరచాలని, మండల విద్యా శాఖ అధికారులుగా నియమించబడిన స్కూల్ అసిస్టెంట్లను వెనక్కి తీసుకోవాలని, అర్హులైన ప్రధానోపాధ్యాయులను ఆ పోస్టుల్లో నియమించాలని కోరారు. అదే విధంగా ఖాళీగా ఉన్న ఉప విద్యాశాఖ అధికారులు డైట్ లెక్చరర్ పోస్టుల్లో అర్హులైన ప్రధానోపాధ్యాయులను నియమించాలని రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందని, అదేవిధంగా పదవ తరగతి నామినేల్ రూల్స్ తయారీలోని ఇబ్బందులను వెంటనే సరిచేయాలన్నారు. మనబడి మన భవిష్యత్తు కార్యక్రమంలో పూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఉన్న ప్లస్ టు పాఠశాలలో అధ్యాపకులు నియమకాన్ని వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందని వారు తెలియజేశారు.

## పచ్చదనం పరిశుభ్రత పై శిక్షణ తరగతులు



**కాజులూరు (మనసులో మాట) నవంబరు 17 ..** గ్రామాభివృద్ధిలో కీలకమైన పచ్చదనం పరిశుభ్రతపై సర్పంచులకు ఉప సర్పంచ్లకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో జె రాంబాబు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఒక ప్రకటనలో ఎంపీడీవో రాంబాబు తెలుపుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మండల పరిషత్తు కార్యాలయ సమావేశ భవనంలో పచ్చదనం పరిశుభ్రత పై గ్రామ సర్పంచులకు ఉప సర్పంచ్లకు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఏర్పాటు చేశామని ఈ శిక్షణ తరగతులకు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు హాజరుకావాలని ఆయన కోరారు.

## పేదవారి ఆకలి తీర్చడం అనేది కోటి దీపాలు పెట్టిన దానితో సమానం




**పల్నాడు, నవంబర్ 17, (మనసులో మాట):** పేదవారి ఆకలి తీర్చడం అనేది కోటి దీపాలు పెట్టిన దానితో సమానమని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పెదకూరపాడులోని అంకమ్మ తల్లి దేవాలయంలో జరిగిన వన భోజనాల్లో ఆహారం మిగిలిన విషయాన్ని ఆలయ కమిటీ ప్రతినిధి కర్ణం శ్రీను జన చైతన్య సమితి బృందానికి మిగిలిన ఆహారము సేకరించి జన చైతన్య సమితి ప్రతినిధులు పెదకూరపాడు మండలంలోని 75 తాళ్లూరు శాంతి కాలనీకి తీసుకువెళ్లి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని పేదవారి ఆకలి తీర్చడంలో ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్ని బాబు ప్రతినిధులు చిమిలి అశోక్, బెజ్జం నాగేశ్వరరావు, షేక్ అన్వర్ తదితరులు ఉన్నారు.

# 'మీ డబ్బు - మీ హక్కు'

## డిపాజిటర్ల విద్యా - జాగృతి నిధి పై గోడ ప్రతి ఆవిష్కరణ

### క్లెయిం చేయని నిధులు, క్లెయిం కాని మొత్తాలు కోసం దరఖాస్తు చేసే అవకాశం - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** దేశ వ్యాప్తంగా బ్యాంకుల్లో ఎన్నో సంవత్సరాలుగా నిర్వృత్తమైన ఖాతాల్లో పేరుకుపోయిన డిపాజిట్లను తిరిగి లబ్ధిదారులకు చేర్చేందుకు ఆర్‌బీఐ చేపట్టిన ఉద్గమ్ పోర్టల్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం గోడ ప్రతులను ఆవిష్కరించారు. గత 10 ఏళ్లుగా లావాదేవీలు జరగని ఖాతాలను క్లెయిం చేయని నిధులు, క్లెయిం కాని మొత్తాలు గా పరిగణించి, వాటికి సంబంధించిన వివరాలు ప్రజలకు, సంస్థలకి చేరవేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు కీర్తి చేకూరి తెలిపారు. దేశ వ్యాప్తంగా పబ్లిక్ బ్యాంకుల్లో రూ.58,400 కోట్లు, ప్రైవేట్ బ్యాంకుల్లో రూ.8,600 కోట్లు విలువైన మొత్తం అన్ క్లైమ్డ్ ఫండ్స్ రూపంలో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. తూర్పు గోదావరి జిల్లాలోనే సుమారు రూ.97 కోట్లు క్లెయిం చేయని నిధులు, క్లెయిం కాని మొత్తాలుగా ఉన్నాయన్నారు. ఇందులో సుమారు 5.10 లక్షల వ్యక్తిగత ఖాతాలకు చెందిన రూ.75 కోట్లు , సుమారు 20 వేల పరిశ్రమల ఖాతాలకు చెందిన రూ.18 కోట్లు, సుమారు 5 వేల ప్రభుత్వ ఖాతాలకు రూ.4 కోట్లు సొమ్ము ఎటువంటి లావాదేవీలు లేకుండా ఉన్నట్లు తెలిపారు. పోర్టల్ ఉద్గమ్ పోర్డల్ ద్వారా www.unclaimed.org తెలుసుకోవచ్చని అని తెలిపారు.

**ఖాతాలు చురుకుగా లేకపోవడానికి కారణాలు..**

ఖాతాదారుల మృతి, నామినీ వివరాలు నమోదు చేయకపోవడం, చిరునామా మార్పులు, కేవైసీ లోపాలు, చాలా తక్కువ మొత్తం ఉండటం వంటి కారణాలతో వేలాది ఖాతాలు ఉపయోగంలో లేకుండా పోయాయని కలెక్టర్ తెలిపారు.

**అర్హులు అన్ క్లెయిమ్ చేసుకోవచ్చు..**

ఖాతాదారులు, నామినీలు, కుటుంబ సభ్యులు సరైన ధృవపత్రాలు సమర్పిస్తే బ్యాంకులు ఈ మొత్తాన్ని తిరిగి అందజేస్తాయని లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్ తెలిపారు. ఖాతాదారు ఉంటే, కేవైసీ పూర్తి చేసి ఖాతాను పునరుద్ధరించుకోవాలి. నామినీ ఉంటే, గుర్తింపు పత్రాలు, మరణ ధృవపత్రంతో క్లెయిమ్ చేయవచ్చు. వివాదాలు లేకపోతే కుటుంబ సభ్యులు సరైన పత్రాలతో పొందవచ్చునని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘూస్వరూప్, ఎల్‌డీఎం డీవీ ప్రసాద్, డీఆర్వో టీ సీతారామ మూర్తి, సీపీఓ ఎల్ అప్పలకొండ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంఆర్ఆర్ ప్రేమ్ కుమార్, భాగ్యలక్ష్మి, డీఎస్పీ భవ్య కిషోర్, డీఎల్డీఓ పీ వీణాదేవి, ఎస్ఎస్ఏ పీడీ ఎస్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

### హైవే అథారిటీ అధికారులు 15 రోజుల్లో స్పందించకపోతే

# టోల్ చార్జీల వసూలు నిలిపివేస్తాం



**దెందులూరు (మనసులో మాట) నవంబర్ 17..** దెందులూరు మండలంలోని సీతంపేట గ్రామం వద్ద జాతీయ రహదారి నిర్మాణం గతంలో ప్రజల రవాణా సౌకర్యాలకు విరుద్ధంగా ప్రమాదకరంగా రూపొందించడం వల్ల ఇప్పటివరకు దాదాపు 100కు పైగా ప్రమాదాలకు ఘటనలు జరిగాయని వాటిపై ఎఫ్ఐఆర్లు కూడా నమోదు అయ్యాయని, ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 25 మంది అమాయక ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారని, అయితే ఈ సమస్యను పరిష్కరించేలా తగిన చర్యలు చేపట్టాలని ఇప్పటికే ఎన్నోసార్లు నేషనల్ హైవే అథారిటీస్ అధికారులకు సూచించడం జరిగిందని, ఎన్నో మార్లు మంత్రులు ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశాల్లో సైతం నేషనల్ హైవే అధికారులకు సూచించిన కూడా తగిన చర్యలు చేపట్టకుండా ప్రజల ప్రాణాల పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత నేషనల్ హైవే అధికారులపై చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలు కాపాడేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గారికి కోరుతూ సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మరో 15 రోజుల్లో హైవే అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, అవసరమైతే రోడ్ల మరమ్మతులు పూర్తయ్యే వరకు కూడా టోల్ చార్జీలు వసూలు చేయకుండా ఉండేలా కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు చేపడతామని తెలిపారు. జాతీయ రహదారి అనేకచోట్ల కనెక్టివిటీ ప్రాంతాల్లో దెబ్బతిని ప్రమాదకరంగా మారిందని, వాటిపై తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని, అదేవిధంగా గుండుగలను వద్ద కేవలం నామమాత్రంగా ఫోటో బ్రిడ్జి నిర్మించి నేషనల్ హైవే అధికారులు ప్రజా సమస్యలను నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని, ప్రజలకు స్థానిక గ్రామస్తులకు అసౌకర్యం కల్పించేలాగా వారి సమస్యలను పరిష్కరించకుండా ఈ విధంగా నామమాత్రంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించి తప్పించుకుంటామంటే ఉపేక్షించమని ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తో సైతం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మరియు ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ ద్వారా సంప్రదించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు చేపడతామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్ , పర్వతనేనీ రామకృష్ణ, పరస వెంకట్రావు, జనసేన నాయకులు గరికపాటి చంటి సహా పలువురు కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

# దగ్గుబాటి పురందేశ్వరిని ఎంపీగా గెలిపించడం దౌర్భాగ్యం

### రాజమండ్రికి ఒక్క పరిశ్రమ తేలేకపోతున్నారు.. - డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర్ రెడ్డి ఆగ్రహం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** విశాఖపట్నం కేంద్రంగా ఈ నెల 14, 15 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగడం చాలా సంతోషమని తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ 13 లక్షల కోట్ల విలువైన 613 వివిధ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలతో పరిశ్రమల స్థాపనకు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. అయితే రాజమహేంద్రవరం ఎంపీగా దగ్గుబాటి పురందరేశ్వరిని గెలిపించుకోవడం ఇక్కడి ప్రజల దౌర్భాగ్యంగా కనిపిస్తోందని విమర్శించారు. ఆమె స్వయానా సీఎం చంద్రబాబుకు, ఐటీ మంత్రి నారా లోకేష్ కు బంధువే అయినప్పటికీ ఎటువంటి ఫలితాలు సాధించలేక పోతున్నారని విమర్శించారు. 'ది రాజమండ్రి ప్రెస్ క్లబ్' లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీకే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నప్పటికీ రాజమండ్రికి ఒక్క రూపాయి కూడా తేలేకపోయారని ఎద్దేవా చేశారు. నిరంతరం గోదావరి నీరు, మంచి ఎయిర్ పోర్ట్, రైల్వే స్టేషన్, అతి సమీపంలో కాకినాడ వద్ద ఓడలరేవు, మంచి మెట్ట ప్రాంతం ఇలా పరిశ్రమల స్థాపనకు అన్ని అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ పరిశ్రమల స్థాపనకు, యువతకు ఉపాధి కల్పించడానికి ఒక్క ముందడుగు కూడా పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడో 70 సంవత్సరాల క్రితం స్థాపించిన ఏపీ పేపర్ మిల్లు తప్ప ఇక్కడ ఒక పెద్ద పరిశ్రమ కూడా కంటికి కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. దాని వల్ల తీవ్రమైన కాలుష్యం ఎదురవుతున్నప్పటికీ ప్రజలు భరించి అలాగే కొనసాగిస్తున్నారని తెలిపారు. అల్యూమినియం ఇండస్ట్రీ అన్నీ మూతపడి చాలా కాలం అయిందన్నారు. ఇంత భారీ స్థాయిలో విశాఖలో సీఐ సదస్సు జరిగినప్పటికీ రాజమండ్రి నగరానికి సంబంధించిన ఒక్క పరిశ్రమ స్థాపనకు కూడా ఎంఓయూ జరగకపోవడం దారుణం అన్నారు. ఇక్కడ కూటమి నాయకులు ఎంత సేపు ఇసుక ర్యాంపులు, గ్రావెల్, మట్టి తరలింపు, డబ్బులు సంపాదన, సెటిల్మెంట్ లతోనే కాలం గడుపుతున్నారని ఆరోపించారు. తాజాగా ఏవి అప్పారావు రోడ్డులో ఒక జర్నలిస్టుకు సంబంధించిన రిజిస్టర్డ్ వీలునామా కలిగిన 234 గజాల రెండు కోట్ల 34 లక్షలు విలువైన స్థలాన్ని వైసీపీ, టీడీపీ, బీజేపీ మహిళా నాయకురాలితో కలిసి దోచుకున్నారని ఆరోపించారు. వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బత్తిన చంద్ర రావు, డాక్టర్ రాజశేఖర్, బర్రె సుబ్రహ్మణ్యం, కిషోర్ కుమార్ జైన్, దేయ్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు గోదావరిలో ధాన్యం సేకరణ వేగవంతం

### 48 గంటల్లోనే రైతులకు చెల్లింపులు - సంయుక్త కలెక్టర్ వై మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్ 2025-26 ధాన్యం సేకరణను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు సంయుక్త కలెక్టర్ వై మేఘా స్వరూప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్‌లో జిల్లా వరి సేకరణ అంచనా 4 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించబడిందని చెప్పారు. ధాన్యం విక్రయ ప్రక్రియలో భాగంగా 10,897 కూపన్లు జారీ చేయగా, జిల్లాలోని 18 మండలాల్లో 162 కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయని వివరించారు. ఇప్పటి వరకు 7,028 మంది రైతుల నుండి 64,769 మెట్రిక్ టన్నులు సేకరించామని తెలిపారు. రైతులకు చెల్లింపులు వేగంగా చేరేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపు రైతుల ఖాతాల్లో మద్దతు ధర నేరుగా జమయ్యేలా పర్యవేక్షణను మరింత బలపరిచామని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లా లో 3,240 మంది రైతులకు రూ.55.82 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ధాన్యం తేమ శాతం 17 శాతం లోపే ఉంచాలని సూచిస్తూ, అవసరమైన గోనె సంచులను 212 ఆర్ఎస్కేలలో నిల్వ చేసినట్లు తెలిపారు. కనీస మద్దతు ధర ప్రకారం కామన్ వరైటీకి రూ.2,389 మరియు గ్రేడ్ ఏకు రూ.2,369 చెల్లిస్తున్నట్లు చెప్పారు. రవాణా, హమాలీ ఛార్జీలు కూడా పూర్తిగా ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇది ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుందని చెప్పారు. రైతులు 8309487151 నంబర్‌కు కాల్ చేసి తమ సందేహాలు, ఫిర్యాదులను తెలియజేయవచ్చని సూచించారు.

# గ్రామ సర్పంచ్ గుండెపోటుతో మృతి



**గండేపల్లి (మనసులో మాట )నవంబర్ 17..** గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి (62) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు సోమవారం అస్వస్థతకు గురికావడంతో రాజమహేంద్రవరం ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె చికిత్స పొందుతూ గుండెపోటుతో మరణించారు. ఆమె మరణం పట్ల గ్రామంలో విషాదఛాయలు అనుముకున్నాయి. పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు.



### ఎస్ఈజెడ్ భూములు రైతులకు

# బదిలీ ప్రక్రియ వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ షణ్మోహన్.

**కాకినాడ (మనసులో మాట), నవంబరు 17:** కాకినాడ ఎస్ఈజెడ్ భూములు రైతుల పేరును బదిలీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ సెజ్ భూములు రైతులు పేరున బదిలీ చేసే ప్రక్రియపై సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. రెవెన్యూ, కెఎస్ఈజెడ్, రిజిస్ట్రేషన్ శాఖలఅధికారులతోసమన్వయసమావేశంనిర్వహించారు. ఈసందర్భంగా సెజ్ భూముల వివరాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో యు. కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఎస్ఈజెడ్ లిమిటెడ్ ద్వారా 1189 ఎకరాల భూమిని 1,545 మంది రైతులకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ పత్రాలపై స్టాంపు డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు రెవెన్యూ, కెఎస్ఈజెడ్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయతో పనిచేసి సెజ్ భూములను రైతుల పేరును బదిలీ చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లి బాబు, కె.శ్రీరమణి, జిల్లా రిజిస్టర్ జయలక్ష్మి, పాడా పీడీ చైత్ర వర్షిణి, ఎస్ఈజెడ్ ఇన్చార్జి ఎస్డీసీ పి. వేణుగోపాలరావు, కాకినాడ సెజ్ జీఎం ఎం.శ్రీనివాసు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో సీఐఐ సదస్సుతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు

- వందలాది కంపెనీలతో కుదిరిన ఒప్పందం
- 13 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న కంపెనీలు
- అమలాపురం ఎంపి హరీష్ బాలయోగి



**అమలాపురం (మనసులో మాట) నవంబరు 17:** విశాఖలో ఏర్పాటు చేసిన సీఐఐ సదస్సు మంచి ఫలితాలను ఇవ్వడంతో ఆయా సంస్థల పెట్టుబడులతో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పరుగులు పెడుతోందని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు. విశాఖలో ఏర్పాటు చేసిన భారత పరిశ్రమల సమాఖ్య సదస్సు సత్ఫలితాలను ఇవ్వడంతో ఎంపీ హరీష్ సోమవారం పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 613 ఒప్పందాల ద్వారా 13.25716 కోట్ల రూపాయలకు పెట్టుబడులు వచ్చాయన్నారు. వీటి ద్వారా 16,13,188 ఉద్యోగాలు రానున్నాయని ఆనందం వ్యక్తంచేశారు. ఇదంతా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషి తో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇస్తున్న మద్దతుతో సాధ్యమవుతుందన్నారు. గత ప్రభుత్వ విధ్వంసాల వల్ల రాష్ట్రానికి కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాలేదని, నేడు ఎన్డీఏ ప్రభుత్వంలో అంచనాలను మించి పెట్టుబడులు వస్తున్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ ను పెట్టుబడుల హబ్ గా మార్చేందుకు సీఎం చంద్రబాబు తీవ్ర కృషి చేస్తున్నారన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో మంత్రి లోకేష్ పెట్టుబడులను ఆకర్షించి రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకొంటున్నారన్నారు. పెట్టుబడుల వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాలకు కంపెనీలను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. ఈ కంపెనీ పెట్టుబడులే కాకుండా ప్రతీ నియోజకవర్గంలో ఎంఎస్ఎం ఈ పార్కులను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి ఒక వ్యాపారవేత్తను తీసుకొచ్చే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

# ఇంటి పన్నుల వసూళ్లను సకాలంలో పూర్తి చేయాలి

### డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణిరావు



**కాజులూరు (మనసులో మాట) నవంబరు 17:** గ్రామపంచాయతీలపై ప్రత్యేక దృష్టి గ్రామాభివృద్ధి, స్థానిక సంస్థల ఆర్థిక బలోపేతం మరియు ప్రజా సేవల పురోగతిలో ఇంటి పన్నులు (హౌస్ ట్యాక్స్) కీలక పాత్ర పోషిస్తాయని డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణిరావు పేర్కొన్నారు. సోమవారం శీల దుగ్గుదుర్రు కోలంక గ్రామపంచాయతీలలో సచివాలయ సిబ్బందితోనిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ దీపాల నిర్వహణ, శానిటేషన్, నీటి సరఫరా, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, పంచాయతీ సిబ్బంది జీతభత్యాలు ఇలా ప్రతి అంశం పన్నుల వసూళ్లపై ఆధారపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామపంచాయతీ సెక్రటరీలు, రికార్డు సహాయకులు, ఇంటి పన్నుల వసూళ్లను నిర్దేశిత గడువులోపు తప్పనిసరిగా పూర్తి చేయాలి అని చక్రపాణిరావు ఆదేశించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ఆయన వసూళ్ల శాతం పెరిగితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ప్రజలకు సేవలు మెరుగ్గా అందాలంటే పన్నుల వసూళ్లలో జాప్యం ఉండకూడదనీ ప్రతి ఇంటికీ వెళ్లి పన్నుల ప్రాముఖ్యతను వివరించి, ప్రజలలో అవగాహన కల్పించండని సూచించారు. ఇటీవల పన్నుల వసూళ్లలో కొన్ని గ్రామాల్లో లక్ష్యాలకు తగ్గట్టు పురోగతి కనిపించకపోవడంతో, ఆయా గ్రామ పంచాయతీల సిబ్బందిపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా పన్ను చెల్లించని గృహాల జాబితాలు పూర్తి చేయడం, ఇంటింటికీ నోటీసులు అందించడం, పన్నులు చెల్లించేందుకు ప్రజలకు సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలను అధికారులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు పన్ను వసూళ్ల గడువులను, ఇప్పటి వరకు సాధించిన శాతాన్ని, ప్రజల స్పందన వివరాలను చర్చించారు. గ్రామస్తులు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలంటే ఇంటి పన్నులు చెల్లించడం వారి బాధ్యత అని చక్రపాణిరావు పేర్కొన్నారూ. ఇంటి పన్నుల వసూళ్లు శాతం పెరిగి, గ్రామాలు మరింత అభివృద్ధి చెందేలా అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు హేమాదేవి , అనంతలక్ష్మి , చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది శ్రీనివాస్ , కార్తీక్ , లోవరాజు, సాయి ప్రసన్న , విజయ భవాని తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఎంసి చైర్మన్ దిండి రాజు బహుమతులు పంపిణీ


**గోకవరం (మనసులో మాట), నవంబర్ 17..** గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలోని రాజు తోట లో ఉన్న మోడల్ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ దిండి రాజు చేతుల మీదుగా సోమవారం బహుమతి ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎంసి చైర్మన్ దిండి రాజు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, చదువుతో పాటు ఆటపాటల్లో కూడా ముందుండాలని, మంచి క్రమశిక్షణ కలిగి ఉండాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు . వ్యాసరచన , వక్తృత్వం, క్విజ్, కబడ్డీ, కోకో , రన్నింగ్ వంటి వివిధ అంశాల్లో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతి పొందిన విద్యార్థులకి ఎస్ఎంసి చైర్మన్ దిండి రాజు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 31 అర్జీలు..




**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 17:** పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ కార్యాలయంలో సోమవారం యధావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది.పాడ ప్రాజెక్టు డైరెక్టర్ చైత్ర వర్షిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 31 అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు.అందిన అర్జీలలో రెవెన్యూ కు సంబంధించి 15 మున్సిపాలిటీకి సంబంధించి 6 ఇతర విభాగాలకు సంబంధించి 6 ఉన్నాయని, ఆన్లైన్ ద్వారా 4 అర్జీలు వచ్చాయని వివరించారు. ఈ అర్జీలను పరిశీలించి వాటి పరిష్కారానికి సత్వరమే కృషి చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ చైత్ర వర్షిని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు తమ అర్జీలు నమోదు వాటి ప్రస్తుత స్థితిని తెలుసుకోవడానికి 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా కాల్ చేయవచ్చునని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వసంత మాధవి, పిఠాపురం తహసీల్దారు గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ డి రాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక అన్న సమారాధనలో పాల్గొన్న కంబాల



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 17 :** గోకవరంమండలంలోని పలు గ్రామాలలో సోమవారం జరిగిన కార్తీక అన్న సమారాధన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత స్థానిక డ్రైవర్స్ కాలనీలో దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారి దర్శించుకుని, ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మండలంలోని తంటికొండ గ్రామంలోని అఖిలండేశ్వరి జంబు కేశ్వర, స్వామి ఆలయం వద్ద జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలోని శివాలయం ఆలయాన్ని సందర్శించి, స్వామివారిని దర్శించుకున్నారు. తొలిత ఆలయ కమిటీ సభ్యులు కంబాల శ్రీనివాసరావుని పూలమాలలతో ఘనంగా సత్కరించారు. భజన బృందానికి 1500 రూపాయలు, పారిశుద్ధ్య కార్మికులకు 1100 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, ఆయా ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జీఓ 13ను తక్షణమే అమలు చేయాలి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ నెంబర్ 13 ను తక్షణమే అమలు చేయాలని, కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీలలో నాయి బ్రాహ్మణుల కోసం కేటాయించినటువంటి షాపులను తక్షణమే కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్ లో జీఓ నకలును కలెక్టర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తనుబుద్ధి సూర్య భాస్కరరావు, టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కోటిపల్లి చంద్రశేఖర్, బీజేపీ ఓబీసీ మోర్చా మండల నాయకుడు మల్లివలస రాంబాబు, ఓబీసీ నాయకుడు పెండ్యాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మాకు ప్రత్యేక బస్సులు కావాలి రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

### బడి బస్సులు నడపాలని విద్యార్థులు డిమాండ్ - రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన విద్యార్థులు






**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 17..** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం కళాశాల విద్యార్థులకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టింది. నిత్యం కళాశాలకు వెళ్లే విద్యార్థులు బస్సు పాసులు ఉన్న బస్సుల్లో చోటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిపై నిరసన వ్యక్తం చేస్తూ ఉప్పాడ కొత్తపల్లి మండలం మూలపేట గ్రామంలో విద్యార్థులు ప్రధాన రహదారిపై బైఠాయించి ఆర్టీసీ బస్సులను అడ్డగించారు. స్త్రీ శక్తి పథకం కారణంగా మహిళలు అధిక సంఖ్యలో బస్సులో ప్రయాణిస్తుండడంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. దీంతో విద్యార్థులకు ప్రయాణించడం కష్టంగా మారింది.బస్సుల్లో సీట్లు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు ఆటోలకు అదనంగా డబ్బులు చెల్లించి కళాశాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇది వారిపై ఆర్థిక భారం మోపుతుంది. సోమవారం ఉదయం విద్యార్థులు రోడ్డుపై అడ్డంగా భారీకేట్లు పెట్టి బస్సులను నిలిపివేశారు. రోడ్డుపై బైఠాయించి బడి బస్సులు కావాలంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆర్టీసీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు విద్యార్థులు సమస్యలు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. విద్యార్థులు అధికారుల హామీ మేరకు తాత్కాలికంగా నిరసనను విరమించారు. అయితే రేపటి నుండి ప్రత్యేకంగా బడి బస్సులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కళాశాల సమయాలలో బడి బస్సులను నడపాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం స్త్రీలకి ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడం మూలంగా బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రయాణికులకు సరిపడా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ప్రమాదకరస్థాయిలో ప్రయాణికులు ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రయాణికులకు తగ్గట్టుగా బస్సులను కేటాయించాలి.



**దువ్వ వెంకటేశ్వరరావు,**
**జాతీయ మానవ హక్కుల కౌన్సిల్**
**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల చైర్మన్.**

విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. బస్సు పాసులు తీసుకుని కూడా బస్సులు ఖాళీ లేకపోవడంతో అదనపు ఖర్చులు పెట్టుకుని ఆటోలో ప్రయాణిస్తున్నారు. స్త్రీ శక్తి పథకం మూలంగా వేలాడుతూ ఫుట్ బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటాలు ఆడకుండా అవసరమైనన్ని బడి బస్సులను ఏర్పాటు చేయకపోతే ఆందోళన చేపడుతాం.



**ఖండవల్లి సిద్దు,**
**భారత విద్యార్థి సమైక్య జిల్లా ఉపాధ్యక్షుడు**

# ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి నవరాత్రి మహోత్సవాలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** స్థానిక కేవీఆర్ స్వామి రోడ్డులో రాజమండ్రి నగర, రూరల్ స్వర్ణకార సంఘం రాజమండ్రి పాలకవర్గం ఆధ్వర్యంలో 58వ శ్రీ శ్రీ శ్రీ మద్వి రాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నగర, రూరల్ స్వర్ణకార సంఘం ఆహ్వానం మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర పాలక కమిటీ సభ్యుడు ఆకుల వీర్రాజు ప్రత్యేకంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆకుల వీర్రాజు మాట్లాడుతూ స్వర్ణకార సంఘం ప్రతీ ఏటా ఎంతో భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో నిర్వహిస్తున్న ఈ మహోత్సవాలు ప్రశంసనీయమన్నారు. కార్యవర్గ సభ్యులందరికీ తన శుభాకాంక్షలను తెలియజేశారు. భక్తులంతా సకుటుంబ సమేతంగా పాల్గొని, స్వామివారి కృపను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో పోలీస్ శాఖకు బొలెరో వాహనం అందజేత




**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 17..** పిఠాపురం పరిధిలో రక్షణ, శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం పోలీస్ శాఖకు బొలెరో వాహనాన్ని దాత డాక్టర్ సునీత దివ్యరాజ్ సోమవారం అందజేశారు.

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో పిఠాపురం నియోజకవర్గానికి తన వంతు సహాయంగా పోలీస్ శాఖ అవసరాల నిమిత్తం అందజేసినట్లు ఆమె తెలిపారు. అలాగే పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా 25 వేల మంది ప్రజలకు ఆరోగ్య దంత సర్వేను నిర్వహించినట్లు తెలిపారు. దంత సర్వేలో పళ్ళ సెట్లు అవసరమైన వారందరికీ ఉచితంగా నియో సంస్థల తరఫు నుండి అందజేశామని తెలిపారు. షీ ఫౌండేషన్ ద్వారా మహిళల అభివృద్ధికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సుమారు 12 లక్షల రూపాయలు విలువచేసే నూతన బొలోరో వాహనాన్ని జిల్లా ఎస్పీ బిందు మాధవ్, కలెక్టర్ శాన్మోహన్ లకి ఆమె అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు డాక్టర్ సునీత దివ్యరాజ్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ బి డి ఎస్ పి,సత్యనారాయణ పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది

### రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు - టి రాయవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రత్తిపాడు,( మనసులోమాట) నవంబర్ 17..** రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు అన్నారు. మండలంలోని టి రాయవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కన్నబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు రైతులకు కావలిసిన వసతులతో పాటు టెర్పలిన్ కవర్లు,ఖాళీ సంచులు అందుబాటులో ఉండేటట్లు చూడాలన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయ అధికారి జోకా అమృత మాట్లాడుతూ 17 శాతం కంటే తక్కువ తేమ ఉన్న ధాన్యం రైతులు ద్వారా గ్రేడ్ ఎ రకం క్వింటా రూ. 2389, సాధారణ రకం రూ. 2369 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.గోనె సంచులు, లేబర్, రవాణా ఖర్చులు కూడా రైతు ఖాత లో ప్రభుత్వం జమ చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్టవర్తి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు అమరాది వెంకటరావు, ఏలూరు సర్పంచ్ రొంగల సత్యనారాయణ,కూటమి నాయకులు యాళ్ళ విశ్వేశ్వరరావు,ఎస్ తాతబ్బాయి,సొసైటీ సీఈవో కృష్ణ,డైరెక్టర్ కే సూరిబాబు,వ్యవసాయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలకు మంచి స్పందన

### - జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఆర్.సీహెచ్ వెంకట్రావు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** తూర్పు గోదావరి జిల్లాలో ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలకు మంచి స్పందన లభించిందని, విజయవంతంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సీహెచ్ వెంకట్రావు కితాబు నిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ షెడ్యూల్ లో ఇవ్వబడిన అన్ని అంశాలనూ నూరు శాతం నిర్వహిస్తూ.. లక్ష్యాన్ని సఫలం చేస్తున్నారని, రాజమహేంద్రి ఛారిటబుల్ ట్రస్టుని, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, లైబ్రేరియన్ శ్రీదేవిని అభినందించారు. లైబ్రేరియన్ శ్రీదేవి మాట్లాడుతూ ఈ రోజు వక్తృత్వ పోటీలు, పుస్తక పఠనం యొక్క ప్రాముఖ్యత, దాని ఉపయోగాలు, ప్రముఖులతో ప్రసంగాలు నిర్వహించినట్లు తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అతిథిగా పాల్గొన్న భారత్ వికాస్ పరిషత్ మాజీ అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణారావు మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చి మంచి పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వాడ్రేవు అలివేలు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ముంగండి సూర్యనారాయణ, పేపర్ మిల్ రిటైర్డ్ ఇంజినీర్ పిచ్చుక వెంకట రాంబాబు, మారిశెట్టి సత్యనారాయణ , వీధి లక్ష్మయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు డాక్టర్ రాజు (అంబికా కంటి ఆసుపత్రి) , విశ్రాంత స్కూల్స్ సూపర్ వైజర్ ఆర్వీవీ సత్య నారాయణ పాల్గొన్నారు. గ్రంథాలయ బెస్ట్ రీడర్ గా నాటి మురళీకృష్ణ ను అతిథులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు అందరికీ గ్రంథాలయ కమిటీ సభ్యులు, ట్రస్టు సభ్యులు శాలువాలతో సత్కరించారు.



## టీడీపీ ధమన కాండకు వైసీపీ నిరసన

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** హిందూపూర్ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం మోరంపూడి జంక్షన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద వైసీపీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు, హోం శాఖ మాజీ మంత్రి తానేటి వనిత, జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్, రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు.

## కాకినాడలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు

### ఇన్‌చార్జి కమిషనర్ కె.టి. సుధాకర్



**కాకినాడ (మనసులో మాట)నవంబర్ 17..** కాకినాడ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని వాటి పరిష్కారానికి వేగవంతంగా చర్యలు ప్రారంభించినట్లు నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ కె.టి. సుధాకర్ తెలిపారు.సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీ ఆర్ ఎస్ ) ద్వారా వచ్చిన ట్రాఫిక్‌కు సంబంధించిన ఫిర్యాదులపై ట్రాఫిక్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నగరంలోని 42 కీలక ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ స్పీడ్ బంప్స్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ కె.టి. సుధాకర్ మాట్లాడుతూ ట్రాఫిక్‌పై పిజిఆర్ఎస్‌లో అనేక ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్ అధికారులు మరియు ట్రాఫిక్ పోలీసులతో కలిసి సమగ్రంగా సమీక్షించి అవసరమైన చోట్ల తక్షణ చర్యలు చేపడుతున్నాం అని తెలిపారు.అలాగే నగర ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే నగరంలోని ట్రాఫిక్ ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని సూచించారు.ఈ సమావేశంలో కార్పొరేషన్ ఇంజనీరింగ్ ఇన్‌చార్జ్ కనకరావు మచ్చారాజు ట్రాఫిక్ సీఐలు అప్పలనాయుడు ఎన్.రమేష్ లా అండ్ ఆర్డర్ సీఐలు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 17..** రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ జీవోను రద్దు చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు పిఠాపురం పట్టణంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని 24, 25,26 వార్డుల్లో పక్షులు మర్రి చెట్టు, సీతయ్య గారి తోట, గోల్డ్ మార్కెట్ ప్రాంతాలలో వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ వంగా గీతా విశ్వనాథ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ ప్రజల వద్ద నుండి మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో లేకుండా పోతుందని దీనిని అడ్డుకోవడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ

- ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబు
- ప్రజల తరుపున పోరాటం చేస్తూనే వుంటాం, ప్రైవేటీకరణ ఉద్యమం ఆగదు
- 38, 40, 41వార్డుల రచ్చబండ కార్యక్రమంలో మాజీ ఎంపీ భరత్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 17:** ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబు షూరిటి మోసాలపై 38, 40, 41వ వార్డులకు రచ్చబండ కార్యక్రమం స్థానిక సీతంపేట సెంటర్ దగ్గర సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను అడ్డుకోడానికి జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, కోటి సంతకాల సేకరణ చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే సోమవారం 38, 40, 41 వార్డులకు సంబంధించి రచ్చబండ కార్యక్రమాన్ని ఇక్కడున్న నాయకులు ముఖ్యంగా ఇంచార్జీలు కట్టా వెంకటేష్ మిత్ర బృందం కలసి ఏర్పాటు చేశారని అభినందించారు. ప్రజలకు ఎన్నో కల్లబొల్లి కబుర్లు, మాయమాటలు చెప్పేసి సూపర్ సిక్స్ మోసం ఫిక్స్ అంటూ పబ్బం గడిపేద్దామంటే కుదరదని భరత్ అన్నారు.

ప్రభుత్వ ఆస్తులను అన్యాక్రాంతం చేస్తూ తన మనుషులకు అమ్మేద్దాం అనుకుంటే జగనన్న పార్టీ చూస్తూ ఊరుకోదని ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని భరత్ హెచ్చరించారు. మొన్న నిర్వహించిన ప్రజా ఉద్యమం ర్యాలీ ఘన విజయం సాధించడాన్ని జీర్ణించుకోలేని అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు ప్రోద్బలంతో పోలీసులు నా మీదా, వైసీపీ కుటుంబ సభ్యులు 26 మందిపై కేసులు పెట్టడం జరిగిందని, తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని, పోరాటం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే 10 కేసులు పెట్టారు.. ఇంకో 100 పెట్టండి భయపడేది వెనుతిరిగేది లేదని భరత్ అన్నారు. నీచ నికృష్ట రాజకీయాలను ఈవీఎం ఎమ్మెల్యే మానాలని హితవు పలికారు. పోలీసు సిబ్బంది కూడా అత్యుత్సాహం ప్రదర్శించవద్దన్నారు. ఎల్లవేళలా మీదే అధికారం అని టీడీపీ నేతలు విర్ర వీగవద్దని, మాకు అవకాశం వచ్చిన రోజు అన్ని తలక్రిందులు అయిపోతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి సిటీ కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు రోడ్డు నిర్మాణానికి

# తొలగిన అడ్డంకులు



**అధికారులు, గ్రామస్థులతో సమీక్ష నిర్వహించి ఒప్పించిన ఎమ్మెల్యే**

**రెండ్రోజుల్లో ప్రారంభం కానున్న పనులు**

**పలమనేరు నవంబర్ 17 (మనసులో మాట)..** పెద్దపంజాణి మండలంలోని రాయలపేట పంచాయతీ కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులకు అడ్డంకులు తొలిగాయి. ఈ పనులకు సంబంధించి అధికారులు మరియు నిర్వాసితులతో పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. రోడ్డు విస్తరణకు కొంతమంది అభ్యంతరాలు తెలుపుతుండడంతో నాలుగు రోజుల క్రితం రాయలపేట గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. దీంతో అందరి సమ్మతముతోనే పనులు జరుగుతాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన సర్దిచెప్పారు. అయితే పలువురికి విస్తరణ సందర్భంగా తమ ఇల్లు అంగళ్లు అధిక శాతం తొలగించాల్సి ఉంటుందనే ఆందోళన నేపథ్యంలో రెవెన్యూ మరియు ఆర్ అండ్ బి అధికారులతో పాటు గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఎట్టకేలకు రోడ్డు నిర్మాణానికి గ్రామస్తులందరూ సమ్మతించడంతో బుధవారం నుంచి పనులు జరిగేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమీక్షలో తహసీల్దార్ హనుమంతు నాయక్, ఆర్అండ్బీ డీఈ ధనలక్ష్మి, ఏఈ ఆదికేశవులుతో పాటు సిబ్బంది మరియు రాయలపేట వాసులు ప్రకాషం శెట్టి, శివయ్య శెట్టి, రమేష్, లక్ష్మి నారాయణ శెట్టి, రెడ్డెప్ప శెట్టి, సోమురాజు, చంద్రయ్య, రవి, బాలు, బుద్ధు, జిలాని,షౌకత్ మార్కొండయ్య, బాలాజీ, చలపతి తదితరులున్నారు.



### నృత్య పోటీలలో రాణించిన సూర్యా

## హై స్కూల్ విద్యార్థిని యామిని

ధర్మవరం నవంబర్ 17 (మనసులో మాట) పట్టణంలోని సాయి నగర్లో గల సూర్య ఉన్నత పాఠశాల విద్యార్థిని టీఎం. యామిని రాకింగ్ స్టార్స్ డాన్స్ ధర్మవరం ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఇంటర్నేషనల్ డ్యాన్స్ 2025 పోటీల్లో ప్రతిభ ఘనపరిచి ప్రశంసా పత్రం పొందడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ నరేంద్రబాబు, డాన్స్ మాస్టర్ లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా కర్రీస్పాండెంట్, డాన్స్ మాస్టర్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు టీఎం యామినీకు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. మా పాఠశాలలో చదువుతోపాటు క్రీడలు, నృత్యం పై కూడా చక్కటి అవగాహనతో పాటు ప్రాక్టీసులు కూడా చేయబడునని తెలిపారు.

### ఉచిత సంతాన సాఫల్య అవగాహన శిబిరమును

## సద్వినియోగం చేసుకోండి

**స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా**



ధర్మవరం నవంబర్ 17 (మనసులో మాట) పట్టణములోని పుట్టపర్తి రోడ్ సాయిబాబా గుడి దగ్గర గల స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యందు ఈ నెల 19వ తేదీ బుధవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత సంతాన సాఫల్య అవగాహన శిబిరమును సద్వినియోగం చేసుకోవాలని స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలు పుట్టకపోవడం (ఇన్ ఫర్టిలిటీ) అనేది చేయదగిన మరొక వైద్య స్థితి అని తెలిపారు. గర్భం దాల్చడానికి సంవత్సర కాలంగా ప్రయత్నిస్తూ ఉండడం, అనేకసార్లు గర్భస్రావాలు కావడం, అనేక ఐ యు ఐ లేదా ఐ వి ఎఫ్ వైఫల్యాలు కలగడం, రిపోర్టులు మామూలుగా ఉన్నప్పటికీ గర్భం దాల్చలేక పోవడం, వీర్యం కౌంట్ తక్కువగా ఉండడం లేదా వీర్యం కౌంట్ లేకపోవడం, పి సి ఓ ఎస్ సమస్యలు, పాలో పియన్ ట్యూబ్ పోవడం, ఎండ్రోమెట్రియోసిస్ లేదా గర్భాశయం లో ఫైబ్రాయిడ్లు ఉండదన్న అభిప్రాయాలు వాటికి నిపుణులైన వైద్యులచే చికిత్స నిర్వహించబడినది తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సంతానము లేని దంపతులు సద్వినియోగం చేసుకొని సంతానము కలిగించుకొని చక్కటి జీవితాన్ని పొందాలని తెలిపారు.

### అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రారంభమైన

## ఉచిత అన్నవితరణ

**గురు స్వామి- విజయ్ కుమార్, ఆలయ అధ్యక్షులు బండ్లపల్లి వెంకట జయప్రకాష్**



**ధర్మవరం నవంబర్ 17 (మనసులో మాట)..** పట్టణంలోని కేశవ నగర్ లో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈనెల 17వ తేదీ నుండి 2025 జనవరి 5వ తేదీ వరకు అన్న వితరణ కార్యక్రమాన్ని గురుస్వామి విజయ్ కుమార్, ఆలయ అధ్యక్షులు బండ్లపల్లి వెంకట జయప్రకాష్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని మొదటి రోజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ఈ అన్న వితరణ కార్యక్రమాన్ని దాతలు, అయ్యప్ప స్వామి భక్తాదుల సహాయ సహకారాలతో నిర్వహించుట మాకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని తెలిపారు. ప్రతిరోజు 450 మంది నుంచి 600 మంది వరకు అయ్యప్ప మాల ధారణ భక్తాదులు భిక్షకు రావడం జరుగుతోందని తెలిపారు. ఈ అన్న వితరణ కార్యక్రమం 2025 జనవరి 5 తో ముగుస్తుందని తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12:30 నుండి 2 గంటల వరకు ఉచిత అన్న వితరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. హిందూ సంస్కృతి సాంప్రదాయాలను అందరికీ తెలియజేయడమే మా లక్ష్యము అని తెలిపారు. తదుపరి గురుస్వామి విజయ్ కుమార్ తోపాటు ఆలయ అధ్యక్షులు బండ్లపల్లి వెంకట జయప్రకాష్ దాతలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత కృతజ్ఞతలను తెలియజేసి, అయ్యప్ప ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ అన్న వితరణ పట్ల అయ్యప్ప మాలధారణ భక్తాదులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, గురుస్వామికి ఆలయ కమిటీ వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేశారు.

# విద్యా రంగ అభివృద్ధే ప్రాధాన్యం

- ధర్మవరం నియోజకవర్గ విద్యార్థుల సంక్షేమం కోసం మంత్రి కట్టుబడి ఉన్నారు
- ప్రభుత్వ పథకాలు ప్రతి విద్యార్థికి చేరాలన్నదే లక్ష్యం హరీష్ బాబు
- బత్తలపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను సందర్శించిన మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు





బత్తలపల్లి, నవంబర్ 17 (మనసులో మాట) జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై వారి చదువు, పరిస్థితులు, అవసరాలు గురించి తెలుసుకున్నారు. పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన సదుపాయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, వంటశాలలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, పౌష్టికాహార ప్రమాణాలపై పూర్తి వివరాలు సేకరించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం ప్రమాణాలకు పూర్తిగా అనుగుణంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆయన సూచించారు. అలాగే పాఠశాలలోని మౌలిక వసతుల ప్రస్తుత స్థితి గురించి ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు మరియు ఇతర సిబందితో చర్చించి సమస్యలు, అవసరాలు, పరిష్కార మార్గాలు గురించి సమగ్రంగా తెలుసుకున్నారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలపై అధికారులు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ఈ సందర్భనలో భాగంగా, పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ అప్డేట్ సెంటర్ను కూడా హరీష్ బాబు పరిశీలించారు. విద్యార్థులకు ఆధార్ వివరాలను సక్రమంగా నవీకరించుకోవడం ఎంత ముఖ్యమో అవగాహన కల్పిస్తూ, ఇది వారికి స్కాలర్షిప్లు, ప్రభుత్వ పథకాలు మరియు ఇతర విద్యా ప్రయోజనాల కోసం అవసరమని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే పాఠశాలల్లో వసతులు మెరుగుపరచడం, నాణ్యమైన విద్య, ఆరోగ్యం మరియు భద్రత కల్పించడం మంత్రి సత్య కుమార్ యాదవ్ యొక్క ప్రధాన కర్తవ్యమని హరీష్ బాబు పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో విద్యా రంగం అభివృద్ధి కోసం మంత్రి ఎల్లప్పుడూ కృషి చేస్తారని హామీ ఇచ్చారు.

## ఉచితంగా ఎన్ఎంఎస్ఎస్ పుస్తకాలు పంపిణీ - యుటిఎఫ్ నాయకులు



**ధర్మవరం నవంబర్ 17 (మనసులో మాట)...** మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె ఎస్ లక్ష్మణరావు సహకారంతో ,జన విజ్ఞాన వేదిక ,యుటిఎఫ్ ప్రచురించిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే విద్యార్థులకు ఉపయోగపడే మెంటల్ ఎబిలిటీ మెటీరియల్ పుస్తకాలను ధర్మవరం పట్టణ%శీ% లోని మున్సిపాలిటీ ఉన్నత పాఠశాల శాంతినగర్ ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే విద్యార్థులకు ఉపయోగపడే మెంటల్ ఎబిలిటీ మెటీరియల్ పుస్తకాలను ఉచితంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ నాయక్, ప్రధానోపాధ్యాయులు ఉమాపతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఈ పుస్తకాలను ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ పరీక్షల్లో విజయం సాధిస్తే కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరానికి 12,000 చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు విద్యార్థులకు ఉపకార వేతనం లభిస్తుందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి మంచి పుస్తకాన్ని జనవిజ్ఞాన వేదిక యుటిఎఫ్ లు విద్యార్థులకు ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉమాపతి, వారికి ధన్యవాదాలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ పట్టణ శాఖ నాయకులు నాగిరెడ్డి, ప్రదీప్ కుమార్ , ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ప్రతిష్టిస్తాం


**బలిజ సంక్షేమ సంఘం, బలిజ మహిళా మండలి, బలిజ యూత్**



**ధర్మవరం నవంబర్ 17 (మనసులో మాట)..** పట్టణంలోని లోని కోటలో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని త్వరలో ప్రతిష్టించనున్నామని బలిజ సంక్షేమ సంఘం, బలిజ మహిళా మండలి, బలిజ యూత్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు లోని కోటలో "జయహెూ శ్రీకృష్ణదేవరాయ" కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం బలిజ సంగం నాయకులు తొండ మాల బాబు మాట్లాడుతూ అప్పటి శ్రీకృష్ణదేవరాయలు ధర్మవరం పట్టణంలో కోట నిర్మించడం జరిగిందని, కాలక్రమమైన ఆ వీధికి లోనికోటగా నామకరణం చేయడం జరిగిందన్నారు. ఆ మహానుభావుని చిరకాలం గుర్తిండిపోయేలా లోని కోట వీధిలోనే వారి విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని తెలిపారు. అంతేకాకుండా శ్రీ సత్య సాయి జిల్లాలో గల అన్ని మండలాలలో రాయలవారు పాలించిన వాటిలో కోటలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటిని పురావస్తు శాఖ అధికారులు గుర్తించి, ప్రభుత్వ అనుమతితో మరమ్మత్తులు చేయించి, పర్యాటక కేంద్రంగా మార్చాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేల్దారి చేన్న రాయుడు, అల్లం మూర్తి ,తోట ప్రసాద్, పెరిమాలి రమాదేవి, ముక్తం కాశి, గోపి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## టీచ్ టూల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరం

**మండల విద్యాశాఖ అధికారి గోపాల్ నాయక్**



ధర్మవరం నవంబర్ 17 (మనసులో మాట)..ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న సర్వ శిక్ష అభియాన్ కార్యక్రమం కింద ఉపాధ్యాయులందరికీ టీచ్ టు ట్రైనింగ్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈఓ గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏపీ ఎంఈఓ గోపాల్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు ఏ విధంగా అయితే మన మూల్యాంకనం చేస్తామో ,అదేవిధంగా టీచ్ టూల్ అనేది ఉపాధ్యాయుల బోధన విద్యార్థులకు సక్రమంగా అందుతుందా లేదా అని తెలుసుకోవడం కోసం టీచ్ టూల్ కార్యక్రమం చక్కగా ఉపయోగపడుతుందని తెలిపారు. వీటిని ఉపాధ్యాయులు అందరూ కూడా పాఠశాల తరగతి గదిలో అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులందరూ బోధనా సామర్థ్యాన్ని మెరుగు పరుచుకొనుటకు టీచ్ టూల్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, జీవి జడ్పీఎస్ ప్రధానోపాధ్యాయులు సుమన, జగదీష్, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, సీఎంఆర్టీలు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన కవి సమ్మేళన కార్యక్రమం

**గ్రంధాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి**




**ధర్మవరం నవంబర్ 17 (మనసులో మాట)..** పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల పౌర శాఖ ప్రధాన గ్రంథాలయంలో నాలుగవ రోజు 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో కవి ప్రఫుల్ల చంద్ర, టీటీడీ ధర్మాచార్యులు వెంకటేశులు, కాకుమాని రవీంద్ర గాయకులు నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు అని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన కవులు గ్రంథాలయం గురించి ఒక పద్యాన్ని కవిత ద్వారా విద్యార్థులకు వినిపించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. అనంతరం పాటలు గేయాలు,, పద్యాలు, కవితలు, విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రాము, రమణా నాయక్, గంగాధర్, సరస్వతమ్మ, పాఠకులు,55 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



## గ్రామ సేవా సమితికి కుర్చీలు వితరణ

**పలమనేరు (మనసులో మాట) నవంబర్ 17..** పలమనేరు పట్టణంలో గల ఫస్ట్ క్లాస్ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్కు శివాడి గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో కుర్చీలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్. భాస్కర్ చేతుల మీదుగా వితరణ అందించినట్లు సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు, రామ్మూర్తి ,ధనంజయ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ... తమ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, నిరుపేదలకు అందిస్తున్న సేవల్లో భాగంగా పలమనేర్ బార్ అసోసియేషన్కు కుర్చీలు ఇవ్వాలనే సంకల్పాన్ని నెరవేర్చమన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో పలమనేరు నియోజకవర్గంలో ఉన్న ప్రాంతాలకు తమ సేవలు విస్తరించి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజనులకు ఏ వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారో అధ్యాయనం చేసి వారి ద్వారానే తెలుసుకొని మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద మహిళలను గుర్తించి మా సంస్థ ద్వారా చేతి వృత్తులు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించి వాటి ద్వారా వారి జీవనోపాదులు మెరుగుపరచడానికి ప్రయత్నం చేస్తామన్నారు. ఇప్పటికే తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు అందించామని భవిష్యత్తులో తమ కార్యచరణను రూపొందించుకొని ప్రజలకు సేవలు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ .భాస్కర్ మాట్లాడుతూ.... గ్రామ సేవా సమితి తమ బార్ అసోసియేషన్ చేస్తున్న సేవలను గుర్తించి కుర్చీలు విరాళంగా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ సేవ సమితి అధ్యక్షులు రామ్మూర్తికి శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, స్టోర్స్ కార్యదర్శి రంజిత్ షా, మహిళా కార్యదర్శి మహేశ్వరి, న్యాయవాదులు రాజారెడ్డి, లక్ష్మణ రెడ్డి, మహమ్మద్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కవి సమ్మేళనం



పలమనేరు నవంబర్ 17 (మనసులో మాట) :స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం కవి సమ్మేళన కార్యక్రమం జరిగింది. కవి శివకుమార్ మాట్లాడుతూ... కవి జ్ఞానాన్ని అక్షర సాహిత్యాన్ని కథలు కవిత్వాన్ని సమాజానికి అందిస్తూ సమాజ పురోగతికి తోడ్పడతాడని తెలిపారు. మరొక కవి శ్రీనివాస్ మాట్లాడుతూ.... కవులు తమకంటూ ఒక ప్రపంచాన్ని సృష్టించుకుని ఆ ప్రపంచంతో భవిష్యత్తు గురించి సందేశాన్ని ఇస్తారని జాగ్రత్తలు తెలుపుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల అధికారి హేమ కుమార్, పలమనే రచయితల సంఘం అధ్యక్షులు మాధవ రెడ్డి, యుగంధర్, పుర ప్రజలు కవులనుసత్కరించడం జరిగిందన్నారు.

### పాముకాటుకు గురైన బిజెపి నాయకుడిని పరామర్శించిన

## మంత్రి నియోజక వర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు





ధర్మవరం నవంబర్ 17 (మనసులో మాట) మండల పరిధిలోని మల్కాపురం గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు దేవి రెడ్డి శంకర్ రెడ్డి పాముకాటుకు గురైన ఘటన పట్ల మంత్రి నియోజక వర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు ఆందోళన వ్యక్తం చేశారు. బత్తలపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవి రెడ్డి శంకర్ రెడ్డిని వారు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై అక్కడి రైతులకు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం వైద్యులు అందించాలని వైద్యులకు తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ పార్టీ తరపున సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. బిజెపి పార్టీ కు చెందిన కార్యకర్తలు కు అండగా ఎప్పుడూ ఉంటామని తెలిపారు. ఏ కష్టం వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**బిజెపి కార్యకర్త ఉత్తన్న కన్నుమూతపై సంతాపం తెలిపిన మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు..** పట్టణంలోని శారద నగర్ కు చెందిన బిజెపి కార్యకర్త తాత ఉత్తన్న అనారోగ్యంతో మృతి చెందారు. మృతి వార్త విన్న హరీష్ బాబు వ్యక్తిగతంగా వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కష్ట సమయంలో తాము బిజెపి కుటుంబం వారి పక్కన నిలుస్తామని భరోసా ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. అంత్యక్రియల సందర్భంగా బిజెపి నాయకులు సోమ్లా నాయక్ కూడా హాజరై కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. బిజెపి నాయకులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
మంగళవారం 18 నవంబర్ 2025


# అక్రమంగా నిర్మించిన సంధ్యా కన్వెన్షన్ కూల్చివేత

- హైదకోర్టు ఆదేశాలతో హైడ్రా చర్యలు




**హైదరాబాద్,నవంబర్17 (మనసులో మాట):**

భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో గచ్చిబౌలిలో సోమవారం భారీ కూల్చివేతలు చేపట్టారు. ఎఫ్‌సీఐ లే అవుట్‌లో అక్రమంగా నిర్మించిన సంధ్యా కన్వెన్షన్ భవనాలను నేలమట్టం చేశారు. హైడ్రాలిక్ జాక్ క్రషర్‌తో నిర్మాణాలను కూల్చివేశారు. తమ ప్లాట్లను ఆక్రమించి సంధ్యా శ్రీధర్ రావు రోడ్లు వేశారని తెలంగాణ హైకోర్టును బాధితులు ఆశ్రయించారు . ఈ క్రమంలో సంధ్యా శ్రీధర్ రావు అక్రమాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది హైకోర్టు. న్యాయస్థానం ఆదేశాలతో హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే, అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు దూకుడుతో ముందుకెళ్తున్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అధికారులకు ఫిర్యాదులు వస్తే శరవేగంగా చర్యలు చేపడుతున్నారు. హైడ్రా అధికారులు తమకు అండగా నిలవడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి

- నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- సర్దార్ వల్లభాయి పటేల్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- కరీంనగర్ లో వేలాది మందితో యూనిటీ మార్చ్
- యువత, విద్యార్థులతో కలిసి పాదయాత్ర చేసిన బండి సంజయ్




**కరీంనగర్, నవంబర్ 17 (మనసులో మాట):**

సర్దార్ వల్లభాయి పటేల్ ఆశయాలను నెరవేర్చేందుకు నేటి యువత తప్పనిసరిగా రాజకీయాల్లోకి రావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. యువత రాజకీయాల్లోకి రాకుంటే, దేశాన్ని కుటుంబ వారసత్వ రాజకీయాలు పట్టి పీడించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశానికి ఏ మాత్రం మంచి పరిణామం కాదని ఆయన పేర్కొన్నారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల నుండి నిర్వహించిన యూనిటీ మార్చ్ (ఐక్యతా మార్చ్) పాదయాత్రలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది విద్యార్థులు, యువత హాజరై ఆయనతోపాటు నడిచారు.

### పటేల్ లేకుంటే తెలంగాణకు విముక్తి లేదు

పాదయాత్ర ఆరంభంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ భారత దేశ ఐక్యత కోసం తన జీవిత సర్వస్వాన్ని ధారపోసిన మహనీయుడు సర్దార్ వల్లభాయి పటేల్ అని తెలిపారు. దేశంలోని 560 సంస్థానాలను ఒకే జెండా కిందకు తీసుకొచ్చి భారతదేశాన్ని ఏకం చేసిన మహనీయుడు పటేల్ అని ఆయన కొనియాడారు. పటేల్ లేకపోతే తెలంగాణకు విముక్తి కలిగేది కాదని సంజయ్ తెలిపారు. తెలంగాణను పాకిస్తాన్‌లో కలపాలని లేదా ముస్లిం దేశంగా మార్చాలని ఆనాడు నిజాం రాజు కుట్రలు చేశాడని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ తెలంగాణ భారత్‌లో విలీనం కాకుండా ఉంటే, అది మరో పాకిస్తాన్, మరో శ్రీలంక, మరో బంగ్లాదేశ్ లా మారి ఆకలి కేకలతో కల్లోల దేశంగా మారేదని ఆయన చెప్పారు. ఇది ఆనాడే గ్రహించిన పటేల్... భారతదేశ ఐక్యత కోసం 'ఆపరేషన్ పోలో' పేరుతో నిజాం కుట్రలను భగ్నం చేసి తెలంగాణకు విముక్తి కల్పించారని ఆయన తెలిపారు. దేశంలో ఆధునిక సివిల్ సర్వీసెస్ వ్యవస్థను స్థాపించడంలో కూడా పటేల్ కీలక పాత్ర పోషించారని సంజయ్ తెలియజేశారు.

### యువత లేని నవ భారతాన్ని ఊహించలేం

ప్రపంచంలో నెలకొన్న పోటీ, ఎదురవుతున్న సవాళ్లను భారత్ అధిగమించాలంటే తప్పనిసరిగా యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ తెలిపారు. వారసత్వ రాజకీయాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేయకుండా కఠిన నిర్ణయం తీసుకునే ధైర్యం పటేల్ సొంతమని, 'దేశం ఫస్ట్... ఆ తరువాత వ్యక్తిగతం' అనేది ఆయన తత్వమని సంజయ్ తెలిపారు. నేటి యువతకు పటేల్ స్ఫూర్తిదాయకమని, ఆయన క్రమశిక్షణ, దేశభక్తిని యువత అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. యువత తమ కెరీర్‌ను కేవలం ఉద్యోగాలు, వ్యాపారాలు, విదేశాలకు వెళ్లడానికే పరిమితం చేయడంవల్ల దేశానికి నష్టం జరుగుతుందని, వారసత్వ రాజకీయాలు పెరుగుతున్నాయని సంజయ్ తెలిపారు. ఇప్పటికే చాలా మంది యువత తెలిసీ తెలియక డ్రగ్స్, మద్యం, పబ్ కల్చర్ వంటి వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి రాకూడదంటే చురుకైన యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు నిర్వహిస్తున్న " ఐక్యతా మార్చ్" కార్యక్రమంలో భాగంగా సోమవారం కరీంనగర్‌లో ఈ పాదయాత్ర నిర్వహించడం జరిగిందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్పతి పాల్గొన్నారు.

# సహాయక చర్యల కోసం కంట్రోల్ రూం

- బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటాం
- సౌదీ దుర్ఘటనపై కేంద్రం ప్రత్యేక దృష్టి
- తక్షణ సహాయ చర్యలు ప్రారంభం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, నవంబర్ 17 (మనసులో మాట):**

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 42 మంది భారతీయ యాత్రికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల కేంద్ర ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ దుర్ఘటనకు సంబంధించి బాధితులకు సహాయం అందించేందుకు కేంద్రం యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగింది. మక్కా నుంచి మదీనాకు ప్రయాణిస్తున్న భారతీయ యాత్రికుల బస్సు బదర్-మదీనా మధ్య ముఫరహత్ ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన విషయం తెలిసిందే. కరీంనగర్ పర్యటనలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ దుర్ఘటనపట్ల తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయన వెంటనే విదేశాంగ శాఖ అధికారులు, హోంమంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. సౌదీ ప్రభుత్వంతో సంప్రదింపులు: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే సౌదీ ప్రభుత్వంతో మాట్లాడుతున్నారని, కేంద్ర హోం, విదేశాంగ శాఖ అధికారులు సౌదీ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సౌదీలోని భారత దౌత్య కార్యాలయం దుర్ఘటన బాధిత కుటుంబాలకు తక్షణ సహాయక చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. ఈ దుర్ఘటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహాయ సహకారాల కోసం 8002440003 (టోల్-ఫ్రీ), 0122614093, 0126614276, 0556122301 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... సౌదీ దుర్ఘటనలో బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. "క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయం అందిస్తాం. మరణించిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మృతుల ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను" అని ఆయన తెలిపారు. భవిష్యత్తులో యాత్రికుల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్రం తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు.

## సౌదీ బస్సు ప్రమాద ఘటనపై
# సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

### వెంటనే వివరాలు సేకరించాలని సీఎస్‌కు ఆదేశం
### కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడి



**హైదరాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

సౌదీ అరేబియా సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని రాష్ట్ర సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డిని ఆదేశించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఘటనలో తెలంగాణకు చెందిన వారు ఎంతమంది ఉన్నారో వెంటనే తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు సీఎం. కేంద్ర విదేశాంగ శాఖ, సౌదీ ఎంబస్సి అధికారులతో మాట్లాడాలని అధికారులకు సూచించారు. అవసరమైతే వెంటనే తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎస్ రామకృష్ణారావు ఢిల్లీలోని రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌ను అప్రమత్తం చేశారు. సౌదీలో జరిగిన బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు తగిన సమాచారాన్ని, సహాయ సహకారాలు అందించేందుకు సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సౌదీ అరేబియా ఘటనకు సంబంధించి పూర్తి వివరాల కోసం 91 79979 59754, ?91 99129 19545 ఈ నెంబర్లలో సంప్రదించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# ప్రమాదంపై గవర్నర్ తీవ్ర విచారం



**హైదరాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో జరిగిన విషాదకరమైన బస్సు ప్రమాదంపై తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన పలువురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం అందిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు సంతాప సందేశం విడుదల చేశారు. ఈ హృదయ విదారక సంఘటన అనేక కుటుంబాలకు తీవ్ర దుఃఖాన్ని కలిగించిందని గవర్నర్ తన సందేశంలో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన హృదయపూర్వక సానుభూతిని తెలియజేసినట్లు తెలిపారు. మరణించిన వారి ఆత్మలకు శాశ్వత శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ప్రార్థించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయాలను అందించడానికి మరియు సంబంధిత అధికారులతో సరైన సమన్వయాన్ని నిర్ధారించడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ ఆదేశించారు.

# బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన అనేక మంది యాత్రికులు మరణించడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. మక్కా నుండి మదీనాకు వెళుతున్న సమయంలో బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడం వల్ల జరిగిన ఈ ఘోర దుర్ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ..: క్షతగాత్రులకు మెరుగైన చికిత్స: ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మృతుల్లో ఎక్కువమంది హైదరాబాదీలే ఉన్నారనే సమాచారం నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను ముమ్మరం చేయాలని కేటీఆర్ కోరారు. ఊహించని విధంగా జరిగిన ఈ ప్రమాదంలో మరణించిన వారి వివరాలను వీలైనంత త్వరగా గుర్తించాలని, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్నిరకాలుగా అండగా నిలవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## డిసెంబర్ రెండోవారంలో
# స్థానిక ఎన్నికలు!

**ప్రజాపాలన వారోత్సవాల అనంతరం నోటిఫికేషన్**

- కేబినెట్ భేటీలో సీఎం రేవంత్ నిర్ణయం!
- ప్రజాపాలన వారోత్సవాల్లో గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం



**హైదరాబాద్,నవంబర్17 (మనసులో మాట):**

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనార్టీ విభాగానికి చెందిన ఓ అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని సూచించింది. చనిపోయిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం.. అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. బిసి రిజర్వేషన్ల వ్యవహారంతో ఆగిపోయిన స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఉంటుందని పేర్కొంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాతే లోకల్ బాడీ ఎలక్షన్స్ ఉంటాయని మంత్రివర్గ భేటీ స్పష్టం చేసింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు తెలంగాణ ప్రజాపాలన వారోత్సవాలు జరగనున్నాయి. వారోత్సవాల సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సర్పంచ్ సహా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల తరవాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గ భేటీలో చర్చించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితంనే లోకల్ బాడీ ఎలక్షన్‌లలో పునరావృతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి 20 నెలలు పూర్తయ్యాయి. ఇటీవల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై హైకోర్టు, సుప్రీం కోర్టు వ్యతిరేకంగా తీర్పు నిచ్చాయి. రిజర్వేషన్లు 50శాతం దాటరాదన్న నిబంధనలను పాటించాలని సూచించాయి. మొత్తానికి డిసెంబర్‌లో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నాడు రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల నిర్వహణ ఆలస్యమైన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయొద్దని.. వీలైనంత తర్వగా లోకల్ బాడీ ఎలక్షన్స్ నిర్వహించాలని నిర్ణయించింది మంత్రివర్గం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేసిందనే విషయాన్ని ప్రజాపాలన వారోత్సవాల్లో వివరించాలని మంత్రివర్గం తీర్మానించింది. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రచారం చేసి.. లోకల్‌బాడీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయాలని నిర్ణయించింది. ప్రజాపాలన వారోత్సవాలతో గ్రామ స్థాయి కేడర్‌లో మరింత ఉత్సాహం నింపి స్థానిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలని భావిస్తున్నారు.

# ప్రమాద మృతుల కుటుంబాలకు 5లక్షల ఎక్స్‌గ్రేషియా

- అజారుద్దీన్ నేతృత్వంలో సౌదీకి ప్రభుత్వ బృందం
- అక్కడే అంత్యక్రియలకు ఏర్పాట్లు
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం



**హైదరాబాద్,నవంబర్ 17(మనసులో మాట):**

సౌదీ అరేబియా బస్సు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. బాధితులకు అండగా నిలవాలని ఈ భేటీలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యేతోపాటు మైనార్టీ విభాగానికి చెందిన ఉన్నతాధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని సౌదీకి పంపాలనీ కేబినెట్ నిర్ణయించింది. బస్సు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. బాధిత కుటుంబసభ్యులకు చెందిన ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీ తీసుకెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సౌదీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది మరణించారు. వీరంతా హైదరాబాద్ వాసులని తెలంగాణ హజ్ కమిటీ ఒక ప్రకటన వెల్లడించింది. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారని తెలిపింది. హైదరాబాద్‌లోని మొత్తం 4 ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నవంబర్ 9వ తేదీన వీరంతా ఉమ్రాకు బయలుదేరి వెళ్లారు. క్కా యాత్ర పూర్తి చేసుకుని వారంతా మదీనాకి వెళ్తున్న సమయంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది ఈ ప్రమాదంలో మరణించారు.

# నిర్ణయం ప్రకటించండి

**పదిమంది ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ**

**స్పీకర్ తీరును తప్పుపట్టిన సుప్రీం**

**నాలుగు వారాల్లో నిర్ణయం ప్రకటించాలని ఆదేశం**



**న్యూఢిల్లీ,నవంబర్ 17 (మనసులో మాట):**

తెలంగాణ స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా ? అని సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌ను ప్రశ్నించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టుధిక్కర పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోక పోవడంపై కేటీఆర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ జరిగింది. కోర్టుధిక్కారంపై నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని స్పీకర్‌కి దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్. గవాయి ధర్మాసనం విచారణ జరిపింది. మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడం కోర్టు ధిక్కారమే.. రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయి స్పష్టం చేశారు. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని స్పీకర్ తరఫున న్యాయవాదులు అభిషేక్ సింగ్, ముకుల్ రోహత్గి వెల్లడించారు. తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈలోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఆ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండునెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది.

# సింగరేణి ఉద్యోగుల కోసం పోరాటం

**డిపెండెంట్ ఉద్యోగాలను కాపాడుకోవాలి**

**డిసెంబర్ 13న సీఎండీ కార్యాలయ ముట్టడి**

**ఖమ్మం జాగృతి బాటలో కవిత వెల్లడి**



**ఖమ్మం,నవంబర్ 17(మనసులో మాట):**

డిపెండెంట్ ఉద్యోగాలు కాపాడుకోలేని స్థితిలో ఇప్పుడు ఉన్నామని జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 13న సింగరేణి సీఎండీ కార్యాలయాన్ని ముట్టడి చేయబోతున్నామని ఖమ్మం జిల్లాలో జాగృతి బాటలో కవిత ప్రకటించారు. సింగరేణి ఉద్యోగం ఒక కుటుంబానికి ఇన్సూరెన్స్ లాంటిదని... డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తామన్నారు. సోమవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సింగరేణిలో కార్మికులతో కవిత మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికల్ బోర్డ్ కోసం కోట్లాడుతున్నామన్నారు. సింగరేణి గని కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ కట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని.. 'మీకోసం పోరాటం చేసే మాకు అండగా ఉండాలి అని కోరుతున్నాం' అని కవిత అన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు వేలం వేయడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సింగరేణికి అక్షరాలా రూ.40 వేల కోట్ల అప్పు ఉందని తెలిపారు. సింగరేణి కార్మికుల కోసం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు. ఆసుపత్రి నిర్మాణం చేసే లోపు కార్పోరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పెర్మినెంట్ అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. బొగ్గు బావిలోకి దిగే ముందు మైసమ్మకు మొక్కుకుని జాగ్రత్తగా ఉండాలని కవిత సూచించారు.

# ల్యాబ్ టెక్నిషియన్ పోస్ట్ ఫలితాలు విడుదల

**విడుదల చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్,నవంబర్ 17(మనసులో మాట):**



వివిధ విభాగాల్లో 1,284 ల్యాబ్ టెక్నిషియన్ గ్రేడ్ – ఎఎ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షా ఫలితాలను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఈ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా విడుదల చేశారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈ అభ్యర్థుల జాబితాను అందుబాటులో ఉంచింది. ఈ ఉద్యోగాలకు పరీక్ష రాసిన అభ్యర్థులు ఫైనల్ మెరిట్ లిస్ట్‌ను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. తెలంగాణ వైద్యారోగ్య శాఖలో 1,284 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ కాగా.. 24,045 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పోస్టులకు సంబంధించి పరీక్షను 2024, నవంబర్ 10వ తేదీన నిర్వహించారు. మొత్తం 23,323 మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. మెరిట్ లిస్ట్ సిద్ధం చేసి.. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసిన ప్రభుత్వం.. తాజాగా ÷నైల్ మెరిట్ లిస్ట్(ఉద్యోగానికి ఎంపికైన వారి జాబితా)ను విడుదల చేసింది. కొత్తగా ఎంపికైన అభ్యర్థులను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బోధనాస్పత్రులు, జిల్లా, ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నియమించనున్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ తీరుపై ప్రజల్లో ఆగ్రహం

- ఉప ఎన్నిక ఫలితమే ఇందుకు నిదర్శనం
- కేంద్రమంత్రులు బండి, కిషన్ రెడ్డిలు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- కేటీఆర్ అతిగా ఊహించుకోవడం వల్లే దెబ్బ

**హైదరాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని భావిస్తున్న భారతీయ జనతా పార్టీ జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడం పరిశీలిస్తే ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లలో ఐదు శాతం వరకు తగ్గిపోవడం ఏమిటి? బీజేపీ ఈ దుస్థితికి అంతర్గత కలహాలు ప్రధాన కారణమని భావించ వచ్చు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై పెద్దగా స్పందించడం లేదు. సిఎం రేవంత్ నేరుగా ప్రస్తావించిన సమస్యలపైనా ఎదురుదాడితో పక్కదోవ పట్టిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో రాష్ట్ర సమస్యలను పెద్దగా పట్టించుకోవడం లేదు. పక్కరాష్ట్రం ఎపిలో బిజెపి నుంచి కేంద్ర మంత్రులు వచ్చి వాలుతున్నారు. చంద్రబాబు ఏది కోరితే అది చేసి పెడుతున్నారు. విజినరీ బాబు అంటున్నారు. విశాఖ ఉక్కు, అమరావతి, తుఫాన్ సాయం, పంటల కొనుగోళ్లు, మిర్చి రైతుల సమస్యలు ఇలా ఒక్కటేంటి..ఏది అడిగిన కాదనకుండా కేంద్రం ఎస్ సమాధానంతో సిద్దంగా ఉంది. తెలంగాణలో ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా ఒక్కపనీ కావడం లేదు. పనులన్నవి ప్రజలకు సంబంధించినవి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత మాత్రాన ప్రజల సమస్యలు పరిష్కరించకుండా ఉండడం దారుణం కాక మరోటి కాదు. ఇకపోతే కేంద్రమంత్రులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు కాంగ్రెస్‌ను తిడుతూ కూర్చోవడం తప్ప ఒక్కటంటే ఒక్కటి ప్రజలు గుర్తించే పనులు చేయడం లేదు. జూ÷-బలీహిల్‌లో అందుకే బిజెపి అడ్రస్ లేకుండా పోయింది. కేంద్రమంత్రిగా ఇది కిషన్ రెడ్డి సిగ్గుపడాల్సిన విషయం. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్‌లో వచ్చిన ఓట్లు 35 శాతం మాత్రమే. అప్పుడు బీఆర్ఎస్‌కు దాదాపు 44 శాతం ఓట్లు వచ్చాయి. అంటే, కాంగ్రెస్ కంటే దాదాపు 9 శాతం అధికం. గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 14 శాతం పైగా ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 9 శాతంలోపే. ఈసారి బీజేపీ డిపాజిట్ కూడా కోల్పోయింది. 2023 ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీకి దాదాపు పదహారుశాతం ఓట్లు పెరిగాయి. అప్పటితో పోలిస్తే బీఆర్ఎస్, బీజేపీలకు కలిపి 11 శాతం ఓట్లు తగ్గాయి. ఇవన్నీ కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయని భావించాలి. గత ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేయగా, ఇప్పుడు ఆ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో మరో ఐదుశాతం ఓట్లు కాంగ్రెస్ కు కలసి వచ్చాయి. అధికారంలో ఉన్న పార్టీలకు ఉప ఎన్నికల్లో కొన్ని అనుకూలతలు ఉంటాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి 51 శాతం ఓట్లు లభించడం విశేషమే అని అంగీకరించాలి. ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి ఐదు శాతం వరకు అనుకూలతల వల్ల లబ్ధి చేకూరుతుంది. కాంగ్రెస్‌కు 16 శాతం వరకు పెరిగినందున ఆ విజయాన్ని గుర్తించవలసిందే. బిహార్ ఎన్నికల్లో అంచనాలకు మించి స్వీప్ చేసిన బీజేపీకి తెలంగాణలో ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ఆ పార్టీ అధిష్ఠానం ఆలోచించు కోవాలి. ఉత్తరాదిన తిరుగులేని శక్తిగా ఎదిగిన బీజేపీ దక్షిణాదిలో ఎందుకు ఆపసోపాలు పడుతోందో ఆలోచించుకోవాలి. ఇక్కడ జనం నాడిని ఎందుకు అందుకోలేకపోతున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తామే అధికారంలోకి వస్తామన్న అతి విశ్వాసంతో ఉన్న బీఆర్ఎస్‌కు జూబ్లీహిల్స్ ఫలితం గుణపాఠం కావాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా కేటీఆర్ తక్కువగా అంచనా వేశారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రిని కేటీఆర్ తరచుగా కించపరుస్తూ రెచ్చగొట్టారు. రాజకీయంగా ఉండాల్సిన వైరాన్ని వ్యక్తిగత వైరంగా మార్చారు. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి కూడా బిఆర్ఎస్ నేతలు అంగీకరించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అంతులేని వ్యతిరేకత నిజమే అయితే జూబ్లీహిల్స్‌లో 51 శాతం ఓట్లు రావడం ఎలా సాధ్యం అని బీఆర్ఎస్ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఓటమి తరవాత కేసీఆర్ కుటుంబం ఇంకా నేల మీదకు దిగి రాలేదని గ్రహించాలి. కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కే పరిమితం కావడంతో పార్టీలో అంతా తానే అన్నట్టుగా గత రెండేళ్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారు. అయినా ప్రజల అభిమానాన్ని మాత్రం ఆయన చూరగొనలేక పోతున్నారు. కేటీఆర్‌లో ఇంకా అహంభావం ఛాయలు పోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. 2023 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ గెలవలేదు. పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాలేదు. కొన్నిచోట్ల పోటీ కూడా చేయలేదు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నిక. కర్మ మనల్ని వెంటాడుతుందని కేటీఆర్ సొంత చెల్లి కవిత తాజాగా వ్యాఖ్యానించారు. గతంలో అహంభావంతో వ్యవహరించినందునే ఇప్పటి దుస్థితి అని తెలుసుకోకుండా ఇప్పటికీ త్వరలోనే అధికారంలోకి వస్తాం, మీ సంగతి తేలుస్తాం అని ప్రగల్భాలు పుకుతున్నారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో 16 వేల ఓట్ల మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ గెలవడానికి ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లు కూడా కారణం. భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి బీఆర్ఎస్ సిద్ధపడిందని కేసీఆర్ కుమార్తె కవిత బహిరంగంగా చెప్పిన తర్వాత ముస్లింలు బీఆర్ఎస్‌కు దూరమయ్యారని అనుకోవాలి. సిఎం రేవంత్ అన్నట్లుగా యూట్యూబ్ చానళ్లు పెట్టించి, వాటిల్లో అనుకూలంగా ప్రచారం చేయించుకుంటూ అదే నిజమని కేటీఆర్ భ్రమల్లో బతుకుతున్నారు. ప్రస్తుత ఉప ఎన్నిక సందర్భంగా కూడా బీఆర్ఎస్ అనుకూల సోషల్ మీడియా వేదికలు ఊదరగొట్టాయి. అయినా ప్రయోజనం కలగలేదు. మీడియా అయినా, సోషల్ మీడియా అయినా రాజకీయ పార్టీలకు కొంత నష్టం చేయగలవే గానీ, ఎన్నికల్లో ఏదో ఒక పార్టీని గెలిపించలేవు. కేటీఆర్ ఇదే వైఖరితో ఉంటే భవిష్యత్తులో కూడా ఫలితాలు ఇంతకు భిన్నంగా ఉంటాయని భావించలేం. కేసీఆర్ క్రియాశీలంగా వ్యవహరించ లేకపోతే బీఆర్ఎస్ పరిస్థితి మరింతగా దిగజారడం ఖాయం.

# మరో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

- జూబ్లీహిల్స్ ఫలితమే నిదర్శనం
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి
- మిర్యాలగూడలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్



**మిర్యాలగూడ,నవంబర్17(మనసులో మాట):**

మరో 15 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ఇది రుజువైందని చెప్పారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం కాల్వపల్లి వద్ద రింగురోడ్డు పనులకు మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఒక పార్టీకి డిపాజిట్ గల్లంతైందని.. మరో పార్టీ కుటుంబ కలహాలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అన్ని సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నామన్నారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారి ద్వారా అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో మిర్యాలగూడ ప్రజలు కాంగ్రెస్‌కి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రూ.180.25 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు మంత్రులు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రతి సింగిల్ రోడ్డును, డబుల్ రోడ్డుగా చేస్తామని పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మిర్యాలగూడ కేఎన్ఎం డిగ్రీ కాలేజీని.. ప్రభుత్వ కాలేజీగా మార్చింది తామేనని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ దక్కలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాలుగు ముక్కలైందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీలను విమర్శించేందుకు కూడా తమకు నోరు రావట్లేదని దెప్పిపొడిచారు. తెలంగాణలో మరో 15 ఏళ్లు తామే అధికారంలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా కార్యకర్తల కృషి కారణమన్నారు. కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. పదేళ్లలో జరగని అభివృద్ధిని రెండేళ్లలో చేసి చూపించామన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర చెల్లించడంతోపాటు 48 నుంచి 72 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ఉత్తమ్ తెలిపారు.

# బీహార్‌లో బీజేపీ ఓట్ చోరీ సుస్పష్టం

- ఓట్లు వచ్చినా సీట్లు తగ్గిన మహాకూటమి
- ఓట్లు తగ్గినా సీట్లు బీజేపీకి పెరిగాయి
- గాంధీభవన్ ముందు యూత్ కాంగ్రెస్ నిరసన




**హైదరాబాద్,నవంబర్ 17(మనసులో మాట):**

బీహార్‌లో దొడ్డి దారిన ఎన్డీయే కూటమి విజయం సాధించిందని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.. ఓట్ చోరీ నీ నిరసిస్తూ గాంధీ భవన్ ముందు యూత్ కాంగ్రెస్ నేతల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికలు జరగాలన్నారు. యువజన కాంగ్రెస్ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజల్ని చైతన్య వంతం చేసే విధముగా ఉందని కొనియాడారు. ఓట్ చోరీపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారన్నారు. ఓటు విలువ తెలియక ఉండటం శోచనీయమన్నారు. బీహార్ ఎన్నికల్లో సామాన్యులకు తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఓటు శాతం తక్కువగా వచ్చి ఎన్డీయే సీట్లు గెలవడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. బీహార్‌లో ఓట్ చోరీతో ఎన్డీయే కూటమికి సీట్లు వచ్చాయని ఆరోపించారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బీహార్ లో ఎన్డీయే కూటమికి సీట్లు గెలుచుకుందన్నారు. దేశ భవిష్యత్ కి విఘాతం కలిగించే విధంగా ఓట్ చోరీ ఉందన్నారు. ఓట్ శాతం మహాఘాట్ బంధన్ కి ఎక్కువ వస్తే.. ఎన్డీయే కూటమికి సీట్లు పెరిగాయని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.సెక్యులర్ ఓట్లను తొలగించారు.. ఓట్ చోరీ తో రాజ్యాంగానికి తూట్లు.. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా తీరు తెన్నులు శోచనీయం.. అధికార బిజెపికి అనుకూలంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పని చేస్తుంది. దేశం బాగుపడాలంటే ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉంది.. అధికారం పరమావధిగా మోడీ అమిత్ షా ఓట్ చోరీకి పాల్పడుతున్నారు.. బీహార్ ఎన్డీయే కూటమి గెలుపు అప్రజాస్వామికం.. ఓట్ చోరీ గురించి 8 ఏళ్ల క్రితమే పోరాడాం.. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా బీజేపీకి ఫ్రంట్ ఆర్గనైజర్ గా పనిచేస్తుంది.. రేపటి నుంచి తెలంగాణలో ఓట్ చోరీ సంతకాల సేకరణ ముమ్మరంగా జరుగుతుంది.. తెలంగాణలో సర్ పేరిట ఓట్లు తొలగించే ప్రమాదం పొంచి ఉందని టీపీసీసీ ఛీఫ్ వ్యాఖ్యానించారు. భాజపా అధికారంలోకి రావడానికి అనేక రకాలుగా ఓట్లు తొలగించి చోరీకి పాల్పడుతోందని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ నిరసనలు తెలపనున్నట్లు చెప్పారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో తెలంగాణ యువజన కాంగ్రెస్ మహా నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నంతో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ యూత్ కాంగ్రెస్ సైనికులుగా మారి ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి శక్తివంతంగా పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. దేశవ్యాప్తంగా ఓటుచోరీపై నిరసనలు ఉధృతం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ విధానాలను ఇంటింటికి తీసుకెళ్లాలని చెప్పారు. అలాగే, సౌదీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన యాత్రికులకు యూత్ కాంగ్రెస్ నివాళులు అర్పించింది.

# పత్తి కొనుగోళ్లపై ప్రతిష్టంభన

- ఎనుమాముల మార్కెట్‌లో నిలిచిన కొనుగోళ్లు
- సీసీఐ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు
- కేంద్ర,రాష్ట్రాలది మొద్దు నిద్ర అంటూ కేటీఆర్ విమర్శలు



**వరంగల్, నవంబర్ 17 (మనసులో మాట):**

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లపై తీవ్ర గందరగోళం నెలకొంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ తీరుపై రైతులు, జిన్నింగ్ మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కొత్త కొర్రీలతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు, వ్యాపారులు తెలిపారు. ఈ క్రమంలో నేటి నుంచి జిన్నింగ్ మిల్లుల బంద్‌కు వ్యాపారులు పిలుపునిచ్చారు. బంద్ పిలుపు నేపథ్యంలో రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకురాని పరిస్థితి. దీంతో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ బోసిపోయింది. పత్తి కొనుగోళ్లపై ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల్లో ఆందోళన నెలకొంది. తీసిన పత్తిని అమ్ముకోలేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పత్తి రైతుల బాధలపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు స్పందిస్తూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతుంటే ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఏం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. మద్ధతు ధర రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే... మంత్రులు, ఎమ్మెల్యేలు జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఉన్నారని ఫైర్ అయ్యారు. రైతుల కు మద్దతు ధర కోసం బీఆర్ఎస్ నిరసనకు దిగుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్ మెయిల్ చేసి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపొందారని.. నీళ్లు బంద్ చేస్తాం, పెన్షన్లు బంద్ పెడతామని బెదిరించారని మరో బీఆర్ఎస్ నేత రాజయ్య ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని వ్యాఖ్యలు చేశారు. పత్తి రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దొంగే దొంగా అన్నట్టుగా రేవంత్ పాలన ఉందనిమండిపడ్డారు. పత్తి కొనుగోళ్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పత్తిని పండించిన తెలంగాణ రైతన్నలు, నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మార్కెట్ యార్డుల్లో పడిగాపులు పడుతున్నారని చెప్పారు. కళ్ల ముందే పండించిన పత్తి ఈ చలికాలపు తేమకు పాడవుతోంటే ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేమో మొద్దు నిద్ర నటిస్తున్నాయని మండిపడ్డారు. నెల రోజుల్లో 28 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా కేవలం 1.12 లక్షల టన్నుల పత్తి కొనుగోలు చేశారంటేనే రాష్ట్రంలో నెలకొన్న పత్తి కొనుగోళ్ళ సంక్షోభానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. తేమశాతం, కపాస్ మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్, మిల్లుల గ్రేడింగ్ అంటూ కుంటి సాకులతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు నిరాకరిస్తుంటే, దానికి జిన్నింగ్ మిల్లుల అవినీతి తోడై రైతన్న నడ్డి విరుస్తున్నాయని చెప్పారు. మద్ధతు ధర దొరకక, మధ్య దళారులకు తెగనమ్ముకుని రైతులు నష్టాల పాలవుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు వెంటనే పత్తి కొనుగోలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు

## ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక లాభాలు

ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, నవంబర్ 17 (మనసులో మాట):**

సహకార వారోత్సవాలను పురస్కరించుకొని, పెద్దపల్లి మండలం అప్పన్నపేట సింగిల్ విండో ఆధ్వర్యంలో సోమవారం ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం, ఎమ్మెల్యే విజయరమణ రావు పెద్దపల్లి మండలంలోని అందుగులపల్లి, దేవునిపల్లి, రంగాపూర్ గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, రైతులు తరచూ వడ్ల సాగు చేయడం వల్ల రసాయనిక ఎరువుల వాడకం పెరిగి భూసారం దెబ్బతింటున్నదని చెప్పారు. పంటల మార్పిడి వల్ల భూములు సౌడు భూములుగా మారే అవకాశం ఉండదని ఆయన తెలిపారు. ఆయిల్ ఫామ్ వేసుకుంటే మూడు సంవత్సరాల శ్రమ అనంతరం సుదీర్ఘ కాలం పాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, విపరీతమైన లాభాలు వస్తాయని ఆయన చెప్పారు. ఫామ్ ఆయిల్‌ను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోకుండా, మన దేశంలోనే ఉత్పత్తి అయ్యే విధంగా రైతులు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఆయిల్ ఫామ్ పంట ప్రకృతి వైపరీత్యాల నుండి కూడా తట్టుకుంటుందని ఆయన పేర్కొన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో యూరియా, నానో డీఏపీ వాడాలని ఆయన రైతులకు పిలుపునిచ్చారు. కటింగ్ లేకుండా వడ్ల కొనుగోలు చేసిన ఘనత తమకే దక్కుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, జిల్లా వ్యవసాయ అధికారులు, పరిశోధకులు మరియు సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## శంషాబాద్ ఎయిర్ పోర్టులో బంగారం బిస్కెట్లు పట్టివేత

ఇస్త్రీ పెట్టెలో దాచి తెస్తుండగా గుర్తించిన అధికారులు

**హైదరాబాద్,నవంబర్ 17(మనసులో మాట):**

విమానాశ్రయంలో ఓ ప్రయాణీకుడిని అనుమానించి తనిఖీ చేయగా బంగారం బిస్కట్లు బయటపడ్డాయి. బయటకు వస్తున్న అతడిపై అనుమానం వచ్చిన ఎయిర్ పోర్ట్ సిబ్బంది.. అతడి లగేజీ చెక్ చేశారు.. ఎమి దొరకలేదు.. మళ్లీ అనుమానంతో మరో సారి గట్టిగానే తనిఖీలు చేపట్టారు.. దీంతో అసలు విషయం బయటపడింది. ఇస్త్రీ పెట్టెలో లక్షల విలువైన బంగారాన్ని చూసిన ఎయిర్ పోర్ట్ అధికారులు నోరు వెళ్లబెట్టారు. ఇస్త్రీ పెట్టెలో ఏకంగా రూ.1.55 కోట్ల విలువైన బంగారం దాచడంతో ..అక్కడున్న వాళ్లంతా అవాక్కయ్యారు. ఈ ఘటన శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో జరిగింది. వైఎస్ఆర్ కడప జిల్లా పొద్దుటూర్‌కు చెందిన ఓ వ్యాపారి ఇటీవల షార్జాకు వెళ్లాడని అధికారులు వెల్లడించారు. అయితే అతడు షార్జా నుంచి 1200 గ్రాముల బరువున్న 11 బంగారం బిస్కెట్లను తీసుకొచ్చాడు. ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారుల చెకింగ్స్ నుంచి తప్పించుకోగలిగాడు. అయినప్పటికి గ్రీన్ ఛానల్ నుంచి బయటకు వెళ్లిపోతున్న టైంలో తమకు అడ్డంగా దొరికిపోయాడని అధికారులు చెప్పుకొచ్చారు. దొరికిన బంగారాన్ని స్వాధీనం చేసుకుని.. నిందితుడితో పాటు.. మరో వ్యక్తిని డీఆర్ఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ బంగారం ఏపీలోని ప్రొద్దుటూరుకు చెందిన మరో వ్యక్తి కోసం తీసుకువచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## విద్యానగర్‌లో విషాదం

ఒకే కుటుంబానికి చెందిన 18మంది మృతి

కుటుంబీలకు కిషన్ రెడ్డి, పిసిసి చీఫ్‌ల పరామర్శ



**హైదరాబాద్,నవంబర్ 17 (మనసులో మాట):**

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మృతి చెందారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర విషాదం అలముకుంది. నజీరుద్దీన్ మృతితో స్థానికులు కన్నీరు పెట్టారు. నసీరుద్దీన్ ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగి. తన కుటుంబ సభ్యులతో కలిసి మక్కా యాత్రకు వెళ్లారు. అంతలోనే ఈ ఘోర ప్రమాదం వారి కుటుంబాన్ని కబళించింది. విషయం తెలుసుకున్న నసీరుద్దీన్ బంధువులు, స్నేహితులు అతడి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబ బంధువులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్.. నసీరుద్దీన్ ఇంటికి వెళ్లి ఆయన బంధువులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఆ దిశగా చర్యలు మొదలు పెట్టినట్లు చెప్పారు. మరోవైపు నసీరుద్దీన్ ఇంటి వద్ద రోదనలు మిన్నంటాయి. ఒకే కుటుంబంలో 18 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని నమ్మలేకపోతున్నామంటూ ఆయన బంధువులు, స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు 18 మంది అంత్యక్రియలను సౌదీలోనే నిర్వహించనున్నట్లు నసీరుద్దీన్ బంధువులు పేర్కొన్నారు. మరోవైపు ఇదే ప్రమాదంలో.. హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురాకు చెందిన ఐదుగురు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ పరామర్శించారు. సౌదీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. వీళ్లంతా హైదరాబాద్ వాసులేనని తెలంగాణ హజ్ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. మృతి చెందిన వారిలో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నట్లు పేర్కొంది. జయవంతంగా మక్కా యాత్ర పూర్తిచేసుకుని మదీనాకు వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు 25 కి.మీ దూరంలో బస్సు-డీజిల్ ట్యాంకర్ ఢీకొన్నాయి.

## జూబ్లీహిల్ ఓటమితో కుంగిపోయేది లేదు

కాంగ్రెస్ విమర్శలపై మండిపడ్డ ఈటెల రాజేందర్



**హైదరాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సహజమే అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గెలిచినా, ఓడినా.. అధికారం ఉన్నా, లేకపోయినా దశాబ్దాలుగా కాషాయ జండా పట్టుకుని ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అన్నారు. గెలిస్తే బీజేపీ వాళ్ళు ఈవీఎంలను ఏదో చేశారని అంటున్నారు. మరి జూబ్లీహిల్స్ ఎన్నికలో ఈవీఎం మేనేజ్ చేశారా?, దొంగ ఓట్లు నమోదు చేయించారా?. తెలంగాణలో, కర్ణాటకలో కూడా మీరే గెలిచారు, మరి అక్కడ కూడా అలానే చేశారా?. మీరు గెలిస్తే ఒక న్యాయం.. మేము గెలిస్తే ఓట్ చోరీ అని అంటారా?. ఏం చేస్తావో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలి, ఇలాంటి ఆరోపణలు కాదు. బరిగీసి కొట్లాడే తత్వం లేనప్పుడు పార్టీ ముందుకు పోయే అవకాశం లేదు. అధికార పార్టీ హంగుల వల్ల ఉపఎన్నికల్లో గెలుస్తుంది. పార్టీ అంటే నాయకులు అందరూ బాధ్యత తీసుకుంటారు. కిషన్ రెడ్డి గారినో, ఇంకొకరినో బాధ్యులు చెయ్యలేం. జూబ్లీహిల్స్ లో ఎమ్మెల్యే చనిపోయిన వెంటనే బీజేపీ తిరిగి ఉంటే ఫలితం వేరుగా ఉండేదన్నారు. వేలాది మంది బీజేపీ కారకర్తలు, వందల మంది నాయకుల భవిష్యత్తు కోసం మాట్లాడుతున్నా.. సీఎం, మంత్రులు, కొంతమంది అవగాహన లేని నాయకులు మాట్లాడుతున్న మాటలు వింటున్నా అని ఎంపీ ఈటల చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. బీజేపీ కార్యకర్తల్లారా.. జూబ్లీహిల్స్ ఎన్నిక ఓడిపోగానే కుంగిపోవద్దని, భవిష్యత్తు మనదే అని అన్నారు. తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్‌తో అధికారం లోకి రాలేమని.. కులం, మతం పునాది మీద రాజకీయాలు శాశ్వతంగా నడవవన్నారు. 'నారాయణఖేడ్, పాలేరు హుజూర్నగర్, నాగార్జున సాగర్, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అన్నిటిలో అధికార పార్టీ గెలిచింది. కేసీఆర్ అహంకారం అణచడానికి దుబ్బాకలో బీజేపీని గెలిపించారు. అన్యాయానికి న్యాయానికి.. ఆత్మగౌరవానికి అహంకారానికి.. ధర్మానికి అధర్మానికి జరిగిన హుజురాబాద్ ఎన్నికల్లో ధర్మం గెలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ ఆ ఎన్నిక కోసం ఎదురుచూశారు. స్వయంగా కేసీఆర్ వచ్చి దళితబంధు ప్రకటించినా గెలవలేకపోయారు. తెలంగాణ వచ్చిన తరువాత 9 ఉప ఎన్నికలు జరిగితే.. 7 సార్లు అధికార పార్టీనే గెలిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో గెలిచింది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అధికార పార్టీ అనేక ప్రలోభాలు పెట్టీ మరీ గెలిచారు. కేసీఆర్ ఎన్ని చేశారో వీరు కూడా అవే చేశారు. కాంగ్రెస్ పార్టీకి హుజురాబాద్ లో వచ్చిన ఓట్లు 3016. దుబ్బాకలో, మునుగోడు డిపాజిట్ కోల్పోయింది. మరి డిపాజిటు కోల్పోయిన పార్టీ మొన్న ఎలా అధికారంలోకి వచ్చింది. ఒక్క బై ఎలక్షన్ ఓడిపోగానే బీజేపీ పని అయిపోతుందా?. రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారు ఎవరూ అలా మాట్లాడరు' అని ఎంపీ ఈటల అన్నారు. 'బీహార్ ఎన్నికలు ఒక ప్రభంజనం. ఒళ్ళు వంచి పని చేస్తే విజయం మనదే. కార్యకర్తలు, నాయకులు సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు చూసి బాధపడకండి. భవిష్యత్తు మనదే. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితం అందరం బాధ్యత తీసుకుంటున్నాం.ప్రజలకు సేవ చేయడం వల్లనే దేశ వ్యాప్తంగా బీజేపీకి ప్రజలు ఓట్లు వేస్తున్నారు.ఒకాయన అధికారం పోతుందని, ఇంకొకరు సానుభూతితో పోటీ పడ్డారు. నా వ్యక్తిగత అభిప్రాయం.. తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్ తో అధికారంలోకి రాలేము. బీహార్లో మాకు ఇన్ని సీట్లు వచ్చాయి అంటే అందరి మద్దతు ఉంది. ట్రిపుల్ తలాక్ లాంటివి పని చేసాయి. మా సర్ సంగ్ చాలక్ ఒక గొప్ప మాట చెప్పారు.. ఒక జాతిని విస్మరించి దేశాన్ని నిర్మాణం చేయలేమని చెప్పారు. మోడీ గారు ప్రధాని కాగానే ఒక మెసేజ్ ఇచ్చారు. ప్రజలకు ఇప్పటి వరకు ఏం చేసావు, ఇక ముందు ఏం చేస్తావు అని చెప్పి ప్రజలను ఓట్లు అడగాలి' అని ఎంపీ ఈటల చెప్పారు.



# గురుకులాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- విద్యార్థులు కష్టపడి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**మంథని, నవంబర్ 17 (మనసులో మాట):**

గురుకులాల పైన ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం మంథని పట్టణం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు) ఆయన తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనాథ్, వైస్ ప్రిన్సిపాల్ నవీన్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ రవి, బోధన, బోధనేతర బృందం ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వం గురుకులాల పైన ప్రత్యేక శ్రద్ధ వహించిందని, విద్యార్థులు గురుకులాలను ఉపయోగించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని ఆయన సూచించారు. విద్యార్థులకు సంబంధించినటువంటి సౌకర్యాలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. పిల్లలకు అందిస్తున్నటువంటి ఆహార విషయంలో, చదువు విషయంలో సంతృప్తి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలకు సంబంధించినటువంటి పెండింగ్ పనులను అధికారులతో సమన్వయ పరచుకొని పూర్తిచేయాలని ఆయన సూచించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను వచ్చే పరీక్షలకు సంసిద్ధత చేయాలని ఆయన సూచించారు. గురుకులాల విద్యార్థులకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, రేణుకుంట ప్రవీణ్, రమేష్, కుస్రం నీలదేవి, జిల్లా శంకర్, పెద్దపల్లి జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్ రవీందర్, మంథని ఆర్డీఓ సురేష్, పెద్దపెల్లి జిల్లా గురుకులాల కోఆర్డినేటర్ దేవసేన, మంథని ఎమ్మార్వో కుమారస్వామి, ఎస్సై రమేష్, పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఐ బొమ్మ రవితో సినీ పరిశ్రమకు తీరని నష్టం

- రవి హార్డ్ డిస్క్‌లో 21వేలకు పైగా సినిమాలు
- బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసేలా పైరసీ
- పైరసీ ద్వారా 20కోట్లు సంపాదించిన రవి
- 3 కోట్లు అకౌంట్‌లో ఫ్రీజ్ చేశామన్న సీపీ సజ్జనార్
- కమిషనర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సినీ పెద్దలు



**హైదరాబాద్, నవంబర్17 (మనసులో మాట):**

పైరసీతో సినీ పరిశ్రమకు భారీ నష్టం కలిగిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ అన్నారు. పైరసీని అరికట్టే క్రమంలో ఐ బొమ్మ రవిని అరెస్ట్ చేశామన్నారు. ఐ బొమ్మ రవిపై మూడు పైరసీ కేసులున్నాయని తెలిపారు. రవి.. వెబ్ సైట్ డిజైన్, డెవలపింగ్‌లో ఆరితేరాడని, సీక్రెట్ కెమెరాలతో కొత్త సినిమాలను పైరసీ చేస్తాడని తెలిపారు. దమ్ముంటే పట్టుకోండి అంటూ పోలీసులకు ఛాలెంజ్ చేసిన ఐ బొమ్మ రవి ప్రస్తుతం జైల్లో ఊచలు లెక్కపెడుతున్నాడు. రవి అరెస్ట్‌పై సీపీ సజ్జనార్ సినీ ప్రముఖులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పైరసీపై సంచలన విషయాలు బయటపెట్టారు. ఐ బొమ్మ రవి హార్డ్ డిస్క్ లలో దాదాపు 21 వేలకు పైగా సినిమాలు ఉన్నాయని తెలిపారు. పైరసీ ద్వారా రవి రూ. 20 కోట్లు సంపాదించాడని, అందులో రూ. 3 కోట్లు ఫ్రీజ్ చేశామని చెప్పారు. రవికి ఇంటర్నేషనల్ లింక్స్ ఉన్నాయని, ఈ కేసు చేధించేందుకు జాతీయ స్థాయి సంస్థల సహకారం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఐ బొమ్మ రవి దగ్గర 50 లక్షల మంది సమాచారం ఉందని వెల్లడించారు. డేటా కలెక్షన్ కోసం ఐ బొమ్మ రవి మాస్టర్ మైండ్ ఉపయోగించాడని సీపీ వివరించారు. ఒక సైట్‌ను బ్లాక్ చేస్తే.. మరో సైట్‌ను డెవలప్ చేస్తాడని వెల్లడించారు. రవి సైట్ ఓపెన్ చేయగానే బెట్టింగ్ యాప్స్ అట్రాక్ట్ చేస్తాయని, బెట్టింగ్ యాప్స్‌తో జనం వేల కోట్లు నష్టపోయారని వ్యాఖ్యానించారు. కస్టడీకి ఇస్తే ఐ బొమ్మ రవి నుంచి పూర్తి వివరాలు రాబడుతామని, ఆయన నెట్‌వర్క్‌లో ఉన్న మిగతా వారిని కూడా అరెస్ట్ చేస్తామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇదిలావుంటే సోమవారం హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో సినీ పెద్దలు భేటీ అయ్యారు. అగ్ర కథానాయకులు చిరంజీవి, నాగార్జునలతో పాటు దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్‌రాజు, దగ్గుబాటి సురేశ్ ఈ భేటీలో పాల్గొన్నారు. ఇటీవల పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సినీపెద్దలు సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. పైరసీతో సినీ రంగానికి చాలా నష్టం జరిగిందని తెలిపారు. దీన్ని కట్టడి చేయడంలో భాగంగా ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్, శివరాజ్‌ను కూడా అరెస్టు చేశాం. ఇమ్మడి రవి సమాజానికి చాలా నష్టం చేకూర్చాడు. పైరసీ ద్వారా నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నాడు. దీంతో చాలా మంది చనిపోయారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే కొత్త సైట్‌ను తయారు చేశాడు. ఇలా65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించాడు. 21 వేల సినిమాలు అతడి హార్డ్ డిస్క్‌లో ఉన్నాయి. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న వచ్చిన ఓజీ వరకు అందులో ఉన్నాయి. రూ.20 కోట్లు పైరసీ ద్వారా సంపాదించాడు. అందులో రూ.3 కోట్లు సీజ్ చేశాం. 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా రవి వద్ద ఉంది. ఇంత డేటా అతడి వద్ద ఉండటం ప్రమాదకరం. దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉందని సజ్జనార్ వెల్లడించారు. విశాఖకు చెందిన ఇమ్మడి రవి బీఎస్సీ కంప్యూటర్స్ చదివాడు. అతడు వేరే పేర్లతో మహారాష్ట్రలో డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డులు తీసుకున్నాడు. మొదటి నుంచి నేర ప్రవృత్తితో ఉన్నాడు. సినీరంగం అప్రమత్తమై ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు అతడి వెంట పడ్డారు. దీంతో భారత పౌరసత్వాన్ని వదిలి కరేబియన్ దీవుల్లో ఉన్న సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ దేశ పౌరసత్వం తీసుకున్నాడు. ఫ్రాన్స్‌లో ఉంటూ వివిధ దేశాలు తిరిగేవాడు. 2019లో ఐబొమ్మ ప్రారంభించి 21 వేల సినిమాలు పైరసీ చేశాడు. అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో సర్వర్లను పెట్టాడు. 110 డొమైన్స్ కొనుక్కున్నాడు. ఒకటి బ్లాక్ చేస్తే మరొకటి ఓపెన్ చేస్తూ పైరసీ సినిమాలు విడుదల చేశాడు. ఈ రాకెట్‌లో ఉన్న మిగతా వాళ్లను కూడా బయటకు తీసుకువస్తాం అని సజ్జనార్ తెలిపారు. ఇదిలావుంటే ఈ కేసులో కీలకంగా వ్యవహరించి రవిని అరెస్ట్ చేసిన పోలీస్‌లను సినీ ప్రముఖులు చిరంజీవి, రాజమౌళి తదితరులు సన్మానించారు.

# సినీ కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్న పైరసీకారులు

- ఐబొమ్మ రవి అరెస్టుతో అప్రమత్తం కావాలి
- పైరసీ ద్వారా వ్యక్తిగత సమాచారం కూడా చోరీ
- కమిషనర్ ను కలిసి అభినందించిన చిరంజీవి తదితరులు



**హైదరాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

సినీ ఇండస్ట్రీ మీద చాలామంది ఆధారపడి ఉన్నారని వాళ్ల కష్టాన్ని దౌర్జన్యంగా దోచుకుంటుంటే బాధగా ఉంటుందని చిరంజీవి అన్నారు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్ట్ నేపథ్యంలో తాజాగా సినీ ప్రముఖులు హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. ఈ మీటింగ్ అనంతరం చిరంజీవి మాట్లాడారు. అంతకుముందు సౌదీ ప్రమాదంలో మృతులకు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ పైరసీ నుంచి ఎలా తప్పించుకోవాలని ఆలోచిస్తూనే ఉన్నాం. ఇండస్ట్రీ మీద పరోక్షంగా, ప్రత్యక్షంగా లక్షల మంది ఆధారపడి ఉన్నారు. లైట్‌బాయ్ దగ్గర నుంచి పెద్దపెద్ద డైరెక్టర్ల వరకూ ఇండస్ట్రీపై ఆధారపడి ఉన్నారు. ఇంతమంది కష్టాన్ని ఒకడు దౌర్జన్యంగా దోచుకోవడం.. తిరిగి పోలీసులకే సవాలు విసరడాన్ని తట్టుకోలేకపోయాం. ఇలాంటి సమయంలో గత సీపీ సీవీ ఆనంద్ అనంతరం సజ్జనార్ చాలా కృషి చేసి నిందితుడిని పట్టుకున్నారు. ఈ కేసులో పనిచేసిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ప్రజలు కూడా సినిమా తమదిగా భావించాలి, పైరసీ చూడొద్దు. ఈ ఏడాది కూడా చాలా సినిమాలు పైరసీ చేశారు. దీనివల్ల ఎంతో నష్టం జరిగింది. త్వరలో రాజమౌళి గొప్ప సినిమా తీయనున్నారు. అప్పుడు మన ఖ్యాతి ఖండాంతరాలు విస్తరిస్తుంది. ఆ సమయంలోను పైరసీ పెనుసవాలుగా ఉంటుంది. ఇండస్ట్రీ బాధను అర్థం చేసుకున్నందుకు పోలీసులను అభినందిస్తున్నట్లు చిరంజీవి అన్నారు. పోలీసులకు ధన్యవాదాలు. ఇది సినిమాలో సూపర్ హిట్ సన్నివేశంలా ఉంది. విలన్ ఛాలెంజ్ చేస్తే రెండు నెలల తర్వాత హీరో అతడిని కటకటాల వెనక వేసినట్లు ఉంది. భస్మాసురుడి హస్తంలా తన తలమీద తనే చేయిపెట్టుకున్నాడు. పోలీసులతో ఆటలొద్దు. ఈ సందర్భంగా ఒక్కటే చెప్పాలనుకుంటున్నా.. ఏదీ ఉచితంగా రాదు. ఒకవేళ అలా వస్తే దాని వెనక పెద్ద ప్రమాదం పొంచి ఉంటుంది. అది చావు వరకూ తీసుకెళ్తుంది. 'సినిమాలేగా ఏముంది ఫ్రీగా చూస్తున్నాం' అని అందరూ అనుకుంటున్నారు. పైరసీ చేసే వాళ్లేం సంఘసేవ చేయడం లేదు. పెద్దపెద్ద సర్వర్లు ఉపయోగించి పైరసీ చేస్తున్నారు. దానికి డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది? మేము వాళ్లకు డబ్బులు ఇవ్వడం లేదు.. మా సినిమాలను పైరసీ చేసి సంపాదిస్తున్నారు. అంటే మీరు ఇస్తున్నారు. మీ వ్యక్తిగత డేటాను అమ్మడం వల్ల ఇస్తున్నారు. ఈ పర్సనల్ డేటా అంటే చాలా మందికి తెలియకపోవచ్చు. మీ పేరు, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ ఉంటే చాలు మీరు సైబర్ బారిన పడతారు. ఈ డేటాను క్రిమినల్స్‌కు అమ్ముతున్నారు. మీరు నంబరే కదా అని ఎంటర్ చేస్తున్నారు. దాని మూలంగా ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయి. డబ్బులు పోవడమే కాదు.. ప్రాణాలు పోయే వరకూ వెళ్తోంది. ఈ పైరసీ వల్ల మాకంటే మీరే ఎక్కువ నష్టపోతున్నారు. అర్థం చేసుకోండి. ఇలాంటి పైరసీ వెబ్‌సైట్లలో ఉచితంగా సినిమాలు చూసి ఇబ్బందుల్లో పడకండని రాజమౌళి సినీ అభిమానులకు సూచించారు.

# గిగ్ వర్కర్లకు ఇక రక్షణ కవచం

- వెట్టినుంచి విముక్తితో పాటు ఉద్యోగ భద్రత
- సంక్షేమం, సామాజిక భద్రత లక్ష్యంగా బిల్లు
- చర్చించి ఆమోదించిన తెలంగాణ కేబినెట్

**హైదరాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ భేటీలో 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ -ఆధారిత గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం బిల్లు-2025'పై చర్చించిన అనంతరం బిల్లుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది. కేబినెట్ ఆమోదం పొందిన ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే దేశంలోనే తొలిసారిగా సమగ్ర గిగ్ వర్కర్ల చట్టం తెచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుంది. ఇకపై గిగ్ వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రామిక వర్గంగా గుర్తిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 3 లక్షల నుంచి 4 లక్షల వరకు గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం రవాణా (మొబిలిటీ), డెలివరీ, లాజిస్టిక్స్ రంగాల్లో పనిచేస్తున్నారు. వీరు సాధారణంగా వారానికి 7 రోజుల పాటు రోజుకు 10 నుంచి-12 గంటల చొప్పున వర్క్ చేస్తున్నారు. వీరి ఆదాయంలో ప్లాట్‌ఫామ్‌లు 20 నుంచి 30శాతం వరకు కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. ఈ క్రమంలో వారికి స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేకుండాపోవడం ప్రధాన సమస్యగా ఉంది. తాజా బిల్లులో గిగ్ వర్కర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రంగా 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ -ఆధారిత గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ బోర్డు' పేరుతో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయనుంది. ఈ బోర్డు గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సంక్షేమ పథకాల అమలు, నిధుల పర్యవేక్షణ బాధ్యతలు చేపడుతుంది. అగ్రిగేటర్లకు చెల్లించే సొమ్ములో 1-2 శాతం వాటాను గిగ్ వర్కర్ల సంక్షేమ నిధికి మళ్లించనున్నారు. దీనికి తోడు ప్రభుత్వం తరఫున సీఎస్‌ఆర్ ఫండ్స్, విరాళాలు, గ్రాంట్లను ఈ నిధికి అందజేస్తుంది. ప్లాట్‌ఫామ్‌ల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా? లేదా? అనేది పర్యవేక్షించేందుకు రియల్-టైమ్ 'వెల్ఫేర్ ఫండ్ ఫీ వెరిఫికేషన్ సిస్టమ్ అందుబాటులోకి తేనున్నారు. స్విగ్గీ, జొమాటో, జెప్టో, ఉబర్, ఓలా వంటి ప్లాట్ ఫామ్‌లు, కార్మికుల మధ్య తలెత్తే వివాదాలను ఇన్‌టైంలో పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెసల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మసాయిదాలో పొందుపరిచింది. ఇందులో భాగంగా గిగ్ కార్మికుల జీతాల చెల్లింపులో ఆలస్యం, మోసాలు, అకారణంగా అకౌంట్లు సస్పెండ్? చేయడం.. లాంటి సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెసల్ అధికారులను నియమిస్తారు. 100 మందికి పైగా కార్మికులు ఉండే ప్రతి పెద్ద ఎలాట్‌ఫామ్‌లో 'అంతర్గత వివాద పరిష్కార కమిటీ'ని తప్పనిసరిగా ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. ఈ కమిటీల ద్వారా పరిష్కారం లభించకపోతే, పైస్థాయిలో అప్పీలేట్ అథారిటీకి వెళ్లే అవకాశం ఉంటుంది. ఇందుకోసం బిల్లులో ప్రత్యేక నిబంధనలు పొందుపరిచారు. కార్మికులు లేదా ఎలాట్‌ఫామ్‌లు గ్రీవెన్స్ అధికారులు ఇచ్చిన నిర్ణయంపై సంతృప్తిచెందకపోతే వారు అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించే అవకాశం ఉంది. ఈ అథారిటీ స్వతంత్రంగా విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకోనుంది. తద్వారా కార్మికులకు న్యాయపరమైన భరోసా దక్కుతుంది. చట్టం అమల్లోకి వస్తే ఆయా ప్లాట్‌ఫామ్‌లు ఇకపై ఉద్యోగులను అకారణంగా తొలగించలేవు. ఎవరైనా ఉద్యోగిని తొలగించాలంటే కనీసం ఏడు రోజుల ముందు నోటీసు ఇవ్వడం తప్పనిసరి. గతంలో ప్లాట్‌ఫామ్‌లు గిగ్ వర్కర్ల అకౌంట్లను ఒక్కసారిగా నిలిపివేసేవి. దీనివల్ల కార్మికులు ఉన్నఫళంగా రోడ్డునపడేవారు. తాజా బిల్లులో కస్టమర్ భద్రతకు ముప్పు కాని సందర్భాల్లో.. ఏ వర్కర్నైనా తొలగించాలంటే కనీసం ఏడు రోజుల ముందుగా నోటీసు ఇవ్వాలనే నిబంధన పెట్టారు. పని కేటాయింపు, తొలగింపు.. తదితర అంశాల్లో వివక్ష లేకుండా ఉండేందుకు, ప్లాట్‌ఫామ్‌లు ఉపయోగిస్తున్న అల్గారిథమ్‌లు పారదర్శకంగా ఉండేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం గిగ్ వర్కర్లకు పని కేటాయింపులు, బోనస్‌లు, రేటింగ్‌లు, అకౌంట్ సస్పెన్షన్‌లు పూర్తిగా సాఫ్ట్‌వేర్ అల్గారిథమ్‌పై ఆధారపడి నడుస్తున్నాయి. దీని ద్వారా కార్మికులు తమ పనిపై ప్రభావం చూపే నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారో తెలుసుకునే హక్కు పొందుతారు. గిగ్‌వర్కర్ల బిల్లు రూపకల్పన నుంచి ఆమోదం వరకు ప్రభుత్వం శాస్త్రీయంగా ముందుకు వెళ్తున్నది. ముందుగా రాష్ట్రంలో 1,300 మంది గిగ్ వర్కర్లపై సర్వే నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సమస్యల ఆధారంగా బిల్లులో పలు అంశాలు పొందుపరిచింది. 2024 జనవరి నుంచి 2025 జూన్ వరకు అగ్రిగేటర్లు, గిగ్ వర్కర్ల సంఘాలు, నిపుణులు, న్యాయవేత్తలతో ఆరుసార్లు సంప్రదింపులు చేపట్టి.. పలు మార్పులు చేర్పులు చేసింది. న్యాయశాఖ పరిశీలన అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి మే 19 వరకు బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. 66 సూచనలు, అభ్యంతరాలు అందగా.. వీటిలో చాలా అంశాలను బిల్లులో పొందుపరిచారు.

# తెలంగాణ పోలీసుల కృషి అభినందనీయం

## సజ్జనార్ ను కలిసి అభినందించిన నాగార్జున



**హైదరాబాద్,నవంబర్17 (మనసులో మాట):**

పైరసీని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ సినీనటుడు నాగార్జున అన్నారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్‌తో సినీ ప్రముఖుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్ గురించి నాగార్జున మాట్లాడుతూ తమ కుటుంబంలోనూ ఒకరిని సుమారు రెండు రోజులుపాటు నిర్బంధించారని తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు వారు తప్పించుకున్నారన్నారు. తెలంగాణ పోలీసులకు అభినందనలు. ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్ట్ చేసిన తర్వాత చెన్నై నుంచి నా స్నేహితుడు ఫోన్ చేసి ఇక్కడ మేం చేయలేనిది అక్కడ మీరు చేశారన్నాడు. కేవలం రూ.20కోట్ల కోసం నిందితులు ఇదంతా చేయడం లేదు. పైరసీ వెనుక అంతర్జాతీయ ముఠా ఉంది. 50లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా వారికి చేరింది. ఇది బిగ్ ట్రాప్. ఉచితంగా సినిమాలు చూపించాలనేది వారి ఉద్దేశం కాదు. దీనిలో రూ.వేల కోట్లు దోచేసే పెద్ద ప్లాన్ ఉంటుంది. సినిమాలు ఫ్రీగా చూస్తున్నామని అనుకోవద్దు.. దాని వెనుక ఉన్న పెద్ద మోసాన్ని గమనించాలని నాగార్జున అన్నారు. తెలంగాణ పోలీసులు సినీ పరిశ్రమకు చెందిన వారి పరిస్థితి మరికొంత మెరుగుపడేలా చేశారని నిర్మాత సురేశ్‌బాబు అన్నారు. పైరసీ సినిమాలు చూడొద్దని.. ఏదీ ఉచితంగా రాదని చెప్పారు. మన డేటా వారి వద్ద ఉండటంతో ఎన్నో నేరాలకు పాల్పడతారన్నారు. ఉచితంగా సినిమా చూడటం వల్ల ఇవన్నీ జరుగుతాయని సురేశ్‌బాబు అన్నారు.

# సైబర్ క్రైమ్ పోలీసుల కృషి అభినందనీయం

## అభినందించిన హోం స్పెషల్ సెక్రటరీ ఆనంద్



**హైదరాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి ని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. పోలీసులకు దమ్ముంటే తనను పట్టుకోవాలని కొన్ని రోజుల ముందు ఇమ్మడి రవి సవాల్ చేశాడు. ఆయన కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఇమ్మడి రవి అరెస్ట్‌పై తెలంగాణ రాష్ట్ర హోం శాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్ స్పందించారు. రవి అరెస్ట్‌పై సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా సీవీ ఆనంద్ ట్వీట్ పెట్టారు. దమ్ముంటే పట్టుకోండి అన్నోడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారని సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అభినందనలు తెలిపారు. ఇమ్మడి రవిని పట్టుకోవడానికి జూన్ నుంచి సైబర్ క్రైమ్ టీమ్ రేయింబవళ్లు కష్టపడిందని ప్రశంసించారు. రవిని తప్పా ఈ పైరసీకి సంబంధించిన వాళ్లందరినీ పట్టుకుందని గుర్తుచేశారు. దమ్ముంటే పట్టుకోండని పోలీసులకు సవాలు విసిరి, బెదిరించిన వ్యక్తిని ఇప్పుడు అరెస్టు చేశారని కొనియాడారు. డీసీపీ కవిత, హైదరాబాద్ సీపీ సజ్జనార్‌లని ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు సీవీ ఆనంద్.

# ఏసీబీకి చిక్కిన డీటీ



**ఖమ్మం, నవంబర్ 17 (మనసులో మాట):**

ఒక రేషన్ డీలర్ నుండి రూ.30 వేల లంచం డిమాండ్ చేసి, మరో ఇద్దరి ద్వారా ఆ డబ్బును తీసుకుంటున్న నేపథ్యంలో సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ మహమ్మద్ యాకుబ్ పాషా ను సోమవారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈనెల ఏడో తేదీన డిప్యూటీ తాసిల్దార్ మహమ్మద్ యాకూబ్ పాషా ఏడవ తేదీన నియోజకవర్గంలోని టేకులపల్లి లో ఒక రేషన్ షాపును తనిఖీ చేసి , స్టాకు తక్కువ ఉందని ఆ షాపును సీజ్ చేశారు. కాగా ఆ రేషన్ షాపు డీలర్ అయిన మహిళకు షాపు తిరిగి పునరుద్ధరించాలంటే డిప్యూటీ తాసిల్దార్ 30 వేల రూపాయలు డిమాండ్ చేశారు. ఇల్లందు రేషన్ షాపు డీలర్ మండల అధ్యక్షుడు శబరీష్ ద్వారా టెక్నికల్ అసిస్టెంట్ విజయ్ కు ఆ డబ్బును ఇవ్వాలని ఆ మహిళ డీలర్ కు చెప్పగా ఆమె ఆ డబ్బును ఆ డీలర్ అధ్యక్షుడు కి ఇవ్వగా ఆ డబ్బును టెక్నికల్ అసిస్టెంట్ విజయ్ కు బయట ఓ షాపులో ఇస్తున్న క్రమంలో వారిద్దరితోపాటు ఇప్పుడు తాసిల్దార్ ను కూడా అరెస్టు చేసినట్లు ఏసీబీ డిఎస్పి వై. రమేష్ ప్రకటించారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

## కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం గంగారం సాయి బాబా కాలనీలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ మరియు కొత్తగడి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ రోజు మెనూ ప్రకారం వంట చేశారా లేదా అని తనిఖీ చేశారు. వంట చేయడానికి ఉపయోగించే వంట సామగ్రిని పరిశీలించారు. స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి, బియ్యం నాణ్యతను చెక్ చేశారు. ప్రతిరోజు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తాజా కూరగాయలతో విద్యార్థులకు భోజనం పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన ఐఎఫ్‌టీ ప్యానల్ పని విధానాన్ని కూడా పరిశీలించారు. పాఠశాల నిర్వహణపై కలెక్టర్ ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, అందులో పదవ తరగతి చదివే విద్యార్థులు ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు అన్ని సబ్జెక్టులలో ఎంత మేరకు పోర్షన్ పూర్తయిందని వివరాలు అడిగారు. రోజు సాయంత్రం విద్యార్థులకు స్పెషల్ క్లాసులు చెబుతున్నారా అని అడిగారు. సబ్జెక్టులలో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పదవ తరగతి చదివే విద్యార్థులందరూ కూడా ఇప్పటి నుంచే పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకా దేవి, ఎంఈఓ బాబు సింగ్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# 'షీ-లీడ్స్' స్ఫూర్తితో మహిళా బ్లూ కోల్ట్స్ విప్లవం

**● కరీంనగర్‌లో వినూత్న పోలీసింగ్**



**కరీంనగర్, నవంబర్ 17 (మనసులో మాట):**

కరీంనగర్ పోలీసు కమిషనరేట్ మహిళా పోలీసులను కేవలం ఆఫీస్ విధులకే పరిమితం చేయకుండా, 'విజిబుల్ పోలీసింగ్'లో భాగస్వామ్యం చేసేందుకు వినూత్నమైన 'షీ-లీడ్స్' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా మహిళా పోలీసులు 'బ్లూ కోల్ట్స్' విధులు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సంఘటనలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా మహిళా పోలీసులను తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని సీపీ తెలిపారు. దాదాపు 100 మంది మహిళా పోలీసులకు (షీ టీమ్స్ సభ్యులతో సహా) రెండు దశల్లో కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, "పోలీసు శాఖలో విధులు నిర్వహించాలంటే శారీరక ధృడత్వంతో పాటు మానసికంగా కూడా ధృడంగా ఉండాలి. మనల్ని మనం రక్షించుకునే స్థితిలో ఉన్నప్పుడే ప్రజలను రక్షించగలం" అని ఉద్ఘాటించారు. కరాటే (అన్ ఆర్మ్డ్ కంబాట్ కోర్స్): ఆత్మరక్షణ విద్యలో సుశిక్షితులుగా తీర్చిదిద్దడం, తమను తాము రక్షించుకోవడంతో పాటు ఆపదలో ఉన్న పౌరులకు రక్షణ కల్పించేలా శిక్షణ అందిస్తున్నారు. ధర్నాలు, నిరసనల్లో ముఖ్యంగా మహిళా నిరసనకారులను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు మెళకువలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సున్నితమైన అంశాలను మానవీయంగా నిర్వహించేలా నేర్పిస్తున్నారు. కఠినమైన క్షేత్ర స్థాయి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు, పోలీసులకు మానసిక ధృడత్వాన్ని పెంచేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని సీపీ తెలిపారు. ఈ శిక్షణ మహిళా పోలీసులను ఏ మాత్రం తొట్రుపాటు లేకుండా సంఘటనలను ధైర్యంగా ఎదుర్కొనేలా సన్నద్ధం చేస్తోందని సీపీ తెలియజేశారు. విధి నిర్వహణలో నిరంతర అప్రమత్తత అవసరమని, నేర్చుకున్న అంశాలను అవసరమైతే తప్పకుండా ఉపయోగించుకోవాలని ఆయన మహిళా పోలీసులకు సూచించారు. కరీంనగర్ పోలీసు కమిషనరేట్ తీసుకున్న ఈ 'షీ-లీడ్స్' చొరవ, మహిళా శక్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా వారికి మరింత దగ్గరయ్యేలా చేస్తుందని సీపీ ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా బ్లూ కోల్ట్స్ బృందం వీధుల్లో తిరుగుతుంటే, తమకు రక్షణ ఉందనే ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రజల్లో మరింత పెరుగుతాయని సీపీ అభిప్రాయ పడ్డారు. ఈ వినూత్న సంస్కరణ ద్వారా కరీంనగర్ పోలీసు శాఖ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సత్ఫలితాలనిస్తుందని సీపీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భీంరావు, ఏసీపీ శ్రీనివాస్ జి, వేణుగోపాల్, మాధవి కరాటే మాస్టర్ వసంత్ కుమార్ పాల్గొన్నారు.

# ముదిరెడ్డిపల్లిలో ఇండ్ల గృహ ప్రవేశం

## దశలవారీగా అర్హులందరికీ ఇండ్లు



**గుండుమల్, నవంబర్ 17 (మనసులో మాట):**

కొడంగల్ నియోజకవర్గం, గుండుమల్ మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు. హౌసింగ్ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి ఆమె లబ్ధిదారులను ఇళ్లకు ఆహ్వానించి గృహ ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పైలట్ గ్రామమైన ముదిరెడ్డిపల్లికి మొత్తం 104 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అందులో సోమవారం ఆరు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ సహాయంతో లబ్ధిదారులు ఇండ్లను చాలా చక్కగా నిర్మించుకున్నారని, లబ్ధిదారులు కూడా ఆనందం వ్యక్తం చేశారని ఆమె తెలిపారు. గ్రామంలో ఇంకా 91 ఇండ్ల నిర్మాణాలు రూఫ్ లెవెల్, స్లాబ్ లెవెల్, బేస్ మెంట్ లెవెల్ లలో కొనసాగుతున్నాయని ఆమె చెప్పారు. ఏ.ఈ. ఇచ్చిన సమాచారం మేరకు పక్షం రోజులలో మరో 20 ఇండ్లు ప్రారంభానికి సిద్ధం అవుతున్నాయని, వాటిని లబ్ధిదారులకు అప్పగిస్తామని ఆమె తెలిపారు. నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఇదే సరైన సమయమని, ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మిగతా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను మోటివేట్ చేస్తున్నామని చెప్పారు.

**రూ. 5 లక్షల సక్రమ వినియోగం**

ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, దశలవారీగా అర్హులైన వారందరికీ ఇళ్లను మంజూరు చేస్తామని ఆమె పేర్కొన్నారు. గ్రామం, మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నామని, పంచాయతీ కార్యదర్శుల ద్వారా మీటింగ్‌లు ఏర్పాటు చేసి గైడెన్స్ ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు రూ.5 లక్షలు ఇవ్వడం దేశంలో ఎక్కడా లేదని, ఈ మొత్తాన్ని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారికి మహిళా సంఘాల ద్వారా రుణాలు, అలాగే శ్రీనిధి బ్యాంకు ద్వారా 50 వేల రూపాయలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని ఆమె తెలిపారు. ఎలాంటి సమస్య ఉన్నా నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ లబ్ధిదారులందరికీ ఇళ్లను నిర్మించుకునేందుకు తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.





# పుస్తకాల పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

**● జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య**

**సంగారెడ్డి, నవంబర్ 17 (మనసులోమాట):**

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య సారథ్యంలో సోమవారం క్విజ్ , వ్యాస రచన పోటీలను సందడిగా నిర్వహించారు. గ్రంథాలయ శాస్త్రం, పుస్తక పఠన ప్రాధాన్యం, చదివే అలవాటు పెంపు, ఉత్తమ చదువరి ప్రోత్సాహకం వంటి విషయాలపై విద్యార్థులను ప్రోత్సహిస్తూ పోటీలు నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య , సరస్వతి దేవి, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటాలకు పుష్పమాలలు అర్పించి, అనంతరం గ్రంథాలయ ప్రతిజ్ఞతో వారోత్సవాల ప్రారంభోత్సవాన్ని ప్రారంభించారు. వారి అధ్వర్యంలో గ్రంథాలయ ప్రతిజ్ఞ తో కార్యక్రమం ప్రారంభం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రంథాలయంలో లభించే అన్ని రకాల పుస్తకాలను చిన్నారుల నుండి సీనియర్ సిటిజెన్స్ వరకు అందరూ చక్కగా వినియోగించుకోవాలని తెలిపారు. ముద్రిత గ్రంథాలతో పాటు డిజిటల్ గ్రంథాలయాలు ఆధునిక కాలంలో అత్యంత ప్రాముఖ్యమని, వాటిని అభివృద్ధి చేయడానికి సి.యస్.ఆర్ నిధుల సహకారం అందించే దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గ్రంథాలయం అందిస్తున్న సేవలు, పాఠకుల అవసరాలు, అభివృద్ధి చేయవలసిన అంశాలపై వివరణాత్మకంగా గ్రంథాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోటీల్లో పాల్గొన్న వివిధ విద్యాసంస్థల విద్యార్థులను అభినందించిన కలెక్టర్, పోటీ పరీక్షల పుస్తకాలు మాత్రమే కాకుండా నవలలు, సాంస్కృతిక గ్రంథాలు, అకాడమీ పబ్లికేషన్లు, పత్రికలు తదితరాలను చదివే మంచి అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శ్రీనివాస్, ప్రశాంత్, శోభారాణి, వరలక్ష్మీ, సావిత్రి, కృష్ణమూర్తి, నాగరాజు తదితరులతో పాటు అనేకమంది పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పత్తి రైతుల సమస్యలపై కేంద్రంతో సమీక్ష

**● కొనుగోళ్లు చేయాలని జిన్నింగ్ మిల్లులకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి**

**హైదరాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

తెలంగాణ పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సచివాలయం నుండి కేంద్ర జౌళి శాఖ సెక్రటరీ, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, తేమ శాతం, ఎకరానికి విధించిన కొనుగోలు పరిమితులపై మరొకసారి సమీక్షించాలని మంత్రి తుమ్మల కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

**కేంద్ర నిబంధనలతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి**

మంత్రి తుమ్మల మాట్లాడుతూ... రైతులు రేయింబగళ్లు కష్టపడి సాగు చేసిన పంటలు వాతావరణ మార్పులు, అకాల వర్షాల కారణంగా నష్టపోతున్నా, ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే నమ్మకంతో కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువస్తే, కేంద్రం విధించిన నిబంధనలతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకుముందు పెసళ్లు, కందులు, పొద్దుతిరుగుడు వంటి పంటలపై కేవలం 25% మాత్రమే కొనుగోలు పరిమితి పెట్టి, రైతులు మిగతా పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితిని కేంద్రం కల్పించిందని ఆయన గుర్తుచేశారు. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో గత రెండు సంవత్సరాల నుండి మిగిలిన పంటలను రాష్ట్ర ప్రభుత్వమే మద్ధతు ధర చెల్లించి కొనుగోలు చేస్తోందని తెలిపారు. సోయాబీన్ విషయంలో అకాల వర్షాల వల్ల రంగు మారినప్పటికీ కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, రంగు మారిన పంటను కొనాలని కేంద్రాన్ని కోరినప్పటికీ నాఫెడ్ నుండి గాని, కేంద్రం నుండి గాని ఎటువంటి స్పందన లేకపోవడం శోచనీయం అని మంత్రి పేర్కొన్నారు.

**పరిమితి తగ్గింపుపై అభ్యంతరం**

ఈ రోజు జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రాష్ట్రం నుండి జిల్లాల వారీగా సరాసరి పత్తి దిగుబడి గణాంకాలను సీసీఐకి పంపించినప్పటికీ, మొదట్లో ఎకరానికి 11 క్వింటాళ్ల చొప్పున సేకరించి, కొన్ని రోజుల తరువాత ఆ పరిమితిని 7 క్వింటాళ్లకు తగ్గిస్తూ రైతులను అయోమయానికి గురిచేశారని తెలియజేశారు. మొంథా తుపాను, అకాల వర్షాలతో రైతులు సతమతమవుతుండగా, కేంద్రం విధించిన తేమశాతం నిబంధనతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తేమ శాతం పెంచి కొనుగోలు చేయాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేసినా ఎలాంటి సడలింపులు ఇవ్వలేదని, ఈ రెండు విషయాలలో రైతులందరికీ ఉపయోగపడేలా సానుకూల నిర్ణయం తీసుకోవాలని మంత్రి కోరారు.

**జిన్నింగ్ మిల్లుల సమస్యలు, సమ్మె హెచ్చరిక**

జిన్నింగ్ మిల్లుల అసోషియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి కూడా పాల్గొన్న ఈ సమీక్షలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ, కేంద్రం తీసుకొచ్చిన నిబంధనల కారణంగా జిన్నింగ్ మిల్లులను పత్తి కొనుగోళ్లు జరపాలనే నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి ఉందని, దీంతో 82 మిల్లులు ఇంకా తెరుచుకోకపోవడం వల్ల రైతులు చాలా దూరం వెళ్లి పత్తిని అమ్ముకోవాల్సి వస్తోందని అభిప్రాయపడ్డారు. పత్తి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా జిన్నింగ్ మిల్లర్లతో మాట్లాడి, వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా సీసీఐ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రి కోరారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని, పత్తి కొనుగోళ్లలో ఆటంకం ఏర్పడకుండా, వెంటనే కొనుగోళ్లను ఆరంభించాలని మంత్రి తుమ్మల జిన్నింగ్ మిల్లుల అసోషియేషన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డిని కోరారు. రేపు సీసీఐ వారితో జరిగే సమావేశంలో జిన్నింగ్ మిల్లుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి, ముఖ్యమంత్రి గారి సూచనలతో సానుకూల నిర్ణయం వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతులు ఇప్పటికే చాలా రకాలుగా నష్టపోయారని ఉద్ఘాటించారు.

# పోరు వద్దు, ఊరు ముద్దు

**మాజీ మావోయిస్టుకు కంటి చికిత్స చేయించిన కోటపల్లి పోలీసులు**



**కోటపల్లి, నవంబర్ 17 (మనసులో మాట):**

పోలీస్ శాఖ అందిస్తున్న మానవతా దృక్పథానికి నిదర్శనంగా, కోటపల్లి పోలీసులు లొంగిపోయిన ఒక మాజీ మావోయిస్టుకు ఉచితంగా కంటి శస్త్రచికిత్స చేయించారు. 'ఆయుధాలను, అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవండి' అనే ప్రభుత్వ పిలుపునకు అనుగుణంగా ఈ సహాయం అందించారు. కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పారేపల్లి గ్రామానికి చెందిన ఆత్రం లచ్చన్న, ఆయన భార్యతో కలిసి గత కొన్ని నెలల క్రితం లొంగిపోయిన సంగతి తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ ప్రజలకు చేస్తున్న సహాయ సహకారాలు, అలాగే లొంగిపోయిన మావోయిస్టుల పట్ల చూపిస్తున్న ఆదరణను తెలుసుకుని, ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకొని లచ్చన్న జనజీవన స్రవంతిలో కలిశారు. లొంగిపోయిన మాజీ మావోయిస్టులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఎలాంటి సహాయం, సమస్య ఉన్నా అండగా ఉంటామని ఇచ్చిన మాట ప్రకారం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా, చెన్నూర్ రూరల్ సీఐ బన్సీలాల్ మరియు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ పర్యవేక్షణలో ఆత్రం లచ్చన్నకు కంటి చికిత్స చేయించారు. మంచిర్యాలలోని పవన్ ఆప్టికల్స్ ద్వారా ఆయనకు ఉచితంగా కంటి చికిత్స అందించారు. మాజీ మావోయిస్టులకు కొత్త జీవితాన్ని అందించడంలో భాగంగా, పోలీస్ శాఖ అందించిన ఈ సహకారంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ఎస్పీతో నేరుగా మాట్లాడండి

**వికారాబాద్‌లో 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమం ప్రారంభం**

వికారాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):



వికారాబాద్ జిల్లా ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించే లక్ష్యంతో, జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఈ రోజు 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రజలు ఇకపై తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకురావచ్చు.ప్రారంభించిన మొదటి రోజే ఈ కార్యక్రమానికి అద్భుతమైన స్పందన లభించింది. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధి నుండి మొత్తం 26 కాల్స్ నమోదయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, "ప్రజలు తమ ఫిర్యాదులను నమోదు చేయడానికి సుదూర ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా, ఫోన్ ద్వారానే అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది" అని తెలిపారు.ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల్లో ప్రధానంగా ఈ కింది అంశాలు ఉన్నాయని ఎస్పీ వివరించారు: మహిళల భద్రతకు సంబంధించిన సమస్యలు, మాడిఫైడ్ సైలెన్సర్లతో కూడిన వాహనాల ద్వారా ఇబ్బందులు, అక్రమ ఇసుక రవాణా, అక్రమ ఎర్రమట్టి రవాణా, భార్యాభర్తల మధ్య గొడవలు, వ్యక్తిగత సమస్యలు, పొలాలలోకి అక్రమంగా ప్రవేశించడం, మండల కేంద్రాలలో ట్రాఫిక్ సమస్యలు తదితర సమస్యలు వచ్చాయి. ప్రతి సోమవారం, ఉదయం 11:00 గంటల నుండి 12:00 గంటల వరకు జిల్లా ఎస్పీ స్వయంగా ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటారు. సంప్రదించాల్సిన నంబర్: 08416 255601. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకొని, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో తక్షణ స్పందన

**ముగ్గురు లబ్ధిదారులకు ఉపకరణాల అందజేత**



**సంగారెడ్డి, నవంబర్ 17 (మనసులో మాట):**

ప్రభుత్వం అందించే సేవలను ప్రజలకు దీర్ఘకాలం వేచి చూడకుండా వేగంగా అందించడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం పనిచేస్తుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి వెంటనే చర్యలు చేపట్టి ముగ్గురు లబ్ధిదారులకు అవసరమైన ఉపకరణాలను అందజేశారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అభ్యర్థనను కేసు వారీగా పరిశీలించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి, అవసరానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం అత్యంత ప్రాధాన్యతగా ఉందని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి తెలిపారు. తక్షణ స్పందనపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. నశాముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ప్రతిజ్ఞ కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు, మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా, నశాముక్త భారత్ అభియాన్ కింద జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచేలా మార్గనిర్దేశం చేయాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలని ఆమె సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం, మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం జిల్లా పరిపాలన తీసుకుంటున్న చర్యలను ప్రజలు అభినందిస్తున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# సహానారెడ్డికి సన్మానం

**పీజీ మెడిసిన్‌లో 9వ ర్యాంకు సాధించినందుకు సన్మానించిన మంథని రెడ్డి సంక్షేమ సంఘం**



**మంథని, నవంబర్ 17 (మనసులో మాట):**

పీజీ జనరల్ మెడిసిన్ కోర్సులో రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించి మంథని ప్రాంతానికి కీర్తి తెచ్చిన డాక్టర్ సహనా రెడ్డిని మంథని రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మాజీ జెడ్పిటిసి మూల సరోజన పురుషోత్తం రెడ్డి కుమార్తె అయిన డాక్టర్ సహనా రెడ్డికి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు ముసుకుల సురేందర్ రెడ్డి మరియు పాలకవర్గం ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవనంలో ఈ అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం పెద్దలు మాట్లాడుతూ, సహనా రెడ్డిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె అందించే వైద్య సేవలను ఈ మంథని ప్రాంతానికి అందించాలని పిలుపునిచ్చారు. సన్మానాన్ని స్వీకరించిన అనంతరం డాక్టర్ సహనా రెడ్డి మాట్లాడుతూ, "వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నేను, పట్టుదలతో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే డాక్టర్ వృత్తిని ఎంచుకున్నాను. పేదలకు సేవ చేయడమే నా ధ్యేయం. మంథని ప్రాంత ప్రజలకు నా వంతు సేవ ఎల్లవేళలా చేస్తాను" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు ముసుకుల సురేందర్ రెడ్డితో పాటు గౌరవ అధ్యక్షులు ఎమ్మెస్ రెడ్డి, ఏలుకూరి సత్యనారాయణరెడ్డి, మూల శేఖర్ రెడ్డి, బయ్యపు మురలీధర్ రెడ్డి, టీవీ సత్యనారాయణ రెడ్డి, మూల సత్యనారాయణ రెడ్డి, చందుపట్ల సుధాకర్ రెడ్డి, పెండ్లి రమేష్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మూల సరోజన పురుషోత్తం రెడ్డి, డిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి అథ్లెటిక్స్ కు 'సిద్ధార్థ' విద్యార్థి

**కరీంనగర్, నవంబర్ 17 (మనసులో మాట):**



స్థానిక భగత్‌నగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థి ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రంగారెడ్డి జిల్లా, సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో ఈ నెల 14, 16 తేదీల్లో ఎస్.జి.ఎఫ్.ఐ. (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలలో, అండర్-14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న ఎం. సాయి చైతన్య అద్భుత ప్రదర్శన చేశాడు. సాయి చైతన్య 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో రెండవ స్థానం సాధించి వెండి పతకం గెలుచుకున్నాడు. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలలో అతను పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా చాలా అవసరమని తెలిపారు. క్రీడల వల్ల విద్యార్థులు అన్ని రంగాలలో చురుకుగా పాల్గొనగలరని, దేహదారుఢ్యం కలుగుతుందని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, డైరెక్టర్ స్వప్న శ్రీపాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా 'ఒరిస్సన్'

**ప్రాథమిక దశ నుండే సమగ్ర అవగాహన**





**కరీంనగర్, నవంబర్ 17 (మనసులో మాట):**

విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే వివిధ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడం, వాటిలో నైపుణ్యం సాధించేలా ప్రోత్సహించడం ద్వారా వారు సమాజంలో ఉన్నతంగా ఎదుగుతారని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. స్థానిక భగత్ నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో సృజనాత్మకంగా నిర్వహించిన "ఒరిస్సన్" (విషయాల అవగాహన కార్యక్రమం) ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అంశాలపై పట్టు సాధించే విధంగా సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీయడానికి వార్షిక ప్రణాళికలో భాగంగా అనేక రకాల కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని, వాటిలో పాల్గొనేందుకు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రాలను కూడా అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు తరగతి గదిలోని విషయాలను చక్కగా వర్ణించాలని, వాటిపై పూర్తి పట్టు సాధింపజేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు ఇష్టమైన రంగాలలో శిక్షణ ఇప్పించాలని, తగిన వనరులను కల్పించి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమన్వయంతో వారి పిల్లలను ఉత్తమంగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ఈ 'ఒరిస్సన్' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో పలు అంశాలపై చక్కటి అవగాహన కల్పించారు. వాటిలో ఆలయాల ప్రాముఖ్యత, న్యూట్రిషన్ విశిష్టత, సాంస్కృతిక వైభవం, ఆరోగ్యకరమైన, అనారోగ్యకరమైన ఆహారం, మొబైల్ అవేర్‌నెస్, జంక్ ఫుడ్ నష్టాలు, హెల్తీ ఫుడ్ ప్రభావాల, అల్ఫోర్స్ కైండ్‌నెస్ వాల్, అల్ఫోర్స్ ట్రైన్ వంటి అంశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా వివిధ రకాల వస్తువులతో క్యాంపస్‌ను చాలా చక్కగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వికారాబాద్ కు రూ.5.42 కోట్ల నిధులు

- **అభివృద్ధి పనులను ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**



**ధారూర్, నవంబర్ 17 (మనసులో మాట):**

వికారాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి సహకారంతో తాను స్పీకర్‌గా నిధులు పెద్ద ఎత్తున తీసుకువస్తున్నానని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. సోమవారం ధారూర్ మండలంలోని ఎనిమిది గ్రామాలలో 5.42 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాల పంపిణీలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

### ధారూర్ మండలంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

స్పీకర్ ప్రసాద్ కుమార్ ధారూర్ మండలంలోని వివిధ గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, బీటీ రోడ్లు సహా పలు పనులను ప్రారంభించారు. తరిగొప్పుల గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్, 5 లక్షల సీసీ రోడ్డు, కమ్యూనిటీ వాటర్ ప్లాంట్, చిల్డ్రన్ పార్క్‌ను ప్రారంభించడంతో పాటు పల్లె దవాఖానను పరిశీలించారు. రాజాపూర్ గ్రామంలో రూ.91 లక్షల మొమిన్ ఖుర్దు నుండి రాజాపూర్ వరకు బీటీ రోడ్డును ప్రారంభించారు. గట్టేపల్లిలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని, అవుసుపల్లిలో రూ.11 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని మరియు రెండు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. గడ్డమీది గంగారాం గ్రామంలో రూ.2.82 కోట్లతో కుక్కింద ఎక్స్ రోడ్డు నుండి కోట్‌పల్లి పీడబ్ల్యూడీ రోడ్డు వరకు బీటీ రోడ్డును, అలాగే అల్లిపూర్‌లో 1.10 కోట్లతో రోడ్డు నుండి అల్లిపూర్ వరకు బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ధారూర్‌లో 8 లక్షలతో నిర్మించే అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం, నాగారం, హరిదాస్‌పల్లి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ధారూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మరియు మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు.

### నీటిపారుదల, రోడ్లపై ప్రత్యేక దృష్టి

ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు వెల్లువలా వస్తున్నాయని, గత పదేళ్లలో పట్టించుకోని రోడ్లను ఇప్పుడు మళ్ళీ తానే రూ.600 కోట్లతో కొత్తగా వేయిస్తున్నానని తెలిపారు. కోట్‌పల్లి రిజర్వాయర్ ఆధునీకరణకు రూ.90 కోట్లు మంజూరు చేయించామని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించి బాగు చేయిస్తామని హామీ ఇచ్చారు. రైతుల గురించి మాట్లాడుతూ... ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా తడిచిన పత్తిలో తేమ 16 శాతం వరకు ఉన్నా సీసీఐ కొనుగోలు చేయాలని తాను లెటర్ రాశానని, రైతులు ఇబ్బంది పడొద్దని తన తాపత్రయమని పేర్కొన్నారు.

### ఉద్యోగాలు, సంక్షేమం

నియోజకవర్గ పిల్లల ఉద్యోగాల కోసం మోమిన్‌పేట్ మండలం ఎన్కతలలో □45 కోట్లతో ఇండస్ట్రీయల్ పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించామని, అనంతగిరి గుట్టను టూరిజంగా అభివృద్ధి చేయడం ద్వారా రెండు నుంచి మూడు వేల మందికి ఉద్యోగాలు, స్థానికులకు హోటల్స్, చిన్న షాపులతో ఉపాధి కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో వచ్చిన ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని ఆయన వివరించారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరంటు, 500 లకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ జరిగిందని, సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తున్నారని చెప్పారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను డబుల్ చేసి, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచామని, 60,000 పైగా ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని ఆయన లెక్కలతో సహా తెలిపారు.

### అప్పుల పాలనపై విమర్శ

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సమర్థుడు కాబట్టే కొత్తగా అప్పులు చేయకుండా, గత ముఖ్యమంత్రి చేసిన అప్పులకు నెలకు □6,500 కోట్ల మిత్తి చెల్లిస్తూ కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. "మీకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి అన్ని విధాలుగా కష్టపడుతున్నాం. నన్ను గెలిపించిన మీ రుణం తీర్చుకోవడానికి అహర్నిశలు కృషి చేస్తాను" అని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు.

# మల్లన్న కల్యాణం, జాతర ఘనంగా నిర్వహించాలి

- **మంత్రి కొండా సురేఖ ఆదేశం**



**హైదరాబాద్, నవంబర్ 17 (మనసులో మాట):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొమురవెల్లిలోని శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణం, జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఎండోమెంట్, జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె దిశానిర్దేశం చేశారు. సచివాలయంలోని దేవాదాయ శాఖ ఛాంబర్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సిద్దిపేట జిల్లా అధికారులతో మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉత్సవాల తేదీలను ఖరారు చేశారు శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణం: డిసెంబర్ 14, 2025 ఉదయం 10:45 గంటలకు. జాతర నిర్వహణ: జనవరి 18, 2026 నుండి పది (10) ఆదివారాల పాటు, మార్చి 16, 2026 వరకు జాతర నిర్వహణకు నిర్ణయించారు.(గమనిక: మీరు ఇచ్చిన తేదీల్లో 16 మార్చి 2025 అని ఉంది. 18 జనవరి 2026 నుండి 10 వారాల వరకు ఉత్సవాలు కొనసాగితే, అది 2026 మార్చిలో ముగుస్తుంది. కాబట్టి 16 మార్చి 2026 అని పరిగణించబడింది.) భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, భద్రత, రవాణా వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంత్రి అధికారులను కోరారు. దేవాదాయ శాఖ, ఇతర నిధులతో ఆలయ ప్రగతికి చేపడుతున్న పనులపై కూడా మంత్రి సురేఖ అధికారులను అడిగి ఆరా తీశారు. ఈ రివ్యూ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హరీష్ పాల్గొన్నారు.

# నిర్మల్‌లో ఘనంగా 'యూనిటీ మార్చ్'

**సర్దార్ పటేల్ ఐక్యతా స్ఫూర్తిని కొనసాగించాలి**




**నిర్మల్, నవంబర్ 17 (మనసులో మాట):**

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను పురస్కరించుకొని, నిర్మల్ పట్టణంలో సోమవారం సాయంత్రం యూనిటీ మార్చ్ (ఐక్యతా యాత్ర) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడెం నగేష్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ లతో పాటు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. ముందుగా, పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఈ ర్యాలీ సాగింది. మార్గమధ్యంలోని వివేక్ చౌక్‌లో గల స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో జ్యోతి ప్రజ్వలన చేసి, సామూహికంగా జాతీయ గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా నాయకులు సర్దార్ పటేల్ సేవలను కొనియాడారు ఎంపీ గోడం నగేష్ మాట్లుడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని వివరించారు. అనేక రాజ్యాలుగా ఉన్న మన దేశాన్ని మొత్తం ఏకం చేశారని, నిజాం రాజ్యాన్ని కూడా స్వతంత్ర భారతదేశంలో విలీనం చేసిన గొప్ప వ్యక్తి సర్దార్ పటేల్ అని తెలిపారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత కూడా నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రాన్ని భారతదేశంలో కలపడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవ మరువలేనిదని తెలియజేశారు. దేశ ఐక్యత కోసం ప్రతి క్షణం పరితపించిన మహనీయుడు ఆయనేనని, పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకొని దేశ ఐక్యతలో ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని సూచించారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యత స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత నేటితరం యువతపై ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ దేశ సమైక్యత, సమగ్రత కొరకు పాటుపడాలని చెప్పారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ భారత తొలి ఉప ప్రధానిగా, తొలి కేంద్ర హోం శాఖ మంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారని, దాదాపు 600 వరకు చిన్న, పెద్ద స్వతంత్ర రాజ్యాలను భారతదేశంలో విలీనం చేసి సంపూర్ణ భారతదేశాన్ని స్థాపన చేశారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా యూత్ ఆఫీసర్ శైలి బెల్లాల్, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, నవంబర్ 17 (మనసులో మాట):**

కరీంనగర్ పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని, ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని సుడా (శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. కట్టరాంపూర్‌లోని కార్తికేయ నగర్ కాలనీలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం సుడా నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ పనులకు ఆయన స్థానికులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతున్నాం. మున్సిపల్ సాధారణ నిధులతో పాటు సుడా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. నగర సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం" అని పేర్కొన్నారు. స్థానికుల కోరిక మేరకు కార్తికేయ నగర్ నుండి అపూర్వ ఎంక్లేవ్ మీదుగా కట్టరాంపూర్ మెయిన్ రోడ్డు వరకు డ్రైనేజీ మరియు రోడ్డు నిర్మాణం చేపడుతామని నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సయ్య, నెల్లి నరేష్, దన్న సింగ్, బత్తిని చంద్రయ్య, గంగుల దిలీప్, విఠల్ రెడ్డి, సూర్య నారాయణ, సత్యంరావు తదితరులు పాల్గొన్నారు.

# గువాహటి టెస్ట్‌కు టీమిండియా కసరత్తు

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో సౌతాఫ్రికా చేతిలో తొలి టెస్ట్ మ్యాచ్ ఓడిపోయిన భారత క్రికెట్ జట్టు, ఇప్పుడు రెండో టెస్ట్ కోసం తీసుకుంటున్న నిర్ణయం నిజంగా ఆశ్చర్యకరం. ఈ నిర్ణయం వల్ల గువాహటిలో జరగబోయే చివరి టెస్ట్‌లో కూడా టీమిండియా ఓడిపోయే ప్రమాదం ఉందని క్రికెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివేదికల ప్రకారం భారత జట్టు సాధారణంగా మ్యాచ్ ముగిసిన వెంటనే తదుపరి వేదికకు వెళ్తుంది. కానీ ఈసారి కోల్‌కతాలో ఓడిపోయిన తర్వాత కూడా టీమిండియా అక్కడే ఉండిపోయింది. మంగళవారం రోజు ఈడెన్ గార్డెన్స్‌లోనే ప్రాక్టీస్ చేయాలని జట్టు నిర్ణయించుకుంది. జట్టు కోల్‌కతాలో ప్రాక్టీస్ చేయాలని నిర్ణయించడం చూస్తుంటే, గువాహటిలో కూడా కోల్‌కతా పిచ్‌లాంటిదే తయారు చేయాలని మేనేజ్‌మెంట్ ప్లాన్ చేస్తున్నట్లు అనుమానాలు వస్తున్నాయి. కోల్‌కతాలో స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై భారత బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలమయ్యారు. అయినా సరే, గువాహటిలో కూడా స్పిన్ ఫ్రెండ్లీ పిచ్‌నే తయారు చేయాలని టీమిండియా మొగ్గు చూపుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గువాహటిలో భారత్–సౌతాఫ్రికా మధ్య రెండో, చివరి టెస్ట్ మ్యాచ్ నవంబర్ 22 నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో కూడా స్పిన్‌కు అనుకూలించే వికెట్‌ను తయారు చేస్తే, భారత బ్యాట్స్‌మెన్‌కు మళ్లీ కష్టాలు తప్పకపోవచ్చు.



గతంలో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్ 0–3 తేడాతో ఓడిపోయింది. వెస్టిండీస్‌పై గెలిచినా, వారికి నాణ్యమైన స్పిన్నర్లు లేరు. కానీ ఇప్పుడు సౌతాఫ్రికా జట్టులోని స్పిన్నర్లు భారత బ్యాట్స్‌మెన్‌ను బాగా ఇబ్బంది పెడుతున్నారు. ఇలాంటి సమయంలో కూడా పిచ్ స్వభావాన్ని మార్చుకుండా స్పిన్ పిచ్‌పైనే ఆధారపడాలని అనుకోవడం క్లీన్ స్వీప్ ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్లేనని విమర్శలు వినిపిస్తున్నాయి. టీమిండియాకు మరో ముఖ్యమైన ఆందోళన ఏమిటంటే రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో టెస్ట్‌కు అందుబాటులో ఉండకపోవడం. తొలి టెస్ట్ సమయంలో ఆయన మెడకు గాయం కావడంతో ఐసీయూలో కూడా చికిత్స తీసుకున్నారు. దీంతో గువాహటి టెస్ట్‌లో గిల్ ఆడటం కష్టమే అని తెలుస్తోంది. ఒకవేళ గిల్ ఆడకపోతే అతని స్థానంలో యువ ఆటగాళ్లు సాయి సుదర్శన్ లేదా దేవదత్ పడిక్కల్‌లో ఒకరికి తుది జట్టులో అవకాశం దక్కే ఛాన్స్ ఉంది. కెప్టెన్ లేకపోవడం, పైగా పిచ్ విషయంలో రిస్క్ తీసుకోవడం.. ఇవన్నీ కలిపి గువాహటి టెస్ట్ ఫలితాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో చూడాలి.



## ఆర్ఆర్ హెడ్ కోచ్‌గా సంగక్కర

ఐపీఎల్ 2026 సీజన్ కోసం ఫ్రాంచైజీలన్నీ పక్కా ప్లానింగ్‌తో సిద్ధమవుతున్నాయి. మెగా ఆక్షన్‌కు ముందే తమ కోచింగ్ స్టాఫ్‌ను సెట్ చేసుకునే పనిలో పడ్డాయి. ఈ క్రమంలో, ఒక టాప్ ఫ్రాంచైజీ పెద్ద సంచలనమే సృష్టించింది. గత సీజన్ (2025)లో ఇండియన్ లెజెండ్‌ను ఎంతో ఆర్భాటంగా హెడ్ కోచ్‌గా తెచ్చుకున్న ఆ టీమ్, ఇప్పుడు ఈ సీజన్‌కు అతన్ని పక్కనపెట్టింది. ఆ ప్లేస్‌లోకి, తమ పాత కోచ్‌నే మళ్లీ వెనక్కి రప్పించింది. రాజస్థాన్ రాయల్స్ (%==%) ఫ్రాంచైజీ సోమవారం పెద్ద ట్విస్ట్ ఇచ్చింది. ఐపీఎల్ 2026 సీజన్‌కు తమ హెడ్ కోచ్‌గా శ్రీలంక లెజెండ్ కుమార సంగక్కర తిరిగి వస్తున్నట్లు ప్రకటించింది. 2025 సీజన్‌లో రాహుల్ ద్రవిడ్ హెడ్ కోచ్‌గా వ్యవహరించగా, ఇప్పుడు ఒక్క సీజన్ తర్వాతే అతన్ని తప్పించి, మళ్లీ పాత కోచ్‌కే బాధ్యతలు అప్పగించారు. సంగక్కర 2021 నుంచి 2024 వరకు హెడ్ కోచ్‌గా పనిచేశాడు. అతని కోచింగ్‌లోనే రాజస్థాన్ 2022లో ఫైనల్ చేరింది, 2024లో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఇప్పుడు మళ్లీ అదే ఫామ్ రిపీట్ చేయాలని టీమ్ భావిస్తోంది. సంగక్కర కేవలం హెడ్ కోచ్‌గానే కాదు, తన పాత రోల్ అయిన 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా కూడా కొనసాగుతాడు. ఈ డ్యూయల్ రోల్‌పై ఫ్రాంచైజీ ఓనర్ మనోజ్ బదాలే క్లారిటీ ఇచ్చారు. "ప్రస్తుత స్టేజ్‌లో జట్టుకు ఏం కావాలో చూశాం. సంగక్కర నాయకత్వం, జట్టుతో అతనికి ఉన్న బాండింగ్, రాయల్స్ కల్చర్ గురించి అతనికున్న లోతైన అవగాహన ఇవన్నీ జట్టుకు సరైన స్థిరత్వాన్ని ఇస్తాయని నమ్మాం," అని అన్నారు. ఒక లీడర్‌గా సంగక్కరపై తమకు పూర్తి నమ్మకం ఉందని, అతని ప్రశాంతత, తెలివితేటలు జట్టును నెక్స్ట్ ఫేజ్‌కు తీసుకెళ్తాయని బదాలే తెలిపారు. హెడ్ కోచ్ మార్పుతో పాటు, మిగిలిన కోచింగ్ స్టాఫ్‌లో కూడా రాజస్థాన్ రాయల్స్ కీలక మార్పులు చేసింది. విక్రమ్ రాథోడ్‌కు ప్రమోషన్ ఇస్తూ 'లీడ్ అసిస్టెంట్ కోచ్'గా నియమించింది. అయితే, న్యూజిలాండ్ మాజీ పేసర్ షేన్ బాండ్ మాత్రం బౌలింగ్ కోచ్‌గా యథాతథంగా కొనసాగుతాడు. వీరితో పాటు, ట్రెవర్ పెన్నీ అసిస్టెంట్ కోచ్‌గా, సిద్ లహిరి పెర్ఫార్మెన్స్ కోచ్‌గా తిరిగి జట్టులోకి వచ్చారు. మొత్తం మీద, ద్రవిడ్‌ను పక్కనపెట్టి, సంగక్కర లీడర్‌షిప్‌లో 2026 సీజన్‌కు పక్కా ప్లాన్‌తో బరిలోకి దిగాలని రాజస్థాన్ రాయల్స్ గట్టిగా ఫిక్స్ అయినట్లు కనిపిస్తోంది. ఈ కోచింగ్ మార్పు ఇప్పుడు ప్లేయర్లపై పెద్ద ఇంపాక్ట్ చూపించనుంది. రాహుల్ ద్రవిడ్ వచ్చి ఒక్క సీజన్ మాత్రమే అవ్వడంతో, అతను సెట్ చేసుకున్న ప్లాన్స్ అన్నీ పక్కకు వెళ్లినట్లే. ముఖ్యంగా, కొద్ది రోజుల క్రితమే జట్టు కెప్టెన్ సంజూ శాంసన్ టీమ్‌ను వీడిన టైమ్‌లో, ఇప్పుడు కోచ్‌ను కూడా మార్చడం గమనార్హం. జట్టుకు ఒక 'స్ట్రాంగ్' లీడర్‌షిప్ అవసరం. ఇక ఇప్పుడు సంగక్కర రీ ఎంట్రీ కీలకం కానుంది. అతను డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా, హెడ్ కోచ్‌గా రెండు బాధ్యతల్లో ఉండటంతో జట్టు మళ్లీ కొత్తగా సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది. మొదటి ట్రోఫీని అందుకున్న రాజస్థాన్ ఇప్పటివరకు మళ్లీ ఫైనల్?లో గెలవలేదు. మరి ఈసారి ఎలాంటి పర్ఫామెన్స్ చూపిస్తారో చూడాలి.

## మైఖేల్ వాన్ నోటి దురుసు

భారత్ అంటే ఎప్పుడూ అక్కసు వెళ్లగక్కే ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ మరోసారి తన నోటికి పని చెప్పాడు. సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియాకు ఎదురైన పరాజయంపై తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. అనుకూలంగా ఉండే పిచ్‌లను తయారు చేసుకొని ప్రత్యర్థులను ఓడించాలని భావిస్తే ఇలాంటి పరాజయాలే ఎదురువుతాయని శాపనార్థాలు పెట్టాడు. టీమిండియాకు తగిన శాస్తి జరిగిందని ట్వీట్ చేశాడు.'ఇలాంటి చెత్త పిచ్‌ను తయారు చేసినందుకు వరల్డ్ ఛాంపియన్స్ చేతిలో మీరు ఓడిపోవాల్సిందే.'అని మైఖేల్ వాన్ ట్వీట్ చేశాడు. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా ఆదివారం ముగిసిన తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యంతో టీమిండియా 30 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. పూర్తిగా స్పిన్‌కు అనుకూలంగా ఉండే వికెట్‌ను తయారు చేయించుకున్న టీమిండియా నలుగురి స్పిన్నర్లతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాను ఓడించాలనుకుంది. అందుకు తగ్గట్లుగానే తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని అందుకొని తొలి రెండు రోజుల ఆటలో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. మ్యాచ్ ప్రారంభానికి నాలుగు రోజుల ముందు నుంచి పిచ్‌పై వాటరింగ్ చేయకపోవడంతో బ్యాటింగ్‌కు ప్రతికూలంగా మారింది. పిచ్‌పై పగుళ్లు ఏర్పడి తొలి రోజు నుంచే బంతి టర్న్ అవ్వడంతో పాటు అనూహ్యంగా బౌన్స్ అయ్యింది. దాంతో పరుగులు రాబట్టేందుకు బ్యాటర్లు తెగ ఇబ్బంది పడ్డారు. అయితే తమ గోతిలో తామే పడ్డట్లు టీమిండియా ఈ స్పిన్ ఉచ్చును తమ మెడకే బిగించుకొని మూల్యం చెల్లించుకుంది. నాలుగో ఇన్నింగ్స్ సమయంలో పిచ్ మరింత ప్రమాదకరంగా మారడంతో భారత బ్యాటర్లు 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేధించలేకపోయారు. మరోవైపు ఈ పిచ్‌పై వచ్చిన విమర్శలను గంభీర్ తప్పుబట్టాడు. ఈ పిచ్ మరీ అంత ప్రమాదకరంగా లేదని, ఓపికగా బ్యాటింగ్ చేస్తే పరుగులు రాబట్టవచ్చని



చెప్పాడు. ఈ పరాజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) పాయింట్స్ టేబుల్‌లో టీమిండియా నాలుగో స్థానానికి పడిపోయింది. గతంలో స్పిన్ బౌలింగ్ ఆడలేకనే న్యూజిలాండ్ చేతిలో 3–0తో క్లీన్ స్వీప్ అయిన భారత్.. మరోసారి స్పిన్ ఉచ్చులోనే పడి మూల్యం చెల్లించుకుంది. భారత క్రికెట్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా తొలిసారి క్లీన్ స్వీప్ అయ్యింది.

## మహమ్మద్ షమీని జట్టులోకి తీసుకోవాలి

### మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కీలక సలహా



సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియా ఓటమి నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కీలక సలహా ఇచ్చాడు. టీమిండియా మాజీ స్పిన్నర్ మహమ్మద్ షమీని జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. స్పిన్ పిచ్‌లను పక్కనపెట్టి సమతూకమైన వికెట్లపై ఆడాలని తెలిపాడు. స్పిన్నర్లతో కలిసి షమీ జట్టుకు విజయాలు అందిస్తాడని చెప్పాడు. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా ఆదివారం ముగిసిన తొలి టెస్ట్‌లో టీమిండియా 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌కు పూర్తిగా స్పిన్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌ను గంభీర్ తయారు చేయించగా భారత బ్యాటర్లు తడబడ్డారు. గింగిరాలు తిరిగిన బంతిని ఆడలేక ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నారు. తాజాగా ఈ పరాజయం స్పందించిన గంగూలీ.. టీమిండియా తమ ప్రణాళికలను మార్చుకోవాలని సూచించాడు. 'గౌతమ్ గంభీర్ అంటే నాకు చాలా ఇష్టం. 2011 వన్డే ప్రపంచకప్‌తో పాటు 2007 టీ20 ప్రపంచకప్‌లో మెరుగైన ప్రదర్శన చేశాడు. టీమిండియా హెడ్ కోచ్‌గా అతను ఇంకొన్నాళ్లు కొనసాగుతాడు. అయితే గంభీర్ టెస్ట్ మ్యాచ్‌ల కోసం మంచి పిచ్‌లు ఎంచుకోవాలి. టెస్ట్ జట్టులోకి మహమ్మద్ షమీని తీసుకోవాలి. భారత పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, మహమ్మద్ షమీలపై గంభీర్ నమ్మకం ఉంచాలి. స్పిన్నర్లు, పేసర్లు కలిసి మ్యాచ్‌లు గెలిపిస్తారు. సమతూకమైన వికెట్లపై ఆడాలి. గంభీర్ ఈ విధంగా ఆలోచిస్తాడని ఆశిస్తున్నా. భారత బ్యాటర్లు 350–400 పరుగులు చేయకపోతే మ్యాచ్‌లు గెలవలేరు. ఇంగ్లండ్ పర్యటనలో భారత బ్యాటర్లు రాణించడంతోనే రెండు మ్యాచ్ గెలిచారు. గంభీర్ మంచి పిచ్‌లను ఎంచుకొని ఆటగాళ్లపై నమ్మకం ఉంచాలి. అంతేకాకుండా టెస్ట్‌లను ఐదు రోజుల్లో గెలవాలి కానీ మూడు రోజుల్లో కాదు'అని గంగూలీ చెప్పుకొచ్చాడు. 2023లో ఆఖరి మ్యాచ్ ఆడిన మహమ్మద్ షమీ.. ఫిట్‌నెస్ సమస్యలతో జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత ఫిట్‌నెస్ సాధించినా ఇంగ్లండ్ పర్యటనతో పాటు వెస్టిండీస్, సౌతాఫ్రికాతో టెస్ట్‌ల సిరీస్‌లకు షమీని సెలెక్టర్లు ఎంపిక చేయలేదు. ఫిట్‌నెస్ సమస్యలు ఉండటంతోనే షమీని పరిగణలోకి తీసుకోలేదని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. కానీ షమీ రంజీ ట్రోఫీలో 4 మ్యాచ్‌లు ఆడి 17 వికెట్లు పడగొట్టాడు.

## హార్దిక్ రీ-ఎంట్రీ ఇవ్వనున్నడా?



భారత్ వర్సెస్ సౌతాఫ్రికా మధ్య వన్డే సిరీస్ మొదలవ్వడానికి ఇంకో రెండు వారాల కన్నా తక్కువ సమయమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ త్వరలోనే వన్డే, టీ20 జట్లను ప్రకటించే అవకాశం ఉంది. ఈ సిరీస్ ద్వారా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ చాలా కాలం తర్వాత సొంత గడ్డపై వన్డేలు ఆడబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఆస్ట్రేలియా టూర్‌లో గాయపడిన శ్రేయస్ అయ్యర్ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. ఆయన స్థానంలో ఎవరు వస్తారు, అలాగే స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, వికెట్ కీపర్ రిషబ్ పంత్ తిరిగి జట్టులోకి వస్తారా అనే అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. చాలా రోజుల తర్వాత హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్ వంటి కీలక ఆటగాళ్లు జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం ఉంది. గాయం కారణంగా ఆస్ట్రేలియా పర్యటనకు దూరమైన హార్దిక్ పాండ్యా ఇప్పుడు పూర్తిగా కోలుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాబట్టి సౌతాఫ్రికా సిరీస్‌లో వన్డే, టీ20 ఫార్మాట్‌లలో ఆయన తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఇంగ్లాండ్ టూర్‌లో గాయపడి, టెస్ట్ క్రికెట్‌లోకి రీ–ఎంట్రీ ఇచ్చిన రిషబ్ పంత్.. వన్డే జట్టులో కూడా చోటు దక్కించుకోవచ్చు. భారత వన్డే జట్టులో ఇన్నింగ్స్‌ను రోహిత్ శర్మ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రారంభిస్తారు. గిల్ సౌతాఫ్రికా టెస్టుకు గాయపడ్డా, వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. విరాట్ కోహ్లీ మూడో స్థానంలో ఆడతారు. నాలుగో స్థానంలో ఆడే శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా దూరమవ్వడంతో ఆయన స్థానంలో ఎవరు వస్తారనేది ఆసక్తికరం. నాలుగో స్థానానికి వికెట్ కీపర్ రిషబ్ పంత్ మంచి ఎంపికగా మారే అవకాశం ఉంది. జస్ప్రీత్ బుమ్రా సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్‌లో ఆడుతున్నందున, ఆయన వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కోసం వన్డే సిరీస్‌కు విశ్రాంతి తీసుకుని టీ20 సిరీస్‌లో తిరిగి వచ్చే అవకాశం ఉంది. భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య జరగనున్న వన్డే సిరీస్ నవంబర్ 30న ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లోని మొదటి వన్డే నవంబర్ 30న మధ్యాహ్నం 1:30 గంటలకు రాంచీలో జరగనుంది. ఆ తర్వాత రెండో వన్డే మ్యాచ్ డిసెంబర్ 3న అదే సమయానికి అంటే మధ్యాహ్నం 1:30 గంటలకు రాయ్‌పూర్ వేదికగా జరుగుతుంది. ఇక సిరీస్‌లో చివరిదైన మూడో వన్డే డిసెంబర్ 6న మధ్యాహ్నం 1:30 గంటలకు విశాఖపట్నంలో జరగనుంది. మూడు మ్యాచ్‌లూ మధ్యాహ్నం 1:30 గంటలకే మొదలవుతాయి.

## స్పిన్నర్ అమిత్ శుక్లా విధ్వంసం


రంజీ ట్రోఫీలో హర్యానా జట్టు అమిత్ శుక్లా అనే డేంజరస్ ప్లేయ–ర్‌ను ఎదుర్కోలేక చతికిల పడింది. అవును, ఈ ఎడమచేతి వాటం బౌలర్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో మొత్తం హర్యానా జట్టు 111 పరుగులకే ఆలౌట్ అయింది. అమిత్ శుక్లా మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 27 పరుగులకు 8 వికెట్లు పడగొట్టాడు. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ ఆటగాడు తన ఐదు వికెట్లను కేవలం ఐదు ఓవర్లలోనే పడగొట్టాడు. ఈ ఐదు ఓవర్లలో అతను ఒక్క పరుగు కూడా ఇవ్వకపోవడం గమనార్హం. అమిత్ శుక్లా ఈ డేంజరస్ బౌలింగ్ కారణంగా, సర్వీసెస్ హర్యానాపై 94 పరుగుల ఆధిక్యాన్ని పొందింది. జట్టు కేవలం 205 పరుగులకే పరిమితమైంది. అమిత్ శుక్లా రెండో బంతి నుంచే హర్యానాను ఇబ్బందుల్లోకి నెట్టాడు. మొదట ఓపెనర్ యువరాజ్ సింగ్‌ను 1 పరుగుకే అవుట్ చేశాడు. ఆ తర్వాత మయాంక్ శాండిల్య, యశ్వర్ధన్ దలాల్, ధీరు సింగ్, నిఖిల్ కశ్యప్‌లను అవుట్ చేశాడు. అమిత్ శుక్లా తన మొదటి 5 మెయిడెన్ ఓవర్లు వేసి ఐదు వికెట్లు తీసుకున్నాడు. ఆ తర్వాత శుక్లా తన ఐదు వికెట్ల పరుగును పూర్తి చేసిన తర్వాత మరో మూడు వికెట్లు పడగొట్టాడు, కపిల్ హుడా, పార్థ్ శివ్, అన్షుల్ కాంబోజ్‌లను అవుట్ చేసి హర్యానాను 111 పరుగులకే ఆలౌట్ చేశాడు. అమిత్ శుక్లా 14 సంవత్సరాలు క్రికెట్ బంతిని ముట్టుకోలేదు. ఆ తర్వాత, అతను లక్నోలోని ఇండియన్ ఆర్మీ మైదానంలో ప్రాక్టీస్ చేయడం ప్రారంభించాడు. అమిత్ శుక్లా తండ్రి, స్వయంగా ఆర్మీ సైనికుడు, తన కొడుకు క్రికెటర్ కెరీర్‌ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించాడు. అమిత్ శుక్లాకు 18 సంవత్సరాల వయసులో, అతనికి మోడలింగ్ ఆఫర్ వచ్చింది. కానీ అతను క్రికెట్‌ను ఎంచుకున్నాడు. అమిత్ శుక్లా కెరీర్ గురించి చెప్పాలంటే, అతని వయసు కేవలం 22 సంవత్సరాలు. 7 ఫస్ట్–క్లాస్ మ్యాచ్‌లలో 32 వికెట్లు పడగొట్టాడు. అతను 6 లిస్ట్ ఏ మ్యాచ్‌లలో 6 వికెట్లు తీసుకున్నాడు. ఇంకా, అతను బ్యాటింగ్ కూడా చేయగలడు. అమిత్ శుక్లా ఇదే ప్రదర్శన కొనసాగిస్తే, అతను ఐపీఎల్‌లో కూడా తన ప్రదర్శనను చూసే అవకాశం త్వరలోనే రావొచ్చని తెలుస్తోంది.

# గోవాలో 20న అంతర్జాతీయ చలనచిత్రోత్సవం

## ఆరంభ వేడుకల్లో బాలయ్యకు సన్మానం



ఒకప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తెలుగు వారికి సరైన ప్రాధాన్యత లభిస్తుండేది కాదు. కానీ ఇప్పుడు కాలం మారింది. యావత్ భారత సినీ రంగం తెలుగు వారివైపు ఆసక్తిగా చూస్తున్నాయి. తెలుగు సినిమాలే ఇవాళ జాతీయ స్థాయిలో దిశా నిర్దేశర చేస్తున్నాయి. అంతర్జాతీయ యవనికపై భారతీయ సినిమా సత్తాను చాటుతోంది కూడా తెలుగు సినిమాలే! ఈ నేపథ్యంలో తెలుగు సినిమా రంగానికి చెందిన కథానాయకులకు, దర్శకులకు అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తగిన గుర్తింపు లభిస్తోంది. ఆ మధ్య మెగాస్టార్ చిరంజీవిని ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ వేదికపై ఘనంగా సత్కరించారు. ఇప్పుడు నందమూరి బాలకృష్ణను సత్కరించబోతున్నారు. నవంబర్ 20న గోవా లో 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ప్రారంభం కానుంది. ఈ ఆరంభ వేడుకల్లోనే బాలకృష్ణను ఘనంగా సత్కరించబోతున్నారు. ఐదు దశాబ్దాల పాటు నందమూరి బాలకృష్ణ తెలుగు సినిమా రంగంలో హీరోగా రాణిస్తున్నారు. నందమూరి తారక రామారావు నట వారసుడిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టిన బాలకృష్ణ మడమ తిప్పకుండా యాభై సంవత్సరాలు ముందుకు సాగుతున్నారు. ఎన్నో బ్లాక్ బస్టర్స్ ను తన ఖాతాలో వేసుకున్నారు. తెలుగు సినిమా రంగానికి ఆయన చేసిన సేవల కారణంగా ఈ సత్కారం జరుగబోతోంది. కేంద్ర ప్రభుత్వ అత్యున్నత గౌరవాల్లో ఒకటైన పద్మభూషణ్ పురస్కారాన్ని సైతం బాలకృష్ణ ఇటీవల అందుకున్నారు. కేవలం నటుడిగానే కాకుండా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా క్యాన్సర్ చికిత్స, పరిశోధన రంగంలో బాలకృష్ణ విశేష సేవలను అందిస్తున్నారు. అదేవిధంగా, మూడు సార్లు హిందూపురం ఎమ్మెల్యేగా ప్రజాసేవలో పదేళ్లకు పైగా కీలక పాత్ర పోషిస్తున్నారాయన.




# తన ఫోటోలతో ఫేక్ సోషల్ అకౌంట్లు

## సైబర్ మోసాలపై నటి అదితి రావు హైదరీ ఆందోళన

నటి అదితి రావు హైదరీ సోషల్ మీడియాలో తన పేరుతో జరుగుతున్న మోసాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పలు దేశీయ, పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న అదితి, పెళ్లి తర్వాత కూడా తన క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపిస్తూనే ఉంది. తరచూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆమె, తాజాగా వాట్సాప్‌లో తన ఫోటోలను ఉపయోగిస్తూ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తున్నారని వెల్లడించారు. అదితి షేర్ చేసిన స్క్రీన్‌షాట్‌లో, ఒక వ్యక్తి ఆమె పేరు, ఫోటోలను ఉపయోగిస్తూ ఫోటోగ్రాఫర్లకు ఫోటోషూట్ల పేరుతో మెసేజులు పంపుతున్నట్లు కనిపించింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఇన్‌స్టాగ్రామ్‌లో క్లారిటీ ఇస్తూ అభిమానులను అప్రమత్తం చేశారు. ఈ రోజు కొంతమంది నాకు చెప్పిన విషయాన్ని మీతో పంచుకుంటున్నాను. వాట్సాప్‌లో నా ఫోటోలను ఉపయోగిస్తూ ఎవరో 'ఫోటోషూట్' కోసం మెసేజులు పంపుతున్నారు. అవి నేను పంపినవి కావు. నేను ఎప్పుడూ నా పర్సనల్ నంబర్‌ను వర్క్ కోసం ఉపయోగించను. నా అధికారిక పనులు అన్నీ నా టీమ్ ద్వారానే జరుగుతాయి. అలాంటి మెసేజులు వస్తే వెంటనే నా జీసఠఇనీనినిఇబి టీమ్‌కి తెలియజేయండి. నాకు ఎప్పుడూ అండగా నిలిచే అభిమానులకు ధన్యవాదాలు, అని అదితి పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవల పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియా ఫేక్ అకౌంట్లతో మోసాలకు గురవుతున్న సందర్భంలో, ఇప్పుడు అదితి పేరు, ఫోటోలతో కూడా మోసగాళ్లు దోపిడీకి ప్రయత్నాలు చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అభిమానులు, ఫోటోగ్రాఫర్లు ఇలాంటి నకిలీ మెసేజులను నమ్మవద్దని ఆమె స్పష్టం చేశారు. ఇక అదితి రావు హైదరి కొద్ది రోజు క్రితం సిద్దార్థ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ జంట ప్రస్తుతం వైవాహిక జీవితంతో పాటు ప్రొఫెషనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేస్తూ దూసుకుపోతుంది.



# పుష్పను పోలిన మలయాళీ మూవీ విలాయత్ బుద్ధ

## సంబంధం లేదన్న పృథ్వీరాజ్ సుకుమారన్

పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'విలాయత్ బుద్ధ' మూవీలో పృథ్వీరాజ్ డబుల్ మోహన్ అనే పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. అందులో ఈ హీరో ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే పాత్రలో కనిపించారు. దీంతో ఈ సినిమా 'పుష్ప'ను ప్రేరణగా తీసుకొని రూపొందించారంటూ వార్తలు మొదలయ్యాయి. తాజాగా ఆ వార్తలపై పృథ్వీరాజ్ స్పందించారు. పుష్ప సినిమా రాకముందే 'విలాయత్ బుద్ధ'ను ప్రారంభించాం. కానీ, ఈ చిత్రం రాక ఆలస్యమైంది. మేం దీని ప్రణాళికలు వేసుకున్నప్పటికి ఎర్రచందనం స్మగ్లింప్‌పై ఒక్క సినిమా కూడా రాలేదు. నిర్మాణంలో ఉందని కూడా తెలీదు. దురదృష్టవశాత్తూ 'విలాయత్ బుద్ధ' పూర్తికావడానికి ముందే పుష్ప రెండు భాగాలు వచ్చి సంచలనం సృష్టించాయి. ఈ రెండు చిత్రాలు స్మగ్లింగ్‌కు సంబంధించిన కథాంశంతో తెరకెక్కడంతో రెండూ ఒకేలా అనిపిస్తున్నాయి. కానీ, డబుల్ మోహన్ పాత్రకు పుష్పకు ఎలాంటి సంబంధం లేదని పృథ్వీరాజ్ తెలిపారు. జయన్ నంబియార్ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. అనుమోహన్, ధ్రువన్, వినోద్‌థామస్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఎవరు వచ్చారు? మాస్ ఎంట్రీలో వస్తున్నాడే మన హీరో డబుల్ మోహన్.. అతనొక దొంగ. ఇక్కడ చాలామంది అతన్ని శాండల్ మోహన్ చిన్న వీరప్పన్ అని పిలుస్తారు అంటూ సాగిన ట్రైలర్ హీరో మాస్ యాక్షన్ సన్నివేశాలతో ఆద్యంతం ఆసక్తిని రేకెత్తిస్తోంది.



# వచ్చే ఏడాది పెళ్ళి పీటలు ఎక్కబోతున్నా

## తిరుమలలో నటుడు సాయిదుర్గతేజ్ వెల్లడి

మెగా మేనల్లుడు సాయి దుర్గ తేజ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపీ బ్రేక్‌లో ఆయన స్వామిని సేవించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఏడాది తన పెళ్లి జరుగుతుందని క్లారిటీ ఇచ్చారు. ఎన్నో రోజులుగా పెళ్లిపై వస్తున్న రూమర్‌లకు చెక్ పెట్టారు తేజ్.'చక్కని సినిమాలు, మంచి జీవితం ఇచ్చిన భగవంతుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు తిరుమల వచ్చాను. కొత్త సంవత్సరం వస్తున్న తరుణంలో శ్రీవారి ఆశీస్సులు కావాలని దర్శించుకున్నాను. వచ్చే ఏడాదిలో నేను నటించిన 'సంబరాల ఏటిగట్టు' విడుదలవుతుంది. ప్రేక్షకులు, అభిమానులు ఆదరిస్తారని ఆశిస్తున్నా' అన్నారు. పెళ్లిపై వస్తున్న రూమర్లపై ఓ జర్నలిస్ట్ ప్రశ్నించగా.. 'వచ్చే ఏడాదిలోనే నా పెళ్లి ఉంటుంది' అని సమాధానమిచ్చారు తేజ్. 'సంబరాల ఏటిగట్టు' చిత్రాన్ని రోహిత్ కె.పి. తెరకెక్కిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. 'తన జీవితంలో చాలా ముఖ్యమైన సినిమా ఇదని, అందరి అంచనాల్ని అందుకునేలా కష్టపడుతున్నానని సాయితేజ్ ఇటీవల ఓ వేదికపై తెలిపారు.



# శివ వైబ్స్ క్రియేట్ చేస్తున్న నాగ్

అక్కినేని నాగార్జున నటించిన ఐకానిక్ మూవీ శివ ఇటీవలే గ్రాండ్‌గా రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. రీరిలీజ్‌లో సూపర్ రెస్పాన్స్ రాబట్టుకుంది శివ. ఇక మరోసారి శివ సినిమా నాటి వైబ్స్ క్రియేట్ చేస్తున్నాడు నాగార్జున. చైన్ బ్రాస్‌లెట్‌ను అరచేతిలో మడిచి పట్టుకున్న నాగార్జున బ్లాక్ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే గాగుల్స్‌తో స్టైలిష్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై కూర్చొని కెమెరాకు ఫోజులిచ్చాడు. అయినప్పటికీ అతడి చరిష్మా శాశ్వతమైనది.. సొగసైనది..మరపురానిది..' అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన తాజా స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆరు పదుల వయస్సు దాటినా కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గేదేలే అంటూ తాజా స్టిల్స్‌తో చెప్పకనే చెప్పేస్తున్నాడు నాగార్జున.ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగార్జున ప్రస్తుతం కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు రా కార్తీక్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీని నాగార్జున 2026 మే నెలలో సమ్మర్ కానుకగా అభిమానుల ముందుకు తీసుకురావాలని ఎ÷-లాన్ చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు రాగా.. నాగార్జున టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.



CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169.
PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861